## షెర్లాక్ హోమ్స్ పరిశోధనలు

# అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లాక్ హోమ్స్-2

సర్ ఆర్థర్ కానన్ డాయల్




అనువాదం : కె.బి.గోపాలం

సర్ ఆర్తర్ కానన్ డాయ్‌ల్

రచన

# ద అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హోమ్స్

## రెండవ భాగం





# ద అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హెూమ్స్

## రెండవ భాగం

రచన

సర్ ఆర్తర్ కానన్ డాయ్ల్

అనువాదం

కె.బి.గోపాలం

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్

హైదరాబాద్

# The Adventures of Sherlock Holmes-2

**Sir Arthur Conan Doyle**

*Translation*

**K.B.Gopalam**

vijayagopalk@gmail.com

*First Edition:* **June, 2016**

Copies : 1000

Price : **Rs. 100/-**

*Cover Page, Layout :*

**AVM Graphics**

*Published by :*

**CREATIVE LINKS PUBLICATIONS**

1-8-725/A/1, 103C, Balaji Bhagyanagar Apartments,
Nallakunta, Hyderabad - 500044.
Ph: 9848065658, 9848506964.



# రచయిత గురించి

సర్ ఆర్తర్ కానన్ డాయ్ల్ (1859 నుంచి 1930) స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బరోలో పుట్టారు. అక్కడే వైద్య విద్యను అభ్యసించారు. 1882 ప్రాంతంలో వైద్యంతో పాటు ఆయన రచనలను కూడా మొదలుపెట్టారు.

1887లో సర్ డాయ్ల్ ప్రఖ్యాత డిటెక్టివ్ షెర్లక్ హోమ్స్, అతని మిత్రుడు, మార్గదర్శి అయిన డాక్టర్ వాట్సన్ పాత్రలను ప్రపంచానికి పరిచయం చేశారు. ఆ పాత్రలు చిరస్థాయిగా ప్రపంచమంతటా పాఠకుల మనస్సులలో నిలిచిపోయాయి.

డాయ్ల్, 'ద ఫైనల్ ప్రాబ్లమ్' అన్న రచనలో షెర్లక్ హోమ్స్ చనిపోయినట్టు రాశారు. కానీ ప్రపంచమంతటా పాఠకులు విపరీతంగా విమర్శలు చేసిన కారణంగా ఆ పాత్రను రచయిత తిరిగి బతికించి మరెన్నో కథలను కొనసాగించారు.

షెర్లక్ హోమ్స్ పరిశోధనల క్రమంలో నాలుగు నవలలు, 65కు పైగా కథలు ఉన్నాయి. ఈ కథలు నాలుగు సంపుటాలుగా వచ్చాయి. మొదటి సంపుటం, అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హోమ్స్‌లోని మొత్తం 12 కథలలోని చివరి ఆరు కథలు ఈ సంపుటంలో ఉన్నాయి.

అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హెూమ్స్

# రెండవ భాగం

# బ్లూ కార్బంకిల్

క్రిస్మస్ తరువాత రెండవ ఉదయాన పండుగల సందర్భంగా అభినందనలు అందజేస్తామని నేను మిత్రుడు షర్లక్ హెూమ్స్ వద్దకు వెళ్లాను. అతను ఒక విచిత్రమయిన రంగు గౌను వేసుకుని సోఫాలో చేరబడి ఉన్నాడు. కుడిపక్కన  పైప్ ర్యాక్ ఉంది. ముందు ఆనాటి వార్తాపత్రికలు కుప్పగా పోసి ఉన్నాయి. వాటన్నిటిని చదివాడని అర్థమవుతున్నది. అతను పడుకున్న కోచ్ పక్కన ఒక కర్ర కుర్చీ ఉంది. దానిమీద ఒక ఫెల్ట్ హ్యాట్ పెట్టి ఉంది. అదేమంత బాగాలేదు. మరీ వాడి నందుకు అరిగిపోయి ఉంది. కొన్నిచోట్ల పగుళ్లు కూడా చూపింది. కుర్చీ మీద ఒక భూతద్దం, ఫోర్సెప్స్ కూడా ఉన్నాయి. అంటే ఆ టోపీని పరీక్షించే ప్రయత్నం జరుగుతున్నదని అర్థమవుతున్నది.



“పనిలో ఉన్నట్టున్నావు. నేను వచ్చి అడ్డు తగులుతున్నానా?” అడిగాను.

“ఎంతమాత్రం లేదు. నా ఆలోచనల ఫలితాలను చర్చించేందుకు ఒక మిత్రుడు దొరకడం నిజానికి సంతోషంగా ఉంది. అయితే

విషయం చాలా మామూలయినది. దానికి సంబంధించి, కొన్ని సంగతులు తోచాయి. అవి ఆసక్తికరం కావు అనడానికి లేదు. వాటిలోనుంచి నేర్చుకోవలసింది కూడా చాలా ఉంది" అన్నాడతను పాతటోపీ వేపు చూపిస్తూ.

నేను వెళ్లి అతని పడకకుర్చీలో కూర్చున్నాను. ఫయర్‌ప్లేస్‌లోని మంటలవేపు చేతులు జాపి వేడి కాచుకుంటున్నాను. బయటంతా చాలా చల్లగా ఉందిమరి. కిటికీ అద్దాలమీద మంచుకణాలు కప్పుకుని కని పిస్తున్నాయి. "చూడడానికి చాలా సంసారపక్షంగా ఉందిగానీ. ఈ టోపీ వెనుక ఏదో పెద్ద కథ ఉన్నట్టుంది. ఒక రహస్యంలోకి తొంగిచూడడానికి ఈ టోపీ దారిని అందిస్తుందని ఆ పైన ఒక నేరస్తునికి శిక్ష పడుతుందని కూడా నాకు తోచింది" అన్నాను.

"అబ్బే, ఇక్కడ నేరం లేదు. ఇదంతా ఒక అర్థంలేని చిన్న సంఘటన. ఏవో కొన్ని చదరపు మైళ్లలో నలభయి లక్షల మానవులు ఉండి, అందరూ చోటు కొరకు తోసుకుంటుంటే, మామూలుగా జరిగే రకం ఇది. ఇంతమంది మానవులు తోసుకుంటే అందులో చర్యలు, ప్రతిచర్యలు ఉండనే ఉంటాయి. అన్ని రకాల సంఘటనలు, వీలయినంతగ జరుగుతుంటాయి. వాటిలోనుంచి వింత వింత సమస్యలు పుట్టుకువస్తాయి. కానీ, అక్కడ నేరం లేకపోవచ్చు. ఇలాంటి సంఘటనలు మనం ఎన్నో చూడనే చూచాం" నవ్వుతూ అన్నాడు షెర్లక్ హెూమ్స్.

"నిజమే, నేను ఈమధ్యన రికార్డు చేసిన ఆరు కేసుల్లో మూడింట న్యాయపరంగా ఏరకంగా నేరమూ లేనేలేదు" నేనన్నాను.

"సరిగ్గా చెప్పావు. నీవు ఐరీన్ ఆడ్లర్ ఫొటోని సంపాదించడానికి నేను చేసిన ప్రయత్నం గురించి, మిస్ మేరీ సూదర్‌లాండ్ వ్యవహారం గురించి, ఇక వంకరపెదవి మనిషికి సంబంధించిన పరిశోధన గురించి చెప్తున్నావు. ఇప్పటి ఈ చిన్న సంఘటన కూడా ఈ రకమయిన అమాయకపు వ్యవహారమే. నీకు కమిషనేర్, పీటర్‌సన్ గుర్తున్నాడు కదూ?"



"అవును."

"అదుగో, ఆ వస్తువు అతనిదే!"

"ఆ టోపీ ఆయనదా?"

''కాదు, కాదు. అతనికి దొరికింది. స్వంతదారుడు ఎవరో తెలియదు. నీవు దాన్ని ఏదో పాతటోపీ అనుకుంటున్నావు గానీ, అది మన తెలివికి పరీక్ష. అసలు ముందు అది ఇక్కడికి ఎట్లా వచ్చిందని? అది క్రిస్మస్ ఉదయాన వచ్చింది. దాంతోపాటే ఒక మంచి బలిసిన బాతు కూడా ఉంది. ఆ బాతు బహుశా ఈ క్షణాన పీటర్‌సన్ ఇంట్లో పొయ్యిమీద ఉడుకుతూ ఉంటుంది. అసలు సంగతి చెపుతాను. క్రిస్మస్ ఉదయాన నాలుగుగంటల ప్రాంతంలో, ఈ మన మహామంచి మనిషి, పీటర్‌సన్, సరదాగా ఎక్కడో తిరుగుతున్నాడు. టోటెన్‌హామ్ కోర్ట్ రోడ్‌లో నడుస్తున్నాడు. అది తన ఇంటివేపు. అంతలో అతనికి ఎదురుగా గ్యాస్‌లైట్ల వెలుతురులో ఒక పొడుగాటి మనిషి, కొంచెం కుంటుతూ రావడం కనిపించింది. అతని భుజంమీద ఒక పెద్ద బాతు వేలాడుతున్నది. ఆ మనిషి గూడ్జ్ వీధి చివరిలోకి వచ్చే సమయానికి అక్కడ ఒక తగవులాట మొదలయింది. రౌడీలు కొందరు పోగయ్యారు. వాళ్లలో ఒకడు వచ్చి తగిలినందుకు ఈ మనిషి టోపీ పడిపోయింది. అతను కోపగించుకుని రక్షణ కోసం అన్నట్టు చేతికర్రను పైకెత్తి తలచుట్టూ తిప్పాడు. అది వెనుకనున్న అంగడి కిటికీకి కొట్టుకున్నది. పీటర్‌సన్ రౌడీలనుంచి ఈ మనిషిని కాపాడడానికని ముందుకు పరిగెత్తాడు. కానీ అతను కిటికీ పగలగొట్టిన భయంతో, అక్కడ పోలీస్‌లాగ కనపడుతున్న ఒక మనిషి తనవేపు

పరుగుగా వస్తున్నట్టు గమనించడంతోనూ, హడలిపోయి, బాతును కిందపడేసి, పరుగులంకించుకున్నాడు. ఆ సందులు, గొందులలో ఎక్కడో మాయ మయ్యాడు. పీటర్‌సన్ వచ్చేసరికి మొరటు కుర్రాళ్లు కూడా పారిపోయారు. రణరంగం పీటర్‌సన్‌కు మిగిలింది. విజయానికి గుర్తుగా అతనికి ఒక టోపీ, సాటిలేని క్రిస్మస్ బాతు చేతికందాయి."

"ఆ వస్తువులను మరి అతను స్వంతదారులకు అప్పగించి ఉండాలి."

"మిత్రమా, అదే చిక్కు సమస్య. బాతు ఎడమకాలికి ఒక చీటీ కట్టి ఉంది, దాని మీద 'మిసెస్ హెన్రీ బేకర్ గారికి' అని రాసి కూడా ఉంది. ఇక టోపీమీద లోపలి అంచులో 'ఎచ్.బి.' అని పొడి అక్షరాలున్నాయి. ఈ ఊళ్లోనేమో  కొన్ని వేలమంది బేకర్స్ ఉన్నారు. వాళ్లలో వందలమంది 'హెన్రీ బేకర్స్' ఉంటారు. వెతికి వాళ్లలో ఈ వస్తువులు ఎవరివో కనుగొనడం, తిరిగి అప్పచెప్పడం వీలయ్యేపని కాదు."

"మరి అప్పుడు పీటర్‌సన్ ఏం చేశాడు?"

"అతను టోపీని, బాతును రెంటినీ నా వద్దకు తెచ్చాడు. నాకు విషయం ఎంత చిన్నదయినా, ఆసక్తి ఉంటుందని అతనికి తెలుసు. బాతును మేము ఇవాళిటిదాకా ఇక్కడే పెట్టాం. ఇంత చల్లని వాతావరణంలోనూ, అది పాడయ్యే సూచనలు కనిపిస్తే, ఇంక ఆలస్యంచేసి లాభం లేదని, దాన్ని తినడమే మంచిదని, బాతు గురించి నిర్ణయించాం. దాన్ని కనుగొన్న వ్యక్తి, దాన్ని తీసుకుపోయాడు. బాతుకు న్యాయంగ చివరికి జరగవలసినదేదో జరుగుతుంది. ఇక నేను మాత్రం, క్రిస్మస్ నాడు చక్కని డిన్నర్‌ను కోల్పోయిన గుర్తు తెలియని మనిషి టోపీని నాతోనే అట్టిపెట్టుకున్నాను."

"అతను పత్రికలో ప్రకటన చేయలేదా?"

"లేదు"

"మరప్పుడు స్వంతదారుని గురించి తెలుసుకోవడానికి క్లూ ఏమిటి?"

"మనం గమనించగలిగినవి మాత్రమే."

"ఏమిటి? టోపీ నుంచా?"

"అవును."

"జోక్ చేస్తున్నావా? నలిగిపోయిన ఈ పాత టోపీ నుంచి నీవేం కనుగొంటావు?"

"ఇదుగో నా భూతద్దం. నీకు నా పద్ధతులు తెలుసు. నీకుగా నీవు ఈ వస్తువును ధరించిన మనిషి వ్యక్తిత్వం గురించి ఏమి గమనించ గలుగుతావో చెప్పు."

నేను ఆ పాత టోపీని చేతిలోకి తీసుకున్నాను. గమనిస్తూ అటుఇటూ తిప్పి చూచాను. చాలా మామూలు నల్లని టోపీ అది. గుండ్రంగానే ఉంది. చాలాకాలం వాడినందుకు గట్టిపడింది. లోపలి లైనింగ్ ఎర్రని సిల్క్‌తో కుట్టింది. కానీ రంగు వెలిసిపోయి ఉంది. టోపీ తయారుచేసిన కంపెనీ ఆనవాళ్ళులేవు. కానీ హెూమ్స్ చెప్పినట్టు 'ఎచ్.బి' అనే పొడి అక్షరాలు గీకినట్టు రాసి ఉన్నాయి. కొక్కానికి వేయడానికి వేసే రంధ్రం కూడా ఉంది. ఎలాస్టిక్ మాత్రం లేదు. ఇక అందులో పగుళ్ళున్నాయి. చాలా దుమ్ము నిండి ఉంది. నిండా మరకలు కూడా ఉన్నాయి. అక్కడక్కడ రంగువెలిసిన చోట సిరాతో కప్పిపుచ్చడానికి చేసిన ప్రయత్నాలు కూడా కనిపించాయి.

"నాకేమీ అర్థం కాలేదు" అన్నాను టోపీని నా మిత్రునికి అందిస్తూ.

"అదేం కాదు, వాట్సన్, నీవు అన్నీ గమనించగలవు. అయితే వాటి గురించి తర్కించడానికి తోచదు. ఆలోచనల నుంచి ఫలితాలను బయటకు తీయడానికి నీవు జంకుతావు."

"అవునా. అయితే తమరికి ఈ హ్యాట్ చూచి ఏమేమి తెలిసిందో సెలవియ్యండి."

అతను టోపీని పైకెత్తాడు సాలోచనగా, విచిత్రంగా తనదయిన పద్ధతిలో

దానివేపు చూస్తున్నాడు. "ఇందులో తెలియవలసినదానికన్నా, తక్కువ సూచనలు కనపడుతున్నాయి. అయితే కొన్ని విషయాలు మాత్రం సులభంగానే తెలుస్తున్నాయి. కొన్ని, అయ్యుండవచ్చు అనిపించే లక్షణాలు కూడా కనపడుతున్నాయి. మొట్టమొదటి చూపులోనే ఈ టోపీని పెట్టుకున్న మనిషి చాలా తెలివిగలవాడని తేలిపోతున్నది. అతను గత మూడేళ్లుగా మంచి స్థితిపరుడుగానే గడిపాడని, ఈమధ్యనే గడ్డురోజులు వచ్చాయని కూడా తెలుస్తున్నది. అతనికి చాలా ముందుచూపుంది. అదిప్పుడు తగ్గిపోతున్నది. నైతికంగా అతను ఒత్తిడికి గురవుతున్నాడు. డబ్బులు లేకుండా పోవడం అన్నది అటువంటి పరిస్థితికి దారితీస్తున్నది. బాధలవల్ల బహుశా అతను తాగుడుకు బానిస అయినట్టున్నాడు. కనుకనే అతని భార్య అతడిని అంతగా ఆదరించడం లేదన్నది కూడా అర్థమవుతున్నది."

"మైడియర్ హోమ్స్!"

"అయినా అతను ఆత్మగౌరవాన్ని కొంతయినా నిలబెట్టుకున్నాడు. అతను ఎక్కువగా తిరిగే అలవాటు లేనివాడు. మధ్యవయసు మనిషి, జుట్టు ఉంగరాలుగా ఉంటుంది. ఈ మధ్యనే అతను జుట్టు కత్తిరించుకున్నాడు కూడా. తలకు అతను నిమ్మవాసన క్రీమ్ పూసుకుంటాడు. ఇవి చాలా సులభంగా కనిపించే విషయాలు. ఇంకొక విషయం, అతనికి ఇంటిలో గ్యాస్ ఏర్పాటు లేదని చెప్పవచ్చు."

"నీవు నన్ను ఆటపట్టిస్తున్నావు, హోమ్స్"

"ఎంతమాత్రమూ లేదు. నేను ఇన్ని విషయాలు చెప్పిన తరువాత కూడ, వాటిని నేనెలాగ తెలుసుకున్నానో నీవు అర్థం చేసుకోలేకపోవడం సంభవమా?"

"నేను మొద్దు బుర్ర మనిషినని అనడంలో నాకు అనుమానం లేదు. అయితే, నీవు చెప్పేదేదీ నాకు అర్థంగావడం లేదు. ఆ మనిషి తెలివిగలవాడని

నీవెలా కనుగొన్నావు?”

జవాబుగా హెూమ్స్ ఆ టోపీని తన తలమీద పెట్టుకున్నాడు. అది నుదుటి మీదినించి వచ్చి ముక్కుమీద ఆనింది.

“ఇది మెదడు కెపాసిటీకి సంబంధించిన ప్రశ్న. ఇంతపెద్ద మెదడున్న మనిషి అందులో కొంతన్నా వ్యవహారం కలిగి ఉంటాడు”అన్నాడతను.

“మరి, అతను ఆస్తి పోగొట్టుకున్నాడన్నావు?”

“ఈ టోపీ మూడు సంవత్సరాల వయసు గలది. ఈ రకంగా చదునుగా ఉండే టోపీలు అప్పుడే వచ్చాయి. ఇది ఎంతో మంచి నాణ్యతగల టోపీ. లోపల లైనింగ్‌గా వేసిన సిల్క్‌ను గమనించిచూడు. మూడు సంవత్సరా క్రితం ఈ మనిషి ఇటువంటి టోపీ కొనగలిగాడు, ఆ తరువాత మరొకటి కొనలేకపోయాడంటే, అతని పరిస్థితి రాను రాను దిగజారింది అనే కదా అర్థం.”

“అవును. అర్థమయింది. మరి అతని ముందు చూపు, నైతికంగా దిగజారడం గురించి ఎలా చెప్పావు?”

షెర్లక్ హెూమ్స్ నవ్వాడు. ‘‘అతని ముందుచూపు ఇక్కడ కనపడుతోంది” అంటూ వేలితో టోపీమీద అమర్చిన ఒక చిన్న డిస్క్ వేపు చూపాడు. “ఇలాంటివి టోపీతో పాటు రావు. ఇతను విడిగా కొని దాన్ని అమర్చుకున్నాడంటే చాలా ముందు చూపుగల వాడని అర్థం. ఈ బిళ్ల టోపీని కాపాడుతుంది. కానీ, దానితోపాటువచ్చే ఎలాస్టిక్‌ని మాత్రం తెగినాసరే అతను సరిచేయలేదు. అంటే అతని ముందుచూపు రాను రాను తగ్గిందని అర్థం. ఇక మరోవేపు, టోపీమీద పడ్డ మచ్చలను అతను సిరాతో కప్పిపుచ్చడానికి ప్రయత్నించాడు. అంటే ఆత్మగౌరవం గురించి ఇంకా ధ్యాస తగ్గలేదని.”

“నీ వివరణ సంభావ్యంగానే ఉంది.”

"ఇంకా ముందుకు కదిలితే, అతని మధ్యవయసు గురించి, అతని వంకరల జుట్టు గురించి, అతను ఈ మధ్యనే జుట్టు కత్తిరించడం గురించి, క్రీమ్ గురించి. టోపీని లోపలివేపు కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే, ఇవన్నీ సులభంగా తెలుస్తాయి. భూతద్దంతో చూస్తే, లోపల వెంట్రుక ముక్కలు ఎన్నో కనిపించాయి. అవి కత్తెరతో కత్తిరించినట్టున్నాయి. పైగా అవి టోపీకి అంటుకుని ఉన్నాయి. లోపలినుంచి నిమ్మక్రీమ్ వాసన వస్తున్నది. నీవు బాగా చూడగలిగితే, టోపీమీది దుమ్ము బజారులో ఉండే రకం కాదు, ఇంట్లో ఉండే ముదురురకం. అంటే, టోపీ ఎక్కువ కాలం ఇంట్లోనే వేలాడుతున్నదని అర్థం. లోపలివేపు టోపీ తడిసిన లక్షణాలు ఉన్నాయి. అంటే స్వంతదారునికి బాగా చమట పడుతుందని అర్థం. అంటే, అతను అంతగా పని అలవాటయిన రకం కాదు."

"అతని భార్య సంగతి? ఆవిడ భర్తను అభిమానించడం లేదన్నావూ?"

"ఈ టోపీని బ్రష్‌తో శుభ్రం చేసి వారాలయింది. వాట్సన్, నిన్ను చూచినపుడు నీ టోపీ మీద వారాలపాటు దుమ్ము పేరుకున్నట్టు కనపడితే, అటువంటి టోపీతో నిన్ను బయటికి పంపడానికి మీ ఆవిడ ఒప్పుకున్నదంటే, నీ భార్య నిన్ను ప్రేమించడం లేదని దురదృష్టకరంగా, నాలో భయం మొదలవుతుంది."

"అతను బ్రహ్మచారేమో?"

"కాదు. అతను తన భార్యకు బహుమతిగా బాతును ఇంటికి తెస్తున్నాడు. దాని కాలికి కాగితంకట్టి ఉన్న సంగతి చెప్పాను కదా?"

"ప్రతిదానికీ, ఏదో ఒక సమాధానం చెప్తావు. కానీ, అతని ఇంట్లో గ్యాస్ లేదని చెప్పావు, అదెట్లాగ?"

"టోపీమీద కొవ్వు మరకలు ఒకటో రెండో ఉంటే, ఏమో అనుకోవచ్చు. కానీ, అయిదుకు పైన మరకలు ఉన్నాయంటే, దాన్ని వాడుతున్న మనిషి

తరుచుగా కొవ్వును ముట్టుకుంటాడని అర్థం. బహుశ కొవ్వొత్తి ఒకచేతితో, టోపీ మరొక చేతిలో పట్టుకుని మెట్లు ఎక్కుతాడనుకుంటాను. అంటే, గ్యాస్ లేదనేకదా అర్థం. ఇప్పుడయినా, సంతృప్తి కలిగిందా?"

"భలే. ఇది మరీ బాగుంది" అన్నాను నేను నవ్వుతూ. "మరొక సంగతి. నేరం ఏదీ జరగలేదన్నావు. బాతు పోవడం తప్ప, ఎవరికీ నష్టం జరగ లేదన్నావు. మరి మనం అనవసరంగా ఈ వ్యవహారం గురించి మధన పడుతున్నామా? "

షెర్లక్ హెూమ్స్ జవాబు చెప్పడానికి నోరు కదిలించేలోగా తలుపు తెరుచుకుంది. కమిషనేర్, పీటర్సన్ లోపలికి దూసుకువచ్చాడు. ఆశ్చర్యంలో మూలుగుతున్నవానివలె అతని ముఖం కంది ఉంది.

"బాతు, మిస్టర్ హెూమ్స్! బాతూ!!" అతను రొప్పుతున్నాడు.

"ఏమిటి? ఏమయింది బాతు? దానికి ప్రాణం వచ్చి రెక్కలు కొట్టుకుని వంటింటి కిటికినుంచి ఎగిరిపోయిందా?"

సోఫాలో గుండ్రంగా తిరిగి అతని ముఖంవేపు నేరుగా చూస్తూ అన్నాడు హెూమ్స్.

"ఇది చూడండి, సర్! బాతు క్రాప్‌లో మా ఆవిడకు ఏం దొరికిందో చూడండి!" అతను చేయిజాపి పిడికిలి విప్పాడు. అరచేతిలో మెరిసిపోతూ అందమయిన నీలిరంగు రాయి ఒకటి కనిపించింది. అది చిక్కుడుగింజకన్నా కొంచెం చిన్నదిగా ఉంది. ఎంతో శుభ్రమయిన ఆ వెలగల రాయి నుంచి వెలుగులు విరజిమ్ముతున్నాయి. అతని చేతిలోనే అది మెరిసిపోతున్నది.

షెర్లక్ హెూమ్స్ ఒక్క ఈల వేసి లేచి కూచున్నాడు. "బై జోవ్! పీటర్సన్! ఇది చాలా విలువయిన రాయి. నీకేం దొరికిందో అసలు అర్థమయిందా?" అన్నాడతను.



"వజ్రం, సార్! ఒక విలువయిన రాయి. దానితో అద్దాన్ని మెత్తగా కోస్తారట."

"అది ఉట్టుట్టి విలువయిన రాయి కాదు. అన్నిటికన్నా విలువయిన రాయి అని అర్థం."

"కొంపతీసి కౌంటెస్ ఆఫ్ మోర్కార్ తాలూకు కార్బంకిల్ కాదుగదా?!" నేను గట్టిగా అరిచాను.

"సరిగ్గా అదే. దాని బరువు, రూపం గురించి వివరాలు కావాలి. ఈ మధ్యన ప్రతినిత్యం ద టైమ్స్ లో దాన్ని గురించి ప్రకటన చదువుతూనే ఉన్నాను. అది చాలా ప్రత్యేకమయిన రత్నం. దాన్ని విలువకట్టడం వీలుకాదు. వెయ్యి పౌండ్లు బహుమతిగా ప్రకటించారంటే రత్నం ధరలో అది ఇరవయ్యవ వంతుకన్నా తక్కువే అయ్యుంటుంది."

"వెయ్యి పౌండ్లే! ఓరి భగవంతుడా!" కమిషనేర్ ఓ కుర్చీలో కూలబడ్డాడు. మా యిద్దరివేపు మార్చి మార్చి చూడసాగాడు.

“అంత బహుమతి ఇస్తామన్నారు. అయితే దాని వెనక స్వంత విషయాలు, అభిమానాలు ఉన్నందుకు కౌంటెస్ రత్నం దొరికితే, మరింత కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని నాకు నమ్మకంగా తెలుసు.”

“అది హొటేల్ కాస్మోపాటిటన్‌లో పోయింది, అనుకుంటాను” అన్నాను నేను.

“అవును. అది డిసెంబర్ 22న. అంటే అయిదు రోజుల క్రితం. ఆవిడగారి నగలకేసు నుంచి దాన్ని కాజేశాడని జాన్ హార్నర్ అనే ఒక ప్లంబర్ మీద అనుమానం వచ్చింది. దొరికిన సాక్ష్యాలు మరీ గట్టిగా ఉన్నదందుకు కేసును పై అధికారులకు అప్పగించారు. వ్యవహారం గురించి కొన్ని వివరాలు ఇక్కడ ఉన్నాయనే అనుకుంటున్నాను” అంటూ హొమ్స్ వార్తాపత్రికలను వెదికి చూడసాగాడు. తేదీలను గమనిస్తున్నాడు. చివరకు ఒకదాన్ని ఎత్తి సరిచేశాడు. మడతపెట్టి చదవసాగాడు.

> *“హొటేల్ కాస్మోపాలిటన్‌లో నగల చోరీ. జాన్ హార్నర్ అనే 26 సంవత్సరాల వయసుగల ప్లంబర్ నిందితుడుగా గుర్తింపబడ్డాడు. అతనిమీద, కౌంటెస్ ఆఫ్ మోర్కార్‌గారి నగల కేస్ నుంచి, 22వ తేదీనాడు నీలి కార్‌బంకిల్ అనే వెలగల రత్నాన్ని దొంగిలించాడని అభియోగం. హొటెల్లో పనిచేసే అప్పర్ అటెండెంట్, జేమ్స్ రైడర్ ఈ విషయంగా సాక్ష్యం చెబుతూ, హార్నర్, కౌంటస్ ఆఫ్ మోర్కార్ గదిలో ఆ రోజున కనిపించినట్టు వివరించాడు. కిటికీలోని చువ్వలలో రెండవదానిని సరి చేయడానికి హార్నర్‌ను అక్కడికి తీసుకువెళ్లాడు. అతనితో అక్కడే కొంతసమయం ఉన్నాడుకూడా. కానీ ఎవరో పిలిచినందుకు, అక్కడి నుంచి రావలసి వచ్చింది. తిరిగి గదిలోకి వెళ్లేసరికి హార్నర్ అక్కడ లేడు. అల్మారా బలవంతంగా*

*తెరిచి ఉంది. అక్కడ ఒక మొరాకో పెట్టె ఉంది. అందులో కౌంటెస్ గారు తమ నగలు దాచుకుంటారని తరువాత తెలిసింది. ఆ పెట్టె డ్రసింగ్ టేబుల్ మీద తెరిచిపెట్టి ఉంది. వెంటనే రైడర్ విషయం అందరికీ చెప్పాడు. అదే సాయంత్రం హోర్నర్‌ని అరెస్టు చేశారు. కానీ, రాయి అతని వంటిమీదకానీ, గదిలోకానీ, కనిపించలేదు. కౌంటెస్‌గారి మెయిడ్, కుసక్ అనే పేరుగలావిడ కూడా సాక్ష్యం చెప్పింది. చోరీని గమనించిన రైడర్ గట్టిగా అరిచాడని, వెంటనే తాను గదిలోకి వెళ్లిందని, అక్కడి పరిస్థితులను గమనించిందని, అవి రైడర్ చెప్పినట్టే ఉన్నాయని ఆమె చెప్పింది. హోర్నర్‌ని అరెస్టు చేయడానికి వెళితే, అతను పెనుగులాడాడని తనకేమీ తెలియదని చాలా గట్టిగా వాదించాడని, డి డివిజన్ ఇన్‌స్పెక్టర్ బ్రాడ్‌స్ట్రీట్ సాక్ష్యమిచ్చాడు. బందీ ఇంతకు ముందు కూడా ఒక నేరంలో అరెస్టుకు గురయ్యాడని తెలిసిన తరువాత, మెజిస్ట్రేట్‌గారు కేసును పై అధికారులకు అప్పజెప్పారు. విచారణ జరుగుతున్నప్పుడు హోర్నర్ తీవ్రమైన మనోభావాలను కనబరిచాడు. చివరకు అతను మూర్ఛపోయాడు. కోర్టులోనుంచి అతనిని ఎత్తి తీసుకు పోవలసి వచ్చింది.*

"ఆహా! పోలీసు కోర్టు పద్దతులు!" అన్నాడు హోమ్స్ సాలోచనగా. అతను పేపర్ పక్కన పడేశాడు. "ఇక ఇప్పుడు మనం విప్పవలసిన చిక్కు, ఒక వైపు బలవంతంగా తెరిచిపెట్టిన నగల కేస్‌తో మొదలయి, మరోవేపు టోటెన్‌హామ్ కోర్ట్ రోడ్‌లో దొరికిన బాతు గొంతులో క్రాప్ దాకా సాగుతుంది. గమనించావా, వాట్సన్. మనమింతవరకూ చేస్తుండిన ఆలోచనలకు ఇప్పుడు ప్రాముఖ్యత పెరిగింది. వాటిలోని అమాయకత్వం కాస్త తగ్గింది. ఇదుగో

రత్నం. ఇది ఆ బాతు గొంతుకలో నుంచి వచ్చింది. బాతు మిస్టర్ హెన్రీ బేకర్ దగ్గరనుంచి వచ్చింది. ఈ టోపీ ఆయనదే. దాన్ని గురించి, ఆయన గురించి చెప్పి నేను నిన్ను విసిగించాను. ఇప్పుడిక మనం సీరియస్‌గా ఆ పెద్దమనిషిని వెదికే ప్రయత్నం చేయాలి. మొత్తం వ్యవహారంలో అతని పాత్ర ఏమిటో తేల్చుకోవాలి. అందుకుగాను ముందుగా మనం అన్నింటికన్నా సులభమయిన మార్గాన్ని అవలంబించాలి. ఇవాళటి సాయంత్రం పేపర్లలో ఒక ప్రకటన ఇవ్వాలి. అది పనిచేయకపోతే, మరేవో పద్ధతులను చూడాలి."

"ఏమని ప్రకటన వేస్తావు?"

"నాకొక కాగితం, పెన్సిల్ ఇవ్వు. చెపుతాను:

*"గూడ్జ్‌స్ట్రీట్ మలుపులో ఒక బాతు, ఒక నల్లని టోపీ దొరికాయి. 221 బి, బేకర్‌స్ట్రీట్‌లో సాయంత్రం ఆరుగంటల ముప్పయి నిమిషాలకు సంప్రదించి మిస్టర్ హెన్రీ బేకర్‌గారు వాటిని తీసుకొనవచ్చు.*

ఇది సరిపోతుందనుకుంటాను."

"బాగుంది. కానీ అతను ప్రకటన చూస్తాడా?"

"అతను పత్రికలమీద ఒక కన్ను వేసి ఉంచుతాడని నిశ్చయంగా చెప్పగలను. బీదవారికి ఈ పోయిన వస్తువులు చాలా విలువగలవిగానే కనపడతాయి మరి. అతను కిటికీ పగలగొట్టానని చాలా భయపడ్డాడు. అంతలో పీటర్‌సన్ కనిపించడంతో హడలిపోయి పరుగుపెట్టాడు. కానీ ఆ తరువాత బాతును పడవేసుకున్నందుకు చాలా మనస్తాపం పొంది ఉంటాడు. పైగా పత్రికలో తన పేరు కనిపించిందంటే తప్పకుండా చూస్తాడు. లేదంటే మరెవరో అతనికి సంగతి చెపుతారు. పీటర్‌సన్, ప్రకటన సంస్థకు వెళ్లి, ఈ నాలుగు మాటలను సాయంత్రం పత్రికల్లో వచ్చేట్టు ఏర్పాటు చెయ్యి."

"ఏఏ పత్రికల్లో, సర్?"

"ఓహ్, గ్లోబ్, స్టార్, పాల్‌మాల్, సెయింట్ జేమ్స్, ఈవినింగ్ న్యూస్ స్టాండర్డ్, ఈకో.. ఇంకా ఏం తోస్తే అవి."

"తప్పకుండా సార్, మరి ఈ రత్నం?"

"కదూ, అది నా దగ్గర ఉండని. థాంక్యూ. కానీ పీటర్‌సన్, తిరిగి వచ్చేప్పుడు ఒక బాతుని కొని తీసుకురా. ఆ మనిషి వస్తే, అతని బాతుకు బదులు ఇవ్వడానికి మరోటి ఉండాలిగదా! అసలు బాతును మీ కుటుంబం మింగేసిందాయె"

కమిషనేర్ వెళ్ళిపోయాడు. హోమ్స్ వెలగల రాతిని పైకెత్తి వెలుగుకు పట్టి చూచాడు. "మేలిమి జాతిది ఇది. ఎట్లా మెరిసిపోతున్నదో చూడు. కానీ ఇది ఒక నేరానికి కేంద్రబిందువు అయింది. వెలగలరాళ్లన్నీ అట్లాగే అవుతాయి. అవి దెయ్యాలు వేసే ఎరల వంటివి అంటారు. పాతకాలపు వజ్రాల యొక్క ప్రతి ముఖంలోనూ రక్తపాతపు మరకలుంటాయని అంటారు. ఈ రాయి ఇరవయ్యేళ్లకన్నా పాతది కాదు. దక్షిణ చైనాలో అమాయ్ నది పక్కన ఇది దొరికింది. ఆ జాతికి ఉండవలసిన లక్షణాలలో అత్యుత్తమ మయినవన్నీ ఇందులో ఉన్నాయి. మంచి ఎరుపులో ఉండేబదులు, ఇది నీలిగా ఉండడం మాత్రం ప్రత్యేకత. చాలా కొత్తదయిన దీని వెనకాల పాపపు చరిత్ర కావలసినంత ఉంది. దీని మూలంగా రెండు హత్యలు, ఒక యాసిడ్ దాడి, ఒక ఆత్మహత్య, మరెన్నో దొంగతనాలు జరిగాయి. ఈ కరడుగట్టిన నలభయి గ్రెయిన్ల బొగ్గు స్ఫటికం కారణంగా అంత జరిగింది. ఇంత అంద మయిన రాయి ఉరికంబాలకు, చెరసాలలకు దారి వేస్తుందని ఎవరు మాత్రం అనుకుంటారు? నేను దీన్ని నా స్ట్రాంగ్ బాక్స్‌లో పదిలం చేస్తాను. కౌంటెస్ గారికి దీన్ని గురించి సమాచారం పంపుతాను."

"హోర్నర్ అనే మనిషి అమాయకుండంటావా?"

“చెప్పలేను.”

“మరి, ఆ మరోమనిషి, హెన్రీ బేకర్, అతని పాత్ర ఎంత?”

“ఈ హెన్రీ బేకర్ నిజంగా అమాయకుడయి ఉంటాడని నా నమ్మకం. తాను మోస్తున్న పక్షి విలువ దాని ఎత్తు బంగారంకన్నా ఎక్కువ ఉంటుందని అతనికి ఆలోచనకూడా వచ్చి ఉండదు. మన ప్రకటనకు, సమాధానంగా సమాచారం దొరికితే ఈ సంగతి తేలుతుంది.”

“అప్పటివరకూ చేయగలిగింది ఏమీ లేదా?”

“ఏమీ లేదు.”

“అయితే మరి, నేను నా పనిమీద వెళ్లివస్తాను. సాయంత్రం నీవు చెప్పిన సమయానికి తప్పకుండా వచ్చేస్తాను. ఈ చిక్కు సమస్య గురించి తెలుసుకోవాలని నాకు కుతూహలంగా ఉంది.”

“చాలా సంతోషం. నేను ఏడింటికి భోజనం చేస్తాను. మంచి ఏర్పాట్లే ఉన్నట్లున్నాయి. కానీ, జరిగిన సంగతులను చూస్తే, మిసెస్ హడ్‌సన్‌గారు మరో పక్షిని కోసేలోగా బాగా పరిశీలించమని చెప్పాల్సినట్టు ఉంది.”

నాకు ఒక కేస్‌తో కొంచెం ఆలస్యమయింది. తిరిగి బేకర్ స్ట్రీట్‌కి చేరేవరకు ఆరున్నర దాటింది. నేను అక్కడికి చేరేసరికి, ఇంటిముందు దీపం వెలుగులో ఒక పొడుగాటి మనిషి నిలబడి ఉండడం చూచాను. స్కాచ్ టోపీ పెట్టుకుని ఉన్నాడు. వేసుకున్న కోటు బొత్తాలు మెడదాకా మొత్తంగా పెట్టి ఉన్నాయి. నేను కూడా చేరిన క్షణంలోనే తలుపు తెరుచుకుంది. ఇద్దరమూ కలిసి హోమ్స్ గదిలోకి వెళ్లాము.

“మిస్టర్ హెన్రీ బేకర్ అనుకుంటాను” అన్నాడు హోమ్స్ కుర్చీలోంచి లేచి వచ్చిన మనిషికి సాదరంగా స్వాగతం చెబుతూ. అతను అనుకుంటే క్షణంలో అటువంటి భావాలను బాగా పులుముకోగలడు. “మిస్టర్ బేకర్, దయచేసి మంట పక్కనే ఈ కుర్చీలో కూర్చోండి. బయట బాగా చలిగా

ఉంది. మీ ఆరోగ్యం వేసవికి మాత్రమేకాని, చలికాలానికి అంతగా తగినది కాదని నేను గమనించగలను. ఇక వాట్సన్, సరిగ్గా సమయానికి వచ్చావు. మిస్టర్ బేకర్, ఈ టోపీ తమదేనా?"

"అవునండీ. నిస్సందేహంగా నాదే."

అతను చాలా భారీ శరీరంగల మనిషి. విశాలమయిన భుజాలు, పెద్ద తల కలవాడు. ముఖంలో తెలివి తెలుస్తున్నది. ఆ ముఖం కోసుగా ఉన్నది. ముక్కు చివర, చెంపలు కొంత ఎర్రబడి ఉన్నాయి. చెయ్యి కొంచెం వణుకుతున్నది. అతని అలవాట్ల గురించి హెూమ్స్ చేసిన ఆలోచనలు నాకు గుర్తుకు వచ్చాయి. అతను వేసుకున్న పొడుగాటి కోటు బొత్తాలు మెడదాకా మొత్తం పెట్టి ఉన్నాయి. కాలర్ పైకి ఎత్తి ఉంది. కోటు చేతులలో నుంచి అతని సన్నని మణికట్లు చొక్కాతో సహా కనపడుతున్నాయి. సన్నని కీచు గొంతుతో మాట్లాడుతున్నాడతను. మాటలు వెతుకుతున్నట్లు నెమ్మదిగా పలుకుతున్నాడు. చాలా చదువుకున్నవాడని భావం కలిగేట్టు ఉంది అతని తీరు.

"మీ వస్తువులను మేము అట్టిపెట్టవలసి వచ్చింది. పత్రికలో ప్రకటన వచ్చి మీ చిరునామా తెలుస్తుందనుకున్నాము. మీరు ఎందుకు ప్రకటన వేయలేదన్నది నాకు ఇప్పటికీ అర్థంకావడం లేదు" అన్నాడు హెూమ్స్.

వచ్చిన పెద్దమనిషి కొంచెం సిగ్గుపడుతున్నట్టు నవ్వాడు. "చేతిలో కానులు ఒకప్పుడు కదిలినంతగా ఇప్పుడు కదలడం లేదండి. నా మీద దాడి చేసిన కుర్ర దుండగులు బాతును, టోపీని ఎత్తుకుపోయారని స్థిరం చేసుకున్నాను. మళ్లీ వాటిని సంపాయించే పేరుతో మరిన్ని కానులు ఖర్చుచేయడం ఇష్టంలేకపోయింది.

"అవును మరి. అన్నట్టు, మీ బాతును మేం తినక తప్పలేదు."

"తిన్నారా?" ఆగంతుకుడు అమాంతంగా కుర్చీలోంచి లేచినంత పనిచేశాడు.

"అవును. దాన్ని అలాగే వదిలేస్తే, ఎవరికీ పనికి వచ్చేది కాదు. ఈ పక్కన కనపడుతున్న మరో బాతు ఇంచుమించు అంతే బరువు గలది, తాజాగా వచ్చింది. దీనితో మీ పని జరుగుతుందనుకుంటాను.'

"తప్పకుండా, తప్పకుండా" అన్నాడు మిస్టర్ బేకర్ సంతృప్తిగా నిట్టూర్పు వదులుతు.

"మీ పక్షి తాలూకు ఈకలు, కాళ్లు, క్రాప్ లాంటివన్నీ ఇంకా ఉన్నాయి. కావాలంటే..."

ఆ మనిషి గట్టిగా నవ్వాడు. "జరిగిన నా సాహసయాత్రను గురించి గుర్తు చేయడం తప్పిస్తే, ఆ పడేసిన శరీర భాగాలు ఏరకంగా పనికొస్తాయో నాకు అర్థంగావడం లేదు. వద్దు సార్. మీరు అనుమతిస్తే, ఈ కనపడుతున్న చక్కనయిన పక్షివేపు నా ధ్యాస మరల్చి సంతృప్తిపడతాను."

షెర్లక్ హెూమ్స్ నావేపు సూటిగా చూచి భుజాలు ఎగరేశాడు.

"అది మీ టోపీ, అది మీ బాతు. సరేగాని, బాతు ఎక్కడ నుంచి తెచ్చినదో చెప్పడం వీలవుతుందా? నాకు పక్షుల గురించి బోలెడు ఆసక్తి ఉంది. ఇంతకన్నా మంచి బాతును ఇంతకు ముందు చూచి ఎరగను."



"తప్పకుండా సర్. మేము కొంతమందిమి మ్యూజియం దగ్గరలో ఉన్న ఆల్ఫా ఇన్‌కు తరుచూ వెళుతుంటాము. పగలంతా మేము మ్యూజియంలోనే ఉంటామని బహుశా అర్థమయి ఉంటుంది. ఈ

సంవత్సరం మా నాయకుడు విండిగేట్ అనే ఆయన ఒక గూస్ క్లబ్ ప్రారంభించారు. మేమంతా వారం వారం కొంత మొత్తం పోగేశాము. దానితో క్రిస్మస్ నాటికి అందరికీ మంచి బాతు ఒకటి అందుతుంది. నేనూ డబ్బులు కట్టాను. తరువాతి సంగతి మీకు తెలిసినదే. ఇక నేను మీకు రుణపడి ఉన్నాను. ఈ స్కాచ్ బానెట్ టోపీ నా వయసుకు, పద్ధతికి తగనివి" అంటూ అతను బాతును ఎత్తి చంకలో పట్టుకున్నాడు. విచిత్రమయిన నాటకీయధోరణిలో వంగి కదులుతూ మా యిద్దరికీ వందనం చేసి వెళిపోయాడు.

"అది మిస్టర్ హెన్రీ బేకర్ వ్యవహారం. అతనికి సంగతి గురించి ముక్కకూడా తెలియదని తేలిపోయింది. మరి ఆకలవుతోందా, వాట్సన్?" అన్నాడు హోమ్స్ తలుపు మూస్తూ.

"నిజానికి అంతగా లేదు."

"అయితే మరి, మన భోజనాన్ని కొంచెం వాయిదా వేద్దాం. ఈలోగా ఈ వేడి క్లూను కాస్త పట్టించుకుందాం."

"లక్షణంగా."

రాత్రి చలి బాగా ఎక్కువగా ఉంది. మేము ఉల్‌స్టర్స్ వేసుకున్నాము. మెడలకు క్రవాట్స్ చుట్టుకున్నాము. ఆకాశంలో మేఘాలు లేవు. నక్షత్రాలు మిలమిల మెరుస్తున్నాయి. వీధిలో నడుస్తున్నవారు ఊపిరి వదులుతుంటే పిస్టోలు పేలినట్టు పొగ మేఘాలు పుడుతున్నాయి. మేము నడుస్తుంటే కాళ్ల చప్పుడు గట్టిగా వినపడుతున్నది. డాక్టర్స్ క్వార్టర్, వింపోల్ స్ట్రీట్, హార్లే స్ట్రీట్ మీదుగా విగ్మోర్ స్ట్రీట్ నుంచి ఆక్స్‌ఫోర్డ్ స్ట్రీట్ చేరాము. పావుగంట లోపల ఆల్ఫా ఇన్ ప్రాంతంలో బ్లూమ్స్‌బరీ చేరుకున్నాము. అది వీధి చివరలోనున్న ఒక పబ్లిక్ హౌజ్. అది హొూల్‌బోర్న్ దాకా సాగుతుంది. హోమ్స్ ప్రయివేట్ బార్ తలుపు తోసుకుని లోపలికి వెళ్లాడు. అక్కడ ఉన్న

యజమానికి రెండు గ్లాసుల బియర్ ఆర్డర్‌గా చెప్పాడు.

“మీ బియర్ కూడా బాతులకు సమానంగా గొప్పగా ఉంటుందను కుంటాను”అన్నాడు.

“మా బాతులా!” ఆ మనిషి ఆశ్చర్యంగా అడిగాడు.

“అవును. అరగంట క్రితమే నేను మీ గూస్ క్లబ్ సభ్యుడు మిస్టర్ హెన్రీ బేకర్‌తో మాట్లాడాను.”

“అదా! సరే. సరే! కానీ చూడండి, ఆ బాతులు మావి కావు.”

“అవునా? మరెవరివి?”

“నేను కోవెంట్ గార్డెన్‌లోని ఒక అమ్మకందారు నుంచి రెండు డజన్లు తెప్పించాను.”

“అవునా? అక్కడివాళ్లు నాకు తెలుసు. ఎవరి గురించి అంటున్నారు మీరు?”

“బ్రెక్కిన్‌రిడ్జ్ అతని పేరు.”

“ఓహో! నాకతను తెలియదు. సరే, బియర్ సంగతి చూద్దాం. ఇక సెలవు.”

కోటు బొత్తాలు పెట్టుకుంటూ బయటకు వచ్చేటప్పుడు హోమ్స్ అనసాగాడు “ఇక బ్రెక్కిన్‌రిడ్జ్‌ని పట్టుకోవాలి. గమనించావా వాట్సన్. ఈ గొలుసు ఒక చివరన ఉన్నది ఒక అమాయకపు బాతు మాత్రమే. మరో చివరన మాత్రం అతగాని అమాయకత్వం రుజువుకాకపోతే ఏడు సంవత్సరాలు కటకటాలను లెక్కించవలసిన మరో మనిషి ఉన్నాడు. మన ప్రయత్నం ఫలిస్తే, అతని తప్పిదం రుజువవుతుంది. మొత్తానికి మన పరిశోధన పోలీసులు వదిలిపెట్టిన దారిన సాగుతున్నది. అది అనుకోకుండా మనకు చిక్కింది. చివరిదాకా సంగతి తేల్చుకుందాం. దక్షిణానికి మళ్లు,

త్వరత్వరగా నడువు!"

మేము హెూల్‌బోర్న్ మీదుగా ఎండిల్ స్ట్రీట్ లోని గజిబిజి ప్రాంతాలను దాటుతూ కోవెంట్ గార్డెన్ మార్కెట్ చేరుకున్నాము. ఒక పెద్ద దుకాణం మీద బ్రెక్కిన్‌రిడ్జ్ పేరు రాసి ఉంది. స్వంతదారు మొరటుగా ఉన్నాడు. చురుకయిన ముఖం మీద చెంపల నిండా వెంట్రుకలు ఉన్నాయి. అతను కొట్టు మూసే ప్రయత్నంలో ఉన్నాడు.

"గుడ్ ఈవినింగ్ సర్. చలి బాగా ఉంది"అన్నాడు హెూమ్స్.

సేల్స్‌మాన్ తల పంకించాడు. ప్రశ్నార్థకంగా నా మిత్రునివేపు చూచాడు.

"బాతులన్నీ అమ్ముడయినట్లున్నాయి" హెూమ్స్ కొనసాగించాడు. అతను ఖాళీ అరలవేపు చూస్తున్నాడు.

"పొద్దున కావాలంటే అయిదు వందలు అందించగలను."

"అదికాదు కావలసింది."

"సరే, ఆ గ్యాస్‌దీపం దుకాణంలో దొరుకుతాయి."

"కానీ, నన్ను మీ దగ్గర కొనమన్నారు."

"ఎవరది?"

"ఆల్ఫా సొంతదారుడు."

"ఓ, అతనా! రెండు డజన్లు పంపాను అతనికి. "

"అవి చాలా బాగున్నాయి. వాటిని మీరు ఎక్కడి నుంచి తెప్పించారు?"

ఆశ్చర్యంగా ఆ ప్రశ్నతో సేల్స్‌మాన్‌కి కోపం వచ్చింది.

"ఇదుగో చూడు మిస్టర్, ఏం కావాలి నీకు? సూటిగా మాట చెప్పు" అన్నాడతను తల ఎగరేసి చేతులు నడుం మీద పెట్టుకుంటూ.

"సూటిగానే చెబుతున్నాను. నీవు ఆల్ఫాకు అమ్మిన బాతులను నీకు

ఎవరు అమ్మారన్నది నాకు తెలియాలి."

"అదా? చెప్పనుగాక చెప్పను. ఏం చేస్తావ్?"

"అది అంత గొప్ప విషయం కాదు. ఇంత చిన్న సంగతి గురించి నీకు ఎందుకంత కోపం వస్తున్నదో అర్థంగాలేదు."

"కోపమా! నన్ను పోరినట్టే నిన్ను కూడా పోరాడితే నీకూ కోపం వస్తుంది. డబ్బులిచ్చాను, సరుకు కొన్నాను. అంతటితో ఆ సంగతి ముగిసి పోవాలి. 'బాతులెక్కడవి?' 'ఎవరు అమ్మారు?' 'ఎంత పుచ్చుకుంటావు?'.. ఇట్లా అడుగుతుంటే ఈ ప్రపంచంలో బాతులు తప్ప మరేమీ లేవేమో అన్నట్టుంది. ఎందుకు ఈ నస అంతా?"

"సరే, నిన్ను అన్ని విషయాలు అడిగినవాళ్లతో నాకు ఏమాత్రం సంబంధం లేదు. నీవు చెప్పనంటే ఏం ఫరవాలేదు. నాకు ఈ పక్షుల గురించి పట్టింపు ఎక్కువ. నేను తిన్న బాతు నాటు రకమని, అయిదు పౌండ్లు పందెం వేశాను."

''నీ పౌండ్లు పోయినట్టే. ఆ బాతు పట్నానిదే'' చటుక్కున జవాబిచ్చాడతను.

"అది నిజం కాదు."

"నేను చెపుతున్నానుగా."

"నాకు నమ్మకం లేదు."

"నీకు బాతుల గురించి నాకంటే తెలుసంటావా? పుట్టినప్పటినుంచి వాటితోనే సతమతమవుతున్నాను. చెప్తా విను. ఆల్ఫాకి పంపిన బాతులన్నీ పట్నంలో పెరిగినవే."

"నువ్వు ఎంత చెప్పినా నమ్మను."

"పందెం కడతావా, అయితే?"

"అంటే నిన్ను దోచుకోవడమే. నా మాటే సత్యమని నాకు తెలుసు. అయినా సరే, ఒక సవరన్ పందెం. అది కూడా నీ మొండితనానికి గుణపాఠం చెప్పడానికే."

సేల్స్‌మన్ నెమ్మదిగా నవ్వాడు. "బిల్, పుస్తకాలు తీసుకురా" అన్నాడు.

కుర్రవాడు ఒక చిన్న ఖాతా పుస్తకం తెచ్చాడు. అది బాగా మకిలి పట్టి ఉంది. ఇద్దరూ దాన్ని దీపం వెలుతురులో తెరిచి చదవసాగారు.

"చూచావా, నమ్మకంగల పెద్దాయనా! బాతులు లేవనుకున్నాను. ఇప్పుడు దుకాణంలో నాకో బాతు దొరికింది. నా లెక్క పుస్తకం చూడు."

"ఏమయింది?"

"నాకు బాతులు సరఫరా చేసేవారి వివరాలివి. చూచావా? ఈ పేజీమీద నాటురకం లెక్క ఒక్కొక్కపేరుకు కొన్ని పక్షుల సంఖ్య అవన్నీ పెద్ద లెడ్జర్‌లో ఉన్నాయి. ఇక ఈ పేజీ చూడు, ఎర్రసిరాతో రాసి ఉంది. వీళ్లంతా నా టౌన్ సప్లయర్స్. ఈ మూడవ పేరు చూడు ఏదీ, గట్టిగా చదువు."

"మిసెస్ ఓక్‌షాట్, 117, బ్రిక్‌స్టన్ రోడ్... 249" హోమ్స్ చదివాడు.

"అయిందా? ఇప్పుడిక లెడ్జర్‌లో చూడు."

హోమ్స్ అతను చూపిన పేజీ తెరిచాడు. "చూచావా, మిసెస్ ఓక్‌షాట్, 117, బ్రిక్‌స్టన్ రోడ్, గుడ్లు, పక్షుల సరఫరా."

"అయితే, చివరిలెక్క ఎక్కడ రాసి ఉంది?"

" 'డిసెంబర్ 22. 24 బాతులు, 7.6 లెక్కన.' "

"కుదిరిందా? ఆ కింద ఏమి రాసి ఉంది?"

" 'మిస్టర్ విండిగేట్, ఆల్ఫా యజమానికి అమ్మినవి. 12 ఎస్ చొప్పున.' "

"ఇప్పుడేమంటావ్?"



షెర్లక్ హొమ్స్ అవమానపడుతున్నట్టు కనిపించాడు. జేబులోనుంచి ఒక సవర్‌ను తీసి బల్లమీద పడేశాడు. చాలా బాధపడుతున్న మనిషి వలె భారంగా వెనక్కు తిరిగి కదలసాగాడు. కొంతదూరం నడిచిన తరువాత ఒక దీపం దగ్గర నిలబడి పడిపడి నవ్వసాగాడు. చప్పుడు రాకుండ అట్లా నవ్వడం అతనికి మాత్రమే చేతనవుతుంది.

"అట్లా చెంపలమీద వెంట్రుకలు పెంచుకుని, జేబుల్లో అటువంటి వస్తువులు పెట్టుకున్న మనిషిని పందెంలోకి దించడం చాలా సులభం. ఒక వంద పౌండ్లు ముందుపెట్టి పందెం అన్నాసరే, సిద్ధమవుతారు. పందెం పేరున కాకుంటే, ఆ మనిషి నుంచి అంత సమాచారాన్ని రాగడం మరే రకంగానూ కుదిరేది కాదు. ఇక సరే వాట్సన్, మన పరిశోధన ఒక కొలిక్కి వస్తున్నదని అనిపిస్తున్నది. తేలవలసిందల్లా మిసెస్ ఓక్‌షాట్ ఇంటికి మనం ఈ రాత్రే పోవాలా? లేక ఆ కార్యక్రమాన్ని రేపటికి వాయిదా వేయవచ్చా

అని. ఆ మొరటు మనిషి చెపుతున్న మాటల ప్రకారం ఈ వ్యవహారంలో మనకొక్కరికే కాక మరికొందరికి కూడా ఆసక్తి ఉన్నట్టు కనపడుతున్నది. కనుక...”

మేము వదిలివచ్చిన అంగళ్ల ప్రాంతంలో ఏదో గొడవ జరుగుతున్నట్టు వినిపించడంతో అతని మాటలకు ఒక్కసారిగా అంతరాయం కలిగింది. వెనక్కు తిరిగిచూస్తే, ఒక చుంచుముఖం వాడు అక్కడ నిలబడి ఉన్నాడు. వేలాడుతున్న దీపపు పసుపుకాంతి వలయంలో వాడున్నాడు. బెక్కిన్‌రిడ్జ్ అనే సేల్స్‌మన్ తన అంగడిద్వారంలో నిలబడి ఆ మనిషివేపు భయ పెడుతున్నట్టు పిడికిలి బిగించిన చేతులను కదిలిస్తున్నాడు.

“నీవు, నీ బాతులూ, కొంచెం ఎక్కువయిపోయింది. అంతా కలిసి దయ్యం దగ్గరికి పొండి. పిచ్చిమాటలు మాట్లాడుతూ, మళ్లీ ఇలా నా దగ్గరకి వచ్చేవంటే కుక్కను ఉసిగొల్పుతాను. మిసెస్ ఓక్‌షాట్‌ను పిలుచుకురా, ఆమెకు జవాబు చెపుతాను. మధ్యలో నువ్వెవరు? బాతులను నీ దగ్గర నుంచి కొన్నానా ఏమి?”

“లేదు, కానీ వాటిలో ఒకటి నాది” సణుగుతూ చెప్పాడు ఆ మనిషి.

“అయితే పోయి అమెనే అడుగు.”

“ఆమే నీ దగ్గరికి పంపింది.”

“అలాగా, అయితే పోయి ప్రూసియా రాజును అడుగు. నాకేం పట్టింది. చాలు, చాలు పో. వెళ్లిపో!” అతను దురుసుగా ముందుకు వచ్చాడు. ఆ వచ్చినమనిషి భయంగా చీకటిలోకి జారుకున్నాడు.

“హా! దీంతో మనకు బ్రిక్‌స్టన్ రోడ్‌కు వెళ్లవలసిన అగత్యం తప్పే టట్టుంది” గుసగుసగా అన్నాడు హోమ్స్. “నాతో రా, వీడివల్ల ఏం లాభం కలుగుతుందో చూద్దాం.” గుంపులు గుంపులుగా ఉన్న మనుషుల మధ్య నుంచి దూరుతూ అంగళ్ల మధ్యనుంచి నా మిత్రుడు వేగంగా వెళ్లి ఆ

మనిషిని పట్టుకున్నాడు. అతని భుజం మీద తట్టాడు. ఆ మనిషి గిరుక్కున వెనక్కు తిరిగాడు. వాని ముఖంలో నెత్తురుచుక్క లేకుండా రంగు వెలిసి పోవడం దీపం వెలుగులో నేను గమనించగలిగాను.

"ఎవరు నీవు? ఏం కావాలి?" అతను వణుకుతున్న గొంతుతో అడిగాడు.

"నన్ను క్షమించు. నీవు ఆ అంగడి మనిషిని అడిగిన ప్రశ్న నేను వినక తప్పలేదు. ఆ విషయంలో నీకు బహుశా సాయం చేయగలనేమో" అన్నాడు హెూమ్స్ పొడిగా.

"నీవా? ఇంతకూ ఎవరు నీవు? ఆ విషయం గురించి నీకేం తెలుసు?"

"నా పేరు షెర్లక్ హెూమ్స్. మిగతా మనుషులకు తెలియని సంగతులు తెలుసుకోవడమే నా పని."



"ఈ సంగతి గురించి మాత్రం నీకేమీ తెలియదు."

"అదేమీ కాదు. నాకంతా తెలుసు. బ్రిక్‌స్టన్ రోడ్‌లో ఉండే మిసెస్ ఓక్‌షాట్, బ్రెక్కిన్ రిడ్జ్ అనే సేల్స్‌మాన్‌కి అమ్మిన కొన్ని బాతుల గురించి ఆరా తీయాలని నీవు తంటాలు పడుతున్నావు. ఆ బాతులను వాడు ఆల్ఫా యజమాని విండిగేట్‌కి అమ్మాడు.

అతను వాళ్ల క్లబ్ వాళ్లకి ఇచ్చాడు. ఆ క్లబ్‌లో మిస్టర్ హెన్రీ బేకర్ ఒక సభ్యుడు."

"ఓహ్! సర్. నేను వెతుకుతున్నది బహుశా మీ గురించే అనుకుంటాను" గట్టిగా అన్నాడు ఆ పొట్టి మనిషి. బారచాపిన అతని చేతి వేళ్లు వణుకుతున్నాయి. "ఈ వ్యవహారంలో నాకున్న ఆసక్తి గురించి చెప్పడం నాకు చేతనయేట్లు లేదు."

షెర్లక్ హోమ్స్ అటుగా వెళుతున్న ఒక నాలుగు చక్రాల బండిని ఆపాడు. "అట్లాగయితే, మనం వెచ్చగా ఉండే నా గదికి వెళ్లి మాట్లాడుకుంటే బాగుంటుంది. ఈ ఈదురుగాలి వీస్తున్న మార్కెట్‌లో మనమెందుకు ఉండాలి. కానీ ఒక సంగతి చెప్పు. నా నుంచి సాయం పొందబోతున్న మనిషి ఎవరో తెలుసుకోవచ్చా?" అన్నాడతను.

ఆ మనిషి ఒక క్షణం తటపటాయించాడు. "నా పేరు జాన్ రాబిన్‌సన్" అన్నాడతను పక్కచూపులు చూస్తూ.

"కాదు. కాదు, అసలు పేరు చెప్పు. మారుపేర్లతో వ్యవహారం చేస్తూ ఉంటే, అంత సౌకర్యంగా ఉండదు" అన్నాడు హోమ్స్ మెత్తగా.

కొత్తమనిషి పాలిపోయిన బుగ్గల్లో రంగు నిండుకుంది. "అయితే సరే, నా అసలు పేరు జేమ్స్ రైడర్" అన్నాడతను.

"ఇది బాగుంది. కాస్మోపాలిటన్ హోటేల్‌లో హెడ్ అటెండెంట్‌వి నీవు. రా బండిలోకి ఎక్కు. నీవు తెలుసుకోదలచిన విషయాలన్నీ తొందరలోనే నీకు చెప్తాను."

"ఆ చిన్న మనిషి సగం భయంతోను, సగం నమ్మకంతోనూ మా యిద్దరివేపు మార్చి మార్చి చూస్తున్నాడు. అతనికి అదృష్టం పట్టిందా, లేక ఆపద ఎదురయిందా అర్థం కావడం లేదు. మొత్తానికి అతను బండిలోకి ఎక్కాడు. అరగంటలో మేము బేకర్ స్ట్రీట్ చేరుకున్నాము. ప్రయాణ సమయంలో మాటలు సాగలేదు. మా కొత్త నేస్తం బరువుగా ఊపిరి

తీస్తుండడం, చేతులను కట్టుకోవడం, విడవడంలాంటి వాటిని చూస్తే అతని మానసిక పరిస్థితి అర్థమయింది.

“వచ్చేశాం. ఇటువంటి వాతావరణంలో చక్కగా మంట ఉంటే బాగుంటుంది. బాగా చలిగా ఉంది కదూ, మిస్టర్ రైడర్? ఆ బాస్కెట్ చైర్‌లో కూచో. నీతో వ్యవహారం మాట్లాడేలోగా నేను చెప్పులు మార్చు కుంటాను. సరేగాని, నీకు ఆ బాతులు ఏమయినయో తెలుసుకోవాలని ఉందిగదూ?” అన్నాడు హెూమ్స్, ఆనందంగా గదిలోకి దారితీస్తూ.

“యస్సార్.”

“బాతులు కాదేమో! ఒక బాతు గురించేనేమో? నీకు ఆసక్తి ఉన్నది ఒకే ఒక బాతు. తెల్లనిది తోకమీద నల్లని చారగలది.”

రైడర్ ఒక్క కుదుపుకు లోనయ్యాడు. “ఓహ్, సర్. దానిగతి ఏమ యిందో చెప్పగలరా?” ఇంచుమించు అరిచాడతను.

“అది ఇక్కడికే వచ్చింది.”

“ఇక్కడికా?”

“అవును. అది చాలా బాగుంది కూడా. అయితే దాన్ని గురించి నీవు అంత ఆసక్తి చూపుతున్నావంటే, నాకు ఆశ్చర్యం లేదు. నీ బాతు చచ్చిన తర్వాత ఒక గుడ్డు పెట్టింది. చాలా వెలగల గుడ్డు. అటువంటి వెలిగిపోయే నీలం గుడ్డును ఇంతకు ముందు చూచింది లేదు. ఆ గుడ్డు ఇక్కడే నా మ్యూజియంలో ఉంది.”

మా అతిథి ఒక్క ఉదుటున లేచి నిలబడ్డాడు. కుడిచేతితో పక్కనున్న మేంటల్‌పీస్‌ను పట్టుకున్నాడు. హెూమ్స్ తన స్ట్రాంగ్ బాక్స్‌ను తెరిచి నీలి కార్‌బంకెల్‌ను బయటికి తీశాడు. అది నక్షత్రంలా చల్లని నీలికాంతులను వెదజల్లుతున్నది. రైడర్ దానివేపే చూస్తున్నాడు. అందిపుచ్చుకోవాలా? ఆగాలా? అతనికి అర్థంకావడం లేదు.

"ఇక ఆటకట్టు రైడర్. నిన్ను నీవు సంబాళించుకో. లేకుంటే మంటలో పడతావు. వాట్సన్, అతనికి చేయూతనిచ్చి కుర్చీలో కూచోబెట్టు. నేరం చేసి తప్పించుకోగల గుండెబలం లేని మనిషి. అతనికి కొంచెం బ్రాండీ కూడా ఇవ్వు. అప్పుడు తేరుకుంటాడు. చూస్తే, మహా బేలమనిషిలా ఉన్నాడు!"

"ఆ మనిషి తబ్బిబ్బయి పడిపోయేట్టున్నాడు. బ్రాండి పడడంతో మళ్లీ కోలుకున్నాడు. అభియోగం మోపుతున్న మనిషివేపు భయంగా చూస్తూ కూచున్నాడు.

"ఈ వ్యవహారంలోని లంకెలన్నీ ఇంచుమించు నా చేతికందాయి. కావలసిన సాక్ష్యమంతా దొరికింది. ఇక నీవు నాకు చెప్పవలసింది ఎక్కువగా లేదు. ఒకటి రెండు ముక్కలు తెలిస్తే కేసు పూర్తవుతుంది. కౌంటెస్ ఆఫ్ మోర్కార్ గారి నీలిరాయి గురించి నీవు విన్నావా రైడర్?"

"నాకు దాన్ని గురించి కేథరిన్ కుసాక్ చెప్పింది" గొంతు జీర బోతుండగా అన్నాడతను.

"ఆమె.... లేడీషిప్‌గారి వెయిటింగ్ మెయిడ్ కదూ? అనుకోకుండా ఆస్తి కలిసివస్తుందంటే, నీకు కాళ్లు నిలవలేదు. ఎంతటివారయినా అంతేమరి. కానీ, నీవు వాడుకున్న మార్గం మాత్రం అంత నీతిగలది కాదు. కనీసం నాకట్లా అనిపిస్తున్నది. నీలోపల ఒక పెద్ద విలన్ దాగి ఉన్నట్టు నాకు కన పడుతున్నది. హార్నర్ అనే ఆ ప్లంబర్ ఇంతకుముందు కూడా ఇటువంటి వ్యవహారంలో తలదూర్చి ఉన్నాడని నీకు తెలుసు. కనుక అనుమానమంతా వాడిమీద పడేట్టు చేశావు. ఆ తరువాత ఏం చేశావు? ఆమె గదిలో నీ హస్తలాఘవం చూపించావు. నీవు, నీ తోటి మనిషి కుసాక్ ఇద్దరూనూ, ఎత్తువేసి హార్నర్‌ను ఇరికించారు. వాడు గదిలోనుంచి వెళ్లిపోయిన తరువాత మీరు నగలపెట్టెను పగల గొట్టారు. అప్పుడు పెద్ద గోల చేశారు. హార్నర్‌ను అరెస్టు చేయించారు. ఆ తరువాత .... "

రైడర్ ఒక్క దూకుగా కింద కూలబడ్డాడు. నా మిత్రుని మోకాళ్లను పట్టుకున్నాడు. “దేవుని పేరున, దయదలచండి! మా నాన్నగారి గురించి ఆలోచించండి! అమ్మ గురించి కూడా! వాళ్ల గుండెలు అవిసిపోతాయి. నేను ఇంతకుముందు ఏ పాపమూ చేసి ఎరుగను! ఇక మళ్లీ చేయను. ప్రమాణం చేస్తున్నాను. బైబిల్ మీద ప్రమాణం చేస్తాను. నన్ను కోర్టుకు మాత్రం ఈడ్వకండి. దేవుని పేరున ఆ పనిమాత్రం చేయకండి!” అన్నాడతను బేలగా.

“లేచి కుర్చీలో కూర్చో. ఇప్పుడు గింజుకుని ఏం లాభం? పాపం అమాయకుడు ఆ హోర్నర్ గురించి ఒక క్షణం ఆలోచించావా?” అన్నాడు హెూమ్స్ కటువుగా.



"నేను వెళ్లిపోతాను మిస్టర్ హెూమ్స్. దేశం వదిలి వెళ్లిపోతాను. అప్పుడిక అతనిమీద అభియోగం నిలవదు."

"ఆహా! అయితే మాట్లాడుదాం. ఇప్పుడు మొత్తం వివరాలన్నీ వినాలి. ఆ వెలగల రాయి బాతులోకి ఎట్లా వచ్చింది? బాతు బజారులోకి ఎట్లావచ్చింది? నిజం చెప్పు. లేకుంటే నీకు రక్షణ అందదు."

రైడర్ ఆరిపోయిన తన పెదవులను నాలుకతో తడుపుకున్నాడు. "జరిగింది జరిగినట్లు చెప్తాను సర్" అన్నాడతను. "హార్నర్ అరెస్టు అయ్యాడు. ఇక వెంటనే దొంగిలించిన వస్తువుతో అక్కడి నుంచి పారిపోవడం మంచిది అనిపించింది. పోలీసులకు అనుమానం వచ్చి. నన్నుగాని, నా గదినిగానీ పరిశీలిస్తారని నాకు ఆ క్షణంలో ఆలోచన కూడా రాలేదు. హెూటేల్‌లో వస్తువును దాచడానికి సరయిన చోటు లేదు. ఏదో పని ఉన్నట్టు బయటకు వెళ్లాను. నేరుగా మా అక్క ఇంటికి వెళ్లాను. ఆమె ఓక్‌షాట్ అనే ఒకతనిని పెళ్లిచేసుకుని బ్రిక్‌స్టన్ రోడ్‌లో ఉంటున్నది. ఆమె బాతులను పెంచి అమ్ముతుంది. అక్కడికి చేరేలోగా ఎదురయిన ప్రతి మనిషి నాకు పోలీస్‌లాగే లేదా డిటెక్టివ్‌లాగే కనిపించాడు. ఆ రాత్రి చలి బాగాఉంది. అయినాసరే, నాకు చెమటలు కారుతున్నాయి. మొత్తానికి బ్రిక్‌స్టన్ రోడ్డు చేరాను. విషయ మేమిటని, నేనెందుకు భయపడుతున్నానని అక్కయ్య అడిగింది. హెూటేల్లో జరిగిన దొంగతనం వల్ల కాస్త చికాకుగా ఉందన్నాను. వాళ్ల పెరట్లోకి వెళ్లి, పైప్ కాల్చాను. ఏం చేస్తే బాగుంటుందని అక్కడే ఆలోచించాను.

"నాకు మాడ్స్‌లే అని ఒక మిత్రుడు ఉన్నాడు. వాడు ఒకప్పుడు తప్పు చేసినందుకు పెంటన్‌విల్ జైల్లో ఉన్నాడు. అంతకుముందు ఒకసారి నన్ను కలిసినప్పుడు దొంగతనాల గురించి, నాతో మాట్లాడాడు. దొంగ వస్తువులను ఏం చేస్తారన్నది చెప్పాడు. వాడు చెప్పింది నిజమేనని అనిపించింది. అందుకే నేను నేరుగా వాడి ఇంటికి వెళ్లి సలహా అడుగుదామనుకున్నాను. దొంగి లించిన రత్నాన్ని అమ్మడమెట్లాగో వాడు చెప్తాడు. కానీ, వాడి దాకా వెళ్లడం

ఎట్లాగా? హొటేల్ నుంచి ఇక్కడికి చేరడమే నాకు ప్రణయమయింది. ఏ క్షణాన్నయినా, నన్ను పట్టుకుని సోదాచేస్తారేమో! రత్నం నా కోటు జేబులో దొరుకుతుంది. నేను పెరట్లో గోడకు ఆనుకుని, అటూ ఇటూ తిరుగుతున్న బాతులను గమనిస్తున్నాను. అవి నా కాళ్లచుట్టూ కూడా తిరుగుతున్నాయి. నాకు చటుక్కున ఒక ఆలోచన వచ్చింది. దానితో ఎంత డిటెక్టివ్‌నయినా మోసగించగలను అనిపించింది.

“క్రిస్మస్ పండగకు బహుమతిగా తన బాతులనుంచి ఒకదాన్ని నేను ఎంచుకోవచ్చునని అక్కయ్య కొన్ని వారాల క్రితమే చెప్పింది. ఆమె మాట మార్చని మనిషి అని నాకు బాగా తెలుసు. నాకు కావలసిన బాతును ఇప్పుడు తీసుకోవచ్చు. నా రత్నాన్ని బాతులో పెట్టి కిల్‌బర్న్‌కు చేర్చవచ్చు. అది నా ఆలోచన. పెరట్లో ఒక చిన్నషెడ్ ఉంది. నేను బాగా బలిసిన తెల్లని ఒక బాతును ఆ షెడ్ వెనుకకు తీసుకుపోయాను. ఆ బాతు తోకమీద చార ఉంది. నేను దాని ముక్కు పెద్దగా విప్పి రత్నాన్ని గొంతులోకి తోసాను. నా వేలు దూరినంత మేరకు దాన్ని తోసాను. పక్షి రాతిని గుటుక్కున మింగింది. అది గొంతులో నుంచి కిందకు జారడం నేను గమనించగలిగాను. బాతు తపతప కొట్టుకున్నది. ఆ చప్పుడుకు అక్కయ్య అక్కడికి వచ్చింది. ఏం జరుగుతున్నదని అడిగింది. ఆమెకు జవాబు చెప్పడానికి వెనుకకు తిరిగేలోగా బాతు పట్టు తప్పించుకుని మిగతావాటి మధ్యలో కలిసిపోయింది.

“ ‘జెమ్, అక్కడ బాతుతో ఏం చేస్తున్నావురా?’ అడిగింది అక్క.

“ ‘క్రిస్మస్‌కి నాకు ఒక బాతును ఇస్తానన్నావు గదా? ఏది బాగుందని చూస్తున్నాను’ అని నేను అన్నాను.

“ ‘నీకొరకు అప్పుడే ఒక బాతును ఎంపికచేసి పెట్టాను. దాన్ని మేము జెమ్స్ బాతు అని అంటున్నాము కూడా. అదుగో ఆ చివరనున్న తెల్లని బాతు. మొత్తం ఇరవయి ఆరు ఉన్నాయి. ఒకటి నీకు, ఒకటి మాకు పోగా రెండు డజన్లు మార్కెట్‌కు చేరతాయి’ అన్నది ఆమె.

“ ‘థాంక్స్, మేగీ, ఏదయితే నీకేమిటి? ఇందాక నేను పట్టుకున్న బాతు నాకు కావాలి’ నేనన్నాను.

“ ‘నేను చెప్పినది దానికన్నా మూడు పౌండ్లు ఎక్కువ బరువుంది. నీకొరకని ఎక్కువ మేత పెట్టి జాగ్రత్తగా పెంచాము’ అక్క అన్నది.

“ ‘ఫరవాలేదు. నాకదే కావాలి. ఇప్పుడే తీసుకుపోతాను’ అన్నాను నేను.

“ ‘ అయితే నీ యిష్టం. ఇంతకు ఏది నీవు పట్టుకున్నది?’ కొంచెం కోపంగానే అడిగిందామె.

“ ‘గుంపుమధ్యలో ఉంది. తోక మీద చార ఉన్నదే అది.’

“ ‘సరే, నీ యిష్టం. పట్టి తెచ్చుకో.’

“ఆమె చెప్పినట్టే చేశాను మిస్టర్ హెూమ్స్, బాతును పట్టుకుని కిల్‌బర్న్‌దాకా తెచ్చాను. నేను చేసినదంతా నా నేస్తానికి చెప్పాను. ఇటువంటి సంగతులు వాడికి చెప్పడం కష్టంకాదు. వాడు ఉక్కిరిబిక్కిరయ్యిందాకా నవ్వాడు. కత్తి తెచ్చి బాతు గొంతు కోశాడు. క్రాప్‌లో రాయి లేదు. నా గుండె చెరువయింది. గొప్ప పొరపాటు జరిగిందని అర్థమయింది. పరుగు పెడుతూ తిరిగి అక్కయ్య ఇంటికి చేరాను. పెరట్లోకి వెళ్లాను. అక్కడ ఒక్క బాతు ఉంటే ఒట్టు.

“ ‘బాతులేమయినాయి మేగీ?’ గట్టిగా అడిగాను.

“ ‘అమ్మేశాను, జెమ్.’

“ ‘ఎవరికి?’

“ ‘కోవెంట్ గార్డెన్‌లో ఉండే బెక్కిన్‌రిడ్జ్‌కు.’

“ ‘తోకమీద చారగల బాతు మరొకటి కూడా ఉందా?’ నేను అడిగాను.

“ ‘అవును జెమ్. చారతోక బాతులు రెండు ఉండేవి. నాకు తేడా తెలిసేది కాదు.’

"సరే. ఇక అక్కడినుంచి వీలయినంత త్వరగా ఆ బెక్కిన్‌రిడ్జ్ అనే మనిషి దగ్గరికి వెళ్లాను. అప్పటికే అతను బాతులను ఒక్కమొత్తంగా అమ్మేశాడు. ఎవరికీ అంటే మాత్రం ఒక్కముక్క చెప్పడానికి ఇష్టపడలేదు. వాడి సంగతి మీరే స్వయంగా మీరే చూశారుగదా? అతనెప్పుడూ అలాగే మాట్లాడు తుంటాడు. నాకు పిచ్చిపట్టిందని మా అక్కయ్యకు అనుమానం పుట్టింది. నా మీద నాకే అనుమానం మొదలయింది. ఇప్పుడు నేను దొంగను కూడా అయ్యాను. పేరు పాడయింది సరికదా, దొంగిలించిన వస్తువు చేతికి అందలేదు. ఓరి దేవుడా! ఓరి దేవుడా!" అతను కుమిలి ఏడవసాగాడు.

కొంతసేపు నిశ్శబ్దం సాగింది. శ్వాస చప్పుళ్లు, బల్ల అంచుమీద షెర్లక్ హెూమ్స్ వేళ్లతో వేస్తున్న దరువు మాత్రమే వినిపించాయి. అంతలో నా మిత్రుడు ఒక్కసారిగా లేచి వెళ్లి తలుపు తెరిచాడు.

"గెట్ అవుట్!" అన్నాడతను.



"ఏమంటున్నారు, సర్! దేవుడు మిమ్మి దీవించుగాక!"

"ముక్క మాట్లాడకు. గెట్ అవుట్!"

ఇక మాటలు అవసరం లేకపోయింది. వేగంగా మెట్లమీద నడిచిన చప్పుడయింది. తలుపు ధడాలున కొట్టుకున్నది. వీధిలో వేగంగా ఎవరో నడుస్తున్న చప్పుడు కూడా అయింది.

తన పైప్‌ను అందుకుంటూ, హోమ్స్ నాతో ఇలాగన్నాడు. "మొత్తం మీద వాట్సన్, నన్ను పోలీసులు తమ లోపాలను కప్పిపుచ్చమని పనిలోనయితే పెట్టలేదు కదా? హార్నర్ ఆపదలోపడతాడంటే అది మరొక విషయం. ఈ మనిషి వాడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పే ప్రసక్తి లేదిక. కనుక కేసు వీగిపోతుంది. ఇప్పుడు పొరపాటు నేను చేస్తున్నట్టు లెక్క. కానీ ఒక అమాయకపు మనిషికి రక్షణ కల్పిస్తున్నాను కూడా. వీడు ఇక జన్మలో తప్పు చేయడు. మరీ భయపడి ఉన్నాడు. వాడిని ఇప్పుడు జైలుకు పంపించామనుకో, బతుకంతా జైలుపక్షి అవుతాడు. పైగా, పండుగ రోజులు. క్షమాపణ రోజులు. అనుకోకుండా సాటిలేని విచిత్రమయిన సమస్య మన చేతికందింది. సమాధానం దొరకడమే తగిన బహుమతి. డాక్టర్, దయచేసి బెల్ మోగించావంటే, మనం మరో పరిశోధన మొదలుపెడదాం. ఇందులో కూడా ఒక పక్షిదే ప్రధాన పాత్ర అవుతుంది."





# 8

# మచ్చల మెడపట్టీ

గడచిన ఎనిమిది సంవత్సరాలపాటు నా మిత్రుడు తన పద్ధతులను వాడిన డెబ్భైకి పైగా కేసుల గురించి రాసుకున్నన నోట్స్‌ను మరొకసారి చూచాను. అందులో కొన్ని హాస్యాస్పదమయినవి. చాలామటుకు విచిత్రమయినవి, మామూలువి మాత్రం ఒక్కటి కూడా లేదు. అతను డబ్బు కొరకు కాక, కేవలం తన చేతిలోని కళమీద ప్రేమతో మాత్రమే పనిచేస్తుంటాడు. అందుకే అసాధరణంకాని కేసులు లేదా కేవలం ఊహలకు మాత్రమే ఊతమిచ్చే కే సులను నా వరకు రానీయలేదు. ఈ రకరకాల కేసులన్నింటిలో నన్ను అమితంగా ఆకర్షించిందేదయినా ఉంటే, అది సర్రేలోని రాయ్‌లాట్ ఆఫ్ స్టోక్‌మొరాన్ అనే ప్రసిద్ధ కుటుంబానికి సంబంధించినది. ఈ వ్యవహారం నేను హోమ్స్‌తో నేస్తం కలిపిన మొదటి రోజుల్లోనే జరిగింది. అప్పటికి నేను బ్రహ్మచారిని. బ్రేకర్ స్ట్రీట్‌లో అతనితోపాటే ఉండేవాడిని. నేను అప్పట్లోనే ఈ కేసుల విశేషాలను రాసిపెట్టుకుని ఉంటాను. కానీ, బయటపెట్టనని ఒక నియమం చేసుకున్నాను. ఆ నియమానికి ఈమధ్య మాత్రమే తెర పడింది. అందుకు కారణం నేనా మాట ఇచ్చిన ఆ స్త్రీ అకాలంగా మరణించడమే. ఇప్పుడు ఆ వాస్తవాలు బయటపడడమే మంచిది. డాక్టర్ గ్రిమ్స్‌బీ రాయ్‌లాట్ మరణం గురించి రకరకాల పుకార్లు వ్యాపించి

ఉన్నాయి. అవి వాస్తవాన్ని మరింత వికృతంగా మారుస్తున్నాయి. కనుక నిజం తెలిస్తేనే మంచిది.

ఎనభై మూడు సంవత్సరం, ఏప్రిల్ మాసం మొదటిరోజుల్లోనే ఒక ఉదయాన నేను నిద్రలేచేసరికి హెూమ్స్ చక్కగా దుస్తులు వేసుకుని నా మంచం పక్కన నిలబడి ఉండడం కనిపించింది. అతను ఆలస్యంగా నిద్రలేవడం, ఒక నియమంగా పెట్టుకున్నాడు. మేంటల్‌పీస్‌మీద ఉన్న గడియారాన్ని చూస్తే, అప్పటికి టైమ్ ఏడుంబావు మాత్రమే అయిందని గమనించాను. అందుకే అతనివేపు కళ్లార్పుతూ ఆశ్చర్యంగా చూచాను. నాలో కొంత నిరసనభావం కూడా కనిపించింది. నాకు కూడా సమయం గురించి గట్టి అలవాట్లే ఉన్నాయి.

"వాట్సన్, నిన్ను లేవగొట్టేసినందుకు క్షమించాలి. కానీ అలా చేయ వలసి వచ్చింది. మిసెస్ హడ్సన్‌ని కూడా లేవగొట్టారు. ఆమె నా మీదకు ఉరికింది. నేను మీ మీదకు ఉరికాను" అన్నాడు అతను.

"ఇంతకూ ఏం జరిగింది.... ఏమయినా తగలబడిందా?"

"లేదు, ఒక క్లయంట్. ఒక యువవయస్కురాలు వచ్చింది. ఆమె చాలా ఆత్రుతగా ఉంది. నన్ను చూడాలని పట్టుబట్టిందట. ఆమె ప్రస్తుతం సిటింగ్‌రూమ్‌లో వేచి ఉన్నది. ఇంత ఉదయాన ఈ సమయంలో ఒక యువతి నగరంలో లేచి తిరుగుతున్నదంటే, హాయిగా పడుకున్నవాళ్లను లేవగొడుతున్నదంటే, పరిస్థితి చాలా విషమంగా ఉంటుందని నా భావన. ఆమె అదే చెప్పదలచుకున్నది అనుకుంటున్నాను. నిజంగా వ్యవహారం ఆసక్తికరమయినదయితే, తప్పకండా నీవు కూడా మొదటినుంచి దాని సంగతులు తెలుసుకోవాలనుకుంటావని నా నమ్మకం. అందుకే నీకు ఆ అవకాశం ఇచ్చే ప్రయత్నం చేశాను."

"ప్రియమిత్రమా, ఏ సందర్భంలోనూ ఇటువంటి అవకాశం వదులు కోను."

హోమ్స్ తన వృత్తిపరమయిన పరిశోధనలు చేస్తుంటే, అతని వెంట ఉండి జరుగుతున్న పద్ధతులను అతని ఊహలను పరిశీలించడంకన్నా, నాకు సంతోషకరమయిన విషయం ఇంకొకటి లేదు. అతని పద్ధతులలో ఒక లాజిక్ మాత్రం ఎప్పుడూ ఉంటుంది. చేతికందిన కేసులను కేవలం ఆ కార్యకారణ సంబంధాల ఆధారంగానే అతను విప్పదీస్తుంటాడు. నేను వేగంగా దుస్తులు వేసుకున్నాను. కొన్ని నిమిషాలలో నా మిత్రుడితో పాటు కింద సిటింగ్ రూమ్‌లోకి వెళ్లడానికి సిద్ధమయ్యాను. అక్కడ నల్లని దుస్తులు, ముఖం మీద దట్టమయిన వలలాంటి తెర వేసుకుని ఒక స్త్రీ కూచుని ఉన్నది. మేము గదిలోకి వెళుతుంటే ఆమె లేచి నిలబడింది.

"గుడ్‌మార్నింగ్, మేడమ్. నా పేరు షెర్లక్ హోమ్స్. ఇతను నా సన్నిహిత మిత్రుడు, సహచరుడు డాక్టర్ వాట్సన్. నా ముందు మాట్లాడినంత నిర్భయంగా అతని ముందు కూడా మీరు మాట్లాడవచ్చు. ఆహా! మిసెస్



హడ్సన్‌కి మంట వెలిగించాలన్న మంచి ఆలోచన కలిగినందుకు ఆనందం. మీరు మంటకు దగ్గరగా జరిగి కూచోండి. మీ కొరకు ఒక కప్పు వేడి కాఫీ ఆర్డర్ చేస్తాను. మీరు వణికిపోతున్నారని, గమనించగలిగాను" అన్నాడు హోమ్స్ హుషారుగా.

"నేను వణుకుతున్నది చలి వల్ల మాత్రం కాదు" తక్కువ స్వరంతో చెపుతూ ఆమె చూపించిన కుర్చీలోకి మారింది.

"అయితే మరెందుకు?"

"భయంతో మిస్టర్ హోమ్స్. అది మామూలు భయంకాదు" మాట్లాడుతూ ఆమె ముఖం మీది తెరను పైకెత్తింది. ఆ ముఖంలోని దయనీయమయిన భావాలను మేము చూడగలిగాము. ఆమె కళ్లలో భయం బాగా కనపడుతున్నది, ముఖం పాలిపోయి ఉన్నది. తరమబడుతున్న వేట జంతువులోని భావాలు ఆ ముఖంలో కనపడుతున్నాయి. ఆమె ముప్ఫయి యేళ్ల వయసుగలదని గమనించగలిగాను. జుట్టుమాత్రం వయసుకు తగినకన్నా, ఎక్కువగా తెల్లబడి ఉన్నది. ముఖంలోని భావాలు కూడా వయసుకు మించినవిగానే ఉన్నాయి. తన మామూలు ధోరణిలో హోమ్స్ త్వరగా ఒకసారి ఆమెను పరిశీలనగా చూచాడు.

"మీరు భయపడకూడదు. మేము వ్యవహారాన్ని త్వరగానే సరి చేయగలము. అనుమానం అవసరం లేదు. మీరు ట్రైన్‌లో వచ్చారని గమనించగలను" అనునయంగా అన్నాడు హోమ్స్ వంగి ఆమె ముంజేతిమీద నెమ్మదిగా తడుతూ.

"అయితే, మీరు నన్ను ఎరుగుదురన్నమాట!"

"లేదు. కానీ మీ చేతి గ్లోవ్స్‌లో టికెట్‌లోని తిరుగు ప్రయాణపు సగం భాగం ఉండడం గమనించాను. మీరు చాలా త్వరగా బయలుదేరి ఉండాలి. అక్కడి నుంచి ఒక చిన్న బండిలో గతుకుల దారిమీద పయనించి వచ్చి,

స్టేషన్ చేరుకున్నారు.”

ఆ యువతి ఒక కుదుపుకు లోనయింది. అత్యంత ఆశ్చర్యంతో నా మిత్రునివేపు చూడసాగింది.

“మైడియర్ మేడమ్. ఇందులో పెద్ద రహస్యం లేదు. మీ జాకెట్ ఎడమచేతిమీద కనీసం ఎడుచోట్ల బురదచుక్కలు పడి ఉన్నాయి. అవి తాజాగా పడినవి. డాగ్‌కార్ట్‌లో తప్ప అటువంటి మచ్చలు మరేరకంగానూ పడే అవకాశం లేదు. అందులోకూడా మీరు నడుపుతున్న మనిషి ఎడమచేతి పక్కన కూచుని ఉన్నారని తెలిసిపోయింది.”

“మీరు చెపుతున్న కారణాలు ఏమయినాగానీ, విషయం మాత్రం నిజంగా నిజం. ఆరుగంటలకు ముందే ఇంటి నుంచి బయలుదేరాను. ఆరు ఇరవైకి లెదర్‌హెడ్ చేరాను. వాటర్లూకి బయలుదేరిన మొదటి ట్రైన్‌లో వచ్చాను. సర్, ఈ బాధను నేను ఎక్కువకాలం భరించలేను. ఇలాగే ఉంటే, పిచ్చెత్తిపోతాను. చెప్పుకోవడానికి నాకు ఎవరూ లేరు... ఒక్కరు కూడా లేరు. ఒకే ఒక్కరున్నారు, నన్ను పట్టించుకునేవారు. కానీ ఆ మనిషిమాత్రం ఇప్పుడు సాయం చేసే స్థితి లేదు. మిస్టర్ హోమ్స్, మీ గురించి విన్నాను. మిసెస్ ఫారింటాష్‌గారు మీ గురించి చెప్పారు. ఆమె నిజంగా అవసరంలో ఉన్నప్పుడు మీరు సాయంచేశారట. మీ చిరునామా నాకు ఆవిడగారే ఇచ్చారు. సర్, మీరు నాకుకూడా సాయం చేయగలనంటారా? నన్ను ఆవరించుకుని ఉన్న చిక్కని చీకటిలోనికి కనీసం కొంత వెలుగును పంపించండి. ప్రస్తుత పరిస్థితులలో మీరు అందించిన సేవలకు తగిన పారితోషికం ఇవ్వలేను. కానీ, ఒక నెల, నెలన్నర లోపల నా పెళ్లి జరుగుతుంది. అప్పుడు నా ఆస్తి నా అదుపులోకి వస్తుంది. కనీసం అప్పుడు నన్ను మీరు అవిధేయురాలు అనడానికి అవకాశం ఉండదు” అన్నది ఆమె.

హోమ్స్ తన బల్లవేపు మళ్లాడు. డెస్క్‌తెరిచి చిన్న కేస్ బుక్ తీసుకున్నాడు. అందులో గమనించసాగాడు.

"ఫారింటాష్, అవును, నాకు కేస్ గుర్తుంది. అందులో ఒక ఓపెల్ టియారా గురించి తెలుసుకోవలసివచ్చింది. వాట్సన్, ఇది నీవు రాకముందు రోజులనాటి విషయం. మేడమ్, ఒకటి చెప్పగలను. మీ మిత్రురాలికి ఎంతటి విధేయతతో సాయంచేశాను అంతగానూ సంతోషంగా మీకూ చేయగలను. ఇక పారితోషికం సంగతి నాకు వృత్తే పారితోషికం. నేను పెట్టే ఖర్చులు ఏమయినా ఉంటే, వాటిని మీరు వీలయినప్పుడే ఇవ్వవచ్చు. ప్రస్తుతం మాత్రం మీ వ్యవహారం గురించి నేను ఒక అభిప్రాయానికి రావడానికి సాయం చేయగల వివరాలన్నింటినీ ముందుంచమని వేడుకుంటున్నాను" అన్నాడతను.

"ఓహో! నా భయాలకు ఒక రూపం లేదు. నా పరిస్థితి నిజంగా చెప్పలేని ఉత్పాతం మధ్యన ఉన్నదన్నది మొదటి నిజం. నా అనుమానాలన్నీ చిన్న చిన్న విషయాలమీద ఆధారపడి ఉన్నాయి. అవి యితరులకు అర్థంలేనివిగా కనిపిస్తాయేమో! నేను కష్టకాలంలో నా బాధ చెప్పుకోగలను అనకున్న ఒకే ఒక్క ఆ మనిషికూడా నాదంతా భ్రమ అని నేను భయపడ్డానని కొట్టిపడేస్తున్నాడు. అతను అలాగనడం లేదు. కానీ, అతని పక్కచూపులు, నచ్చచెపుతూ చెప్పే జవాబులూ, నాకా సంగతిని చెప్పకనే చెపుతున్నాయి. మిస్టర్ హోమ్స్, మీరు మానవహృదయం వేసే రకరకాల జిత్తులలోకి చాలాలోతుగా చూడగలరని విన్నాను. నన్ను చుట్టుకున్న ఈ ఆపదల మధ్యన నడవడం ఎట్లాగో, మీరే నాకు చెప్పాలి."

"శ్రద్ధగా వింటున్నాను, మేడమ్."

"నా పేరు హెలెన్ స్టోనర్. నేను నా మారుటి తండ్రిగారితో ఉంటున్నాను. ఇంగ్లండ్‌లోని ప్రాచీనమయిన శాక్సన్ కుటుంబాలలో ఒకటయిన రాయిలాట్స్ ఆఫ్ స్టోక్ మొరాన్ వంశంలో ఆయన చివరి మనిషి. సర్రే పడమటి హద్దులలో మేముంటాము."

హోమ్స్ తల ఆడించాడు. "నాకు ఆ పేరు పరిచితమయినదే" అన్నాడు.

"ఒకప్పుడు ఇంగ్లండ్‌లో చాలా ధనికులయిన కుటుంబాలలో అది ఒకటి. వారి ఎస్టేట్‌లు ఉత్తరాన బెర్క్‌షైర్, పడమట హాంప్‌షైర్ దాకా విస్తరించి ఉండేవి. గత శతాబ్దంలో మాత్రం నలుగురు వారసులు వరుసగా ఎందుకూ పనికిరాని వారు. చివరికి ఒక వ్యసనపరుని కాలంలో ఆ కుటుంబం మరీ దిగజారిపోయింది. ఏవో కొన్ని ఎకరాల భూమి తప్ప ఏమీ మిగలలేదు. రెండువందల ఏండ్ల నాటి పాత ఇల్లు ఒకటి కూడా ఉంది. అది కూడా అప్పులలో కూరుకుని ఉన్నది. రాజ కుటుంబీకులలో చివరి మనిషి అక్కడే జీవితం వెళ్లమార్చాడు. డబ్బులులేని రాచరికంలో అన్యాయంగా బతికాడు. అతని ఒక్కగానొక్క కొడుకు నా మారుటి తండ్రి. అతను మాత్రం తన జీవనసరళిని మార్చుకోవాలనుకున్నాడు. ఒక బంధువు సాయంతో మెడికల్ డిగ్రీ సంపాయించుకుని కలకత్తాకు వెళ్లాడు. తన నైపుణ్యం, వ్యక్తిత్వాల సాయంతో అక్కడ ప్రాక్టీస్ గొప్పగా జరిగింది. కానీ అతని ఇంటిలో జరిగిన కొన్ని దోపిడీల కారణంగా బాగా కోపగించుకుని స్థానికుడయిన తన బట్లర్‌ను చచ్చేదాకా కొట్టాడు. కొద్దిలో మరణశిక్ష తప్పించుకున్నాడు. చాలాకాలం బందీగా మాత్రం ఉండవలసి వచ్చింది. ఆ తరువాత అతను అసంతృప్తితో ఇంగ్లండ్ తిరిగి వచ్చాడు.

"డాక్టర్ రాయల్‌లాట్ భారతదేశంలో ఉండగా మా అమ్మను పెళ్లి చేసుకున్నారు. ఆమె మొదటి భర్త మేజర్ జనరల్ స్టోనర్, బెంగాల్ ఆర్టిలరీలో పనిచేసేవారు. ఆయన గతించారు. నేను నా చెల్లెలు జూలియా కవలపిల్లలము. మా అమ్మ మళ్లీ పెళ్లి చేసుకున్నప్పుడు మేము కేవలం రెండేళ్ల వయసువాళ్లం. అమ్మకు మంచి ఆస్తే ఉండేది. సంవత్సరానికి కనీసం వెయ్యి పౌండ్లు అందేది. ఆ ఆస్తినంతా ఆమె డాక్టర్ రాయ్‌లాట్‌గారికి దత్తం చేసింది. అందులోనుంచి కొంత భాగాన్ని మాత్రం ఏటేటా మాకు అందేలా చూడాలని నియమం చేసింది. అది మాకు పెళ్ళిళ్లు జరిగిన తరువాత మాత్రమే. మేము ఇంగ్లండ్‌కు తిరిగి వచ్చిన కొంతకాలానికే అమ్మ చనిపోయింది. క్ర్యూవ్ దగ్గర జరిగిన రైలు ప్రమాదంలో అమ్మ ఎనిమిది

సంవత్సరాల క్రితం మరణించింది. ఆ తరువాత డాక్టర్ రాయ్‌లాట్ లండన్‌లో ప్రాక్టీస్ చేయాలనే ప్రయత్నాన్ని మానుకున్నారు. స్టోక్ మొరాన్ లోని పాత ఇంటిలో ఉండడానికి మమ్మల్ని కూడా తీసుకుని వెళ్లడానికి నిశ్చయించుకున్నారు. అమ్మ వదిలివెళ్లిన సొమ్ము మా అవసరాలకు సరిపోయేది. ఆనందంగా బతకడానికి మాకు ఏ అడ్డంకులూ లేవనే అనిపించేది.

"కొంతకాలంలో మా మారుటితండ్రి తీరులో భయంకరమయిన మార్పు వచ్చింది. పొరుగువారితో నేస్తం కలిపి రాకపోకలు సాగించే బదులు, ఆయన ఇంట్లో తలుపులు పెట్టుకుని ఉండిపోయేవారు. స్టోక్ మొరాన్‌కు చెందిన రాయలాట్ కుటుంబం తిరిగి వచ్చిందని సంతోషపడుతున్న చుట్టు పక్కలవారికి నిరాశే మిగిలింది. ఆయన దారిలో ఎదురయిన వారితో కూడా తీవ్రగా కీచులాటకు దిగేవారు. కుటుంబంలో తరతరాలుగా సాగిన పిచ్చితనం వ్యవహారం ఈయనకు కూడా సంక్రమించిందని అనుకునేదాకా వచ్చింది. అంతేకాదు, ఉష్ణమండల దేశాలలో చాలాకాలం ఉండడంవల్ల ఆయనలో పిచ్చి మరింత ముదిరిందని కూడా నా నమ్మకం. గౌరవానికి తగనిరకం పోరాటాలు జరుగుతూ ఉండేవి, రెండింటి విషయంలో వ్యవహారం పోలీసులు, కోర్టు దాకా వెళ్లింది. ఊళ్లోవాళ్లందరూ ఆయనను చూస్తే భయ పడసాగారు. అంత దూరంలో కనిపిస్తే పారిపోసాగారు. ఆయన చాలా బలంగల మనిషి కూడా. కోపం వచ్చిందంటే పట్టపగ్గాలుండవు.

"పోయినవారం, ఆయన స్థానికుడయిన ఒక కమ్మరిని గోడమీదనుంచి ప్రవాహంలోకి తోసేశాడు. వీలయినంత డబ్బు పోగేసి నేను మరోసారి కుటుంబ గౌరవం బయటపడకుండా ఆపగలిగాను. ఆయనకు మిత్రులనేవారు లేరు. చిరునామా లేకుండా తిరుగుతుండే కొంతమంది జిప్సీలకు మాత్రం తనకున్న కొన్ని ఎకరాల భూమిలో ఆయన ఉండ డానికి చోటు ఇస్తుండేవారు. కుటుంబ ఎస్టేట్‌కు ఆ పొలం మాత్రమే గుర్తుగా మిగిలింది. ఆయన వెళ్లి



వాళ్ల గుడారాలలో ఆతిథ్యం స్వీకరించేవాడు. వారాలపాటు వారితో వెళ్లి పోయేవారు. ఆయనకు భారతదేశపు జంతువుల మీద చాలా మక్కువ. అక్కడి నుంచి అటువంటి జంతువులను ఎవరో ఆయనకు పంపేవారు. ఇంట్లో ప్రస్తుతం ఒక చిరుతపులి, ఒక కొండ ముచ్చు ఉన్నాయి. అవి అక్కడ స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. వాటి స్వంతదారుని చూచి భయపడినట్లే ఊరివాళ్లంతా వాటిని చూచి కూడా భయపడుతుంటారు.

"నేను చెపుతున్న ఈ విషయాలనుబట్టీ మీరు, నేను, నా చెల్లెలు జూలియా బతుకుల్లో ఎలాంటి సంతోషం లేకుండా ఉన్నామని అర్థం చేసుకుని ఉంటారు. మాతో పనివాళ్లు ఎవరూ ఉండరు. ఇంటిపనంతా చాలాకాలంవరకూ మేమే చేసేవాళ్లము. నా చెల్లెలు ముప్ఫయి వయసునాటికే పోయింది. అప్పటికే ఆమెజుట్టు నాకులాగే తెల్లబడడం మొదలయింది."

"అయితే మీ చెల్లెలుగారు పోయారన్నమాట."

"సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం పోయింది తాను. ఆమె మరణం గురించే నేను మీతో మాట్లాడాలనుకుంటున్నాను. నేను వర్ణించిన రకం బతుకుతో మాకు సమాన వయసు, హోదా గల మరెవరితోనూ కలిసే అవకాశం లేదని  మీకు అర్థమయే ఉంటుంది. అయితే మాకు ఒక పిన్ని

ఉండేది. మా అమ్మ చెల్లెలు ఆమె. పేరు మిస్ హెనోరియా వెస్ట్‌ఫాల్. ఆమె హారోలో ఉంటారు. అప్పుడప్పుడు మేము కొద్దికాలంపాటు ఆమె ఇంట్లో గడపడానికి అనుమతి దొరికేది. జూలియా రెండు సంవత్సరాల క్రితం క్రిస్మస్‌కు అక్కడికి వెళ్లింది. అక్కడ నౌకాసైన్యంలోని ఒక మేజర్‌ను కలిసింది. అక్కడే ఆమె ఎంగేజ్‌మెంట్ కూడా జరిగింది. చెల్లెలు తిరిగివచ్చిన తర్వాత ఆమె పెళ్లి వ్యవహారం గురించి మా మారుటి తండ్రిగారికి తెలిసింది. ఆయన అడ్డు చెప్పలేదు. పెళ్లికిగాను నిర్ణయించిననాటికి, పదిహేను రోజులులోగానే ఒక భయంకరమయిన సంఘటన జరిగింది. దానితో నాకున్న ఒక్కగానొక్కతోడు లేకుండాపోయింది.”

షెర్లక్ హెూమ్స్ కుర్చీలో వెనుకకు వాలి ఉన్నాడు. కళ్లు మూసుకుని ఉన్నాడు. అతని తల మెత్తని తలగడలో దిగబడి ఉంది. కళ్లను కొంచెంగా తెరిచి అతను వచ్చిన యువతివేపు చూచాడు.

“వివరాలను ఖచ్చితంగా చెప్పండి” అన్నాడతను.

“అది నాకు సులభమే. ఆ భయంకరమయిన సమయంలో జరిగినవన్నీ నా మెదడులో బలంగా నాటుకుని ఉన్నాయి. నేను చెప్పినట్లే మా భవనం చాలా పాతది. అందులో ఒక భాగంలో మాత్రమే మేము ఉంటున్నాము. ఈ భాగంలో బెడ్‌రూమ్స్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఉన్నాయి. సిటింగ్ రూమ్స్ భవనం మధ్యభాగంలో ఉన్నాయి. పడకగదులలో మొదటిది డాక్టర్ రాయ్‌లాట్‌గారిది. రెండవది మా చెల్లెలిది. మూడవది నాది. ఈ మూడు గదుల మధ్యన తలుపులు లేవు. అన్నీ ఒకే కారిడార్‌లోకి తెరుచుకుంటాయి. నేను చెప్పేది సరిగానే ఉందా?”

“సరిగానే చెపుతున్నారు.”

“మూడుగదుల కిటికీలు వెనుకనుండే లాన్స్‌లోకి తెరుచుకుంటాయి. ఆ భయంకరమయిన రాత్రి డాక్టర్ రాయ్‌లాట్ కొంచెం తొందరగానే తమ గదిలోకి వెళిపోయారు. ఆయన పడుకోలేదని తెలుసు. భారతదేశపు సిగర్‌ల

పొగ ఘాటువాసన చెల్లెలికి తెలుస్తూనే ఉంది. ఆయన ఆ రకం చుట్టలనే కాల్చేవారు. చెల్లెలు గదిని వదిలి నా వద్దకు వచ్చింది. కొంతసేపు కబుర్లు చెబుతూ, జరగబోయే పెళ్లిని గురించి మాట్లాడుతూ గడిపింది. పదకొండు గంటల ప్రాంతానికి లేచి బయలుదేరింది. ద్వారం దగ్గర ఒక్క క్షణం నిలబడి వెనుకకు తిరిగి చూచింది.

" 'హెలెన్, ఒకమాట చెప్పు. మధ్యరాత్రి ఎవరయినా ఈలవేయడం విన్నావా?' అని అడిగింది.

" 'ఎప్పుడూ వినలేదు' అని నేను అన్నాను.

" 'నీవుగాని, నిద్రలో ఈలవేస్తుంటావా?'

" 'అదేమీ లేదు. కానీ ఎందుకు?'

" 'ఎందుకంటే, గడచిన కొన్ని రాత్రులుగా షుమారు మూడుగంటల ప్రాంతంలో నాకు ఈలలు వినపడుతున్నాయి. నేను మరీ అంత మొద్దుగా నిద్రపోను. ఈలలతో నాకు మెలకువ వస్తున్నది. ఆ చప్పుడు ఎక్కడనుంచీ వచ్చిందీ నేను చెప్పలేను. పక్కగది నుంచి వచ్చి ఉండవచ్చు లేదా, లాన్ నుంచి ఉండవచ్చు. నీకు కూడా అలాంటి చప్పుళ్లు వినిపించాయేమోనని అడిగాను.'

" 'లేదు. నాకే చప్పుడూ వినిపించలేదు. చెట్ల గుంపులో ఆ జిప్సీలుంటారే ఆ దరిద్రుల పని అయి ఉంటుంది'

" ' అదే అనుకున్నాను. లాన్ వేపు నుంచి వచ్చినదయితే, ఆ చప్పుడు నీకు కూడా వినిపించి ఉండాలికదా?'

" 'నిజమే కానీ, నాకు అంత సులభంగా మెలకువ రాదు.'

" 'పోనీలే. అయినా, ఇదేమంత గొప్ప విషయం కాదు' అంటూ చిరునవ్వు నవ్వి తలుపు మూసి ఆమె వెళిపోయింది. వెంటనే ఆమె గది తలుపు తాళం తీసిన చప్పుడు నాకు వినిపించింది."

"అంటే, మీకు ప్రతిరాత్రీ గదులకు తాళం వేసుకోవడం అలవాటా?" అడిగాడు హోమ్స్.

"అవును."

"ఎందుకని?"

"డాక్టర్ గారి దగ్గర ఒక చిరుతపులి, కొండముచ్చూ ఉన్నాయని చెప్పాననుకుంటాను. తలుపులు బంధించుకుంటే తప్ప అంత భద్రత అనిపించేది కాదు."

"నిజంగానే. సరే, మీ వివరణ కొనసాగించండి."

"ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. ఏదో ఘాతుకం జరగబోతుందన్న భావన మసకగా మెదడులో ఉంది. నేను, నా చెల్లెలూ కవలలమని చెప్పానని గుర్తుంది. మా యిద్దరికీ మధ్యన ఉండే బంధం గురించి మీరు ఊహించి ఉంటారు. ఆ రాత్రి భయంకరంగా ఉంది. బయటగాలులు ఈలలు



వేస్తున్నాయి. వర్షం కిటికీలమీద మోతమోగిస్తున్నది. ఉన్నట్టుండి, అంత గోలలోనూ, భయపడిన ఒక ఆడమనిషి వేసిన కేక వినిపించింది. ఆ గొంతు నా తోబుట్టువుదేనని నాకు తెలుసు. ఒక్కసారి మంచం మీదనుంచి లేచాను. శాలువా చుట్టుకున్నాను. కారిడార్‌లోకి పరుగున వచ్చాను. తలుపు తెరుచుకుని బయటకు వస్తుంటే మంద్రంగా ఈల వినిపించింది. మా చెల్లెలు బహుశా ఆ ఈలగురించే చెప్పింది. ఆ తరువాత కొన్ని క్షణాల్లోనే లోహపు వస్తువేదో కిందపడినట్టు ఖంగున చప్పుడు వచ్చింది. నేను కారిడార్‌లో పరిగెత్తాను. చెల్లెలు గది తెరిచి ఉంది. తలుపు కదులుతున్నది. లోపల ఏం కన పడుతుందోనని నేను భయంగా అటువేపు చూచాను. కారిడార్‌లోని దీపం వెలుగులో చెల్లెలు బయటికిరావడం కనిపించింది. భయంతో ఆమె ముఖం తెల్లబారి ఉంది. సాయం కోసం అన్నట్టు ఆమె చేతులు చాచి ఉన్నాయి. శరీరమంతా తాగిన మనిషివలె తూలుతున్నది. నేను పరుగున వెళ్లి రెండు చేతులూ చుట్టి ఆమెను పట్టుకున్నాను. ఆమె నిలబడలేకపోయింది, నేల మీద కుప్పకూలింది. విపరీతమయిన బాధతో ఆమె విలవిలలాడుతున్నది. శరీరమంతా వంకరలు పోతున్నది. మొదట్లో ఆమె నన్ను గుర్తించలేదు అనిపించింది. కానీ ఆమె మీదకు వంగుతుంటే మాత్రం ఆమె భయంకరంగా అరిచిన అరుపును నేను జన్మలో మరువలేను. 'ఓ మై గాడ్! హెలెన్! ఒక పట్టీ! చుక్కల పట్టీ!' ఆమె ఇంకా ఏదో చెప్పబోతున్నది. డాక్టర్ గదివేపు చెయ్యెత్తి చూపుతున్నది. కానీ, మరొక వణుకు బలంగా పుట్టింది. ఆమె మాటలు గొంతులోనే మిగిలి పోయాయి. నేను మా మారుటి తండ్రిగారిని గట్టిగా పిలుస్తూ, వేగంగా బయటకు వచ్చాను. డ్రసింగ్ గౌన్‌తో ఆయన వేగంగా రావడం గమనించాను. చెల్లెలు దగ్గరికి ఆయన చేరేసరికి, ఆమె మూర్ఛపోయి ఉంది. గొంతులో కొంత బ్రాండీ పోశారు. వైద్యసాయం కోసం పంపించారు. అయినా, ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. ఆమె తేరుకోలేదు. అలాగే మరణించింది. నా ప్రియమయిన చెల్లెలు, అలా

భయంకరంగా గతించింది."



"ఒక్కక్షణం. ఈల గురించి, లోహం చప్పుడు గురించి మీరు నమ్మకంగా చెప్పగలరా?" అన్నాడు హోమ్స్.

"సరిగ్గా విచారణ సమయంలో కౌంటీ కొరోనర్ కూడా ఈ మాటే అడిగాడు. ఆ శబ్దాలను విన్నాననే నాకు గట్టి నమ్మకం. కానీ, ఆ ఈదురుగాలుల రొద, పాత ఇంటిలోని కిరకిరలూ నన్ను బహుశా మభ్యపెట్టి ఉండ వచ్చు కూడా."

"మీ చెల్లెలు దుస్తులు వేసుకుని ఉన్నారా?"

"లేదు. నైట్ డ్రస్‌లో ఉంది. ఆమె కుడిచేతిలో ఆరిపోయిన అగ్గిపుల్ల, ఎడమచేతిలో అగ్గిపెట్టె కనిపించాయి."

"అంటే ఏదో జరుగుతున్నదని, పుల్లగీచి చూచే ప్రయత్నం చేశారన్న మాట. ఇదిచాలా ముఖ్య మయిన విషయం. కరోనర్ ఈ విషయంగా ఏమి నిర్ణయం చేశారు?"

"ఆయన కేసును చాలా జాగ్రత్తగా పరిశీలించారు. మొత్తం కౌంటీలో డాక్టర్ రాయ్‌లాట్‌గారి ప్రవర్తన గురించి అందరికీ తెలుసు. అందుకే జాగ్రత్త. అయినా చావుకు సరయిన సూచనలు మాత్రం దొరకలేదు.

తలుపు లోపలి నుంచి పెట్టి ఉందని నేను సాక్ష్యం చెప్పాను. కిటికీలకు పాతకాలం రకపు ఇనుపచువ్వలు అడ్డంగా ఉన్నాయి. వాటిని రాత్రిళ్లలో మేము గట్టిగా బిగిస్తాము. గదులను జాగ్రత్తగా పరీక్షించారు. అన్ని పక్కలా అవి ధృఢంగా ఉన్నాయి. నేలను కూడా పరిశీలించారు. అది కూడా గట్టిదే. ఇక చిమ్నీ వెడల్పుగా ఉంది. అయినా దానికి నాలుగువేపులా పెద్ద అడ్డు మూతలు ఉన్నాయి. కనుక మా చెల్లెలు ఖచ్చితంగా ఒంటరిగానే ఉందని చెప్పవచ్చును. ఆమె శరీరం మీద ఎటువంటి ఘాతుకం జరిగిన ఆనవాళ్లూ కనిపించలేదు."

"విషప్రభావం గురించి పరిశీలించారా?"

"ఆ పరిశీలనా జరిగింది. విషప్రభావం లేదన్నారు."

"మరయితే, ఆవిడ ఏ కారణంగా మరణించిందని మీరు అనుకుంటున్నారు?"

"ఆమె కేవలం భయమూ, షాక్ వల్ల మరణించిందని నా నమ్మకం. అయితే, అంత భయానికి కారణం ఏమిటో మాత్రం నాకు తోచలేదు."

"ఆ సమయంలో బయట చెట్లలో జిప్సీలు ఉన్నారా?"

"ఉన్నారు. నిజానికి ఎప్పుడూ అక్కడ ఎవరో ఒకరు విడిది చేసి ఉండనే ఉంటారు."

"సరే. ఇక, పట్టీ... చుక్కల పట్టీ గురించీ మీరేమయినా ఆలోచించారా?"

"భయంలో మతి చలించి తాను ఏదో అన్నదని నేను కొన్నిసార్లు అనుకున్నాను. లేక ఎవరయినా మనుషులు, బహుశా చెట్లతోపులోని జిప్సీల గురించి చెపుతున్నదేమో అనుకున్నాను. వాళ్లు మెడల చుట్టూ చుక్కలున్న రుమాళ్లను కట్టుకుంటారు. తలలకు కూడా కట్టుకుంటారు. వాటిగురించి చెపుతూ, ఆమె ఆ పొడిమాటలు అన్నదేమో."

హొూమ్స్, ఏ మాత్రం సంతృప్తి కలగని మనిషివలె తల పంకించాడు.

"ఈ వ్యవహారం చాలా లోతుగా ఉంది. మీరు కొనసాగించండి" అన్నాడు అతను.

"రెండు సంవత్సరాలు గడిచాయి. నా జీవితం మరింత ఒంటరి తనంతో నిండింది. ఒక మాసం క్రితం, నేను చాలా సంవత్సరాలుగా ఎరిగి ఉన్న, ఒక నేస్తం నన్ను పెళ్లాడమని అడిగాడు. అతని పేరు ఆర్మిటేజ్... పెర్సీ ఆర్మిటేజ్. రీడింగ్‌దగ్గర క్రేన్ వాల్టర్‌లో ఉండే మిస్టర్ ఆర్మిటేజ్‌గారి రెండవ కుమారుడాయన. మా మారుటి తండ్రిగారు ఈ సంబంధానికి ఎటువంటి అడ్డూ చెప్పలేదు. మేము త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నాము. రెండునాళ్లక్రితం భవనంలోని పడమటి భాగంలో రిపేర్లు మొదలుపెట్టారు. నా పడకగది పడమటిగోడకు రంధ్రాలు వేశారు. కనుక నేను మా చెల్లెలు మరణించిన గదిలోకి మారవలసి వచ్చింది. ఆ మంచం మీదే పడుకోవలసి వచ్చింది. మీరు ఊహించలేరు. గడిచినరాత్రి నేను నిద్రపట్టక పడి ఉన్నాను. నా చెల్లెలి మరణానికి ముందు వినిపించిన గుర్తు లాంటి సన్నని ఈల ఆ నిశ్శబ్దంలో నాకూ వినిపించసాగింది. నేను చెంగున లేచాను. దీపం వెలిగించాను. గదిలో ఏమీ కనిపించలేదు. మళ్లీ వెళ్లి పడుకోవడానికి భయం వేసింది. మొత్తానికి నేను దుస్తులు వేసుకున్నాను. కొంచెం తెల్లవారేసరికి, బయటకు జారుకున్నాను. డాగ్‌కార్ట్‌బండి పట్టుకుని లెదర్‌హెడ్‌కు చేరుకున్నాను. మిమ్మల్ని కలిసి సలహాపొందాలనే ఏకైక కార్యక్రమంతో ఇక్కడికి వచ్చాను."

"చాలా తెలివిగల పనిచేశారు. ఇంతకూ మొత్తం విషయాలు మీరు నాకు చెప్పినట్టేనా?" అన్నాడు నా మిత్రుడు.

"మొత్తం చెప్పినట్టే."

"మిస్ రాయ్‌లాట్, చెప్పలేదు. మీరు మీ తండ్రిగారిని కప్పి పుచ్చుతున్నారు."

"అదేమిటి? ఎందుకలాగ అన్నారు?"

జవాబుగా హెూమ్స్ ఆమె మోకాలిమీద ఆన్చి ఉన్న చేతి చివరన ఉన్న నల్లని అంచును కదిలించాడు. చేతిమీద అక్కడ అయిదు మచ్చలున్నాయి. నాలుగు వేళ్లు, బొటనవేలు గుచ్చుకున్న మరకలు తెల్లని మణికట్టుమీద కనబడుతున్నాయి.

"మీ పట్ల ఆయన మొరటుగా ప్రవర్తించారు"అన్నాడు హెూమ్స్.

ఆ యువతి విస్తుపోయింది. మణికట్టును మూసేసుకున్నది. "ఆయన మొరటురకం మనిషి. తన బలం తానే ఎరుగడు కూడా" అన్నది.

కొంతసేపు నిశ్శబ్దం కొనసాగింది. హెూమ్స్ తన గడ్డాన్ని రెండు అరచేతులలో ఆనించి, చిటపటలాడుతున్న మంటలోకి అదేపనిగా చూస్తున్నాడు.

చివరకు అతను ఇలా అన్నాడు, "ఈ వ్యవహారం చాలా లోతయినది. నేను తెలుసుకోవలసిన వివరాలు వెయ్యి మిగిలి ఉన్నాయి. అవి తెలిసిన తర్వాతగానీ, పనిలోకి దిగడం కుదరదు. మనం ఒక్క క్షణం ఆలస్యం చేయడానికి లేదు. ఈవేళ మేము స్టోక్ మొరాన్‌కు వస్తే, మీ తండ్రిగారికి తెలియకుండా, మీ గదులను చూడడం వీలవుతుందా?"

"ఏం జరిగిందంటే, ఆయన కూడా ఏదో ముఖ్యమయిన పనిమీద ఇవాళ టౌన్‌లోకి వెళతాననడం విన్నాను. బహుశా దినమంతా ఆయన తిరిగి రాడు. కనుక మీరన్నది వీలవుతుంది. ఇప్పుడు ఇంట్లో ఒక పనిమనిషి ఉన్నది. కానీ ఆ ముసలిది వెర్రిబాగులది. ఆమెను పక్కకు తప్పించడం పెద్ద కష్టం కాదు."

"ఎక్సలెంట్. వాట్సన్, నీకు నాతో రావడానికి కుదురుతుందా?"

"తప్పకుండాను."

"అయితే, ఇద్దరమూ వస్తాము. ఇంతకు మీకింకా ఏమి పని మిగిలి ఉంది?"

"ఎలాగూ టౌన్‌లోకి వచ్చాను కనుక, ఒకటి రెండు చిన్న పనులేవో ఉన్నాయి. పన్నెండు గంటల రైలుకి తిరిగి వెళ్లిపోతాను. మీరు వచ్చేసరికి సిద్ధంగా ఉంటాను."

"మేము కూడా మధ్యాన్నం త్వరగానే వస్తాము. నాకు కూడా చక్కబెట్టవలసిన చిన్న పనులేవో ఉన్నాయి. మీరు కాసేపు ఉండి మాతోపాటు బ్రేక్‌ఫాస్ట్ తినవచ్చు గదా?"

"క్షమించండి. నేను వెళ్లాలి. మీతో నా కష్టాలు చెప్పుకున్నాను గనుక ఇప్పటికే మనసు తేలికయింది. మళ్లీ మధ్యాన్నం మిమ్మల్ని కలవడానికి ఎదురుచూస్తాను" ఆమె మళ్లీ తన నల్లని ముసుగును ముఖం మీదకు వేసుకున్నది గదిలోనుంచి కదిలి వెళ్లిపోయింది.

"ఇక నీవు ఏమనుకుంటున్నావు, వాట్సన్?" అడిగాడు షెర్లక్ హెూమ్స్ తన కుర్చీలో వెనుకకు చేరబడుతూ.

"ఈ వ్యవహారం చాలా ముదురుగా, కుట్రగా నాకు కనపడుతున్నది."

"నిజంగా ముదురురకం. నిజంగా కుట్ర."

"ఆవిడగారు చెపుతున్నట్టు గోడలు, నేల, కిటికీ, చిమ్నీలు పకడ్బందీగానూ ఉన్న పక్షంలో ఆమె చెల్లెలు రహస్యమయంగా చావుకు గురయినప్పుడు వంటరిగా ఉందనడానికి అనుమానం లేదు."

"మరి రాత్రిపూట ఈలలసంగతి, చివరి మాటలుగా ఆ స్త్రీ అన్న చిత్రమయిన మాటల సంగతి ఏమిటి?"

"నాకేమీ తోచడం లేదు."

"రాత్రిపూట ఈలలు వినిపించడం, ఇంటి దరిదాపుల జిప్సీలు ఉండడం, ముసలి డాక్టర్‌తో వాళ్ల సంబంధాలు, వీటన్నిటినీ కలిపి చూడాలి.

ఆ డాక్టర్‌కు తన సవతి కూతుళ్ల పెళ్లిళ్లు ఆపవలసిన అవసరం ఉందని సులభంగానే ఊహించవచ్చు. ఇక పట్టీ సంగతి ఒకటి. చివరగా మిస్ హెలెన్ స్టోనర్‌కు వినపడిన లోహపు చప్పుడు మరొకటి. కిటికీలోని చువ్వలను తిరిగి దాని స్థానానికి చేర్చినపుడు బహుశా ఆ చప్పుడు వచ్చి ఉండవచ్చు. ఆ రకంగా ఆలోచిస్తే విషయంలోని లోతులు అందుతాయనడానికి మంచి ఆస్కారం ఉంది."

"అయితే ఇంతకు జిప్సీలు ఏం చేశారు?"

"ఊహకు అందడం లేదు."

"ఈ సిద్ధాంతానికి అడ్డుగా నాకు ఎన్నో తోస్తున్నాయి."

"నేనూ అలాగే అనుకుంటున్నాను. సరిగ్గా అందుకే మనం ఇవాళ స్టోక్ మొరాన్‌కు పోతున్నాము. మనకు తోచిన అనుమానాలు ఎటువంటివో తేల్చుకోవాలి. అవి నిజమేమో కూడా చూడాలి. అయితే మరి ఇదేమిటో!"

నా మిత్రుడు ఒక్కసారిగా అలాగనడానికి కారణం ఉంది. తలుపు ఒక్కసారిగా తెరుచు కున్నది. ఒక భారీ ఆకారం గల మనిషి లోపలికి వచ్చాడు. అతని దుస్తులు విచిత్రంగా ఉన్నాయి. వ్యవసాయదారుని రకం కొంతయితే, వృత్తి వైద్యుని తీరు మరి కొంత. నల్లని టోపీ పెట్టుకున్నాడు. పొడు గాటి కోటు వేసు కున్నాడు. ఎత్తు వరకు ఉండే బూట్లు వేసుకున్నాడు. చేతిలో వేటగాళ్లు పట్టుకునే కర్ర కదులుతున్నది. అతను చాలా ఎత్తుగా ఉ న్నాడు. లోపలికి వస్తుంటే, టోపీ ద్వారానికి పైన తగిలింది. ద్వారం నిండుగా ఉండేంత వెడల్పు కూడా ఉన్నాడు. ముఖం కూడా పెద్దది. నిండా ముడతలు ఉన్నాయి. ఎండలో తిరిగినందుకు మాడినట్టు ఉన్న ఆ ముఖంలో క్రూరత్వం కనపడుతున్నది. ఆయన మా వేపు మార్చి మార్చి చూస్తున్నాడు. ఎర్రబడిన కళ్లు, కోసుగా ఉన్న ముక్కు చూస్తూ ఉంటే, అతను ఒక రాబందులాగా కనపడు తున్నాడు.



"మీలో హోమ్స్ ఎవరు?" వచ్చినతను అడిగాడు.

"అది నా పేరు. కమాన్ సర్. విషయ మేమిటో చెప్పండి" అన్నాడు నా మిత్రుడు ప్రశాంతంగా.

"నా పేరు డాక్టర్ గ్రీమ్స్‌బీ రాయ్‌లాట్. స్టోక్ మోరాన్ నుంచి వచ్చాను."

"సరే డాక్టర్, దయచేసి కూర్చోండి" అన్నాడు హోమ్స్ నిర్లిప్తంగా.

"అదంతా ఏమీ లేదు. నా కూతురు ఇక్కడికి వచ్చింది. నేను తెలుసుకున్నాను. ఆమె మీకు ఏం చెప్పింది?"

"ఈ రుతువులో ఉండవలసినకన్నా చలి ఎక్కువగా ఉంది" అన్నాడు హోమ్స్.

"ఆమె మీకు ఏం చెప్పింది?" గట్టిగా గద్దించి అడిగాడు ముసలతను.

"అయినా, పక్షులు మాత్రం మామూలుగానే తిరుగుతున్నాయి" పట్టించుకోకుండా కొనసాగించాడు నా మిత్రుడు.

"ఓహో! నీవు నన్ను లెక్కచేయడం లేదు. అంతేనా?" ఒక అడుగు ముందుకు వేస్తూ, చేతిలోని కర్రను ఆడిస్తూ అన్నాడు ఆగంతుకుడు. "నాకు నీ సంగతి తెలుసు భడవా! నీ గురించి ఇంతకు ముందే విన్నాను. ప్రతి పనిలోనూ కలుగజేసుకునే మనిషివి నీవు."

నా మిత్రుడు చిరునవ్వాడు.

"హొమ్స్, బిజీబాడీ!"

అతని చిరునవ్వు పెద్దదయింది.

"హొమ్స్, స్కాట్లాండ్‌యార్డ్ వారికి జాక్-ఇన్-ఆఫీస్!"

హొమ్స్ మనస్ఫూర్తిగా నవ్వాడు. "నీ మాటలు చాలా సరదాగా ఉన్నాయి. బయటకు వెళ్లేటపుడు తలుపు చేరవెయ్యి. గాలి బలంగా వస్తున్నది" అన్నాడు అతను.

"చెప్పవలసిందేదో చెప్పి మరీ పోతాను. నా వ్యవహారాలలో తలదూర్చి తప్పు చేయకు. మిస్ స్టోనర్ ఇక్కడికి వచ్చిందన్నది నాకు తెలుసు. నేను తెలుసుకున్నాను! నాతో పెట్టుకుంటే బాగుండదు. జాగ్రత్త!" అతను ఒక్కసారిగా ముందుకు వచ్చాడు. బల్లమీదనున్న పోకర్‌ను అందుకుని రెండు చేతులతో పట్టి సులభంగా వంచేశాడు.

"నా చేతికిగాని చిక్కితే కష్టపడతావు" అన్నాడతను వంకర తిరిగిన పోకర్‌ను ఫయర్ ప్లేస్‌లోని మంటలోకి విసురుతూ. తరువాత అతను గదిలోనుంచి వెళిపోయాడు.

"మంచి కలుపుగోలు మనిషిలా ఉన్నాడు. అతనిలాగ అంత భారీ మనిషిని కాను. కానీ, అతను కాసేపు ఉంటే, అతని పట్టుకన్నా, నా పట్టు ఏమాత్రం తీసిపోదని చూపించి ఉండేవాడినే" నవ్వుతూ అన్నాడు హొమ్స్.

పోకర్‌ను అందుకుని ఒక్కసారిగా తిరిగి చక్కజేశాడు.

"అతని ధైర్యం చూడు. నన్ను, మొత్తం డిటెక్టివ్‌లను కాదు పొమ్మంటున్నాడు. ఈ సంఘటనతో నాకు ఈ పరిశోధనలో ఆసక్తి మరింత పెరిగింది. పాపం, మన మిత్రురాలు, ఈ మనిషి వలన అపాయానికి గురవుతుందేమో. వాట్సన్ ఇక మనం బ్రేక్‌ఫాస్ట్ తెప్పించుకుందాం. తిన్న తరువాత నేను డాక్టర్స్ కామన్స్‌కి వెళతాను. ఈ వ్యవహారానికి సంబంధించి

అక్కడ మనకు కొంత సమాచారం తెలుస్తుందని నా నమ్మకం."

షెర్లక్ హోమ్స్ పని చక్కబెట్టుకుని తిరిగి వచ్చేసరికి ఒంటిగంట అయింది. అతని చేతిలో ఒక నీలిరంగు కాయితం షీట్ ఉన్నది. దానిమీద ఏవేవో అంకెలు, వివరాలు రాసి ఉన్నాయి.

"మరణించిన భార్య వీలునామా చూచాను. అందులో సూచించిన పెట్టుబడుల ప్రస్తుతపు విలువ కూడా ఖచ్చితంగా లెక్కవేసే వీలు దొరికింది. ఆమె పోయిన సమయానికి ఆదాయం సుమారు 1100 పౌండ్లకు చేరువగా ఉంది. వ్యవసాయరంగంలో ధరలు పడిపోయినయి. కనుక ప్రస్తుత విలువ 750 పౌండ్ల ప్రాంతంలో ఉంది. పెళ్లి జరిగితే, కూతుళ్లు చెరి 250 పౌండ్లు అడగవచ్చు. ఒకవేళ ఇద్దరికీ పెళ్లి జరిగితే మనవాడికి మిగిలేది చాలా తక్కువ. ఒకరికి జరిగినా, అందేదాంట్లో కొరత ఏర్పడడం తప్పదు. నేను పొద్దున్నే వెళ్లినది వ్యర్థం కాలేదు. పిల్లలదారిలో అడ్డు తగలడానికి అతనికి అన్ని రకాలా అవసరం ఉందని తెలిసిపోయింది. వాట్సన్, ఇక మనం కాలక్షేపం చేయడానికి టైమ్ లేదు. ముసలివానికి మనం వ్యవహారంలో తలదూరుస్తున్నామని తెలిసిపోయింది కనుక, అసలే ఆలస్యం కూడదు. నీవు సిద్ధంగా ఉన్నావంటే, బండి పిలిచి వాటర్లూ చేరుకుందాం. నీ రివాల్వర్‌ను జేబులో పెట్టుకుంటే నాకు సంతృప్తిగా ఉంటుంది. స్టీల్ పోకర్లను వంచివేయగల మనిషికి జవాబు చెప్పడానికి ఎలీ నెంబర్ 2 పిస్తోలు బాగుంటుందని అనుకుంటున్నాను. అదీ, మరొక టూత్ బ్రష్, అవి మాత్రమే మనకు కావలసినవి."

"వాటర్‌లూలో అదృష్టంకొద్దీ మాకు లెదర్‌హెడ్ ట్రైన్ దొరికింది. అక్కడినుంచి ఒక ట్రాప్ బండి మాట్లాడుకున్నాము. అందులో అందమయిన సర్రే దారులగుండా నాలుగయిదు మైళ్లు ప్రయాణించాము. ఆరోజు వాతావరణం చాలా బాగుంది. మంచి ఎండ కాస్తున్నది. ఆకాశంలో మేఘాలు దూదిపింజలలాగ అక్కడక్కడా కదులుతున్నాయి. చెట్లు, దారి

పక్కనున్న పొదలు అప్పుడప్పుడే కొత్త చిగుర్లు వేస్తున్నాయి. గాలిలో నిండ తడినేల వాసనలు పరుచుకుని ఉన్నాయి. నా మటుకు నాకు ఈ వాతావరణానికీ, మేము వెళుతున్న విచిత్రమయిన పనికి విరోధాభాసం కనిపించింది. నా నేస్తం బండిలో ముందు కూచుని ఉన్నాడు. తల ఎదమీదికి వంచి, టోపీని కళ్లమీదకు వచ్చేట్టు అమర్చుకుని, చేతులు కట్టుకుని ఉన్నాడు. ఉన్నట్టుండి అతను నా భుజం మీద తట్టాడు. మైదానంమీద వేపుకు చూపించాడు.

"అటు చూడు!" అన్నాడు అతను.

ఒక వాలుమీద చెట్లు దట్టంగా పరచుకుని ఉన్నాయి. వాలు పై భాగాన అవి మరింత దట్టంగా ఉన్నాయి. వాటి కొమ్మలలోనుంచి, బూడిదరంగు భవనం ఒకటి కనిపించింది. అది చాలా పాతకాలంనాటిది.

"స్టోక్ మోరాన్?" అన్నాడతను.

"అవును సార్. డాక్టర్ గ్రిమ్స్‌బీ రాయ్‌లాట్ ఇల్లు అదేనండి" అన్నాడు డ్రయివర్.

"అక్కడ కట్టడం పని నడుస్తున్నది. అక్కడికే మేము వెళ్లవలసినది" అన్నాడు హెూమ్స్.

"ఊరు ఆ పక్కనే ఉంది" అన్నాడు డ్రయివర్ కొంతదూరాన ఇంటి పై కప్పులను చూపిస్తూ. "కానీ, మీరు ఆ పెద్ద ఇంటికి వెళ్లాలంటే ఇక్కడి నుంచి నడిచి వెళితే దగ్గరవుతుంది. పొలాలమధ్యగా వెళ్లాలి. అదుగో అక్కడ ఒక అమ్మాయిగారు వెళుతున్నారే, అదే దారి."

"ఆవిడగారు, మిస్ స్టోనర్ అనుకుంటాను. నీవు చెప్పినట్లు చేయడమే మంచిదనుకుంటాను" అన్నాడు హెూమ్స్ కళ్లమీద చెయ్యి ఉంచుకుని చూస్తూ.

మేము బండి దిగాము. డబ్బులు చెల్లించాము. బండి మళ్లీ లెదర్‌హెడ్‌వేపు వెళిపోసాగింది.



"నేనూ అదే అనుకున్నాను. ఈ మనిషి మనమిక్కడికి కట్టడం పనిమీద వచ్చామనుకోవడం మంచిదే. లేకుంటే లేనిపోని మాటలు పుడతాయి. గుడ్ ఆఫ్టర్‌నూన్, మిస్ స్టోనర్. వేము అన్నమాట నిలబెట్టుకున్నాము. గమనించారా?" అన్నాడు హోమ్స్ ముందుకు నడుస్తూ.

ఉదయం మా దగ్గరకు వచ్చిన క్లయంట్ వేగంగా మా వద్దకు వచ్చింది. ఆమె ముఖంలో సంతోషం కనిపించింది. "నీ కోసం నేను చాలా ఆతురతతో ఎదురుచూస్తున్నాను. అంతా సవ్యంగా సాగుతున్నది. డాక్టర్ రాయ్‌లాట్ టౌన్‌లోకి వెళ్లారు. ఆయన సాయంత్రంకన్నా ముందు వచ్చేటట్టు లేరు" అన్నది ఆమె మాతో షేక్‌హ్యాండ్స్ చేస్తూ.

"ఆ డాక్టర్ గారితో మాకు పరిచయభాగ్యం కలిగింది" అన్నాడు హోమ్స్. జరిగినదంతా కొన్ని మాటలలో వివరించాడు. వింటున్న మిస్ స్టోనర్ ముఖం మారిపోయింది.

"గుడ్ హెవెన్స్! అయితే ఆయన నన్ను వెంటాడారన్నమాట!" గట్టిగా అన్నది ఆమె.

"అట్లాగే అనిపిస్తున్నది."

"ఆయన మరీ జిత్తులమారి మనిషి. నాకు రక్షణ ఉందా లేదా అస్సలు అర్థంకాదు. తిరిగివచ్చి ఏమంటారో?"

"ముందు ఆయన జాగ్రత్తపడాలి. అతనికన్నా తెలివిగల మరొకరు కూడా వెంబడిస్తున్నారని అర్థమయిపోతుంది. మీరు ఈ రాత్రికి మీ గదిలో తాళం పెట్టుకుని ఉండాలి. ఆయన రెచ్చిపోతే మేము మిమ్మల్ని మీ పిన్నిగారి ఇంటికి క్షేమంగా చేరుస్తాం. మనం ఇప్పుడు సమయాన్ని బాగా ఉపయోగించుకోవాలి. కనుక దయచేసి మీ గదులకు వెంటనే తీసుకుపొండి. వాటిని పరిశీలించవలసి ఉంది."

భవనం బూడిదరంగులో ఉంది. రాతి గోడలమీద లైకెన్స్ రాతిపూవులు అక్కడక్కడా పెరిగి ఉన్నాయి. మధ్య భాగం చాలా ఎత్తయినది. రెండుపక్కల పీత డెక్కల వలె రెండు భాగాలు ఉన్నాయి. అందులో ఒకదానిలో కిటికీలు విరిగి ఉన్నాయి. వాటికి చెక్కలను అడ్డంగా కొట్టి ఉంచారు. ఆ భాగంలో పైకప్పు కొంత కూలి ఉంది. అంటే అది శిథిలమయిన భాగమని అర్థం. ఇక మధ్యభాగం కొంత మెరుగుగా ఉంది. కుడిపక్క భాగం మాత్రం బాగుంది. కిటికీలలోని బ్లైండ్స్, చిమ్నీల లోనుంచి వస్తున్న నీలి పొగ లాంటివి చూస్తే, ఈ భాగంలోనే కుటుంబం ఉందని కనబడుతుంది. అక్కడ చివరి గోడకు స్కఫోల్డింగ్ కర్రలు అమర్చి ఉన్నాయి. రాతి గోడను కొంత తొలగించారు. మేము వెళ్లిన సమయంలో మాత్రం అక్కడ పనివాళ్లెవరూ లేరు. గజిబిజిగా పెరిగి ఉన్న లాన్ మీద హోమ్స్ నెమ్మదిగా అటు ఇటూ తిరుగుతూ, చుట్టుపక్కల వివరాలను పరీక్షించాడు.

"ఈ కిటికీ బహుశా మీరు వాడిన గదిది అనుకుంటాను. మధ్య



కిటికీ మీ చెల్లెలు గది, మెయిన్ బిల్డింగ్‌కి ఆనుకున్నది డాక్టర్ రాయ్‌లాట్‌గారి ఛాంబర్ అంతేనా?"

"సరిగ్గా చెప్పారు. కానీ ప్రస్తుతం నేను మధ్య గదిలో పడుకుంటున్నాను."

"మార్పులు జరుగుతు న్నాయి గనుక. కానీ, నిజానికి ఇక్కడ మరమ్మతులు చేయ వలసిన అవసరం ఏమీ కనిపించడం లేదే?"

"నిజంగానే లేదు. నన్ను నా గదిలోనుంచి పంపించడానికి మాత్రమే ఇదొక ఎత్తు అని నా నమ్మకం."

"ఆహ్! ఇది బాగుంది. ఈ ఇరుకు భాగంలో అటువేపు మీ మూడు గదులు తెరుచుకునే కారిడార్ ఉంది. అందులో కూడా కిటికీలు ఉన్నాయి."

"అవును. కానీ చాలా చిన్నవి. వాటిలోనుంచి ఎవరూ దూరి రావడానికి వీలు లేదు."

"మీరు రాత్రిళ్లు గదిని తాళం వేసుకుంటున్నారు. ఇక అటువేపు నుంచి ఎవరూ వచ్చేవీలు లేదు. ఇప్పుడు మీరు మీ గదిలోకి వెళ్లి గ్రిల్స్ మూసుకుంటారా?"

మిస్ స్టోనర్ అలాగే చేసింది. కిటికీలోనుంచి పరిశీలిస్తూ హోమ్స్ ఆ గ్రిల్స్‌ని తెరవడానికి రకరకాలుగా ప్రయత్నించాడు. కానీ లాభం లేకపోయింది. కత్తి దూర్చి గ్రిల్స్‌ని కదిలించడానికి ఎక్కడా సందుకూడ

లేదు. ఆ తర్వాత అతను భూతద్దం సాయంతో మడతబందులను పరిశీలించాడు. అవి గట్టి ఇనుముతో చేసి ఉన్నాయి. గోడలోకి చక్కగా బిగించి ఉన్నాయి. హోమ్స్ తన గడ్డం గోక్కుంటూ, ఇలాగన్నాడు “నా సిద్ధాంతం ప్రస్తుతం చిక్కుల్లో పడింది. గ్రిల్స్ మూసి ఉంటే ఈ దారి వెంట గదులలోకి పోయే అవకాశమే లేదు. గదిలోపల ఏమయినా తెలుస్తుందేమో చూడాలి.”

పక్కనున్న ఒక చిన్న ద్వారంలోనుంచి పోతే. నడవలోకి చేరుకున్నాము. మూడు బెడ్‌రూమ్స్, సున్నం వేసిన ఆ కారిడార్‌లోకే తెరుచుకుంటాయి. హోమ్స్ మూడవ గది గురించి పట్టించుకొనలేదు. కనుక మేము నేరుగా రెండవ గదిలోకి వెళ్లాము. అందులోనే మిస్ స్టోనర్ ప్రస్తుతం పడు కుంటున్నారు. ఆ గదిలోనే ఆమె చెల్లెలు ప్రాణాలు వదిలింది. గది చిన్నది పైకప్పు తగ్గుగా ఉన్నది. పెద్ద ఫయర్ ప్లేస్, పాతపద్ధతి పల్లెటూరి ఇళ్లలో వలె ఉన్నది. ఒక మూలన బ్రౌన్ రంగు సొరుగుల పెట్టె ఉన్నది. పేము అల్లిన తెల్లని మంచం ఒకటి, మరొక డ్రస్సింగ్ టేబుల్ కిటికీకి ఎడమపక్కన ఉన్నాయి. రెండు పేము కుర్చీలు ఉన్నాయి. ఆ గదిలో మధ్యన ఒక విల్టన్ కార్పెట్ తప్ప, మరే వస్తువులూ లేవు. గోడల మీద అమ ర్చిన ఓక్ చెక్కలు పురుగులు తొలిచినట్టు ఉన్నాయి. వెలిసిపోయిన వాటిరంగును చూస్తే, అవి బహుశా ఇల్లు కట్టిన నాటివి అని అనిపిస్తుంది. హోమ్స్ ఒక కుర్చీని మూలకు లాక్కుని నిశ్శబ్దంగా కూచున్నాడు. కళ్లు మాత్రం గదిలో చుట్టూ, కిందకు, మీదకూ కదులుతూ అన్ని వివరాలను గమనిస్తున్నాయి.

“ఈ గంట ఈ గదిలో మోగుతుంది?” చివరకు అతను ఎదురుగా వేలాడుతూ కనపడుతున్న ఒక గంటతాటిని చూపుతూ అడిగాడు. తాడు కింద చివర మంచంమీది తలగడకు తగులుతున్నది.

“అది హౌజ్‌కీపర్ గదిలో మోగుతుంది.”

“మిగతా వస్తువులకన్నా అది కొత్తగా కనపడుతున్నది?”

"అవును. అది రెండు సంవత్సరాల క్రింద మాత్రమే అమర్చబడింది."

"మీ చెల్లెలుగారు దానికోసం అడిగి ఉంటారనుకుంటాను?"

"లేదు. ఆమె దాన్ని ఎప్పుడూ వాడగా నేను వినలేదు. మాకు కావలసిన వస్తువులను అన్నింటినీ మేమే తెచ్చు కునేవాళ్లం."

"నిజమే. అంతమంచి గంటను ఏర్పాటుచేయడం అనవసరం అని పిస్తున్నది. ఇక నేను ఫ్లోర్ గురించి కూడా తేల్చుకోవాలి. కొన్ని నిమిషాలు మీరు నన్ను క్షమిస్తారనుకుంటాను." హోమ్స్ బోర్లా నేల మీద పడుకున్నాడు. భూతద్దం చేతపట్టి ముందుకు, వెనక్కు పాకుతూ, కింద పరిచిన చెక్కపలకల మధ్య పగుళ్లను పరిశీలించాడు. తరువాత అతను గోడలకు అమర్చిన చెక్కలను కూడా అదే రకంగా పరీక్షించాడు. చివరకు మంచం దగ్గరకు చేరి దానివేపు తదేకంగా చూస్తూ గడిపాడు. ఆ తరువాత గంటతాడు చేతిలోకి అందుకుని ఒక్కసారి దాన్ని లాగాడు.

"ఇదేమిటి? గంట లేనే లేదు. ఇది ఉట్టి డమ్మీ" అన్నాడు అతను.

"గంట మోగదా?"

"లేదు. అసలు నిజానికి ఇది ఏ తీగెకూ కలిపి లేదు కూడా. ఇదేదో ఆసక్తికరంగా ఉంది. ఈ తాడు పైభాగం కనబడుతున్న వెంటిలేటర్ పక్కనున్న కొక్కానికి కట్టి ఉంది."

"ఎంత అర్థంలేని సంగతి! నేనది ఇంతకు ముందు గమనించనే లేదు."

"చాలా విచిత్రం!" హోమ్స్ గొణిగాడు, తాటిని మరోసారి లాగుతూ. "ఈ గది గురించి ఒకటిరెండు ప్రత్యేకమయిన విషయాలు కనిపించాయి. ఉదాహరణకు ఎంత పిచ్చివాడయినా, వెంటిలేటర్‌ని పక్కగదిలోకి పెడతాడా? అదే పని బయటి గోడకు చేస్తే, చక్కగా బయటిగాలి వస్తుంది కదా!"

"ఆ మార్పుకూడా ఇటీవలే జరిగింది" అన్నది యువతి.

"గంటతాడు అమర్చినప్పుడే వెంటిలేటర్ కూడా పెట్టారా?" అడిగాడు హోమ్స్.

"అవును. ఆ సమయంలో చిన్న చిన్న మార్పులు చాలా చేయించారు."

"అవన్నీ చాలా ఆసక్తికరంగా ఉన్నట్టున్నాయి- మోగని గంటతాళ్లు, గాలి అందించని వెంటిలేటర్, మిస్ స్టోనర్, మీరు అనుమతిస్తే మనము మిగతా ప్రాంతాలను పరిశీలిద్దాము."

డాక్టర్ గ్రిమ్స్బీ రాయ్లాట్ గది, ఆయన కూతుళ్ల గదులకంటే చాలా పెద్దది. ఫర్నిచర్ మాత్రం మామూలుగా ఉంది. ఒక కాంప్ మంచం, నిండా పుస్తకాలతో ఒక కర్ర షెల్ఫ్ ఉన్నాయి. పుస్తకాలు చాలామటుకు టెక్నికల్ రకం. మంచంపక్కన ఒక కుర్చీ ఉంది. గోడపక్కన ఒక మామూలు కర్ర కుర్చీ ఉంది. ఒక గుండ్రని బల్ల, పెద్ద ఐరన్ సేఫ్ కూడా అక్కడే కనపడుతున్నాయి. హోమ్స్ నెమ్మదిగా నడుస్తూ చాలా ఆసక్తిగా వాటన్నటినీ పరీక్షించాడు.

"ఇందులో ఏముంది?" సేఫ్ మీద తడుతూ అడిగాడు.

"మా తండ్రిగారి బిజినెస్ కాగితాలు."

"ఓహో! మరి మీరు వాటిని ఎప్పుడయినా చూచారా?"

"కొన్ని సంవత్సరాల క్రితం, ఒక్కసారి చూచాను. అందులో నిండా కాగితాలే ఉన్నాయని గుర్తుంది."

"అందులో ఒక పిల్లిగాని ఉందా? ఉదాహరణకు?"

"లేదు. అదేమి వింత ఆలోచన!"

"మరి ఇటు చూడండి" సేఫ్ మీద ఉన్న ఒక చిన్న పాలసాసర్‌ను ఎత్తి చూపిస్తూ అన్నాడు హోమ్స్.

"లేదు. మా యింట్లో పిల్లి లేదు. కానీ ఒక చిరుతపులి, ఒక కొండ ముచ్చు మాత్రం ఉన్నాయి."



"అవునవును కదూ! చిరుతపులి అంటె పెద్ద పిల్లి. కాని, దాని అవసరాలు తీర్చడానికి ఈ సాసర్‌లో పాలు చుక్కలు ఏం సరిపోతాయి? ఈ సంగతి గురించి తేల్చుకోవలసి ఉంది" అతను కఱ్ఱ కుర్చీ ముందు చతికిలపడి కూర్చున్నాడు. కుర్చీ సీటును చాలా శ్రద్ధగా పరిశీలించాడు.

"థాంక్యూ! అర్థమయింది" అన్నాడతను లేచి భూతద్దాన్ని జేబులో పెట్టుకుంటూ. "హలో! ఇక్కడేదో ఆసక్తికరమయిన సంగతి ఉంది."

అతని దృష్టిని ఆకర్షించినది మంచంమీదనున్న కుక్క మెడ పట్టీ. అది వడితిప్పి రెండుగా మలిపి ఉంది. ఒక కొరడా మాదిరి మారిందది.

"అదేమిటంటారు, వాట్సన్?"

"ఇది మామూలు తాడే. కానీ, ఇట్లా ఎందుకు మలిపారో అర్థంకావడం లేదు."

"అదేమీ మామూలుగా లేదుకదూ? అయినా, నా వెఱ్రితనం కాకపోతే, ఒక తెలివికల మనిషి తన మెదడును నేరాలవేపు మళ్లిస్తే, ఎంతకయినా

తెగిస్తాడు. ఇక చూచింది చాలు. మిస్ స్టోనర్, మీరు అనుమతిస్తే, కాసేపు లాన్‌లో తిరుగుదాం."

నా మిత్రుని ముఖం అంతగా ముడుచుకుపోవడం నేనెపుడూ గమనించలేదు. అతను పరిశీలననుంచి బయలుదేరినప్పుడు ముఖంలో బాధ కనిపించింది. మేము లాన్‌లో చాలాసార్లు అటూ ఇటూ తిరిగాము. మిస్ స్టోనర్‌గాని, నేనుగానీ, హెూమ్స్ ఆలోచనల ప్రభావానికి అడ్డుపడడానికి ఇష్టపడలేదు.

"మిస్ స్టోనర్, మీరు నా సలహాను అన్ని రకాలా పాటించడం చాలా అవసరం" అన్నాడు అతను.

"తప్పకుండా అలాగే చేస్తాను."

"వ్యవహారం అనుమానాలకు చోటివ్వనంత సీరియస్‌గా ఉంది. మీ ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయి."

"వాటిని మీ చేతులలో పెడుతున్నాను."

"ఈ రాత్రి నా మిత్రుడూ నేనూ, మీ గదిలో గడపాలన్నది మొదటి సంగతి."

మిస్ స్టోనర్‌తో పాటు నేను కూడా అతని వేపు ఆశ్చర్యంగా చూచాను.

"అవును. అది జరగాలి. నన్ను చెప్పనివ్వండి. ఆ ఎదురుగా కనపడుతున్నది విలేజ్ ఇన్ అనుకుంటాను?"

"అవును. దాన్ని క్రౌన్ అంటారు."

"బాగుంది. అక్కడి నుంచి మీ కిటికీలు కనపడతాయి కదూ?"

"చక్కగా."

"మీరు మీ గదినుంచి కదలకూడదు. మీ తండ్రిగారు వచ్చినపుడు తలనొప్పిగా ఉందని చెప్పండి. ఆయన పడుకున్నారని తేల్చుకున్న తరువాత

మీ కిటికీ షటర్స్ తెరవండి. గొళ్లెం కూడా తొలగించండి. మాకు సంకేతంగా దీపాన్ని అక్కడ పెట్టండి. మీకు కావలసిన వస్తువులన్నీ వెంట తీసుకుని చడీచప్పుడూ లేకుండా మీరు మామూలుగా వాడిన గదిలోకి జారుకోండి. రిపేర్లు జరుగుతున్నా సరే, ఈ ఒక్కరాత్రికి ఆ గదిలో గడపడం కుదురుతుందనే అనుకుంటున్నాను."

"అవును, సమస్య లేదు."

"ఇక మిగతా వ్యవహారం నాకు వదిలేయండి."

"కానీ మీరేం చేయబోతున్నారు?"

"మేము రాత్రంతా మీ గదిలో ఉంటాము. మీకు చికాకు కలిగించిన చప్పుళ్లను గురించి పరిశోధిస్తాము."

"మిస్టర్ హోమ్స్, మీరిప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని నేను అనుకుంటున్నాను" అన్నది మిస్ స్టోనర్, తన చేతిని నా మిత్రుని ముంజేతిమీద పెడుతూ.

"బహుశా నిజమేనేమో."

"అయితే, మా చెల్లెలు మరణానికి కారణమేమిటో దయచేసి చెప్పండి."

"నోరు విప్పేలోపల నేను మరింత స్ఫుటమయిన సాక్ష్యాలు కోరుకుంటాను."

"అసలు నా ఆలోచన నిజమా, కాదా చెప్పండి. ఆమె కేవలం విపరీతమయిన భయంతో చనిపోయిందా?"

"లేదు. నేనలా అనుకోవడం లేదు. అంతకన్నా మామూలు కారణం ఏదో ఉందనిపిస్తున్నది. ఇక మిస్ స్టోనర్, మేము వెళ్లిపోవాలి. ఒకవేళ డాక్టర్ రాయ్‌లాట్ తిరిగి వచ్చారంటే, మా ప్రయాణం, శ్రమా వ్యర్థమవుతాయి. సెలవు, ధైర్యంగా ఉండండి. నేను చెప్పినట్టు చేశారంటే, మిమ్మల్ని భయ పెడుతున్న ఆపదలను దూరంగా తరమగలుగుతామని నమ్మండి."



క్రౌన్ సత్రంలో షెర్లక్ హోమ్స్, నేనూ సులభంగానే సిటింగ్ రూమ్‌తో సహా ఉన్న పడక గదులను ఏర్పాటు చేసు కోగలిగాము. అవి పై అంతస్తులో ఉన్నాయి. కిటికీ లోంచి చూస్తే, దారి, గేటు, స్టోక్ మోరాన్ మేనర్ హౌజ్‌లో ఇంటివాళ్లు ఉంటున్న భాగం చక్కగా కనిపిస్తు న్నాయి. సూర్యాస్తమయం సమయాన డాక్టర్ గ్రిమ్స్‌బీ రాయలాట్ తిరిగి రావడం కనిపించింది. బండి నడుపు తున్న కుర్రవాని పక్కన కూచున్న ఆయన భారీ దేహం కనిపించింది. కుర్రవాడు ఇనుప గేట్లను తెరవడానికి కొంచెం కష్టపడ్డాడు. డాక్టర్ మొరటు గొంతుతో అరుస్తూ, పిడికిలి బిగించి కదిలిస్తూ ఆ కుర్రవాడిని మాటలు అనడం చూడగలిగాము. చిన్నబండి లోపలికి వెళిపోయింది. ఆ తరువాత ఒక్కసారిగా దీపం వెలిగించినట్టు వెలుతురు కనిపించింది. వాట్సన్, నీకు తెలుసా, నిన్ను ఈ రాత్రి ఇక్కడికి తేవడంలో నేను తప్పు చేశానేమో? ఇక్కడ తప్పకుండా ఆపద ఉంది" మేమిద్దరమూ కూచుని ఉండగా హోమ్స్ అన్నాడు.

"మరి నావల్ల సాయం జరుగుతుందా?"

"నీవు తోడు ఉంటే చాల జరుగుతుంది."

"అయితే నేను తప్పకుండా వస్తాను."

"నీవు చాల దయగలవాడివి."

"ఆపద ఉందంటున్నావు? అంటే ఆ గదులలో నాకు కనపడని విషయాలను నీవు చూచావన్నది అర్థమవుతున్నది."

"అదేమీ లేదు. నేను కొంచెం ఎక్కువగా ఆలోచించానని అనుకుంటున్నాను. నేను చూచినవన్నీ నీవూ చూచావు."

"గంటతాడు తప్ప, నాకు మరేమీ ప్రత్యేకంగా కనిపించలేదు. ఆ తాటితో మరేం జరుగుతుందన్నది నేను ఊహించలేకపోయాను."

"వెంటిలేటర్‌ని కూడా చూచావు గదా?"

"అవును. రెండు గదుల మధ్యన ఒక చిన్న రంధ్రం ఉండడం అంత అసాధారణమయిన విషయమేమీ కాదని నాకు అనిపించింది."

"స్టోక్ మొరాన్‌కు రాకముందే రెండు గదుల మధ్యన ఒక వెంటిలేటర్ కనపడుతుందని నాకు తెలుసు."

"మైడియర్ హెూమ్స్!"

"అవునయ్యా, నిజంగానే. ఆవిడ తన స్టేట్‌మెంట్ చెపుతూ, తన చెల్లెలు డాక్టర్ రాయలట్‌గారి సిగర్ వాసన పసిగట్టిందని చెప్పింది గదా? అంటే రెండు గదుల మధ్యన రంధ్రం ఉండితీరాలి. అది చిన్నదయి ఉండవచ్చు. లేకుంటే, దాన్ని గురించి కరోనర్ విచారణలో ప్రసక్తి వచ్చేది. కనుక ఉండవలసినది వెంటిలేటర్ అని నేను నిశ్చయించాను."

"దానివల్ల ఏం హాని జరుగుతుంది?"

"సరే. కనీసం సంగతులు జరిగిన తేదీల విషయంలో చిత్రమయిన సంబంధం ఉంది. ఒక వెంటిలేటర్ పెట్టించారు. ఒక తాడు వేలాడదీశారు. మంచంమీద పడుకున్న ఒక స్త్రీ మరణించింది. నీకేమీ తోచడం లేదా?"

"వాటి మధ్య నాకు ఏ రకంగానూ సంబంధం కనబడడం లేదు."

"ఆ మంచం గురించి ఒక విచిత్రమయిన సంగతిని నీవుగాని గమనించావా?"

"లేదు."

"అది నేలకు బిగించి ఉంది. ఒక మంచాన్ని నేలకు అట్లా బిగించి ఉంచడం ఇంతకుముందు ఎక్కడయినా చూచావా?"

"చూచానని అనలేను."

"ఆవిడ మంచాన్ని కదిలించలేకపోయింది. అంటే వెంటిలేటర్‌కు, తాడుకూ సంబంధించి మంచం ఎప్పుడూ ఒకే చోట ఉండాలి. అదీ ఏర్పాటు. ఆ తాడు గంట కొరకు కానేకాదు."

"హోమ్స్, నాకిప్పుడే నీవేం చెబుతున్నావో కొంచెంగా అర్థమవుతున్నది. అంటే మనం ఒక భయంకరమయిన, రహస్యమయిన నేరాన్ని ఆపడానికి సకాలంలో వచ్చామంటావా?"

"నిజంగా రహస్యం, నిజంగా భయంకరం. ఒక డాక్టర్ తప్పు చేయడానికి తలపెడితే మొదటిరకం నేరస్తుడవుతాడు. అతనికి కావలసిన ధైర్యముంది, తెలివి కూడా ఉంది. ఈ వృత్తిలో పామర్ అండ్ ప్రిచర్డ్ అనేవాళ్లు తలమానికంగా ఉండేవాళ్లు. ఈ మనిషి వాళ్లకన్నా లోతుగా పోతున్నాడని నా కనిపిస్తున్నది. వాట్సన్, మనం అంతకన్నా లోతుగా వెళ్లాలి. ఈ రాత్రి గడిచేలోపల భయంకరమయిన విషయాలు మన ముందుకు రానున్నాయి. చక్కగా పైప్ కాలిచి సరదాగా ఆలోచిస్తూ మెదళ్లను కొంచెంసేపు పక్కకు తిప్పుదాం."

సుమారు తొమ్మిదిగంటల ప్రాంతాన చెట్లమధ్యన కనిపించిన దీపాలు ఆరిపోయాయి. మేనర్ హౌజ్ ప్రాంతమంతా చీకటిగా మారింది. నెమ్మదిగా రెండు గంటలు గడిచాయి. పదకొండు గంటలు కొట్టినప్పుడు ఒక్కసారిగా ఒక్క దీపం వెలిగింది.

"అదే మనకు సంకేతం. మధ్య కిటికీలోనుంచి వస్తున్నది" అన్నాడు హోమ్స్, లేచి నిలబడుతూ.

బయటకు బయలుదేరుతూ అతను ఇన్న్ యజమానితో కొంత మాట్లాడాడు. పరిచయస్తుల దగ్గరకు వెళుతున్నామని బహుశా రాత్రి అక్కడే ఉండిపోతామని చెప్పాడు. తరువాత మేము చీకట్లో నడిచాము. ముఖాలకు చల్లని గాలి తగులుతున్నది. ఆ విషాదవాతావరణంలో, మా కార్యక్రమానికి మాకు దారిచూపుతున్నట్టు పసుపుపచ్చగా మిణుకు మిణుకుమంటూ దీపం కనపడుతున్నది.

ఆవరణలోకి ప్రవేశించడానికి ఏమాత్రం కష్టం కాలేదు. పాత పార్కు గోడ పడిపోయి అక్కడక్కడా దారులు పడ్డాయి. చెట్ల మధ్యగా నడుస్తూ మేము లాన్‌లోకి చేరాము. దాన్ని కూడా దాటి కిటికీ దగ్గరికి చేరబోతుండగా పక్కనున్న పొదలలో భయం కరమయిన ఆకారమొకటి కదిలింది. అది నేలమీద అటూఇటూ దొర్లి లేచి వేగంగా లాన్ మీదుగా చీకట్లోకి పరిగెత్తింది.



"మైగాడ్! చూచావా?" నేను గుస గుసగా అన్నాను.

హోమ్స్ కూడా ఒక్క క్షణంపాటు నాలాగే భయ పడ్డాడు. ఆత్రంగా అతను నా చేతిని చాలా గట్టిగా పట్టు కున్నాడు. వెంటనే అతను

చిన్నగా నవ్వాడు. నా చెవిలో గుస గుసగా చెప్పసాగాడు. “చాలా మంచి కుటుంబం. అది బబూన్.”

డాక్టర్ పెంచు కుంటున్న వింత పెంపుడు జంతువుల గురించి నేను మరిచినట్టున్నాను. ఒక చిరుతపులి కూడా ఉంది. ఏ క్షణాన్నయినా అది వచ్చి భుజం మీద తడు తుందేమో! హెూమ్స్‌ని అనుసరిస్తూ, జోళ్లని వదిలి నెమ్మదిగా పడకగదిలోకి వెళ్లిన తరువాత నా మనసుకు కొంచెం ప్రశాంతత చిక్కింది. నా మిత్రుడు చప్పుడు రాకుండా కిటికీలను మూసేశాడు. దీపం తెచ్చి బల్లమీద పెట్టాడు. ఒకసారి గదిని పరికించాడు. అంతా పగలు చూచినట్టే ఉంది. అతను నా దగ్గరకు నెమ్మదిగా కదులుతూ వచ్చి, రెండు చేతులను నా చెవికి పెట్టి గుసగుసగా చెప్పాడు ఆ మాటలను నాకు అర్థమయినయి.

“ఏ కొంచెం చప్పుడయినా, మన పథకమంతా పాడవుతుంది.”

విన్నాను అని చెప్పడానికి నేను కేవలం తల ఆడించాను.

“దీపం లేకుండా కూచోవాలి. లేకుంటే వెంటిలేటర్ ద్వారా అతనికి వెలుగు కనిపిస్తుంది.”

నేను మళ్లీ తల ఆడించాను.

“నిద్రపోవద్దు. లేకుంటే ప్రాణంమీదకు వస్తుంది. పిస్తోలు సిద్ధంగా ఉంచుకో. అవసరమవుతుందేమో. నేను మంచం పక్కన ఉంటాను. నీవు ఈ కుర్చీలో కూర్చో.”

నేను నా రివాల్వర్‌ను తీసి బల్ల మూలమీద ఉంచాను.

హెూమ్స్ తనతో సన్నని పొడగాటి బెత్తం తెచ్చుకున్నాడు. దాన్ని తన పక్కనే మంచం మీద పెట్టాడు. ఒక అగ్గిపెట్టె కొవ్వొత్తి ముక్క ఆ పక్కనే పెట్టాడు. తరువాత అతను దీపం ఆర్పేశాడు. మేము చీకట్లో మిగిలాము.

మేము కాసిన కాపు నేనెలా మరిచిపోగలను? ఒక్క చడీ చప్పుడు

లేదు. శ్వాస చప్పుడూ లేదు. అయినా నా మిత్రుడు కొన్ని అడుగుల దూరంలో కళ్లు విప్పదీసుకుని కూచున్నాడని తెలుసు. నాలాగే అతనూ టెన్షన్‌లో ఉన్నాడని తెలుసు. కిటికీలో మూసినందుకు వెలుగు ఏ మాత్రం లోపలికి రావడం లేదు. అంటే మేము పూర్తి చీకటిలో ఉన్నాము. బయటి నుంచి పక్షుల అరుపులు అప్పుడప్పుడు వినబడుతున్నాయి. కిటికీ పక్కనుంచే పిల్లి కూతల లాంటివి వినపడుతున్నాయి. అంటే చిరుతపులి హాయిగా తిరుగుతున్నదని అర్థం. దూరంగా చర్చి గంటలు పావుగంటకు ఒకసారిగా వినపడుతున్నాయి. ఎన్ని పావు గంటలయినయి? పన్నెండు గంటలు కొట్టారు. ఒకటయింది. రెండు, మూడయింది. ఏం జరుగుతుందోనని చూస్తూ మేమలాగే వేచి ఉన్నాము.

ఒక్కసారిగా వెంటిలేటర్‌వేపు నుంచి కొంచెం వెలుగు కనిపించింది. వెంటనే ఆరిపోయింది. ఆ తరువాత నూనె కాలిన వాసనవచ్చింది. లోహం వేడెక్కిన వాసన కూడా. అంటే పక్క గదిలో ఎవరో ఒక లాంతరు ముట్టించారు. నెమ్మదిగా కదులుగున్న చప్పుడయింది. తరువాత మళ్లీ నిశ్శబ్దం. వాసనలు మాత్రం ఎక్కువవుతున్నాయి. అరగంటపాటు చెవులు రిక్కించి కూచున్నాను. తరువాత ఒక చప్పుడు వినిపించసాగింది. కెటిల్‌లోనుంచి నెమ్మదిగా ఆవిరి



బయటకు వస్తున్నట్టు ప్రశాంతమయిన చప్పుడది. ఆ చప్పుడు వినిపించగానే హోమ్స్ ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు. అగ్గిపుల్ల వెలిగించాడు. తన కర్రతో గంట తాడు మీద గట్టిగా కొట్టసాగాడు.

"చూచావా, వాట్సన్? చూచావా?" అతను గట్టిగా అరిచాడు.

నాకేమీ కనిపించలేదు. హెూమ్స్ దీపం వెలిగించినపుడు నాకు ఈలలాంటి చప్పుడు ఒకటి వినిపించింది. కానీ, ఒక్కసారిగా వెలుగు రావడంతో కదిలిపోయిన నేను అదేమిటో తెలుసుకోలేకపోయాను. ఈలోగా నా మిత్రుడు కొట్టసాగాడు. అతని ముఖం మాత్రం చాలా పాలిపోవడం కనిపించింది. అందులో భయం కూడా కనిపించింది.

"అతను కొట్టడం ఆపాడు. వెంటిలేటర్‌వేపు అదేపనిగా చూస్తున్నాడు. అంతలో ఒక్కసారిగా నిశ్శబ్దాన్ని చీలుస్తూ హృదయవిదారకమయిన కేక వినిపించింది. అది రానురాను పెద్దదయింది. భయము, కోపాలు నిండిన ఆ బొంగురు గొంతుక రాను రాను కీచుగా మారింది. దూరంగా చర్చిలోనూ, పక్క ఊరిలోనూ ఆ కేక కారణంగా పడుకున్నవారు నిద్ర లేచారని తరువాత చెప్పగా విన్నాను. దానివల్ల మా గుండెలు ఒక్కసారి చల్లబడ్డాయి. నేను హెూమ్స్‌వేపు కళ్లు విప్పుకుని చూస్తూ ఉండిపోయాను. అతనూ నా వేపు అలాగే చూస్తున్నాడు. చివరకు అంతా నిశ్శబ్దమయింది.

"అంటే ఏమిటి అర్థం?" నేను రొప్పుతూ అడిగాను.

"అంతా ముగిసిందని" హెూమ్స్ జవాబిచ్చాడు. "బహుశా నిజానికి అదే మంచిదేమో. నీ పిస్టల్ తీసుకో. డాక్టర్ రాయ్‌లాట్ గదిలోకి వెళదాము."

ముఖంలో వింతభావాలు కనపరుస్తూ అతను మళ్లీ దీపం వెలిగించాడు. కారిడార్‌లో పక్క గదికి దారితీశాడు. రెండుసార్లు తలుపు తట్టాడు. లోపలి నుంచి ఏ చప్పుడూ రాలేదు. అతను తలుపు తెరిచి లోపలికి ప్రవేశించాడు. చేతిలో పిస్టల్ ఎత్తి పట్టుకుని వెంట నేను వెళ్లాను.

మాకు కనిపించిన దృశ్యం మరెక్కడా చూచి ఎరుగనిది. బల్లమీద ఒక లాంతరు ఉంది. దాని షెటర్ సగం మాత్రమే తెరిచి ఉంది. వెలుగు నేరుగా ఇనుప బీరువా మీద పడుతున్నది. సేఫ్ తలుపు కొంచెంగా తీసి ఉంది.

బల్ల పక్కన కర్ర కుర్చీమీద డాక్టర్ గ్రిమ్స్బీ రాయ్‌లాట్ కూచుని ఉన్నాడు. అతను పొడుగాటి డ్రసింగ్ గౌన్‌లో ఉన్నాడు. పాదాలు కింద నుంచి నగ్నంగా కనపడుతున్నాయి. వాటికి టర్కిష్ స్లిప్పర్స్ ఉన్నాయి. అతని ఒడిలో సాయంత్రం మేము గమనించిన, పొడుగాటి కొరడా ఉంది. అతని తల ఎత్తి ఉంది. కళ్లు భయంతో పై కప్పులో దేన్నో చూస్తున్నాయి. అతని నుదుటి మీద పసుపుపచ్చని పట్టీ ఒకటి చుట్టి ఉంది. దానిమీద బ్రౌన్‌రంగు చుక్కలున్నాయి. పట్టీ తలచుట్టూ గట్టిగా కట్టినట్టుంది. మేము గదిలోకి వెళ్లినప్పుడు అతను కదలలేదు, చప్పుడు చేయలేదు.

"పట్టీ! చుక్కలపట్టీ!" హెూమ్స్ గుసగుసగా అన్నాడు.

నేను ఒక అడుగు ముందుకు వేశాను. ఆ క్షణంలోనే అతని తలపట్టీ కదలసాగింది. అది కొంచెం కదులుతుండగా వెనుక వెంట్రుకలలోనుంచి డైమండ్ ఆకారంలో ఒక తల కనిపించింది. గొంతు పెద్దదిగాఉంది. అది ఒక భయంకరమయిన పాము.



"దాన్ని స్వాంప్ ఆడర్ అంటారు." గట్టిగా అరిచాడు హోమ్స్. "భారతదేశంలోకెల్లా విషపూరితమయిన పాము అది. కరిచిన పది సెకండ్లలో అతను చనిపోయాడు. తలపెట్టిన ఘాతుకం తలకు చుట్టుకుంటుంది అంటారు. ఎవరు తవ్విన గోతిలో వాళ్లే పడతారు. మనం ఈ విషజంతువును దాని చోటికి పంపిద్దాము. ఆ తరువాత మిస్‌స్టోనర్‌ని సురక్షిత మయిన చోటికి చేరుద్దాము. తరువాత స్థానిక పోలీసులకు ఏం జరిగిందో తెలుస్తుంది" అన్నాడు హోమ్స్.

ఈ మాటలు అంటూ అతను మృతుని ఒడిలోనుంచి కొరడా వంటి తాడును లాగేశాడు. దాని చివరన ఉన్న ఉరి వంటి వలయాన్ని పాము మెడకు వేశాడు. దాన్ని లాగి చెయ్యి చాచి దూరంగా పట్టుకుని ఐరన్ సేఫ్‌లోకి వదిలాడు. వెంటనే దాని తలుపు మూసేశాడు.

డాక్టర్ గ్రిమ్స్ బీ రాయ్‌లాట్ ఆఫ్ స్టోక్ మోరాన్ మరణం గురించిన వాస్తవాలు నిజానికి ఇవి. ఆ వార్తను అప్పటికే భయపడిన ఆ అమ్మాయికి చెప్పి వివరించిన వైనమంతా చెప్పి కథను మరింత కొనసాగించడం అవసరం లేదు. మొత్తానికి ఆమెను ఆ ఉదయం రైల్లో హారోలో ఉన్న ఆమె పిన్ని ఇంటికి చేర్చాము. తరువాత విచారణ జరిగింది. భయంకరమయిన జంతువులు పెంచుకునే అలవాటున్న డాక్టర్ గారు కేవలం నిర్లక్ష్యం కారణంగా పెంపుడు జంతువు వల్లనే చనిపోయాడని తేల్చారు. కేసు గురించి నాకు అర్థంకాని మరికొన్ని సంగతులను, మరుసటినాడు మేము తిరుగు ప్రయాణంలో ఉండగా హోమ్స్ వివరించాడు.

"నేను పూర్తిగా తప్పుదారి పట్టాను. సమాచారం తగినంతగా లేకుండా కార్యకరణాలు చూడడంవల్ల ఎంత అపాయం ఉంటుందో దీనివల్ల అర్థమయింది. జిప్సీలు అక్కడ ఉండడం, పట్టీ అని ఒక మాటను ఆ అమ్మాయి వాడడం, నన్ను పక్కదారి పట్టించాయి. అగ్గిపుల్ల వెలుగులో ఆమె మసకగా చూచిన విషయాన్ని వర్ణిస్తూ పట్టి అన్నది. నేను తప్పుదారి పట్టాను. కానీ, ఆ

మనిషికి వచ్చిన ఆపద కిటికీలోనుంచి లేదా ద్వారంగుండా మాత్రం రాలేదని నిశ్చయ మయిన తరువాత నా ఆలోచనలు మరోవేపు మళ్లాయి. నేను ఇంతకుముందే నీతో అన్నట్టు నా ధ్యాసంతా వెంటిలేటర్ మీదకు, తాడు మీదకు మళ్లింది. ఆ తాడు చివరన గంట లేదని తెలిసింది. మంచాన్ని నేలకు బిగించి ఉంచారు. అంటే ఆ తాడు మంచంమీదకు ఒక వంతెనలాగ ఏర్పాటుచేశారని నాకు అర్థమయిపోయింది. వెంటనే పాము గురించి ఆలోచన మొదలయింది. డాక్టరు భారతదేశం నుంచి వింత జంతువులను తెప్పించేవాడని నాకు తెలుసుగనుక, నా ఆలోచన గట్టిపడింది. పడమటి దేశాలలో శిక్షణ పొందిన ఒక తెలివిగల మనిషికి, ఏ రసాయన పరీక్షకు అందని విషం గురించి ఆలోచన రావడంకూడా తోచింది. ఆ విషం క్షణాలలో పనిచేస్తుందన్నది మరొక ముఖ్యమయిన విషయం. పరిశోధించేవారు ఎంతో తెలివయినవారయితే తప్ప పాము కాటు వేసినచోట పడిన రెండు గుర్తులను గమనించలేరు. తరువాత నేను ఈల గురించి ఆలోచించాను. అతను పనిజరిగిన తరువాత పామును తిరిగి పిలవవలసి ఉంటుంది. పాలను ఆశగా చూపితే పాము తిరిగివచ్చేట్టు దానికి నేర్పించాడతను. సరయిన సమయం చూచి అతను పామును వెంటిలేటర్‌లోకి వదులుతాడు అది తాటిమీదుగా మంచాన్ని చేరుతుంది. అక్కడ మనిషిని అది కరవనీ, కరవక పోనీ, ప్రయత్నాలు జరుగుతుంటాయి. వారం రోజులపాటు ప్రయత్నిస్తే ఎప్పుడో ఒక్కసారి పని జరగకపోదు.

“నేను అతని గదిలోకి ప్రవేశించకముందే ఈ నిర్ణయాలకు వచ్చేశాను. అతని కుర్చీని బాగా పరిశీలించినమీదట దాని మీద ఎక్కి నిలబడే వాడని, వెంటిలేటర్‌ను అందుకోవడానికి అట్లా చేయడం అవసరమని గమనించాను. ఇనుప బీరువా, పాల సాసర్, తాటితో పేనిన కొరడా లాంటివన్నీ చూచిన తరువాత నా మనసులో మిగిలిన అనుమానాలన్నీ మాయమయినయి. లోహపు చప్పుడు అయిందని మిస్ స్టోనర్ చెప్పిందిగదా. ఆమె మారుటితండ్రి

పామును లోపల వేసి అలమార మూసినపుడు ఆ చప్పుడయింది. ఆ రకంగా నిర్ణయాలు చేసుకున్నాను. రుజువు చేయడానికి నేను వేసిన పథకం నీకు తెలిసిందే. పాము బుసకొట్టడం వినిపించింది. బహుశా నీవు కూడా విని ఉంటావు. నేను వెంటనే దీపం వెలిగించి దాని మీదకు దాడిచేశాను.”

“నీవు కొట్టడంతో అది మళ్లీ వెంటిలేటర్‌లోనుంచే వెనక్కు పోయింది. అంతేకాదు, అది యజమానిమీద పడి దాడి చేసింది కూడా. నాలుగు దెబ్బలు తగిలేసరికి అది రెచ్చిపోయింది. కనిపించిన మనిషి మీదికి దాడి చేసింది. అంటే డాక్టర్ రాయ్‌లాట్ మరణానికి పరోక్షంగా నేనే కారణమన్న మాట. అలాగని నాకేదో మనసులో బాధ కలుగుతుందని మాత్రం చెప్పలేను.”





9

# ఇంజనియర్ బొటనవేలు

నేను మిస్టర్ షెర్లక్ హెూమ్స్‌తో సన్నిహితంగా ఉన్న సంవత్సరాలలో అతని ముందుకు సమాధానాల కోసమని వచ్చిన సమస్యలలో రెండింటిని అతని దృష్టికి తెచ్చింది నేనే. అందులో ఒకటి మిస్టర్ హాదర్లీ బొటనవేలు వ్యవహారం. రెండవది కల్నల్ వార్‌బర్టన్ పిచ్చి గురించినది. అసలయిన పరిశీలకునికి ఈ రెండవ కేసు మంచి కార్యరంగంగా కనపడి ఉంటుంది. కానీ, మొదటి వ్యవహారం ఆరంభం నుంచి చాలా నాటకీయంగా సాగుతుంది. దాన్ని రికార్డుకు ఎక్కించడం ఎక్కువ అవసరమనిపించింది. నా మిత్రుడు విషయాలను కూపీలాగే పద్ధతిలో ఇక్కడ తక్కువగానే కష్టపడి ఉంటాడు. అయినాసరే, అద్భుతమయిన ఫలితాలను సాధించాడు. ఆ వ్యవహారం గురించి, పత్రికలలో చాలాసార్లు రాశారని నా నమ్మకం. అయినాసరే, అట్లా పత్రికలలో ఒక అరకాలంలో వ్యవహారాన్నంత కుదించిపెట్టినపుడు సంగతి అంత స్ఫుటంగా బయటికి తెలియదు. వాస్తవాలను మన కళ్లముందు వరుసగా పరుచుకునేట్టు చేస్తే, రహస్యం నెమ్మదిగా విడిపోతుంది. ఒక్కొక్క సంగతితో మనం అసలు సత్యంవేపు ఎక్కి కదులుతాము. ఆ సందర్భంలో పరిస్థితులు నన్ను బాగా ప్రభావితుడిని చేశాయి. కానీ రెండు సంవత్సరాల కాలంలో ప్రభావం తగ్గుతున్నట్టు ఉన్నది.

అది 89 సంవత్సరం వేసవి కాలం. నా పెళ్లి జరిగి చాలాకాలం కానేలేదు. ఇప్పుడు నేను వివరించబోయే సంఘటనలు అప్పుడే జరిగాయి. నేను సివిల్ ప్రాక్టీస్‌లోకి మళ్లీ దిగాను. హొమ్స్‌తో పాటు బేకర్ స్ట్రీట్‌లో ఉండడం లేదు. కానీ, తరుచుగా అక్కడికి వెళుతూ ఉండేవాడిని. అప్పుడప్పుడు అతని తన పద్ధతులు మార్చుకుని మా యింటికి రావాలని కూడా చెప్పేవాడిని. నా ప్రాక్టీస్ క్రమంగా పెరిగింది. నేను ఉండేది పాడింగ్టన్ స్టేషన్‌కు చాలా దగ్గరలో గనుక అక్కడి అధికారులలో నుంచి కొంతమంది చికిత్స కోసం నా దగ్గరకు వచ్చేవాళ్లు. అందులో ఒకాయనకు చాలాకాలంగా తగ్గని నొప్పి సమస్య ఉండేది. దాన్ని నేను తగ్గించాను. ఇక ఆయన నా శక్తియుక్తులను గురించి ప్రచారం చేస్తూ, తన ప్రభావానికి అందే ప్రతి రోగబాధితుడిని నా వద్దకు పంపుతుండేవాడు.

ఒకనాటి ఉదయం ఏడు గంటలు కాకముందే, మెయిడ్ వచ్చి తలుపు తట్టి నన్ను నిద్రలేపింది. పాడింగ్టన్ నుంచి ఇద్దరు మనుషులు వచ్చారని, నా కన్‌సల్టింగ్ రూమ్‌లో ఎదురుచూస్తున్నారని చెప్పింది. నేను త్వరత్వరగా దుస్తులు వేసుకున్నాను. రైల్వేనుంచి వచ్చే కేసులు ఎప్పుడూ అంత చిన్నవి కావని తెలుసుగనుక, వేగంగా కిందకు వెళ్లాను. మెట్లు దిగుతుండగా, నా పాత మిత్రుడయిన గార్డ్, గదిలోనుంచి బయటకు వచ్చాడు. తలుపును గట్టిగా మూశాడు.

"వాడిని తెచ్చాను. బాగానే ఉన్నాడు" చేతి బొటనవేలిని భుజం మీదుగా వెనుకకు చూపుతూ, గుసగుసగా చెప్పాడు.

"సంగతేమిటి?" నేను అడిగాను. అతని వాలకం చూస్తే, నా గదిలో బంధింపబడిన జీవి చాలా చిత్రమయినదని తోచింది.

"ఒక కొత్త పేషెంట్. అందుకే నేనే స్వయంగా వెంటపెట్టుకు వచ్చాను. లేకుంటే ఎక్కడికో జారిపోతాడు. ఇపుడతను భద్రంగా ఉన్నాడు. డాక్టర్‌గారూ, ఇక నేను వెళ్లాలి. నాకూ డ్యూటీలున్నాయి. మీలాగే" గుసగుసగా చెప్పాడతను.

నా నమ్మకం గల ఏజెంటు, కనీసం ధన్యవాదాలకు కూడా టైమ్ ఇవ్వకుండా, వెళ్ళిపోయాడు.

నేను నా కన్సల్టింగ్ రూమ్‌లోకి ప్రవేశించాను. బల్ల దగ్గర ఒక పెద్ద మనిషి కూచుని ఉండడం గమనించాను. అతను హెదర్ ట్వీడ్ సూట్ వేసుకున్నాడు. మెత్తని గుడ్డటోపీ తీసి నా పుస్తకాలమీద పెట్టాడు. అతని ఒక చేతిచుట్టూ జేబురుమాలు చుట్టి ఉంది. దాని మీద అక్కడక్కడా రక్తం మరకలు ఉన్నాయి. అతను యువకుడు. ఇరవయి అయిదు కన్నా మించి వయసు ఉండదు. మంచి ధృఢమయిన ముఖం కలవాడని చెప్పాలి. కానీ చాలా పాలిపోయి ఉన్నాడు. ఏదో పెద్ద కలవరంలో ఉన్న భావం కలిగించాడని నాకనిపించింది. అదుపు చేయడానికి వీలులేనంత అలజడిలో అతను ఉన్నట్టు తోచింది.

“ఇంత తొందరగా, మిమ్మల్ని లేపినందుకు క్షమించాలి, డాక్టర్. కానీ రాత్రి చాలా సీరియస్ ప్రమాదం జరిగింది. ఉదయం ట్రైన్‌లో వచ్చాను. పాడింగ్టన్‌లో దిగి దగ్గరలో డాక్టర్ ఎక్కడ దొరుకుతాడని అడిగాను. పెద్ద మనసు గల ఒకాయన నన్ను ఇక్కడిదాకా తెచ్చాడు. నేను మెయిడ్‌కు కార్ట్ ఇచ్చాను. కానీ, ఆవిడ దాన్ని ఇక్కడే పక్క బల్ల మీద పెట్టిందని చూడగలిగాను” అన్నాడు అతను.

నేను కార్డు చేతికి అందుకుని చూచాను. “మిస్టర్. విక్టర్ హేదర్లీ, హైడ్రాలిక్ ఇంజనియర్, 16 ఎ, విక్టోరియా స్ట్రీట్ (థర్డ్ ఫ్లోర్)” అవి ఉదయాననే వచ్చిన అతిథి యొక్క పేరు, వివరాలు. “వేచి ఉండవలసి వచ్చింది. మీరు క్షమించాలి.” అన్నాను నేను నా లైబ్రరీ కుర్చీలో కూర్చుంటూ. “మీరు రాత్రంతా ప్రయాణం చేసి వచ్చినట్టు తెలుస్తున్నది. అసలు అదే చికాకు వ్యవహారం” అన్నాను.

“ఓహ్, రాత్రి విసుగుగా ఉందని మాత్రం అనలేను” అంటూ అతను నవ్వసాగాడు. పెద్ద, కంచుకంఠంతో మనస్ఫూర్తిగా నవ్వుతూ, అతను కుర్చీలో

వెనక్కు వాలి కదిలిపోతున్నాడు. ఆ నవ్వుతో వైద్యుడిగా నా భావాలు కుదుపుకు గురయ్యాయి.

"ఆపండి! కొంచెం కుదురుగా ఉండండి!" గట్టిగా అన్నాను. కొంచెం మంచినీళ్లు పోసి అందించాను.

కానీ లాభం లేకపోయింది. అతను అదుపులేకుండా నవ్వుతున్నాడు. గొప్ప సమస్య తీరిపోయినపుడు కలిగిన ఊరటభావంతో నవ్వుతున్నాడు. కానీ అంతలోనే తమాయించుకున్నాడు. ముఖం మాత్రం ఇంకా పాలినట్టే ఉంది.

"నేను వెర్రిగా కనపడుతున్నట్టు ఉన్నాను" గుక్కపట్టి అన్నాడతను.



"అదేం లేదు. నీళ్లు తాగండి" అంటూ ఆ నీళ్లలోకి కొంచెం బ్రాండీ పోశాను. తాగుతున్న అతని ముఖంలోకి మళ్లీ  రంగులు రాసాగాయి.

"ఇది బాగుంది. ఇక డాక్టర్, మీరు నా బొటనవేలిని పట్టించుకోవాలి. కాదు, ఒకప్పుడు బొటనవేలు ఉన్న చోటును అనాలి" అన్నాడతను.

జేబురుమాలు తీసి అతను చేతిని ముందుకు చాచాడు. అంత అనుభవం గల నేను కూడా ఒక్కసారి కదిలిపోయాను.  నాలుగు వేళ్లు ఉన్నాయి. బొటనవేలు ఉండవలసిన చోట ఎర్రగా ఒక చిన్న ముద్ద మాత్రం ఉంది. ఆ వేలు మూలం నుంచి నరికినట్టుంది.

"గుడ్ హెవెన్స్! ఇది చాలా భయంకరమయిన గాయం. బాగా రక్తం పోయి ఉంటుంది" నేను గట్టిగా అన్నాను.

"అవును, పోయింది. అప్పుడు నేను మూర్ఛపోయాను కూడా. అట్లా చాలాసేపు పడి ఉన్నాను. తెలివి వచ్చిన తర్వాత కూడా రక్తం పోతూనే ఉన్నట్టు కనిపించింది. నా జేబురుమాలను మణికట్టుమీద గట్టిగా కట్టి ఒక కర్రపుల్లతో బాగా మెలితిప్పాను.

"ఎక్సలెంట్! మీరసలు సర్జన్ అయి ఉండవలసింది."

"హైడ్రాలిక్స్ సమస్య. అది మరి నా రంగం."

"చాలా పెద్దదీ, వాడిగల ఆయుధం కింద వేలు తెగింది" అన్నాను నేను గాయాన్ని పరిశీలిస్తూ.

"మాంసం చీల్చేలాంటి పెద్ద కత్తి" అన్నాడతను.

"ప్రమాదం అనుకుంటాను?"

"కానే కాదు."

"అవునా? హత్యాప్రయత్నమా?"

"అంతకంటే ఎక్కువే."

"మీరు నాకు భయం పుట్టిస్తున్నారు."

నేను గాయాన్ని తుడిచి, శుభ్రంచేసి డ్రస్ చేశాను. దానిమీద దూది వరుసలుగా పెట్టి బ్యాండేజెస్‌తో కట్టాను. అంతసేపూ అతను కదలకుండా పడుకున్నాడు. అపుడప్పుడు మాత్రం పెదవి కరచుకున్నాడు.

"ఎలాగుంది?" పని ముగిసిన తరువాత అడిగాను.

"భలే! మీ బ్రాండీ ఇక మీ బ్యాండేజ్ రెంటి మధ్యన నేను మళ్లీ కొత్త మనిషిని అయ్యాను. చాలా బలహీనంగా ఉండేది. చాలానే కష్టపడ్డాను."

"మీరు సంగతి గురించి మాట్లాడకుంటేనే మేలు. దాని ప్రభావం బాగా కనపడుతున్నది."

"ఓహ్, ఇప్పుడేమీ లేదు. నా కథనంతా పోలీసులకు వెళ్లి చెప్పాలి. మన మధ్య చెపుతున్నాను, ఈ గాయమే గనక లేకుంటే, నా మాటలు ఎవరూ నమ్మకున్నా ఆశ్చర్యం లేదు. అంతా అసాధారణంగా జరిగింది. నేను అందించగల సాక్ష్యాలు కూడా లేవు. ఒకవేళ వాళ్లు నమ్మినా సరే, నేనిచ్చే సాక్ష్యాలు నిజంగా న్యాయందాకా చేర్చే నమ్మకం లేదు."

"హా! సమస్యకు సమాధానం కనుగొనాలని మీరు అనుకుంటున్న పక్షంలో, నా మిత్రుడు, మిస్టర్ షెర్లక్ హొమ్స్ దగ్గరకు వెళ్లమని నేను గట్టిగా చెపుతున్నాను. అదీ పోలీసులకు వెళ్లి చెప్పక ముందే" గట్టిగా చెప్పాను.

'ఓహ్, ఆ మనిషి గురించి విన్నాను. నా వ్యవహారాన్ని ఆయన పట్టించు కుంటానంటే, అంతకంటే సంతోషం లేదు. అయినా, పోలీసులకు కూడా చెప్పాలి. మీరు ఆయన పరిచయభాగ్యం కలిగించగలరా?"

"అంతకంటే ఎక్కువే చేస్తాను. నేనే మిమ్మల్ని స్వయంగా తీసుకు పోతాను."

"మీకు నేను రుణపడి ఉంటాను."

"ఒక బండి పిలుద్దాం. ఇద్దరమూ వెళదాం. అతనితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ తినడానికి సకాలానికి వెళదాం. మీకు సమ్మతమేనా?"

"తప్పకుండా. నా కథ చెప్పేవరకూ మనసుకు ఊరట ఉండదు."

"అయితే, మా మనిషి బండిని పిలుస్తాడు. నేను కూడా వెంటనే వచ్చేస్తాను" అంటూ నేను పై అంతస్తులోకి వెళ్లాను. మా ఆవిడకు క్లుప్తంగా సంగతి చెప్పాను. అయిదు నిమిషాల్లో హాన్సన్ బండి వచ్చింది. కొత్త పరిచయస్తునితో బేకర్ స్ట్రీట్‌కి బయలుదేరాం.

నేను అనుకున్నట్టే, షెర్లక్ హోమ్స్ డ్రస్సింగ్ గౌన్‌లో తన గదిలో అటు ఇటూ తిరుగుతున్నాడు. మామూలుగా పైప్ కాలుస్తూ, ద టైమ్స్ పత్రికలోని ఆగోని కాలమ్ చదువుతున్నాడు. పైప్‌మీద పాత మరకల మిగుళ్లను జాగ్రత్తగా గీకి మ్యాంటెల్‌పీస్ మీద ఉంచాడు. తన సహజమయిన మిత్ర ధోరణితో మమ్మల్ని స్వాగతించాడు. మాకోసం కూడా తిండి తెప్పించి తానూ కలిసి కూచున్నాడు. తిండి ముగిసిన తరువాత, నూతన పరిచయస్తుడిని సోఫాలో పడుకోబెట్టాడు. తలకింద తలగడ ఉంచాడు. బ్రాండీ కలిపిన నీటిని ఒక గ్లాసులో అందుబాటులో ఏర్పాటుచేశాడు.

"నీ అనుభవం మామూలు రకం కాదని సులభంగానే చూడ గలుగుతున్నాను, మిస్టర్ హాదర్లీ. అనుమానం లేకుండా హాయిగా పడుకోండి. చెప్ప గలిగింది చెప్పండి. అలసట కలిగితే మాత్రం నిస్సందేహంగా ఆగి, కాస్త సాయం పుచ్చుకోండి" అన్నాడతను.



"థాంక్యూ. డాక్టర్ నాకు కట్లు కట్టిన తరువాత మరో

మనిషినన్న భావన కలుగుతున్నది. మీరిచ్చిన బ్రేక్‌ఫాస్ట్‌తో చికిత్స పూర్తయింది. నేను వీలయినంత తక్కువ టైమ్ తీసుకుంటాను. నా విచిత్రమయిన అనుభవం గురించి ఆలస్యం లేకుండా చెపుతాను" అన్నాడు నా పేషెంట్.

హోమ్స్ తన పెద్ద వాలుకుర్చీలో కూచున్నాడు. బరువుగా, అలసటగా వాలిన కళ్లు అతని తీరును చెపుతున్నాయి. నేను అతని ఎదురుగా కూచున్నాను. మా మిత్రుడు వివరంగా చెప్పిన విచిత్రమయిన కథను నిశ్శబ్దంగా విన్నాము.

"నేను ఒక అనాథను, బ్రహ్మచారినని మీకు తెలియవలసి ఉంది. లండన్‌లో నేను ఒంటరిగా ఉంటున్నాను. వృత్తి ప్రకారం హైడ్రాలిక్ ఇంజనీయర్‌ని. ఏడు సంవత్సరాల కాలంలో మంచి అనుభవం గడించాను. గ్రీన్‌విచ్‌లో ప్రసిద్ధ కంపెనీ, విన్నర్ అండ్ మాతెస్సన్ వారు నన్ను అప్రెంటిస్‌గా నియమించారు. రెండు సంవత్సరాల క్రితం, ఉద్యోగ కారణంగాను, నాన్న పోవడం కారణంగానూ, కొంత డబ్బు నా చేతికి అందింది. స్వంత వ్యాపారం చేసుకోవాలని నిర్ణయించి విక్టోరియా స్ట్రీట్‌లో ఒక ఆఫీసు పెట్టుకున్నాను.

"ఎవరికయినా, వ్యాపారంలో మొదటి అనుభవం కొంచెం కష్టంగానే ఉంటుందని అనుకుంటాను. నా విషయంలో అది మరింత కష్టంగా ఉంది. రెండు సంవత్సరాలలోనూ నా దగ్గరికి ముగ్గురు మాత్రమే వచ్చారు. ఒకసారి మాత్రమే పని అందింది. నా వృత్తి అట్లా సాగిందన్నమాట. మొత్తం సంపాదనంతా కలిసి, ఇరవయి ఏడు పౌండ్లు పది షిల్లింగ్‌లు. ప్రతి నిత్యం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు దాకా, నా స్థలంలో వేచి ఉంటాను. చివరికి హృదయం కుంగిపోతుంది. నా ప్రాక్టీస్ ఇక జరగదు అనిపిస్తుంది.

"అయితే నిన్న మాత్రం, ఆఫీసు వదిలి పోదామనుకుంటుండగా, నా క్లర్క్ వచ్చి ఒక పెద్దమనిషి వచ్చినట్టు చెప్పాడు. వ్యాపారం విషయంగా నన్ను చూస్తానంటున్నాడని కూడా చెప్పాడు. ఒక కార్డు కూడా తెచ్చాడు.

దాని మీద కల్నల్ లైసండర్ స్టార్క్ అని ముద్రించి ఉంది. వెంటనే కల్నల్ స్వయంగా వచ్చేశాడు. ఆ మనిషి ఎక్కువ ఎత్తరి కాదు, పైగా మరీ పీలగా ఉన్నాడు. అంత బక్కపలచని మనిషిని నేనెప్పుడూ చూచిన గుర్తు లేదు. ముఖంలో ముక్కు, గడ్డం మరీ కోసుగా ఉన్నాయి. చంపల మీద చర్మం ఎముకల మీద బిగదీసినట్టుంది. అయినాసరే, అతనిలో రోగ లక్షణాలు మాత్రం కనిపించలేదు. చలాకీగా ఉన్నాడు. నడక, తీరు బాగున్నాయి. చాలా మామూలు దుస్తులు వేసుకున్నాడు. కానీ అవి నీట్‌గా ఉన్నాయి. అతని వయసు నలభయి ప్రాంతాలలో ఉంటుందనాలి.

" 'మిస్టర్ హాదర్లీ, నీ గురించి నాకెవరో చెప్పారు. వృత్తిలో మంచి నైపుణ్యం ఉందనేకాక, రహస్యాలను దాచడంలో కూడా గట్టివాడివి అన్నారు.' అన్నాడతను కొంచెం జెర్మన్ యాసతో.



"అంత గౌరవంగా మాట్లాడితే యువ కులకు ఎవరికయినా కలిగే సంతోషంతో నేనూ మాట్లాడాను. 'ఇంతకూ నా గురించి అంత మంచి మాటలు చెప్పినవారెవరో అడగవచ్చా?' అన్నాను.

" 'ఈ సమయంలో ఆ సంగతి చెప్ప కుంటేనే మంచిది. పైగా మీరు ఎవరూ లేని వారని, పెళ్లి కాలేదని, లండన్‌లో ఒంటరిగా ఉంటున్నారు అని తెలిసింది' అన్నాడు ఆయన.

" 'నిజమేనండి' అని నేను బదులిచ్చాను. 'అయితే, ఈ విషయాలకు, నా వృత్తికీ మధ్యన సంబంధమేమిటో తెలియడం లేదు. మీరు నాతో మాట్లాడదలచుకున్నది పని గురించే అనుకుంటాను' అని కూడా అన్నాను.



“ ‘అనుమానమే లేదు. కానీ, నేను చెప్పినదంతా విషయానికి సంబంధించినదే. నేను మీకు పని ఇవ్వబోతున్నాను. కానీ వ్యవహార మంతా అతి రహస్యంగా జరగాలి. నిజంగా రహస్యమని మీరు అర్థం చేసుకోవాలి. ఒంటరిగా ఉన్న మనిషికి తప్ప, కుటుంబజీవికి అంత రహస్యం వీలుకాదని నేను అనుకుంటాను.

“ ‘రహస్యాన్ని రహస్యంగానే ఉంచుతాను. ఆ విషయంలో నన్ను మీరు నమ్మవచ్చు’ అన్నాను నేను.

“నేను మాట్లాడుతుండగా ఆయన నావేపు తీవ్రంగా చూచాడు. అంత అనుమానం గానూ, ప్రశ్నార్థకంగానూ, నన్ను చూచిన వారు లేరు.

“ ‘ మాట ఇస్తారా, అయితే?’ అన్నాడాయన చివరకు.

“ ‘మాట ఇస్తాను.’

“ ‘పనికి ముందు, జరుగు తున్నప్పుడు, తరువాత అసలయిన నిశ్శబ్దం? సంగతి గురించి మాట్లాడ కూడదు, రాయకూడదు?’

“ ‘నేనిప్పటికే మాట ఇచ్చాను.’

“ ‘వెరీగుడ్. ఆయన ఒక్కసారిగా లేచాడు. బాణంలా దూసుకువెళ్లి తలుపు తెరిచాడు. కానీ, బయట అంతా ఖాళీగా ఉంది.

“ ‘అయితే సరే, యజమానుల వ్యవహారాలను గురించి క్లర్కులు చూపించే ఆసక్తి నాకు తెలుసు. ఇపుడు మనం క్షేమంగా మాట్లాడుకోవచ్చు’

ఆయన ఒక కుర్చీ నాకు దగ్గరగా లాక్కున్నాడు. మళ్లీ నావేపు అనుమానంగానూ, ఆలోచనతోనూ, చూడసాగాడు.

"ఆ మాంసంలేని మనిషిలోని వింత నడవడి కారణంగా, నా లోపల ఒక అయిష్టత, లేదా భయంలాంటి భావం మొదలయింది. పని అవకాశం పోతున్నదన్నది కూడా తెలియనంతగా ఓపిక నశించింది.

" 'సర్, ముందు మీ వ్యాపార విషయం చెప్పండి. నాకు చాలా పని ఉంది' నా చివరి మాట అన్నందుకు దేవతలు నన్ను క్షమించాలి. అను కోకుండా, ఆ మాటలు నా నోట వచ్చాయి.

" 'ఒక రాత్రి పనికి యాభయి గినీలు అందుతాయంటే, ఎలా గుంటుంది?' ఆయన అడిగాడు.

" ' చాలా బాగుంటుంది.'

" 'ఒక్క రాత్రి అంటున్నాను. నిజానికి ఒక గంటలో పని ముగుస్తుంది. పాడయిన ఒక హైడ్రాలిక్ స్టాంపింగ్ యంత్రం గురించి మీ అభిప్రాయం చెప్పాలి. అందులోని లోపం చెప్తే, మేమే బాగుచేసుకుంటాము. ఏమంటావు?'

" 'పని చాలా తేలిక. చెల్లింపు మాత్రం ఉదారం.'

" 'సరిగా చెప్పావు. ఈ రాత్రే చివరి ట్రైన్‌కి రావాలి.'

" 'ఎక్కడికి?'

" 'ఐఫోర్డ్, బర్క్‌షైర్‌లో. ఆక్స్‌ఫర్డ్ షైర్‌కు దగ్గరలో ఉంటుంది. రీడింగ్ నుంచి ఏడు మైళ్లు. పాడింగ్టన్ నుంచి 11:15కు ఒక రైలు బయలు దేరుతుంది.'

" ' సరే. '

" 'నేను బండిలో వచ్చి కలుస్తాను.'

“ ‘అంటే కొంతదూరం బండిలో వెళ్లాలన్నమాట!’

“ ‘అవును. మా స్థావరం ప్రశాంతమయిన పల్లె వాతావరణంలో ఉంది. ఐఫోర్డ్ స్టేషన్ నుంచి ఏడు మైళ్ల దూరం.’

“ ‘అంటే చేరేసరికి మధ్యరాత్రి అవుతుంది. తిరిగిరావడానికి ట్రైన్ ఉండదు. రాత్రికి అక్కడే ఉండక తప్పదు.’

“ ‘అవును. ఏర్పాట్లు మేం చూస్తాం.’

“ ‘ఇదేం బాగులేదు. అనుకూలంగా ఉండే సమయంలో రావడానికి కుదరదా?’

“ ‘సమయం గురించి మేము నిర్ణయించాం. అనుకూలంగా ఉండదు కనుకనే, అంత ఇస్తాము అన్నాం. ముక్కూ మొహం తెలియని మనిషివి. అంత డబ్బు పోస్తే, మీ రంగంలో అందరికన్నా గొప్ప ఎక్స్‌పర్ట్‌ను పిలవవచ్చు. ఇప్పటికయినా మించింది లేదు. ఇష్టం లేకుంటే, చెప్పవచ్చు.’

“నేను 50 గినీల గురించి ఆలోచించాను. అవి నాకు అవసరం. ‘మరేం ఫరవాలేదు. మీ యిష్టం వచ్చినట్టే చేస్తాను. అయితే, నేను చేయ వలసింది ఏమిటో మరింత అర్థమయితే బాగుంటుంది’ అన్నాను.

“ ‘సరే. రహస్యం అంటూ ప్రమాణాలు చేయించినందుకు అట్లాగని పించడం సహజమే. వివరం చెప్పకుండానే, నీతో ఏ పనీ చేయించను. మాట ఎవరూ వినడం లేదని నమ్మకమేనా?’

“ ‘సంపూర్తిగా.’

“ ‘అసలు సంగతి. ఫుల్లర్స్-అర్త్ అనేది విలువయిన పదార్థమని తెలిసే ఉంటుంది. మొత్తం ఇంగ్లండ్‌లో అది ఒకటి రెండు చోట్ల మాత్రమే దొరుకుతుంది.’

“ ‘విన్నాను.’

“ ‘కొంతకాలం క్రితం నేనొక చిన్న జాగా కొన్నాను. రీడింగ్‌కు పది మైళ్ల దూరంలో చిన్న పొలం. నా పొలంలోనే ఫుల్లర్స్-అర్త్ నిక్షేపాలు ఉన్నాయని తెలిసింది. పరీక్షిస్తే, ఉన్నది చాలా తక్కువ అని తెలిసింది. నా పొలానికి అటుపక్కన ఇటుపక్కనా ఉన్న పెద్ద నిక్షేపాలను కలిపే మార్గం మాత్రమే అది. ఆ రెండు పక్కల పొలాలవారికీ వారి నేలలో బంగారు గని ఉన్నదని ఎంతమాత్రం తెలియదు. ఆ సంగతి, అసలు విలువ తెలిసేలోగానే నేనా పొలాను, సహజంగానే కొనాలని నా ఆశ. కానీ అందుకు తగినంత పెట్టుబడి నా దగ్గర లేదు. కొంతమంది మిత్రులకు రహస్యం చెప్పాను. మరొకరికి తెలియకుండా పక్క భూముల్లోని నిక్షేపాల్ని తవ్వి తీసుకోవాలని, వచ్చిన డబ్బులతో ఆ పొలాలను కొనవచ్చునని వాళ్లు సలహా చెప్పారు. మేము కొంతకాలంగా అదే పనిచేస్తున్నాము. మా పనిలో భాగంగా ఒక హైడ్రాలిక్ ప్రెస్ పెట్టాము. అది పాడయిందని ఇంతకుముందే చెప్పాను. దాన్ని గురించి మీ సలహా కావాలి. మేము రహస్యాన్ని జాగ్రత్తగా కాపాడుతున్నాము. మా చిన్నఇంట్లోకి హైడ్రాలిక్ ఇంజనీయర్లు వచ్చిపోతున్నట్టు తెలిస్తే అందరూ ప్రశ్నలు అడుగుతారు. నిజం బయటపడితే, మా పథకం అంతా తలకిందులవుతుంది. అందుకే నేను విషయం గురించి, మరొక మనిషికి చెప్పనని నీ చేతి శపథం చేయించాను. అంతా వివరంగా చెప్పానా?’

“ ‘నాకు అర్థమయింది. అయితే, ఫుల్లర్స్-అర్త్ తీయడంలో హైడ్రాలిక్ ప్రెస్ అవసరం ఏమిటో తెలియలేదు. ఆ పదార్థాన్ని మట్టిలాగా తోడతారనుకుంటాను’ అన్నాను నేను.

“ ‘ఆ! మా పద్ధతి మాకు ఉంది. మేము ఆ మట్టిని ఇటుకలుగా అదుముతున్నాము. అవేమిటో తెలియకుండా రవాణా చేయడానికి వీలవుతుంది. అవన్నీ వివరాలు. ఉన్నదంతా నీకు చెప్పనే చెప్పాను. మిస్టర్ హాదర్లీ, నేను నిన్ను ఎంతగా నమ్ముతున్నానో తెలిసే ఉంటుంది. రాత్రి 11:15కు కలుద్దాం’ మాట్లాడుతూనే ఆయన లేచి నిలబడ్డాడు.

“ ‘తప్పకుండా వస్తాను.’

“ ‘మరో ప్రాణికి తెలియకూడదు.’ అతను మళ్లీ నా వేపు ప్రశ్నార్థకంగా తేరిపార చూచాడు. చల్లని తన చేతితో నా చేతిని నొక్కాడు. గదిలో నుంచి వేగంగా వెళిపోయాడు.

“ఇక, ఆ సంగతులను గురించి మరోసారి ఆలోచిస్తే, మీరను కుంటున్నట్టే నాకు చాలా ఆశ్చర్యంగా తోచింది. పని దొరికినందుకు నాకు ఒకవేపు సంతోషంగా ఉంది. నేను అడగదలచుకున్నదానికి పది రెట్లు అందుతున్నది. ఈ ఆర్డర్ తరువాత, మరిన్ని ఆర్డర్లు రావచ్చు. పైగా, వచ్చిన పెద్దమనిషి తీరు నాకు అంతగా నచ్చలేదు. ఫుల్లర్స్-అర్త్ గురించి, అక్కడ నా అవసరం గురించి, అతను చెప్పిన వివరాలు అంత నిజం కావనిపించింది. అందులో రహస్యం ఏమిటో అర్థం కాలేదు. అయినా, భయమంతా గాలికి వదిలేశాను. మంచి భోజనం చేశాను. పాడింగ్టన్‌కు వెళ్లి ప్రయాణం ప్రారంభించాను.

“రీడింగ్‌లో రైలేకాదు స్టేషనే మారవలసి వచ్చింది. అయినా, ఐఫోర్డ్ వెళ్లే చివరి ట్రైన్ అందింది. ఆ మసక చీకటి స్టేషన్‌కు 11 తరవాత చేరగలిగాను. అక్కడ దిగింది నేను ఒక్కడినే. ప్లాట్‌ఫామ్ మీద దీపం పట్టుకుని కునుకుతున్న పోర్టర్ తప్ప మరెవ్వరూ లేరు. గేటులోనుంచి బయటకు వస్తుంటే, ఉదయంవచ్చిన మనిషి, ఒక నీడలో నిలబడి ఉండడం కని పించింది. మాట్లాడకుండా అతను నా చేయి పట్టుకుని వేగంగా బండి వద్దకు లాక్కుపోయాడు. దాని తలుపు సిద్ధంగా తెరిచి ఉంది. అతను కిటికీలు మూసేశాడు. గోడమీద తట్టాడు. గుర్రం వీలయినంత వేగంగా పరుగు మొదలుపెట్టింది.”

“ఒకే గుర్రం?” హోమ్స్ అడ్డు తగిలాడు.

“అవును, ఒకటే”

“రంగు గమనించారా?”

"అవును. బండిలోకి ఎక్కుతూ, పక్కదీపం వెలుగులో చూచాను. చెస్ట్‌నట్ రంగులో ఉంది."

"అలసి ఉందా? హుషారుగా ఉందా?"

"ఓహ్, మెరిసిపోతూ ఉంది."

"థాంక్యూ. అడ్డు వచ్చినందుకు క్షమించండి. ఆసక్తికరమయిన మీ కథనాన్ని కొనసాగించండి."

"బయలుదేరాము. కనీసం ఒక గంటపాటు పయనించాము. కల్నల్ లైసండర్ స్టార్క్, ఏడు మైళ్లు అన్నాడు కానీ, మేము వెళుతున్న వేగాన్ని బట్టీ, వెళ్లిన దూరాన్ని బట్టీ, కనీసం 12 మైళ్లు ఉంటుందని అనుకోవాలి. అంతసేపూ ఆయన నా పక్కన నిశ్శబ్దంగా కూచున్నాడు. ఒకటి రెండు సార్లు, నేను ఆయన వేపు చూస్తే, ఆయన మాత్రం నా వేపే తీవ్రంగా చూస్తున్నట్టు తెలిసింది. పల్లె దారులు అంతబాగుండలేదు. మేము చాలా కుదుపులకు గురయ్యాము. కిటికీలోనుంచి చూచి ఎక్కడున్నదీ తెలుసుకునే ప్రయత్నం చేశాను. కానీ, ఆ అద్దాలు బయటకు కనిపించే రకం కాదు. పక్కన ఏదో వెలుగు కనిపిస్తే తప్ప ఏమీ తెలియడం లేదు. ప్రయాణం గురించి అప్పుడో ఇప్పుడో ఒక మాట అనే ప్రయత్నం చేశాను. కల్నల్ కేవలం మూలుగులతోనే జవాబిచ్చాడు. మాటలు కుదరలేదు. కొంతకాలానికి, కుదుపులు పోయి కంకరదారి మీద బండి నడవసాగింది. అది ఆగింది కూడా. కల్నల్ లైసండర్ స్టార్క్ దూకి దిగాడు. నేనూ దిగాను. ఎదురుగా ఉన్న ఒక పోర్చ్‌లోకి ఆయన నన్ను లాక్కు వెళ్లాడు. మేము బండిలోనుంచి నేరుగా హాలులోకి దూకి నట్టుంది. ఇంటిముందు ఉన్న వివరాలేవీ మేము చూడలేకపోయాము. లోపలికి వచ్చిన మరుక్షణం ద్వారం బరువుగా మూసుకున్నది. బండి వెళ్లిపోయిన చప్పుడు లీలామాత్రంగా వినిపించింది.

"ఇంట్లో చిమ్మచీకటిగా ఉంది. కల్నల్ పళ్లు బిగబెట్టి గొణుగుతూ, అగ్గిపెట్టె కోసం తడిమాడు. ఉన్నట్టుండి నడవ చివరన మరొక తలుపు

తెరుచుకున్నది. పొడుగాటి, బంగారురంగు వెలుతురు మా వేపు పరుచుకున్నది. అది రాను రాను వెడల్పయింది. చేతిలో దీపంతో ఒక స్త్రీ అక్కడ కనిపించింది. దీపాన్ని తలకన్నా పైకి ఎత్తి ఆమె ముందుకు ఒంగి మా వేపు చూచింది. ఆమె అందంగా ఉందని గమనించగలిగాను. గుడ్డల మీద పడ్డ వెలుగు కారణంగా, దుస్తులు చాలా వెలగలవని కూడా అర్థమయింది. ఆమె తెలియని ఒక భాషలో అన్న మాటలు ప్రశ్నలా ఉన్నాయి. నా సహచరుడు మొరటుగా ఒక్క ముక్కతో జవాబిచ్చాడు. దానితో ఆమె ఉలిక్కిపడింది. దీపం ఇంచుమించు చేయి జారినంత పనయింది. కల్నల్ స్టార్క్ ఆమె వద్దకు వెళ్లాడు. చెవిలో గుసగుసగా ఏదో చెప్పి, ఆమెను తిరిగి గదిలోకి తోశాడు. చేతిలో దీపంతో నా దగ్గరకు వచ్చాడు.

" 'బహుశా తమరు, కొన్ని నిమిషాలపాటు, దయచేసి ఈ గదిలోనే వేచి ఉండాలి' అంటూ ఆయన మరొక తలుపు తెరిచాడు. ఆ గది చిన్నది. మధ్యలో ఒక గుండ్రని బల్ల ఉన్నది. దాని మీద కొన్ని జెర్మన్ పుస్తకాలు పడి ఉన్నాయి. తలుపు పక్కనున్న ఒక హార్మోనియం మీద కల్నల్ స్టార్క్ దీపాన్ని పెట్టాడు. 'ఇక ఒక క్షణం కూడా వేచి ఉండనవసరం లేదు' అన్నాడతను. చీకటిలోకి మాయమయ్యాడు.

"బల్లమీది పుస్తకాలను నేను గమనించాను. నాకు జెర్మన్ రాదుగాని, వాటిలో రెండు సైన్స్ పుస్తకాలని, మిగతావి కవితల పుస్తకాలని చూడ గలిగాను. నేను బయటి వాతావరణం కనపడుతుందనుకుని కిటికీ దాకా నడిచాను. కానీ, దానికి చెక్క తలుపులు గట్టిగా బిగించి ఉన్నాయి. ఆ ఇల్లు ఆశ్చర్యకరంగా, నిశ్శబ్దంగా ఉంది. నడవలో ఎక్కడో ఒక పాత గడియారం గట్టిగా టిక్కుటిక్కు మంటున్నది. మిగతా అంతా భయం కరమయిన నిశ్శబ్దం. నాలోపల చెప్పలేని భావాలు మొదలయ్యాయి. ఎవరు ఈ జెర్మన్లు, ఈ మారుమూల ప్రాంతాన ఏం చేస్తున్నారు? ఇంతకూ ఈ స్థలం ఎక్కడ ఉంది? నేను ఐఫోర్డ్ నుంచి పది మైళ్ల దూరంలో ఉన్నానని తెలుసు. అది

ఏ దిక్కున అనేది మాత్రం తెలియదు. నిజానికి, రీడింగ్ మొదలయిన మరికొన్ని నగరాలు ఇంచుమించు అంతే దూరంలో ఉన్నాయి. అంటే, ఈ చోటు మరీ అంత మారుమూల కాదని అర్థం. కానీ, ఆ ప్రశాంతతను చూస్తే, పల్లె ప్రాంతమని మాత్రం తెలిసిపోతున్నది. నేను గదిలో కూనిరాగాలు తీస్తూ, అటు ఇటు తిరిగాను. 50 గినీలు దొరకుతున్నాయి గనుక కొంచెం ఓపికగా ఉండాలని ప్రయత్నం.

"అంతటి నిశ్శబ్దంలోనూ ఎటువంటి సూచన లేకుండా, ఒక్కసారిగా గది తలుపు నెమ్మదిగా తెరుచుకున్నది. అక్కడ ఆ స్త్రీ నిలబడి ఉన్నది. వెనుక చీకటి ఉంది. నా పక్కన ఉన్న దీపం వెలుతురు, ఆమె అందమయిన ముఖం మీద పడుతున్నది. ఆమె భయంతో, విలవిలలాడుతున్నదని చూడగలిగాను. నాకు భయం మొదలయింది. నిశ్శబ్దంగా ఉండమని సూచిస్తు, ఆమె వేలితో సైగ చేసింది. వచ్చిరాని ఇంగ్లీషులో నాలుగు మాటలు గుస గుసగా అన్నది. బెదిరిన గుర్రం లాగా ఆమె వెనుకనున్న చీకట్లోకి చూస్తున్నది.



" 'నేను వెళ్లాలి. వెళ్లాలి. నేను ఇక్కడ ఉండకూడదు. ఇక్కడ నీవు చేయగలిగింది ఏమీ లేదు' ప్రశాంతంగా మాట్లాడడానికి ప్రయత్నిస్తూ ఆమె అన్నట్టు నాకు తోచింది.

" 'కానీ, మేడమ్, వచ్చిన పని నేను చేయనేలేదు. మెషీన్‌ను చూచిన దాకా నేను బహుశా వెళ్లిపోలేను' అన్నాను నేను.

" 'వేచి ఉండడం మంచిది కాదు. తలుపులోనుంచి వెళ్లిపో.

ఎవరూ అడ్డురారు' అమె చెపుతూ పోయింది. ఆ తరువాత నేను చిరునవ్వి, తలూపడం గమనించింది. తనలోని జంకును విడిచి ఒక అడుగు ముందుకు వేసింది. తన రెండుచేతులూ నులుముకుంటున్నది. 'దేవుడి పేరున, ఆలస్యంకాక ముందే, ఇక్కడి నుంచి వెళ్లిపో!' ఆమె గుసగుసగా చెప్పింది.

"నేను కొంచెం మొండిస్వభావం మనిషిని. దారికి ఏదయినా అడ్డం వస్తే, పట్టుదల మరింత పెరుగుతుంది. నేను 50 గినీల గురించి ఆలోచించ సాగాను. ప్రయాణం గురించి, అనుకూలంగాలేని రాత్రి అనుభవం గురించి, ఆలోచించాను. ఇదంతా ఊరికే పోవాలా? పని పూర్తికాకుండా ఎందుకు పారిపోవాలి? అదీ డబ్బు లేకుండా! ఎవరికి తెలుసు, ఈ అమ్మాయి పిచ్చిదేమో? ఆమె నడవడితో నాకు భయం కలిగినా సరే, నేను మాత్రం కదలదలచుకోలేదు. ఉన్న చోటునే ఉండిపోయాను. ఆమె మళ్లీ నన్ను ఒప్పించడానికి నోరు తెరిచేలోగా, ఒక తలుపు వేసిన చప్పుడయింది. మెట్ల మీది నుంచి ఎవరో దిగుతున్న చప్పుడయింది. ఆమె ఒక్కక్షణం విన్నది. నిస్సహాయంగా చేతులను విసిరి వచ్చినంత నిశ్శబ్దంగానూ మాయమయింది.

"కల్నల్ లైసండర్ స్టార్క్, తనతో మరొక మరకల గడ్డం, పొట్టి మనిషిని తీసుకుని వచ్చాడు. మిస్టర్ ఫెర్గ్యూసన్ అంటూ పరిచయం చేశాడు.

" 'ఈయన నా సెక్రెటరీ, మేనేజర్ కూడాను. పోతే, ఈ తలుపు వేసిన చప్పుడు వినిపించినట్టుంది? నీకు గాలి తగలలేదా?' అన్నాడు కల్నల్.

" 'లేదు, మరీ ఊపిరి సలపకుంటే, నేనే తలుపు తెరిచాను' అన్నాను నేను.

"ఆయన నావేపు అనుమానపు చూపు పడేశాడు. 'ఇక మనం పనిలోకి దిగితే బాగుంటుంది. మేమిద్దరమూ నిన్న యంత్రం దగ్గరికి తీసుకుపోతాం' అన్నాడు అతను.

" 'బహుశా నేను హాట్ పెట్టుకోవాలేమో? '

“ ‘అవసరం లేదు. మెషీన్ ఇంట్లోనే ఉంది.’

“ ‘ఏమిటది? ఫుల్లర్స్-అర్త్ ఇంట్లో తోడతారా?’

“ ‘అదేం లేదు. ఇక్కడ ఇటుకలు చేస్తాం అంతే. అవన్నీ పట్టించుకోకు. నీవు చేయవలసిందల్లా, యంత్రాన్ని పరీక్షించి, దానికి ఏమయిందో చెప్పడమే.’

“అంతా కలిసి పై అంతస్తులోకి వెళ్లాము. చేతిలో దీపంతో కల్నల్ ముందున్నాడు. తరువాత లావుపాటి మేనేజర్, ఆ వెనుక నేను. అది పాత ఇల్లు, గజిబిజిగా నడవలు,దారులు, ఇరుకయిన మెట్లు, ఎత్తు ఎక్కువగా లేని తలుపులు, కలకాలంగా బోలుగా మారుతున్న కడపలు ఎన్నో దాటాము. ఎక్కడో కార్పెట్లు లేవు. ఫర్నీచర్ లేదు. కింద అంతస్తును వదిలి, మిగతా భవనంలో గోడలు పెచ్చులు ఊడుతున్నాయి. తేమ పట్టి, పచ్చని మరకలతో నిండి ఉన్నాయి. నేను వీలయినంతవరకూ పట్టించుకోకుండా ఉన్నట్టు నటించాను. నాకు ఆడమనిషి హెచ్చరికలు గుర్తున్నాయి. వాటిని పట్టించు కోలేదుకానీ, ఈ ఇద్దరినీ మాత్రం జాగ్రత్తగా గమనిస్తున్నాను. మేనేజర్ మాట్లాడని మనిషి. అతను ఆ ప్రాంతం వాడే అని, అన్న కొద్ది మాటలతో అర్థమయింది.

“కల్నల్ లైసండర్ స్టార్క్ ఒక చిన్న తలుపు ముందు ఆగి తాళం తీశాడు. చదరంగా ఉన్న ఆ గది మరీ చిన్నది. ముగ్గురమూ ఒకసారి వెళ్లను వీలులేనిది. మేనేజర్ బయటే ఉండిపోయాడు. కల్నల్ నన్ను లోపలికి పిలిచాడు.

“ ‘మనం ప్రస్తుతం నిజంగా హైడ్రాలిక్ ప్రెస్ లోపల ఉన్నాము. తెలియక, ఎవరయినా దాన్ని ఆన్ చేస్తే మనం నలిగిపోతాం. ఈ గది పై కప్పుగా కనిపిస్తున్నది కిందకు జారే పిస్టన్. కొన్ని టన్నుల బరువుతో ఒక్క సారిగా కిందకు వచ్చి పడుతుంది. బయట ఉన్న నీటి కాలమ్స్‌లో ఆ బలం

ప్రభావం పడుతుంది. ఇక జరిగేదంతా నీకు అర్థమయే ఉంటుంది. యంత్రం పనిచేస్తూనే ఉన్నది. కానీ, ఎందుకో బిగుసుకు పోయినట్టు అనిపించింది. దాని శక్తికూడా కొంచెం తగ్గినట్టుంది. సరిచేయడం ఎట్లాగో నీవు చూచి చెప్పాలి మరి' అన్నాడాయన.

"ఆయన చేతి నుంచి దీపం అందుకుని యంత్రాన్ని బాగా పరీక్షించాను. అది నిజంగా పెద్దది. అందులోని ఒత్తిడి కలిగించ కలుగుతుంది. బయటకు వెళ్లి, దానిని పనిచేయించే లెవర్స్‌ను వాడి చూస్తే, వచ్చిన చప్పుడుతో, ఎక్కడో లీకేజి ఉందని అర్థమయింది. పక్కనున్న సిలిండర్లలో నీరు వెనుకకు తన్నుతున్నది. లోపల ఒక హెడ్ చుట్టూ బిగించి ఉన్న ఇండియారబ్బర్ పట్టీ కొంత ముడుచుకుపోయినట్టు గమనించగలిగాను. యంత్రం శక్తి తగ్గడానికి అదే కారణం. ఆ విషయమే చెప్పాను. నా సహచరుడు జాగ్రత్తగా విని కొన్ని మంచి ప్రశ్నలు అడిగాడు. మరమ్మతు చేయడానికి మార్గం తెలుసుకున్నాడు. వివరమంతా చెప్పిన తరువాత, నేను మళ్లీ కుతూహలంకొద్దీ, యంత్రపు మెయిన్ ఛేంబర్‌లోకి మళ్లీ వెళ్లాను. ఫుల్లర్స్-అర్త్ గురించి చెప్పినదంతా కేవలం కట్టుకథ అని, అంత చిన్న పనికి ఇంత శక్తిగల యంత్రాన్ని పెట్టడం అనవసరమని నాకు అప్పుడు తోచింది. గోడలు చెక్కతో చేసినవి. అడుగు నేలమాత్రం ఇనుప తొట్టెలాగ ఉన్నది. పరీక్షగా చూస్తే, దాని మీద లోహపు మరకలు కనిపించాయి. అదేమిటో చూడాలని వంగి గీకడానికి ప్రయత్నించాను. అంతట్లో నాకు జెర్మన్ భాషలో ఆశ్చర్యపడడం వినిపించింది. కల్నల్ తాలూకు ముఖం కనిపించింది.

" 'ఏం చేస్తున్నావిక్కడ?' అడిగాడు ఆయన.

"ఆయన అంతటి కథను కల్పించి చెప్పినందుకు నాకు కోపంగా ఉంది. కనుక 'ఫుల్లర్స్-అర్త్‌ను చూస్తున్నాను. యంత్రాన్ని ఎందుకు వాడుతున్నారో తెలిస్తే, నేను మీకు మరింత మంచి సలహా ఇవ్వగలను

అనుకున్నాను' అన్నాను.

"మాటలు ముగించేలోపలే నా తప్పిదం అర్థమయింది. అతని ముఖం ముడుచుకున్నది. కళ్లలో క్రూరమయిన వెలుగు కనిపించింది.

" 'అలాగేమిటి? యంత్రంగురించి అంతా తెలుస్తుంది' అంటూ ఆయన బయటకు అడుగేసి తలుపు ధడాలున మూశాడు, తాళం కూడా వేశాడు. నేను వెళ్లి తలుపు తీయడానికి ప్రయత్నించాను. అది మాత్రం అంగుళం కూడా కదల లేదు. 'హలో! హలో! కల్నల్! నన్ను బయటకు రానీవండి!' అరిచాను.

"నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఒక చప్పుడు మొదలయింది. నా గుండె నోట్లోకి వచ్చేసింది. వినిపించినది లెవర్స్ చప్పుడు, సిలెండర్‌లోని లీక్ చప్పుడు. ఆయన ఇంజన్‌ను పని చేయిస్తున్నాడు. నేలను గమనించినప్పుడు నేను పెట్టిన దీపం కిందనే ఉన్నది. ఆ వెలుగులో చూస్తే, పై కప్పు కొంచెం కొంచెంగా కిందకు రావడం కనిపించింది. అది కిందకు వచ్చి నన్ను గుజ్జుగా మారుస్తుందన్న సంగతి, నాకన్నా ఎక్కువగా మరెవరికీ అర్థం కాదు. నేను అరుస్తూ, తలుపు దగ్గరికి వెళ్లాను. తాళాన్ని గట్టిగా లాగాను. బయటకు వదలమని వేడుకున్నాను. లెవర్స్ చప్పుడులో నా అరుపులు కలిసిపోయాయి. పైకప్పు నా తలకన్నా ఒకటి రెండు అడుగుల ఎత్తున మాత్రమే ఉన్నది. చేతులు పైకెత్తితే అది గరకుగా తగిలింది. నేను నిలబడిన తీరు మీద, చనిపోతూ అనుభవించే బాధ ఆధారపడి ఉంటుందని నాకు అర్థమయింది. బోర్లా పడుకుంటే, బరువు వచ్చి నా వెన్ను మీద పడుతుంది. అపుడు కలిగే బాధ తలుచుకుంటే, ఒళ్లు జలదరించింది. ఏదీ అర్థం కాలేదు. అయినాసరే, నేను పడుకుండి పోయాను. కిందకు వస్తున్న బరువును గమనిస్తున్నాను. ఇక నేను లేచి నిలబడే వీలు లేదు. అంతట్లో నా హృదయానికి ఊరట కలిగించే కదలిక కనిపించింది.



''గదిలోని నేల ఇనుముతో చేసిందని, గోడలు మాత్రం చెక్కలని ఇందాకే అన్నాను. పక్కగాచూస్తే, రెండు చెక్కల మధ్యన సన్నని సందు కనిపించింది. అది రానురాను కొంచెం పెద్దదయింది. అంటే చావు నుంచి తప్పించుకోవడానికి దారి ఉందని అర్థం. మరుక్షణం ఆ చెక్కను తోసి బయటపడ్డాను. ఎగశ్వాస పీలుస్తూ, బయటపడి ఉన్నాను. చెక్క ఒక్కసారిగా తిరిగి తన చోటికి చేరింది. క్షణం తరువాత లోహాలు కొట్టుకుని దీపం నలిగిపోయిన చప్పుడు వినిపించింది. నేను వెంట్రుకవాసిలో తప్పించు కున్నానని అర్థమయింది.

"ఎవరో నా చేయి పట్టి లాగడంతో ఈ ప్రపంచంలోకి వచ్చేశాను. ఒక ఇరుకయిన నడవలో రాతి నేలమీద పడి ఉన్నానని తెలిసింది. ఒక ఆడమనిషి నా మీదకు వంగి ఎడమ చేతితో నన్ను లాగుతున్నది. కుడిచేతిలో ఒక కొవ్వొత్తి వెలుగుతున్నది. ఆమె ఎవరో కాదు. నన్ను హెచ్చరిస్తూ వారించిన ఇంతకు ముందటి స్త్రీయే. ఆమె మాటలను నేను పట్టించుకోలేదు.

" 'రా! రా!' ఆమె పిలిచింది. 'వాళ్లు ఏ క్షణాన్నయినా వచ్చేస్తారు. నువ్వు అందులో లేవని తెలుసుకుంటారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకు!' అన్నది.

"ఈసారి మాత్రం నేను ఆమె సలహాను పెడచెవిన పెట్టలేదు. లేచి నిలబడ్డాను. ఆమెతోపాటు పరుగెత్తి, సుడి తిరిగిన మెట్ల వెంట దిగాను. అక్కడ మళ్లీ ఇంకొక నడవ ఎదురయింది. మేము అక్కడికి చేరేలోగానే

వెనుక ఎవరో పరిగెత్తుతున్న చప్పుడు, రెండు గొంతులు వినిపించాయి. ఒక గొంతు ప్రశ్నలు అడుగుతుంటే, ఇంకొకటి కింద అంతస్తు నుంచి జవాబు చెబుతున్నది. ఏం చేయాలో అర్థం కానట్టు నా మార్గదర్శకురాలు ఆగి అటు ఇటూ చూచింది. చటుక్కున ఒక తలుపు తెరిచింది. అది ఒక పడకగది. కిటికీలోనుంచి వెన్నెల బాగా కనపడుతున్నది.

“ 'ఇదొక్కటే దారి. బాగా ఎత్తుగా ఉంది. కానీ, నీవు దూకగలుగుతావనే అనుకుంటాను' అన్నది ఆమె.

“ఆమె మాట్లాడుతుండగానే నడవ అవతల చివరన వెలుగు కనిపించింది. ఒక చేతిలో దీపం పట్టుకుని, మరొక చేతిలో కసాయివారు వాడే పెద్ద కత్తితోబాటు కల్నల్ లైసెండల్ స్టార్క్ వేగంగా ముందుకు రావడం చూడగలిగాను. పడక గదిలోకి పరుగెత్తి, కిటికీ తెరిచి బయటకు చూచాను. ఆ రాత్రి వెన్నెలలో తోట ఎంత ప్రశాంతంగా మధురంగా ఉందో చెప్పలేను. బహుశా ముప్ఫయి అడుగుల కింద ఉందది. కిటికీలోకి ఎక్కాను. కానీ, దూకడానికి కొంచెం సంకోచించాను. ఈలోగా నన్ను కాపాడాలనుకుంటున్న ఆమెతో నన్ను వెంటాడుతున్న రాక్షసుడు పడుతున్న పేచీ వినిపించింది. ఆమెకు ఏదయినా ఆపద వస్తుందని, సాయంగా వెళ్లాలనిపించింది. ఆ ఆలోచన వచ్చేలోగానే అతను తలుపు దగ్గరికి వచ్చాడు. ఆమెను తోసుకుంటూ ముందుకు వస్తుంటే, రెండు చేతులతో పట్టుకుని ఆమె ఆపాలని ప్రయత్నం చేసింది.

“ 'ఫ్రిట్జ్! ఫ్రిట్జ్! గడచినసారి తరువాత మాట ఇచ్చావు గుర్తుందా? మళ్లీ అలా చేయనన్నావు. అతను ఎవరికీ చెప్పడు. నిజంగా చెప్పడు!' ఆమె ఇంగ్లీషులో అంటున్నది.

“ 'ఎలీజ్, నీకు పిచ్చెత్తింది. నీవల్ల అందరమూ నాశనమవుతాము. అతను చాలా ఎక్కువే చూచాడు. నన్ను వెళ్లనివ్వమంటున్నాను!' ఆమె పట్టునుంచి విడిపించుకునే ప్రయత్నం చేస్తూ, అతను అరిచాడు. ఆమెను



ఒక పక్కకు తోసి కిటికీ దగ్గరికి వచ్చేస్తూ, ఆ పెద్ద కత్తితో నా మీద దాడి చేశాడు. నేను కిందకు జారాను. నా చేతులు కిటికీ అంచులను పట్టుకుని ఉన్నప్పుడు అతని దెబ్బ పడింది. మూగ నొప్పి తెలిసింది. నా పట్టు సడలింది. నేను కింద తోటలోకి పడిపోయాను.

“నేను కుదుపుకు గురయ్యానేగాని, దెబ్బలు తగలలేదు. లేచి పొదలలోకి పరుగెత్తాను. ఇంకా ఆపద తొలగలేదనిపించి బాగా వేగంగా వెళ్లాను. ఎంత ప్రయత్నిస్తున్నా సరే, ఆగకుండా మత్తు ఆవరించింది. నా చేతి వేపు చూచుకున్నాను. అది బాగా నొప్పి పెడుతున్నది. నా బొటనవేలు తెగిందని, రక్తం ఏకధారగా కారుతున్నదని చూడగలిగాను. ప్రయత్నించి జేబురుమాలు చేతికి కట్టుకున్నాను. ఒక్కసారిగా చెవులలో మోత మొదల యింది. ఆ గులాబీ పొదలలో మూర్ఛపోయాను.

“అట్లా ఎంతకాలం మత్తులో ఉన్నానో తెలియదు. చాలాసేపే ఉండి ఉంటాను. నాకు తెలివి వచ్చేసరికి వెన్నెల లేదు సరికదా, తెల్లవారు తున్నది. నా దుస్తులన్నీ మంచుతో తడిసి ఉన్నాయి. గాయం నుంచి వచ్చిన నెత్తురుతో కోటు చెయ్యి తడిసి ఉంది. ఆ నొప్పితో ఒక్కసారిగా రాత్రి జరిగిన నా

సాహసయాత్ర గుర్తుకువచ్చింది. నన్ను వెంటాడుతున్నవారి నుంచి ఇంకా ఆపద ఉంది అనుకుని లేచి నిలబడ్డాను. కానీ ఆశ్చర్యంగా, నేను లేచి నిలబడి చూస్తే ఇల్లుగాని, ఆ తోటగానీ కనిపించలేదు. హైరోడ్ మీద ఒక పక్కన నేను పడి ఉన్నాను. దగ్గరలో ఉన్న ఒక పెద్ద బిల్డింగ్ కనిపించింది. అక్కడిదాకా వెళ్లి చూస్తే, నేను గతరాత్రి దిగిన స్టేషన్ అదే అని తెలిసింది. నా చేతిమీద గాయంగనుక లేకున్నట్టయితే, రాత్రి జరిగినదంతా కలగా భావించి ఉండే వాడిని.

"సగం మగతగా, స్టేషన్‌కు చేరుకున్నాను. ట్రైన్ గురించి అడిగాను. ఒక గంటలోపల రీడింగ్‌కు బండి ఉందన్నారు. నేను వచ్చినపుడు ఉన్న పోర్టర్ ఒక్కడే ఇపుడు కూడా డ్యూటీలో ఉన్నట్టు గమనించాను. కల్నల్ లైసండర్ స్టార్క్ అనే వ్యక్తి గురించి అతడిని అడిగాను. ఆ పేరే వినలేదని అన్నాడతను. గత రాత్రి నాకోసం వచ్చిన బండిని గమనించాడేమో అడిగాను. అది కూడా లేదన్నాడు. దగ్గరలో పోలీస్ స్టేసన్ గాని ఉందా? అని అడిగాను. మూడు మైళ్ల దూరంలో ఒకటి ఉందన్నాడు.

" అంతదూరం వెళ్లడం, ఈ పరిస్థితుల్లో నావల్ల కాదు. టౌన్‌కు చేరేదాకా, నా కథను నాతోనే పెట్టుకోవాలి. అక్కడ పోలీసులకు చెప్పాలి అని నిర్ణయించుకున్నాను. నేను వచ్చేసరికి ఆరు గంటలయింది. ముందుగా గాయానికి కట్టు కట్టించుకోవాలనుకున్నాను. ఇక ఈ డాక్టర్ దయతో నన్ను ఇక్కడికి తెచ్చారు. కేసును మీకు అప్పచెపుతున్నాను. మీరు ఏం చెపితే అదే చేస్తాను."

ఈ అసాధారణమయిన కథనాన్ని వింటూ, ఆ తరువాతకూడా కొంతసేపు మేమిద్దరమూ మౌనంగా ఉండి పోయాము. షెర్లక్ హెూమ్స్ లేచి షెల్ఫ్‌లో నుంచి ఒక మామూలు పుస్తకం బయటికి తీశాడు. అందులో పేపర్ కటింగ్స్‌ను అతను దాచుతూ ఉంటాడు.

"ఇక్కడ ఒక ప్రకటన ఉంది. అది మీకు ఆసక్తికరంగా ఉంటుంది.

ఒక సంవత్సరం క్రితం అది అన్ని పేపర్లలోనూ వచ్చింది. వినండి' అన్నాడతను.

> *"కనపడుట లేదు. మిస్టర్ జెరెమియా హేలింగ్ అనే 26 సంవత్సరాల వయసుగల హైడ్రాలిక్ ఇంజనియర్ తొమ్మిదవ తేదీ నుంచి కనపడుటలేదు. రాత్రి పది గంటల ప్రాంతంలో ఇల్లు వదిలి వెళ్లాడు. ఆ తరువాత అతని ఆచూకీ లేదు. దుస్తులు....ఫలానా, ఫలానా, అది బహుశా కల్నల్ తన యంత్రానికి మరమ్మత్తులు చేయించా లనుకున్న గత సందర్భం అయి ఉంటుంది."*

"ఓరి దేవుడా! ఆ అమ్మాయి మాటలకు అర్థం తెలిసింది" అన్నాడు నా పేషెంట్.

"అనుమానమే లేదు. ఆ కల్నల్ చాలా దుర్మార్గుడని తెలుస్తూనే ఉన్నది. తాను ఆడే నాటకానికి ఏ చిన్న అడ్డు కూడా రాకూడదని పథకాలు వేశాడు. పట్టుకున్న పడవ నుంచి ఒక్కరు కూడా మిగలకుండా చూచే రాక్షసపు రకం సముద్రపు దొంగలవలె ఉన్నాడు. ఇప్పుడిక ప్రతిక్షణమూ ఎంతో విలువ యినది. నీకు అభ్యంతరం లేకుంటే, నేరుగా స్కాట్లాండ్‌యార్డ్ వెళదాము. ఐఫోర్డ్ వ్యవహారానికి ప్రారంభం జరుగుతుంది."

మరొక మూడు గంటలు ఆ పై సమయంలో, మేమంతా మళ్లీ ట్రైన్‌లో ఎక్కి బర్క్‌షైర్ ప్రాంతంలోని పల్లెకు బయలుదేరాము. షెర్లాక్ హోమ్స్, ఆ హైడ్రాలిక్ ఇంజనియర్, స్కాట్లాండ్‌యార్డ్ ఇన్‌స్పెక్టర్ బ్రాడ్‌స్ట్రీట్ మరొక మఫ్టీ దుస్తుల మనిషి ఇక నేనూ ఉన్నాము. బ్రాడ్‌స్ట్రీట్ ఒక సైన్యపు మ్యాప్ తెచ్చాడు. దాన్ని సీటు మీద పరిచి, ఐఫోర్డ్ కేంద్రంగా ఒక వలయం గీచి, అందులో వెతుకుతున్నాడు.

"అది సంగతి. పల్లె నుంచి పది మైళ్ల దూరాన్ని సూచించేటట్లు వలయం గీశాను. మనం వెతుకుతున్న చోటు ఆ గీత మీదే ఎక్కడో ఉంటుంది. పది మైళ్లు అన్నారు కదండీ' అన్నాడు అతను.

"కనీసం గంట ప్రయాణించాము."

"అంటే, మీరు మూర్ఛపడి ఉండగా వాళ్లు మిమ్మల్ని అంతదూరమూ తిరిగి తెచ్చారంటారు?"

"అదే జరిగి ఉంటుంది. నాకంతా గజిబిజిగా ఉంది. నన్ను ఎత్తి తరలించడం గుర్తున్నట్టే అనిపిస్తున్నది."

"మీరు తోటలో మూర్ఛపడి ఉండగా, ఎందుకు మిమ్మల్ని వదిలేశారో మాత్రం అర్థంకావడం లేదు. ఆ స్త్రీ కారణంగా దుర్మార్గుడు బహుశా మెత్తబడి ఉంటాడు" అన్నాను నేను.

"నేనట్లా అనుకోవడం లేదు. నా బతుకులో అంతటి క్రూరమయిన ముఖం మరెక్కడా చూడలేదు"

"ఓహ్, త్వరలోనే అంతా తేలిపోతుంది. నేను వలయం గీశాను. అందులో, మనం వెతుకుతున్నవారు ఎక్కడ ఉన్నారో తెలిస్తే కుదురుతుంది" అన్నాడు బ్రాడ్‌స్ట్రీట్.

"ఆ చోటును నేను చూపగలను అనుకుంటున్నాను" అన్నాడు హోమ్స్ ప్రశాంతంగా.

"నిజమా, ఇప్పుడా! అంటే అభిప్రాయానికి వచ్చారన్నమాట! మీ సంగతి ఏమిటో చూద్దాం రండి. నేను దక్షిణం వేపు అంటున్నాను. అక్కడ జనావాసం తక్కువగా ఉంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఇక నా అభిప్రాయం తూర్పు అని" అన్నాడు నా పేషెంట్.

"నా దృష్టిలో పడమట. అటువేపు చిన్న చిన్న పల్లెలు చాలా ఉన్నాయి" అన్నాడు మఫ్టీ దుస్తుల మనిషి.

"నా అభిప్రాయం ఉత్తరం అని. అక్కడ కొండలు లేవు. మన మిత్రుడు కొండల గురించి ఒక్క మాట అనలేదు" అన్నాను నేను.

"భిన్నాభిప్రాయాలు అంటే ఇలాగుండాలి. అన్ని దిక్కులనూ పంచు

కున్నాము. మరి మీరు ఏ దిక్కు?" నవ్వుతూ అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మీరందరూ తప్పే."

"అదెట్లా కుదురుతుంది?"

"లక్షణంగా కుదురుతుంది. అదే నా పాయింట్. ఇదుగో ఇక్కడ వాళ్లు దొరుకుతారు" వలయం మధ్యలో వేలు పెడుతూ అన్నాడు హెూమ్స్.

"మరి పన్నెండు మైళ్ల ప్రయాణం?" ఆత్రంగా అడిగాడు హాదర్లీ.

"ఆరు అటు, ఆరు ఇటు! అంతా సింపుల్. బండి ఎక్కినపుడు, గుర్రం మెరుస్తూ ఉన్నదని మీరే చెప్పారు. అది ఆ రోడ్ల మీద పన్నెండు మైళ్లు పరిగెత్తితే, ఎట్లాగుంటుంది?"

"నిజమే. అర్థమవుతున్నది. ఆ మనుషుల గురించి అర్థమవుతున్నది" సాలోచనగా అన్నాడు బ్రాడ్‌స్ట్రీట్.

"ఏమీ లేదక్కడ వాళ్లు దొంగ నాణాల మనుషులు. వెండికి బదులు వాడే లోహాలను ఆ మెషీన్‌తో తయారు చేస్తున్నారు."

"అటువంటి గ్యాంగ్ ఒకటి ఉందని మాకు కొంతకాలంగా తెలుసు. వాళ్లు వేలసంఖ్యలో అర క్రౌన్ నాణాలను తయారుచేసి పడవేస్తున్నారు. వాళ్లను వెతుకుతూ, మేము రీడింగ్ దాకా వెళ్లాము. ఇక ముందుకు సాగలేకపోయాము. ఆ తరువాత దారి తెలియకుండా, వాళ్లు చాలా తెలివిగా పథకాలు వేశారు. ఇప్పుడు, అదృష్టం కొద్దీ, వాళ్లు చేతికి చిక్కినట్టే ఉన్నారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

కానీ, ఇన్‌స్పెక్టర్ మాట తప్పు అయింది. ఆ దుండగులు న్యాయం చేతులకు అందనే లేదు. మేము ఐఫోర్డ్ స్టేషన్‌కు చేరుతుండగానే, దూరంగా చెట్ల వెనుకనుంచి పెద్ద ఎత్తున పొగ పైకి రావడం కనిపించింది. అది ఆకాశంలో పెద్ద ఆస్ట్రిచ్ ఈక వలె వ్యాపించి, కదులుతున్నది.

‘‘ఇల్లు తగలబడిందా?’’ రైలు ఆగుతుండగా, బ్రాడ్‌స్ట్రీట్ అడిగాడు.

“యస్, సర్!” అన్నాడు స్టేషన్ మాస్టర్.

“ఎప్పుడు మొదలయింది?”

“రాత్రి అన్నారు, సర్. కానీ, మంట రాను రాను పెరిగింది. మొత్తం ఇల్లంతా తగలబడింది.”



‘‘ఎవరిది ఆ ఇల్లు?”

“డాక్టర్ బెషర్ గారిది.”

“డాక్టర్ బెషర్ అంటే, ఒక జెర్మన్. చాలా సన్నగా పొడుగ్గా ఉంటారు. ముక్కు కోసు. ఆయనేనా?” అడ్డువస్తూ అడిగాడు ఇంజనియర్.

స్టేషన్ మాస్టర్ మనసారా నవ్వాడు. “నో సర్. డాక్టర్ బెషర్ ఇంగ్లీషు మనిషే. ఈ చుట్టుపక్కల ఆయనంత నడుము ఉన్న మనిషి మరొకడు లేడు. ఆయన దగ్గర మరొక పెద్దమనిషి ఉంటాడు. అతను రోగిష్టి. విదేశీ అనగా విన్నాను. అతన్ని చూస్తే మాత్రం కాస్త తిండిపెడితే బాగుండును అనిపించేలా ఉంటాడు” అన్నాడతను.

స్టేషన్ మాస్టర్ మాట ముగించేలోగా, మేమంతా మంటలు రేగుతున్నవేపు వేగంగా బయలుదేరాము. దారి ఒక చిన్న కొండమీదుగా సాగింది. మా ముందు సున్నం వేసిన, విశాలమయిన ఒక భవంతి కనిపించింది.

దాని ప్రతి కిటికీ, సందులోనుంచి మంటలు రేగుతున్నాయి. ముందున్న తోటలో మూడు ఫైర్ ఇంజన్‌లు నిలబడి మంటలు ఆర్పడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాయి.

“అదే! అదే కంకర దారి. నేను పడి ఉన్న గులాబీపొదలు అవే. కనిపిస్తున్న రెండవ కిటికీలోనుంచి నేను కిందికి దూకాను” తీవ్రమయిన ఉద్రేకానికి గురయి హాదర్లీ గట్టిగా అన్నాడు.

“బాగుంది. కనీసం మీరు, వాళ్లమీద పగ తీర్చుకోగలిగారు. ప్రెస్‌లో మీరు వదిలిన దీపం కారణంగా చెక్క గోడలు నిప్పు అంటుకుని ఉంటాయి. వాళ్లు మిమ్మల్ని తరిమే తొందరలో మంటలను పట్టించుకుని ఉండరు. చుట్టూ ఉన్న మనుషుల్లో రాత్రి మీకు దొరికిన మిత్రులు కనిపిస్తారేమో చూడండి. నాకు మాత్రం, వాళ్లు ఇప్పటికే కనీసం వందమైళ్ల దూరం పోయి ఉంటారని అనిపిస్తున్నది” అన్నాడు హోమ్స్.

హోమ్స్ మాటలు నిజమయినట్టున్నాయి. నాటి నుంచి నేటి వరకూ ఎవరూ ఆ అందమయిన అమ్మాయి గురించిగానీ, దుర్మార్గుడయిన జెర్మన్ గురించిగానీ లేక ఆ ఇంగ్లీషు వ్యక్తి గురించి గానీ, ఒక్క మాటా అనలేదు. ఆ ఉదయాన రీడింగ్ వేపు వెళుతున్న ఒక బండిలో కొందరు మనుషులు, వారితోబాటు పెద్ద పెద్ద పెట్టెలు ఉండడం చూచినట్టు ఒక రైతు చెప్పాడు. కానీ, వాళ్ల గురించి మరే జాడా తెలియలేదు. హోమ్స్ తెలివికి కూడా వాళ్ల ఆచూకీగానీ, ఆధారాలుగానీ అందలేదు.

మంటలు ఆర్పేవాళ్లకు భవనంలో కనిపించిన ఏర్పాట్లు చాలా చిత్రంగా తోచాయి. అంతకంటే చిత్రంగా కిటికీలో వారికి అప్పుడే తెగిన బొటనవేలు ఒకటి కనిపించి మరింత తికమకపెట్టింది. సుమారు సాయంత్రం సమయానికి వాళ్ల ప్రయత్నాలు ఫలించాయి. మంటలను అదుపుచేశారు. కానీ, ఈలోగా పై కప్పు కూలిపోయింది. మొత్తం ఇల్లు సర్వనాశన మయింది. కొన్ని సిలెండర్లు మరికొన్ని ఇనుప గొట్టాలు తప్ప అక్కడ మరే యంత్ర

పరికరాలూ కనిపించలేదు. ఒక ఔట్‌హౌజ్‌లో పెద్ద మొత్తంలో నికెల్, టిన్ లోహాలు కనిపించాయి. నాణాలు మాత్రం దొరకలేదు. బండిలో పెద్ద పెట్టెలు ఉన్నాయన్న మాటకు ఇక్కడ సార్థకత కనిపించినట్టుంది.

ఇక మన హైడ్రాలిక్ ఇంజనియర్‌ను, తోటలో పడి ఉన్న చోటు నుంచి మళ్లీ తెలివి వచ్చిన చోటుకి తరలించిన తీరు మాత్రం రహస్యంగానే ఉండిపోతుందనుకున్నాము. కానీ, ఒక మామూలు సంగతితో వ్యవహారం తేలిపోయింది. ఆయనను ఇద్దరు మనుషులు ఎత్తి కదిలించారు. వారిలో ఒకరి కాళ్లు చాలా చిన్నవి, మరొకరివి అసాధారణంగా పెద్దవి. అక్కడున్న ఇంగ్లీషు వ్యక్తి తనతోటి మనిషికన్నా కొంచెం మెత్తనివాడని, అతనే అపాయం నుంచి ఇంజనియర్‌ను తప్పించడంలో అమ్మాయికి సాయం చేసి ఉంటాడని అనిపించింది.

“బాగుంది. ఈ వ్యవహారం బాగానే ముగిసింది. బొటనవేలు పోయింది. యాభయి గినీలూ పోయాయి. ఇక నాకు ఏం మిగిలింది?” మేము లండన్‌కు తిరిగి వస్తుండగా రైల్లో ఆలోచనగా అన్నాడు ఇంజనియర్.

“అనుభవం. అది మరో రకంగా ఎంతో విలువగలది. నీవు మిగిలి ఉన్నంతకాలం ఈ సంగతి చెపుతూ, మాటల ద్వారా నీకు దొరికిన సహవాసం గురించి వివరిస్తూ ఉండవచ్చు” నవ్వుతూ అన్నాడు హోమ్స్.





10

# ది నోబుల్ బాచెలర్

**లా**ర్డ్ సెయింట్ సైమన్ మామూలుగా తిరుగుతూ ఉండే ఉన్నత వర్గాలలో ఆయన వివాహం, దాని అంతం గురించిన చర్చ దానిమీద ఆసక్తి ఇంచుమించు అడుగంటాయి. కొత్త వ్యవహారాలు గ్రహణాల్లాగ అడ్డ వచ్చాయి. వాటిలోని తాజా సంగతుల వెనుక, నాలుగు సంవత్సరాలనాటి నాటకం మీద తెరపడింది. అయితే, ఆ పెళ్లి వ్యవహారంలోని అసలు సంగతులు, మామూలు జనం మధ్యకు రానేలేదు అనడానికి గట్టి కారణాలున్నాయని నా నమ్మకం. నా మిత్రుడు షెర్లక్ హోమ్స్‌కు ఆ వ్యవహారాన్ని విడదీసిన ఘనతలో భాగం ఉంది. అతని గురించి రాస్తున్న జ్ఞాపకాల పుస్తకంలో ఈ వ్యవహారం గురించి కొంతయినా రాయకపోతే, అన్యాయమే అవుతుంది.

అదింకా నా పెళ్లికన్నా కొన్ని వారాల ముందటి సమయం. అంటే నేనింకా బేకర్‌స్ట్రీట్‌లో హోమ్స్‌తో పాటు అక్కడే ఉండేవాడిని. ఒక మధ్యాన్నం హోమ్స్ బయట తిరిగి వచ్చేసరికి అతనికోసం ఎదురుచూస్తున్నట్టు ఒక ఉత్తరం బల్లమీద పడి ఉంది. బయట ఒక్కసారి వర్షం మొదలయింది. ఆ ఈదురుగాలులు, నా ఆఫ్ఘాన్ యాత్రకు గుర్తుగా వంటిలో వెనుకకు తెచ్చుకున్న జెసెల్ బులెట్ రెండూ కలిసి నన్ను బాధపెడుతుంటాయి. కనుక నేను

దినమంతా ఇల్లు కదలకుండా ఉన్నాను. ఒక ఈజీచైర్‌లో కూచుని కాళ్లు మరొకదానిలో పెట్టి నేను వార్తాపత్రికల మేఘంలో కమ్ముకు పోయాను. ఆనాటి వార్తలు నన్ను ముంచెత్తిన తరువాత పత్రికలను పక్కకు తోసి అలాగ పడి ఉన్నాను. బల్ల మీద పడి ఉన్న ఉత్తరం మీది మోనోగ్రామ్‌ను, రాజచిహ్నాన్ని గమనిస్తూ నా మిత్రునికి పెద్దవాళ్లు రాసే ఉత్తరాల గురించి, మత్తుగా ఆలోచిస్తున్నాను.

“ఇక్కడ చాలా ఫ్యాషనబుల్ వస్తువు ఒకటి ఉన్నది. పొద్దున వచ్చిన ఉత్తరం మాత్రం, నాకు గుర్తున్నంతవరకూ ఒక చేపలు అమ్మే మనిషి నుంచి వచ్చినట్టు ఉంది” అన్నాను నేను అతను లోపలికి వస్తుండగా.

“నాకు వచ్చే ఉత్తరాలలో బోలెడంత వైవిధ్యం ఉంటుంది. కానీ, మామూలుగా ఉండేవాటిలోనే ఆసక్తికరమయిన అంశాలు ఉంటాయి. ఈ ఉత్తరాన్ని చూస్తే, ఇదేదో అవసరంలేని ఆజ్ఞగా కనపడుతున్నది. దానితో వచ్చే మనిషి బుర్ర తింటాడు. లేదంటే అబద్దాలాడతాడని అనిపిస్తున్నది” చిరునవ్వుతో అన్నాడతను సమాధానంగా.

సీలు విప్పి కవర్‌లోని అంశాలను అతను గమనించాడు.



"ఏం మాటలు? అందులోనూ ఆసక్తికరమయిన అంశాలు ఉండ వచ్చు."

"తెలిసినవాళ్లు రాసిన ఉత్తరమా?"

"అదేం లేదు. పక్కా పని వ్యవహారమా?"

"అది ఒక రాచరికం మనిషి నుంచి?"

"ఇంగ్లండ్‌లోని ఉత్తమకుటుంబాల్లో ఒకదాని నుంచి."

"మిత్రమా, నీకు అభినందనలు."

"నన్ను నమ్ము వాట్సన్, కేసులో లోతు తప్పితే నా క్లయింట్ హెూదా మీద నాకు ఏమాత్రం ఆసక్తి ఉండదు. అయితే ఈ కొత్త పరిశోధనలో ఆసక్తి ఉండవచ్చునని అనుకోవచ్చుకదా? ఈ మధ్యన నీవు పత్రికలు బాగా చదువుతున్నావు కదూ?"

"అలాగే ఉంది. చేయడానికి మరే పనీ లేదుగా" పడి ఉన్న పాత పత్రికలవేపు చూపిస్తూ ఆలోచనగా అన్నాను నేను.

"అదృష్టం. నీవు నాకు చాలా సంగతులు చెప్పగలుగుతావు. నేను నేరాల వార్తలు, ఎగోనీ కాలమ్ తప్పిస్తే, మరొకటి చదవను. అందరూ సాయం కోసం అడిగే ఈ రెండవ భాగంలో బోలెడు సంగతులు తెలుస్తాయి. నీవు మాత్రం ఈ మధ్యన వార్తలు వివరంగా చదువుతూ ఉన్నట్టయితే, లార్డ్ సెయింట్ సైమన్ పెళ్లి వ్యవహారం గురించి తెలిసే ఉంటుంది."

"చాలా ఆసక్తిగా చదివాను."

"బాగుంది. నా చేతిలో ఉన్న ఉత్తరం లార్డ్ సెయింట్ సైమన్ రాసినది. చదువుతాను విను. అందుకు బదులుగా, ఈ వ్యవహారం గురించి పత్రికలలో వచ్చిన సంగతులన్నీ నీవు నాకు చెప్పాలి. ఆయన ఏమంటు న్నాడంటే:

"మైడియర్ మిస్టర్ షెర్లక్ హోమ్స్:

*"మీయొక్క న్యాయ నిర్ణయశక్తి, విచక్షణల ముందు నా వ్యవహారాన్ని నమ్మకంగా ఉంచవచ్చునని లార్డ్ బ్యాక్ వాటర్ నాకు చెప్పారు. కనుక నేను మీ వద్దకు వచ్చి కొన్ని బాధాకరమయిన సంఘటనలు, నా పెళ్లికి సంబంధించిన వాటి గురించి మీతో సంప్రదించాలని నిర్ణయించుకున్నాను. స్కాట్లాండ్‌యార్డ్‌కు చెందిన మిస్టర్ లెస్ట్రేడ్ ఈ వ్యవహారంలో చురుకుగా పనిచేస్తున్నారు. మీ సహకారం విషయంలో ఆయనకు ఎటువంటి అభ్యంతరం లేదని నమ్మకంగా చెప్పారు. మీ వల్ల మంచి జరిగే అవకాశం ఉందని కూడా ఆయన అనుకుంటున్నారు. ఈ మధ్యాహ్నం నాలుగు గంటలకు నేను వస్తాను. ఆ సమయానికి మీకు వేరేదయినా పని ఉన్నప్పటికీ, సర్దుకుంటారని అభ్యర్థిస్తున్నాను. నాది చాలా ముఖ్యమయిన విషయమని గమనించ ప్రార్థన.*

*మీ విధేయుడు,*

*సెయింట్ సైమన్."*

"గ్రోస్‌వీనర్ మాన్షన్స్ నుంచి వచ్చిన ఈ ఉత్తరం ఈక పెన్నుతో రాసి ఉన్నది. రాస్తున్న సమయంలో దురదృష్టంగా లార్డ్ కుడిచేతి చిటికెన వేలికి కొంచెం సిరా అంటింది" ఉత్తరాన్ని మడతపెడుతూ హోమ్స్ అన్నాడు.

"నాలుగు గంటలు అన్నాడు, ఇప్పుడు మూడు అయింది. మరో గంటలో వస్తాడు."

"అయితే, నీ సాయంతో, విషయం గురించి మరింత తెలుసు కోవడానికి, టైమ్ ఉంది. పేపర్లను తెచ్చి కటింగ్స్‌ను కాలక్రమం ప్రకారం పెడితే, మన క్లయింట్ ఎవరో నేను ఒక దృష్టి వేసి చూస్తాను" అంటూ



అతను రెఫెరెన్స్ పుస్తకాలలో నుంచి ఎర్రని బైండ్ వాల్యూమ్ ఒకదానిని బయటకు తీసుకున్నాడు. కూచుని దాన్ని మోకాళ్ల మీద విప్పి చూస్తూ, “ఇదుగో ఇక్కడ దొరికాడు, లార్డ్ రాబర్ట్ వాల్సింగ్‌హామ్ డి వియర్ సెయింట్ సైమన్, డ్యూక్ ఆఫ్ బామొరాల్ రెండవ కుమారుడు. సైన్యంలో అలంకృతుడు, 1846లో పుట్టాడు. అంటే 41 సంవత్సరాల వయసు. పెళ్లికి బాగ తగిన వయసు. గతంలో కాలొనీ అండర్ సెక్రటరీగా పనిచేశాడు. అతని తండ్రి అయిన డ్యూక్ ఒకప్పుడు విదేశీ వ్యవహారాల కార్యదర్శి. వీరు ప్లాంటజెనెట్, ట్యూడర్ వంశాల వారసులు. హా! బాగుంది. ఇందులో పనికివచ్చే ముక్క ఒక్కటి లేదు. ఇక నీవే దిక్కు. వాట్సన్, మరింత గట్టి సంగతులు ఉంటే చెప్పు.”

“తెలుసుకోవడానికి నేనేమంత కష్టపడవలసిన అవసరాలు రాలేదు. వాస్తవాలన్నీ ఇటీవలివే. వ్యవహారం నాకు కొట్టవచ్చినట్టు కనబడింది. నీ చేతిలో అప్పటికే ఒక కేసు ఉండడం మూలాన, ఈ సంగతులను నేను నీ ముందు ఎత్తలేదు. నీకు ఒక పనిలో ఉన్నప్పుడు మరొకదాన్ని పట్టించుకోవడం ఇష్టం ఉండదు మరి” అన్నాను నేను.

“ఓహో, గ్రోస్‌వీనర్ స్క్వేర్ ఫర్నిచర్ వాన్ వ్యవహారం గురించి అంటున్నావా? అది మొదటినుంచి సులభంగానే ఉంది. ఇప్పటికి పూర్తిగా తేలిపోయింది. ఇక నీ వార్తాపత్రికల విశేషాలు చెప్పు మరి.”

"నేను గమనించిన మొదటి నోటీసు మార్నింగ్ పోస్ట్‌లోని పర్సనల్ కాలమ్‌లో వచ్చింది. అది కొన్ని వారాల కిందటి సంగతి:

> *"పుకార్లు కనుక నిజమే అయితే, ఒక వివాహం నిశ్చయమయింది (అంటున్నారు). లార్డ్ రాబర్ట్ సెయింట్ సైమన్, అంటే డ్యూక్ ఆఫ్ బామొరాల్ రెండవ కుమారుడు, మిస్ హాటీడొరాన్ అనే అమ్మాయిని పెళ్లాడబోతున్నాడు. ఆమె యుఎస్ఎ, కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కోవాసి అలోసియస్ డొరాన్ గారి ఒక్కగానొక్క కూతురు.*

అని మాత్రమే ఉంది ఇక్కడ."

"టు ద పాయింట్" అన్నాడు హెూమ్స్, తన పొడుగాటి సన్నని కాళ్లను మంటవేపు నిగడదీస్తూ.

"అదే వారంలో ఈ సంగతిని కొంచెం వివరిస్తూ, ఒకానొక సొసైటీ పేపర్లో ఒక పేరగ్రాఫ్ కనిపించింది. విను:

> *"పెళ్లిళ్ల మార్కెట్‌లో రక్షణ కొరకు త్వరలోనే ఒక పిలుపు రానున్నది. ప్రస్తుతం అమలులో ఉన్న ఫ్రీ ట్రేడ్ పద్ధతికి ఇది పూర్తిగా విరుద్ధంగా ఉన్నట్టున్నది. గ్రేట్ బ్రిటన్‌లోని రాజకుటుంబాల వ్యవహారాలు ఒకదాని వెంట ఒకటి నెమ్మదిగా అట్లాంటిక్ అవతలనున్న మన తెల్ల దాయాదుల చేతులలోకి జారుతున్నాయి. ఈ అందమయిన దండయాత్రదారులు చేజిక్కించుకున్న బహుమతుల పట్టికకు గడిచిన వారంలో మరొక ముఖ్యమయిన పేరు వచ్చి చేరింది. బాణాల దేవుని తాకిడికి లార్డ్ సెయింట్ సైమన్ పడిపోయారు. మిస్ హాటీ డొరాన్ అనే అమ్మాయితో తన పెళ్లి జరగనున్నట్టు స్థిరంగా ప్రకటించారు. మిస్ డొరాన్*

*కాలిఫోర్నియాలోని ఒక ధనవంతుని కూతురు. అందమయిన ఆమె ఆకారం, ముఖాలు వెస్ట్‌బరీ ఉత్సవాలలో అందరినీ ఆకర్షించాయి. ఆమె తండ్రికి ఒక్కగానొక్క సంతానం. తనతో తెచ్చే వరకట్నం ఆరు అంకెలను మించి ఉంటుందని అంటున్నారు. మునుముందు మరింత కూడా వస్తుంది అంటున్నారు. గడచిన సంవత్సరాలలో డ్యూక్ ఆఫ్ బామొరాల్ మనుగడకోసం ఇంట్లోని చిత్తరువులను అమ్ముతున్నారని అందరికీ తెలిసిన రహస్యం. లార్డ్ సెయింట్ సైమన్‌కు, ఒక్క బిర్చ్‌మూర్ ఎస్టేట్ తప్ప స్వంత ఆస్తి అంటూ లేదు. అంటే ఈ పెళ్లి వ్యవహారంలో రిపబ్లికన్ మహిళ స్థాయి నుంచి బ్రిటిష్ రాజకుటుంబపు సభ్యురాలిగా మారి లాభపడుతున్నది కాలిఫోర్నియా సంతతి అమ్మాయి ఒక్కరు మాత్రమే కాదని అనుకుంటున్నారు."*

"ఇంకేమయినా ఉందా?" ఆవులిస్తూ అడిగాడు హోమ్స్.

"చాలానే ఉంది. పెళ్లి చాలా మామూలుగా జరుగుతుందని మార్నింగ్ పోస్ట్‌లో మరొక నోట్ ఉంది. ఆ పెళ్లి హానోవర్ స్క్వేర్‌లోని సెయింట్ జార్జ్‌లో జరుగుతుంది. దగ్గరి మిత్రులు అరడజను మందికి మాత్రమే ఆహ్వానాలు ఉంటాయి. తరువాత వారు లాంకాస్టర్ గేట్‌లో ఉన్న కొత్త ఇంటికి వస్తారు. మిస్టర్ అలోసియస్ డొరాన్ దాన్ని ఈ మధ్యనే కొన్నారు. రెండునాళ్ల తరువాత– అంటే గడిచిన బుధవారం అన్నమాట– పెళ్లి జరిగిందని మరొక చిన్న ప్రకటన వచ్చింది. దంపతులు లార్డ్ బ్యాక్‌వాటర్‌గారి రాజభవనంలో హనీమూన్ గడుపుతారు. పెళ్లి కూతరు కనిపించకుండా పోవడానికి ముందు వచ్చిన నోటీసులు ఇవి మాత్రమే."

"దేనికి ముందు అన్నావు?" ఉలిక్కిపడి అడిగాడు హోమ్స్.

"ఆ మహిళ మాయం కావడానికి."

"అయితే, ఆమె ఎప్పుడు మాయమయింది?"

"పెళ్లి భోజనం సమయంలో."

"బాగుంది. అనుకున్నకన్నా వ్యవహారం ఆసక్తికరంగా ఉంది. నిజానికి, నాటకీయంగా ఉంది."

"నిజమే. మామూలుగా లేదని నాకూ అనిపించింది."

"సాధారణంగా పెళ్లి కాకముందే మాయమవుతారు. లేదంటే హనీమూన్ సమయంలో పోతారు. కానీ, ఇంత కచ్చితమయిన వ్యవహారం ఎక్కడా చూడలేదు. దయచేసి, వివచాలు చెపుతావా?"

"ముందే చెపుతున్నాను. అవేవీ సంపూర్తిగా లేవు."

"మనం వాటిని పూర్తి చేస్తే సరి."

"అవి ఎలాగున్నాయి అంటే, నిన్నటి పత్రికలో వాటినంతా ఒకే ఒక్క వ్యాసంగా ఇచ్చారు. చదువుతాను. శీర్షిక 'ఫ్యాషనబుల్ పెళ్లిలో సాటిలేని సంఘటన':

> *"ఈ వివాహం సంబంధంగా జరిగిన విచిత్రమయిన మరియు బాధాకరమయిన సంఘటనలతో, లార్డ్ రాబర్ట్ సెయింట్ సైమన్ గారి కుటుంబం గొప్ప సంకటంలో పడ వేయబడింది. నిన్నటి పత్రికలలో ప్రకటించినరకంగానే, పెళ్లి తంతు ఉదయం సరిగానే జరిగింది. కానీ ఇప్పటికీ గాలిలో తేలుతున్న గాలి వార్తలు నిజంగా నిజమని స్థిరం చేసే అవకాశం వచ్చింది. మిత్రులందరూ వ్యవహారాన్ని కప్పి పుచ్చాలని ప్రయత్నించినా సరే, సంగతులు ప్రజల మధ్యకు వచ్చేశాయి. అందరూ నాలుగు రకాలుగా అన్నందువల్ల అక్కడ జరిగే మంచిలేదని తేలిపోయింది.*
>
> "పెళ్లి, హానోవర్ స్క్వేర్‌లోని సెయింట్ జార్జ్‌లో

ప్రశాంతంగా జరపబడింది. పెళ్లి కుమార్తె తండ్రి మిస్టర్ అలోసియస్ డొరాన్, డచస్ ఆఫ్ బామొరాల్, లార్డ్ బ్యాక్‌వాటర్, లార్డ్ యూస్టేస్ ఇక లేడీ క్లారా సెయింట్ సైమన్ (చివరి ఇద్దరూ పెళ్లి కుమారుని సోదరుడు, సోదరి) లతోపాటు లేడీ అలీసియా విటింగ్టన్ తప్ప, అక్కడ మరెవ్వరూ లేరు. తరువాత అందరూ లాంకాస్టర్ గేట్‌లో ఉన్న మిస్టర్ అలోసియస్ డొరాన్‌గారి నివాసానికి చేరారు. అక్కడ బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయబడి ఉంది. అక్కడే, పేరు తెలియని ఒక స్త్రీ కారణంగా కొంత గొడవ జరిగింది. ఆమె పెళ్లివారితో పాటు ఇంటిలోకి చొరబడింది. లార్డ్ సెయింట్ సైమన్ మీద తనకు హక్కులు ఉన్నాయంటూ అభియోగం చేసింది. కొంత రభస జరిగిన తరువాత అమెను సిబ్బంది బయటకు పంపించగలిగారు. పెళ్లికూతురు, అదృష్టంగా, ఈ అంత రాయం జరగకముందే ఇంట్లోకి వచ్చి ఉంది. భోజనాల దగ్గర ప్రశాంతంగా ఉన్నప్పుడు ఆమె తనకు ఒంట్లో బాగులేదంటూ గదికి వెళ్లిపోయింది. ఎంతకూ ఆమె తిరిగి రాకపోవడంతో తండ్రి కూడా లోనికి వెళ్లాడు.



కానీ, లోపల మెయిడ్ చెప్పిన ప్రకారం పెళ్లి కూతురు తన గదిలోకి వచ్చి ఉన్నది ఒక్క క్షణం మాత్రమేనని, ఆమె కోటు, టోపీలను అందుకుని వెళ్లిపోయిందని తెలిసింది. ఆ రకం దుస్తులు వేసుకుని ఒక మహిళ బయటకు వెళ్లడం చూచానని సిబ్బందిలో ఒకతను చెప్పాడు. ఆమె తమ యజమాని అని మాత్రం చెప్పలేకపోయాడు. తన కుమార్తె అదృశ్యమయిందని నమ్మకం కుదిరిన తరువాత, పెళ్లికుమారునితో కలిసి మిస్టర్ అలోసియస్ డొరాన్, వ్యవహారాన్ని పోలీసుల దృష్టికి తెచ్చారు. వారు తమ శక్తియుక్తులనంతా వాడి పరి శోధిస్తున్నారు. రాత్రి పొద్దుపోయే సమయానికి అదృశ్యమయిన మహిళ గురించి, ఎటువంటి వార్తా తెలిసిన ఆచూకీ లేదు. ఈ వ్యవహారంలో కొంచెం లోతు లున్నాయని పుకార్లు పుట్టాయి. చికాకుకు కారణమయిన స్త్రీని అరెస్టు చేసినట్టు చెపుతున్నారు. అసూయ లేక మరొక కారణంతో ఆమె పెళ్లికూతురు మాయం కావడానికి కారణం అయి ఉండవచ్చునంటున్నారు.”

“ఇక అంతేనా?”

“మరొక మార్నింగ్ పేపర్‌లో ఒక చిన్న అంశం ఉంది. కానీ, అది ఊహమాత్రమే.”

“ఏమంటుంది....”

“మిస్ ఫ్లోరా మిల్లర్, అంటే ఇంట్లోకి దూరివచ్చిన ఆ మహిళ, నిజంగానే అరెస్టయింది. ఆమె ఇంతకుముందు అలెగ్రో లో డాన్స్ చేసేది. కొన్ని సంవత్సరాలుగా ఆమెకు పెళ్లికొడుకు తెలుసు. అంతకన్నా వివరాలు లేవు. ఇక కేసు మొత్తం నీ చేతిలో ఉంది, అంటే ప్రపంచానికి తెలిసింది ఇంతే అంటున్నాను.”

"చూస్తే, చాలా చాలా ఆసక్తికరమయిన కేస్‌లా ఉంది. ఏ రకంగా నయినా దీన్ని వదులుకునేవాడిని కాను. వాట్సన్, గంట మోగింది. గడియారం నాలుగు తరువాత కొన్ని నిమిషాలు చూపిస్తున్నది. వచ్చినది గౌరవనీయు లయిన క్లయింట్ కాక మరెవరో కాదు. వెళ్లిపోవాలని కలలో కూడా అనుకోకు. నాకు సాక్ష్యం ఉండడం అవసరం. నా జ్ఞాపకశక్తి మీద ఇదొక అదనపు ఏర్పాటు మాత్రమే."

"పనికుర్రవాడు తలుపు తెరిచి లార్డ్ రాబర్ట్ సెయింట్ సైమన్ వచ్చినట్టు ప్రకటించాడు. ఒక పెద్ద మనిషి ప్రవేశించాడు. ఆయన తీరు చాలా హుందాగా ఉంది. ముఖంలోనూ, నడకలోనూ రాజసం ఉట్టిపడుతున్నది. పెద్దగా తెరిచిన ఆయన కళ్లు ఆజ్ఞాపి స్తున్నట్టేగాక, వింటున్నట్టు కూడా చెపుతున్నాయి.



ఆయన వేగంగా కదులుతున్నాడు. అయినా, వయసు పెరిగిన సూచనలు కన పడుతున్నాయి. నడుస్తున్నప్పుడు మోకాళ్లు వంగు తున్నాయి. వెన్ను కూడా కొంచెం వంగింది. పెద్ద అంచుగల హాట్‌ని తీసినప్పుడు గిరజాల జుట్టు బయటపడింది. కొంచెం బట్టతల మొదలయిన సూచనలు కనిపించాయి. వేసుకున్న దుస్తులు కొంచెం డాబుగానే ఉన్నాయి. కాలర్ పెద్దది. నల్లని పై కోటు, తెల్లని వెయిస్ట్ కోటులతో పాటు పసుపురంగు చేతి తొడుగులు, చర్మపు కాలిజోళ్లు లాంటివన్నీ తీరును తెలుపుతున్నాయి. ఆయన నెమ్మదిగా గదిలోకి వచ్చాడు. చేతిలోని దారం సాయంతో బంగారు కళ్ల జోడును అటు ఇటూ కదిలిస్తూ, రెండు

పక్కలకూ చూశాడు.

"గుడ్ డే, లార్డ్ సెయింట్ సైమన్, దయచేసి బాస్కెట్ చైర్‌లో కూచోండి. ఈయన నా మిత్రుడు, సహచరుడు, డాక్టర్ వాట్సన్. మంటకు కొంచెం దగ్గరగా జరిగి కూచోండి. మనం మాట్లాడుకుందాం" అన్నాడు హొూమ్స్, లేచి వంగి నమస్కరిస్తూ.

"అన్నిటికన్నా, బాధాకరమయిన విషయం ఇది నాకు. మీకు అర్థమయ్యే ఉంటుంది. మిస్టర్ హొూమ్స్, నన్ను తెగేసినట్టు ఉంది. మీరు ఇప్పటివరకే, ఈ రకమయిన సున్నితమయిన వ్యవహారాలు చాలా చూచారని నేను ఎరుగుదును. సర్, అవి ఒకరకంగా మావంటి వర్గానికి చెందినవి కాకపోవచ్చునని అనుకుంటున్నాను."

"లేదు. నేను ఒక మెట్టు దిగుతున్నాను."

"క్షమించాలి. ఏమన్నారు?"

"నా చివరి క్లయింట్ ఒకరకంగా మహారాజు."

"నిజంగానా? నాకు తెలియదు. ఏ దేశపు రాజు?"

"స్కాండినేవియా ప్రభువు."

"ఏమిటి! ఆయన భార్య కూడా కనిపించడం లేదా?"

"నా యితర క్లయింట్ల వ్యవహారాలు, మీ వ్యవహారంలాగే పూర్తిగా రహస్యంగా ఉంచుతానని మీరు అర్థం చేసుకునే ఉంటారు" అన్నాడు హొూమ్స్ నర్మంగా.

"అవునవును! నిజం! చాలా చక్కని మాట! క్షమించమని అడుగుతున్నాను అనుకుంటున్నాను. ఇక నా కేస్ సంగతి.. ఒక అభిప్రాయానికి రావడానికి మీకు కావలసిన ఏ సమాచారాన్నయినా అందించడానికి నేను సిద్ధంగా ఉన్నాను."

"థాంక్యూ. ప్రజల మధ్యకు వచ్చిన వివరాలన్నింటినీ నేను తెలుసుకున్నాను. ఆ పైన తెలియదు. వధువు కనిపించకుండా పోవడం గురించి వచ్చిన ఈ వ్యాసం నిజమే అనుకుంటాను."

లార్డ్ సెయింట్ సైమన్ దానివేపు చూచాడు. "అవును నిజమే" అన్నాడు.

"కానీ, ఒక అభిప్రాయం అందించేముందు తెలియవలసింది చాలా ఉంది. తమరిని కొన్ని ప్రశ్నలు అడిగి నిజాలు సేకరించవచ్చని నా అభిప్రాయం."

"దయచేసి కొనసాగించండి."

"మీరు మిస్ హాటీ డొరాన్‌ను మొదటిసారిగా ఎప్పుడు కలిశారు?"

"శాన్ ఫ్రాన్సిస్కోలో, ఒక ఏడాది క్రితం."

"మీరు స్టేట్స్‌లో పయనిస్తున్నారా?"

"అవును."

"మీకు ఎంగేజ్‌మెంట్ జరిగిందా?"

"లేదు."

"కేవలం నేస్తాలుగా కొనసాగారు."

"ఆమె తీరు నాకు సరదాగా ఉంది. ఆమె నన్ను సరదాపరిచింది."

"వాళ్ల తండ్రి బాగా ధనవంతులా?"

"పసిఫిక్ స్లోప్ ప్రాంతంలో అందరికన్నా ధనవంతుడు అన్నారు."

"ఆయనకు డబ్బు ఏదారిన వస్తుంది?"

"గనులు ఉన్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం ఏమీ ఉండేది కాదు. అప్పుడిక బంగారం పండింది. పెట్టుబడులు పెట్టి అంచెలంచెలుగా సంపాయించారు."

"ఇక ఆ యువతి గురించి, అంటే మీ భార్య వ్యక్తిత్వం గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

ఆ రాచబిడ్డ చేతిలో కళ్లజోడును మరింత వేగంగా కదిలించాడు. మంట వేపు తీవ్రంగా చూచాడు. "చూడండి, మిస్టర్ హోమ్స్, తండ్రి ధనవంతుడయ్యేసరికి నా భార్య వయసు 20 సంవత్సరాలు. ఆ సమయంలో ఆమె గనుల ప్రాంతంలో హాయిగా తిరిగింది. కొండలు, అడవుల్లో తిరిగింది. కనుక ఆమె చదువు బడిపంతులు ముందుకాక ప్రకృతి ఒడిలో సాగిందీ అనాలి. ఇంగ్లండ్‌లో మనం అటువంటివారిని టామ్‌బాయ్ అంటాము. స్వాతంత్రం, దుడుకుతనం, గట్టి ప్రకృతిగల మనిషి. పాత పద్ధతుల పట్టింపు లేదు. చాలా భావావేశంగల మనిషి. అగ్ని పర్వతం అందామనుకున్నాను. చటుక్కున నిర్ణయాలు చేస్తుంది. వాటిని నిర్భయంగా అమలు చేస్తుంది. లేకుంటే నా యింటి పేరును ఆమె పేరుకు జత చేసే ఆలోచన వచ్చి ఉండేదే కాదు" అంటూ ఆయన ఒకసారి హుందాగా దగ్గాడు. "ఆమెలో రాచరికపు లక్షణాలు ఏదో మూలన కనిపించకపోతే, అన్నమాట! ఆమెలో ఆత్మత్యాగం లాంటి లక్షణాలు ఉన్నాయి. పైగా, గౌరవానికి భంగం కలిగించే తీరు ఎక్కడా కనిపించలేదు."

"ఆవిడ ఫొటోగ్రాఫ్ ఉందా?"

"తెచ్చాను."

ఆయన ఒక లాకెట్‌ను విప్పి చాలా అందమయిన ఒక స్త్రీ ముఖాన్ని అందులో చూపించాడు. అది నిజానికి ఫొటోగ్రాఫ్ కాదు. ఏనుగు దంతంలో మలిచిన మినియేచర్ శిల్పం. ఆమె నల్లని జుట్టు, నల్లని పెద్ద కళ్లు, అందమయిన నోరు లాంటి వివరాలన్నింటినీ కళాకారుడు చాలా బాగా ఆవిష్కరించాడు. హోమ్స్ చాలాసేపు, ధ్యానంతో దాన్ని చూచాడు. తరువాత లాకెట్‌ను మూసి తిరిగి లార్డ్ సెయింట్ సైమన్‌కు అందించాడు.

"అయితే యువతి లండన్‌కు వచ్చారు. అప్పుడు మీరు మీ పరిచయాన్ని

పునరుద్ధరించారు?"

"అవును. తండ్రి ఆమెను గడిచిన లండన్ సీజన్‌కు, వెంటపెట్టుకు వచ్చారు. ఆమెను చాలాసార్లు కలిశాను. ఎంగేజ్‌మెంట్ జరిగింది. పెళ్లాడాను."

"ఆమె చాలా డబ్బు, వెంట తెచ్చారని విన్నాను?"

"పెద్ద మొత్తమే. అయితే, మా కుటుంబంలో మామూలుగా వచ్చే మొత్తానికి ఎక్కువ మాత్రం కాదు."

"సహజంగానే. పెళ్లికి ముందురోజున మీరు మిస్ డొరాన్‌ను చూచారా?"

"అవును."

"ఆమె మంచి మూడ్‌లోనే ఉన్నారా?"

"అంతకన్నా మంచి మూడ్‌లో ఎన్నడూ ఉండలేదు. ముందు జీవితం గురించి మాట్లాడుతూనే ఉన్నారు. "

"బాగుంది. ఇది చాలా ఆసక్తికరంగా ఉంది. ఇక పెళ్లినాటి ఉదయం సంగతి?"

"ఆమె చేతనయినంత హుషారుగా ఉన్నారు. కనీసం తంతు ముగిసే వరకూ."

"అప్పుడు మీరు ఆమెలో ఏమయినా మార్పులు చూచారా?"

"వెల్, నిజం చెప్పాలంటే ఆమె ధోరణి అంత తీవ్రంగా ఉంటుందన్న మొదటి సూచన నాకు అప్పుడే అందింది. జరిగినది చెప్పవలసినంత పెద్ద విషయం కాదు. కేసు మీద ఎటువంటి ప్రభావమూ చూపదు."

"ఎందుకయినా మంచిది, దయచేసి చెప్పండి."

"ఓహ్! చిన్నపిల్లల వ్యవహారం. మేము ముందుకు వెళుతుంటే, ఆమె

పూలగుత్తి పడేసుకున్నది. ముందు బెంచీ పక్కగా పోతుండగా పూలగుత్తి పడిపోయింది. ఒక్క క్షణం ఆగవలసి వచ్చింది. అక్కడ కూచున్న పెద్దమనిషి దాన్ని ఆమెకు తిరిగి అందించాడు. అది ఏమాత్రం పాడు కూడా కాలేదు. కానీ, నేను ఆ సంగతి గురించి మాట్లాడితే ఆమె కరకుగా జవాబిచ్చింది. ఆ చిన్న సంఘటనతో, బండిలో తిరిగివచ్చేప్పుడు కూడా చాలా కలతపడినట్టు కనిపించింది.'

"నిజంగానా! ముందుబెంచీ మీద ఒక పెద్ద మనిషి ఉన్నాడన్నారు. అంటే అక్కడ కొంతమంది మామూలు జనం ఉన్నారన్న మాట?"

"అవునుమరి. చర్చి తెరిచి ఉన్నప్పుడు వాళ్లను రానీయకుండా ఉండ లేము కదా?"

"ఆ పెద్దమనిషి మీ ఆవిడగారి నేస్తులలో ఒకరా?"



"లేదు లేదు. నేను ఏదో గౌరవంకొద్దీ పెద్దమనిషి అన్నాను. కానీ అతను చాలా మామూలు మనిషి. నేను ఎక్కువగా పట్టించు కోనుకూడా లేదు. కానీ, మనం అసలు విషయం నుంచి మరెక్కడికో పక్కకు పోతున్నట్టు ఉన్నాము."

"అంటే లేడీ సెయింట్ సైమన్ పెళ్లి నుంచి తిరిగివచ్చే టప్పుడు ఒకరకంగా వెళ్లినప్పుడు ఉన్న మానసిక పరిస్థితిలో లేరు. తండ్రి ఇంటికి చేరిన తరువాత ఆమె ఏం చేశారు?"

"తన మెయిడ్‌తో మాట్లాడుతుండగా చూచాను."

"ఇక ఈ మెయిడ్ ఎవరు?"

"ఆమె పేరు ఆలీస్. ఆమె అమెరికన్. కాలిఫోర్నియా నుంచి తనతోపాటే వచ్చింది."

"అంటే సన్నిహితురాలన్నమాట."

"కొంచెం ఎక్కువగానే. యజమానురాలు ఆమెకు కొంచెం ఎక్కువ స్వతంత్రమే ఇచ్చినట్టు కనపడింది. కానీ నిజానికి అమెరికాలో ఇటువంటి వ్యవహారాలను మరో రకంగా చూస్తారు."

"ఆమె ఆలీస్‌తో ఎంతసేపు మాట్లాడారు?"

"కొన్ని నిమిషాలు. నేను పట్టించుకోలేదు."

"వాళ్ల మాటలు వినలేదంటారా?"

"లేడీ సెయింట్ సైమన్ 'జంపింగ్ ఎ క్లెయిమ్' లాంటిదేదో అన్నారు. ఆ రకం యాసమాటలు ఆమెకు అలవాటే. అర్థమేమిటో నాకు తెలియదు."

"అమెరికన్ యాసల్లో కొన్నిసార్లు లోతయిన అర్థాలుంటాయి. మెయిడ్‌తో మాట్లాడిన తరువాత మీ ఆవిడ ఏం చేశారు?"

"నడిచి బ్రేక్‌ఫాస్ట్ రూమ్‌లోకి వచ్చారు."

"మీ చేతిలో చేయి వేసుకునా?"

"లేదు. ఒంటరిగానే. ఇటువంటి చిన్న వ్యవహారాలలో ఆమె మరీ స్వతంత్రత చూపించేది. ఇక అక్కడ సుమారు పది నిమిషాలు కూచున్నాము. అంతలో ఆమె వేగంగా లేచింది, క్షమాపణలుగా నాలుగు మాటలు గొణిగి వెళ్లిపోయింది. మళ్లీ తిరిగిరాలేదు."

"కానీ, ఆలీస్ అనే మెయిడ్ చెప్పిన ప్రకారం, ఆమె గదికి వెళ్లి పెళ్లి దుస్తులను కప్పే విధంగా పొడుగాటి కోటు వేసుకుని, టోపీ పెట్టుకుని

వెళ్లిపోయారన్నారు."

"నిజమే. ఆ తరువాత ఆమె హైడ్ పార్కులో ఫ్లోరా మిల్లర్‌తో నడుస్తూ కనిపించారట! ఆ రెండవ మనిషి ప్రస్తుతం అరెస్టయి ఉంది. మిస్టర్ డోరాన్ వాళ్ల ఇంట్లో ఆ ఉదయం గోల చేసిన మనిషి ఆవిడే."

"అవును. ఆ యువతి గురించి కొంత సమాచారం కావాలి. ఆమెతో మీ సంబంధం గురించి కూడా."

లార్డ్ సెయింట్ సైమన్ భుజాలు ఎగురవేశాడు. కనుబొమలు పైకెత్తాడు. "మేము కొన్ని సంవత్సరాలుగా స్నేహితులుగా ఉంటున్నాము. స్నేహం కొంచెం ఎక్కువగానే ఉన్నట్టుంది. ఆమె అలెగ్రోలో పనిచేసేది. నేను ఆమెకు అన్యాయం ఏమీ చేయలేదు. నా గురించి ఆమె ఫిర్యాదు చేయవలసిన పరిస్థితి లేదు. కానీ మీకు ఆడవాళ్ల సంగతి తెలుసుకదా. మిస్టర్ హోమ్స్, ఫ్లోరా చాలా మంచి మనిషి. కానీ, కొంచెం దురుసురకం నా మీద బోలెడు ప్రేమ. నేను పెళ్లి చేసుకోబోతున్నానని తెలిసి భయంకర మయిన ఉత్తరాలు రాసింది. నిజం చెప్పాలంటే, ఆ సందర్భంగా చర్చిలో అనవసరమయిన గొడవ జరగకూడదనే, పెళ్లిని అంత మామూలుగా జరిపించాలని నిశ్చయించాను. అయితే ఆమె పెళ్లి ముగిసిన తరువాత మిస్టర్ డోరాన్ ఇంటికే వచ్చేసింది. తోసుకుని లోపలికి దూరింది. నా భార్యను నానా దుర్భాషలాడింది. భయపెట్టింది కూడా. అటువంటిదేదో జరుగుతుందని ముందే ఊహించాను కనుక, నేను ఇద్దరు పోలీసువాళ్లను అక్కడ మామూలు దుస్తులలో ఉండేట్లు ఏర్పాటు చేశాను. వాళ్లు ఆమెను బయటికి తోసేశారు. ఇక అక్కడ గోల చేసి లాభం లేదని అర్థమయిన తరువాత ఆమె ఊరుకుండిపోయింది."

"ఇదంతా మీ ఆవిడ విన్నారా?"

"మంచి పనయింది. వినలేదు."

"ఆ తరువాత ఆమె అదే ఆడమనిషితో నడుస్తూ కనిపించారు?"

"అవును. స్కాట్లాండ్‌యార్డ్ ఇన్‌స్పెక్టర్ మిస్టర్ లెస్ట్రేడ్ అలాగనే చెప్పారు. ఆయన దాన్ని సీరియస్ సంగతి అంటున్నారు. ఫ్లోరా మా ఆవిడను మోసపుచ్చి వశం చేసుకుందని ఆయన అనుమానం."

"అది జరిగే వీలున్న ఆలోచనే."

"మీరూ అదే మాట అంటున్నారా?"

"నేను జరిగగలిగింది అనలేదు. మీకు మాత్రం అది సంభావ్యంగా తోచినట్టు లేదు."

"ఫ్లోరా ఒక పురుగుకు కూడా హాని తలపెట్టదు."

"అయినా, అసూయతో మనుషుల లక్షణాలు చిత్రంగా మారి పోతాయి. జరిగినదాని గురించి ఇంతకూ, మీరు ఏమనుకుంటున్నారు?"

"వెల్, నిజానికి నేను ఒక సిద్ధాంతం కొరకు వచ్చాను. సిద్ధాంతం చెప్పడానికి కాదు. వాస్తవాలన్నీ మీ ముందు ఉంచాను. అయినా, అడుగు తున్నారు కనుక చెపుతున్నాను. జరుగుతున్న వ్యవహారం కారణంగా, సంఘంలో తన స్థాయి ఒక్కసారిగా పెరిగిపోయినందుకు నా భార్యకు పట్టరాని ఉద్రేకం కలిగిందేమో అని అనుకుంటున్నాను."

"అంటే, ఒక్కసారిగా స్థిమితం చెడిందంటారా?"

"నిజంగా ఆమె అలా వెళ్లడం, అది నా వల్ల మాత్రం కాదు. అందరూ అటువంటిదేదో జరగాలని చాలా ప్రయత్నమే చేశారు. ఇక ముందుకు నాకేమీ అర్థం కావడం లేదు."

"అవును. ఇక్కడ కూడా ఒక ఊహాసిద్ధాంతం ఉంది" అన్నాడు హోమ్స్ మెల్లగా నవ్వుతూ. "ఇక లార్డ్ సెయింట్ సైమన్, నాకు అవస రమయిన సమాచారమంతా అందినట్టే ఉంది. ఒక్కమాట అడగ వచ్చునా? మీరు బ్రేక్‌ఫాస్ట్ దగ్గర, కిటికీలోనుంచి దృశ్యం కనపడే విధంగా కూచున్నారా?"

"మేము రోడ్డు అవతల, పార్కులోదాకా చూడగలిగాము."

"బాగుంది. ఇక మిమ్మల్ని ఎక్కువసేపు ఆపే పనిలేదు. సంగతి మీకు తెలియజేస్తాను."

"అంటే సమస్యకు సమాధానం అదృష్టం కొద్దీ దొరికితేనన్నమాట" కుర్చీలోనుంచి లేస్తూ మా క్లయింట్ అన్నారు.

"సమాధానం దొరికింది."

"ఏహ్! ఏమన్నారు?"

"చిక్కుముడి విప్పాను అన్నాను."

"అయితే మా ఆవిడగారు ఎక్కడున్నారు?"

"ఆ సమాచారం త్వరలోనే అందజేస్తాను."

లార్డ్ సెయింట్ సైమన్ తల ఆడించారు. "అందుకొరకు మీకన్నా, నా కన్నా, తెలివిగల తల అవసరమని నా భయం" అన్నారు రాజసం పద్ధతిలో ఒకసారి వంగి వెళిపోయారు.

"లార్డ్ సెయింట్ సైమన్ తమ తలతో, నా తలను కూడా సమంగా నిలిపి గొప్పగానే చెప్పారు. ఇక నేను కొంచెం విస్కీ, సోడా తీసుకుని సిగర్ తో కాలం గడుపుతాను. ప్రశ్నలన్నీ చికాకు పుట్టించాయి. మన క్లయంట్ గదిలోకి రాకముందే నేనేమో కేసు గురించి నిర్ణయానికి వచ్చేశాను" అన్నాడు షెర్లక్ హోమ్స్ నవ్వుతూ.

"మైడియర్ హోమ్స్!"

"నా దగ్గర ఇటువంటి కేసుల వివరాలు చాలా ఉన్నాయి. కానీ నేను ఇంతకుముందే అన్నట్టు అవి ఈ కేసులాంటివి మాత్రం కావు. జరిగిన విచారణ అంతా నా ఆలోచన నిజమని రుజువు చేసింది. సందర్భపరంగా దొరికిన సాక్ష్యాలు అనుకూలంగా ఉన్నాయి. కవి తొరో అన్నట్టు పాలకుండలో పెద్ద చేప దొరికినట్టుంది."

"కానీ, నీవు విన్న మాటలన్నీ నేనూ విన్నాను."

"కానీ, నీ దగ్గర అంతకుముందటి కేసుల గురించి నాకు తెలిసిన సంగతులు లేవుకదా? కొన్ని సంవత్సరాల క్రితం ఆబర్డీన్‌లో అచ్చంగా ఇటువంటిదే ఒక సంఘటన జరిగింది. ఫ్రాంకో-ప్రుస్సియన్ యుద్ధం తరువాత ఒక సంవత్సరానికి మునిచ్‌లో కూడా అలాంటిదే జరిగింది. అంతా ఒకేరకం. కానీ, హలో, అదుగో లెస్ట్రేడ్! గుడ్ ఆఫ్టర్‌నూన్ లెస్ట్రేడ్! బల్లమీద మరో ఖాళీ గ్లాసు ఉంది. పక్కనే పెట్టెలో సిగర్స్ కూడా ఉన్నాయి."

అఫీషియల్ డిటెక్టివ్ మామూలు దుస్తులలో ఉన్నాడు. అతనిప్పుడు సముద్ర యాత్రికుడిలా కనిపిస్తున్నాడు. చేతిలో ఒక నల్లని కాన్వాస్ సంచి ఉంది. ఒక్కమాటతో నమస్కారం చెప్పి అతను కూచున్నాడు. అందించిన చుట్టను వెలిగించుకున్నాడు.

"ఏం జరుగుతున్నది? నీవేదో అసంతృప్తితో కనిపిస్తున్నావు?" కళ్లలో మెరుపుతో అడిగాడు హెూమ్స్.

"అసంతృప్తిగా ఉన్నాను. సెయింట్ సైమన్ పెళ్లి గురించిన మంటల కేస్. అందులో నాకు తల, తోకా అందడం లేదు."

"నిజంగానా? ఆశ్చర్యంగా ఉందే."

"ఇంత గజిబిజి వ్యవహారం మరోటి ఉండదు. క్లూలన్నీ జారి పోతున్నాయి. రోజంతా అదే పనిలో తిరిగాను."

"పనిలో మొత్తం తడిసిపోయినట్టున్నావు?" అన్నాడు హెూమ్స్ తడిసిన అతని కోటు చేతిని తాకుతూ.

"సర్పెంటైన్‌ని మొత్తంగా కదిలించాను."

"ఎందుకోసమని?"

"లేడీ సెయింట్ సైమన్ శరీరం కోసం."

షెర్లక్ హెూమ్స్ తన కుర్చీలో వెనుకకు వాలి, మనస్ఫూర్తిగా నవ్వాడు.

"ట్రఫాల్గర్ స్క్వేర్‌లోని ఫౌంటేన్‌ను కదిలించకపోయావా?" అడిగాడు.

"ఎందుకు? ఏమిటి మీ ఉద్దేశం?"

"రెంటిలోనూ ఆవిడగారు దొరికే అవకాశం అంతంతే కనుక."

లెస్ట్రేడ్ నా మిత్రునివేపు కోపంగా ఒక్కసారి చూచాడు. "మీకు అంతా తెలిసినట్టు ఉంది"అన్నాడు.

"ఇప్పుడిప్పుడే విషయమంతా విన్నాను. నిర్ణయం కూడా చేసేశాను."

"అవునేమిటి? అయితే వ్యవహారంలో సర్పెంటైన్ ప్రమేయం లేదంటారా?"

"ఉండదనే అనుకుంటాను."

"అయితే, అక్కడ దొరికిన వీటి గురించి దయచేసి వివరిస్తారా?" అంటూ అతను చేతిలోని సంచీ విప్పాడు. బోర్లిస్తే అందులోనుంచి తడిసిన పెళ్లి దుస్తులు, శాటిన్ జోళ్ల జత, పూలగుత్తి, ముసుగు కిందకు జారాయి. తడిసినందుకు అవన్నీ రంగు వెలిసి ఉన్నాయి. పెళ్లి ఉంగరం ఒకదాన్ని పైన పెడుతూ "చూచారా, ఇక్కడ మీకు విప్పడానికి గట్టి చిక్కుముడి దొరికింది, మాస్టర్ హోమ్స్" అన్నాడు.



"నిజంగానే! వీటిని సర్పెంటైన్‌లోనుంచి వెలికి లాగావా?" అన్నాడు నా మిత్రుడు నీలి పొగలను రింగులుగా గాలిలోకి వదులుతూ.

"లేదు. పార్క్ కీపర్ ఒకతను వీటిని నీటి అంచున తేలుతుండగా చూచాడు. ఇవి ఆమె దుస్తులేనని తెలిసింది. దుస్తులు ఉన్నాయంటే ఇక ఆమె కళేబరం కూడా దగ్గరలోనే ఉంటుందని అనిపించింది."

"ఈరకంగా చూస్తే, ప్రతి మనిషి దుస్తుల అల్మారా పక్కనా ఆ శరీరం కూడా ఉండాలంటావా? ఇంతకు ఏం తేల్చుకున్నావు?"

"ఆమె మాయం కావడంలో ఫ్లోరా మిల్లర్ పాత్ర ఉందని సాక్ష్యం దొరికింది"

"కానీ, నిరూపించడం కష్టమేమో?"

"ఏమంటున్నారు? మిస్టర్ హొూమ్స్, మీరు చేసే నిర్ణయాలు, ఆలోచనలు కొన్నిసార్లు ప్రాక్టికల్‌గా ఉండవని అనుమానం. రెండు నిమిషాలలో రెండు పొరపాట్లు చేశారు. ఈ డ్రస్ మిస్ ఫ్లోరామిల్లర్‌ను కేసులో ఇరికిస్తుంది."

"అదెట్లాగా?"

"డ్రస్‌లో ఒక జేబు ఉంది. జేబులో ఒక కార్డ్ కేస్ ఉంది. కార్డ్‌కేస్‌లో ఒక నోటు ఉంది. ఇదే ఆ నోటు మరి" అంటూ అతను ఒక కాగితాన్ని బల్ల మీద తపక్కున పెట్టాడు. "వినండి. ఏం రాసి ఉందో..

> "అంతా సిద్ధమయినాక నన్ను కలువు. వెంటనే వచ్చేయి.
>
> ఎఫ్‌ఎచ్‌ఎం."

"ఇంతసేపూ నేను లేడీ సెయింట్ సైమన్‌ను ఏదోరకంగా ఫ్లోరా మిల్లర్ వశపరచుకున్నదని చెపుతున్నాను. కొందరి సాయంతో ఆమె మాయమయ్యే ఏర్పాట్లు కూడా ఆమె చేసింది. ఆమె సంతకంతో ఇప్పుడు నోట్ కూడా



దొరికింది. దీన్ని ఆమె నెమ్మదిగా అందించి ఉంటుంది."

"వెరీగుడ్, లెస్ట్రేడ్. నీవు చెప్పేదంతా బాగానే ఉంది. నన్ను చూడనీ'' అంటూ నిర్లక్ష్యంగా హోమ్స్ కాగితాన్ని అందుకున్నాడు. కానీ వెంటనే అతని చూపు తీరు మారింది. సంతృప్తిగా ఒక్క చప్పుడు చేశాడు. ''ఇది నిజంగా పనికి వచ్చేది'' అన్నాడు.

"హా! నిజంగానా?"

"తప్పకుండానూ. నిన్ను నేను అభినందిస్తున్నాను."

లెస్ట్రేడ్ విజయగర్వంతో లేచాడు. వంగి చూస్తూ "అదేమిటి? కాగితం వెనక చూస్తున్నారు!" అరిచాడు.

"కాకపోగా, అదే సరయిన దిక్కు."

"సరయినదా? మీకు పిచ్చా? పెన్సిల్‌తో రాసిన నోట్ అటుపక్కన ఉంటే!"

''ఇటుపక్కన హొటేల్ బిల్లు వివరాలున్నాయి. అది నాకు ఆసక్తికరమయిన సంగతి."

"అందులో ఏం లేదు. నేను కూడా చూచాను" అన్నాడు లెస్ట్రేడ్.

"అక్టోబర్ 4, గదికి 8ఎస్, బ్రేక్‌ఫాస్ట్ 2 ఎస్. 6డి., కాక్‌టెయిల్ 1ఎస్., లంచ్ 2ఎస్., 6డి., గ్లాస్ షెరీ 8 డి., ఇందులో ఏంలేదు."

"నిజంగానే. కానీ అది చాలా ముఖ్యం. ఇక నోట్ కూడా ముఖ్యమే. కనీసం పేరు రాసిన పొడి అక్షరాలు. కనుక నేను నిన్ను మరోసారి అభినందిస్తున్నాను."

"నేను కాలయాపన చేశాను. నాకు కష్టపడి పనిచేయడం తెలుసు. వెచ్చగా కూచుని పిచ్చి సిద్ధాంతాలు చేయడం నచ్చదు. గుడ్ డే మిస్టర్ హోమ్స్. ఇక వ్యవహారం ఏరకంగా కొలిక్కి వస్తుందో చూద్దాం" అంటూ అతను దుస్తులను పోగుచేసుకుని, సంచీలో కుక్కి బయటకు వెళ్లసాగాడు.

"నీకు ఒక్క సూచన, లెస్ట్రేడ్. విషయానికి సంబంధించి ఒక నిజ మయిన వివరం చెపుతాను. లేడీ సెయింట్ సైమన్ ఒక మిథ్య. అటువంటి వ్యక్తి లేదు, ఇంతకు ముందు కూడా ఉండలేదు" సాగదీస్తూ చెప్పాడు హోమ్స్.

లెస్ట్రేడ్ నా సహచరుడి వేపు జాలిగా చూచాడు. నా వేపు చూచి నుదుటి మీద మూడుసార్లు కొట్టుకున్నాడు. గౌరవంగా తల ఆడించి వెళ్లి పోయాడు. అతను తలుపును ధడాల్న మూశాడు. మరుక్షణం హోమ్స్ లేచి తన ఓవర్ కోట్ వేసుకున్నాడు. "బయటపడి పనిచేయడం గురించి అతను మాటల్లో నిజముంది. కనుక వాట్సన్, నేను కొంచెంసేపు నిన్ను నీ పత్రికలతో వదిలేస్తాను" అన్నాడు.

షెర్లక్ హోమ్స్ బయలుదేరినప్పుడు అయిదు గంటలు దాటింది. నేను ఎక్కువకాలం ఒంటరిగా ఉండనే లేదు. ఒక గంట లోపలే ఒక పెద్ద పెట్టెతో ఒక మనిషి వచ్చాడు. వెంట వచ్చిన కుర్రవాని సాయంతో, ఆశ్చర్యంగా అతను ఆ అట్టెపెట్టె తెరిచాడు. అందులోనుంచి రాత్రి భోజనానికి కావలసిన సరంజామా, సరుకులన్నింటినీ బల్లమీద సర్దడం మొదలుపెట్టాడు. అందులో రెండు ఉడ్‌కాక్ కోళ్లున్నాయి. మరొక పక్షి కూడా ఉంది. కొంత తీపి పదార్థం ఉంది. రకరకాల చిన్న చిన్న సీసాలు కూడా ఉన్నాయి. వెలగల ఆ భోజ నాన్నంతా బల్లమీద సర్దిన తరువాత, వచ్చినవాళ్లిద్దరూ, అరేబియన్ నైట్స్‌లో

భూతాలలాగ మాయమయ్యారు. డబ్బులు చెల్లించారని, ఈ అడ్రస్‌లో ఇచ్చి రమ్మన్నారని తప్ప వాళ్లు ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు.

తొమ్మిది అవుతుండగా, షెర్లక్ హెూమ్స్ గదిలోకి వడిగా వచ్చేశాడు. ముఖం గంభీరంగా ఉంది. కానీ, కళ్లలో మాత్రం మెరుపు ఉంది. ప్రయత్నాలలో అతను విఫలుడు కాలేదనే నాకు తోచింది.

"అయితే, భోజనం సిద్ధం చేశారన్నమాట!" అంటూ అతను చేతులు రుద్దుకున్నాడు.

"ఎవరో వస్తున్నట్టున్నారు. ఏర్పాట్లు అయిదుగురి కొరకు చేశారు."

"అవును. ఎవరో వస్తున్నారని అనుకుంటున్నాను. లార్డ్ సెయింట్ సైమన్ ఇంకా రాలేదని ఆశ్చర్యపోతున్నాను. హా! మెట్ల మీద చప్పుళ్లు వినపడుతున్నట్టున్నాయి" అన్నాడు అతను.

మధ్యాహ్నం వచ్చిన అతిథి మళ్లీ వచ్చాడు. ఈసారి కళ్లజోడును మరింత వేగంగా కదిలిస్తున్నాడు. ముఖం మీద రాచఠీవితో పాటు కొంచెం కలవరం కనపడుతున్నది.

"అయితే, మీకు వర్తమానం అందిందన్నమాట" అడిగాడు హెూమ్స్.

"అవును. విషయం తెలిసి అంతులేకుండా ఆశ్చర్యపోయాను. మీరు బాగా తెలుసుకునే చెపుతున్నారా?"

"అంతకంటే, బాగా ఇక కుదరదు."

లార్డ్ సెయింట్ సైమన్ ఒక కుర్చీలో చేరబడి, చేతితో నుదుటిని రాసుకున్నాడు.

"కుటుంబంలో ఒక వ్యక్తికి ఇంతటి అవమానం జరిగిందంటే డ్యూక్ ఏమంటారో?" ఆయన గొణిగాడు.

"అంతా అనుకోకుండా జరిగింది. ఇందులో అవమానం ఏముంది?"

"ఆహా! విషయాన్ని మీరు మరోవేపు నుంచి చూస్తున్నారు."

"ఇందులో ఎవరినీ నిందించడానికి లేదంటున్నాను. ఆమెగారు ఇంకొకరకంగా చేయడానికి వీలే లేదని నాకు తోస్తుంది. అయితే, చేసిన తీరు మాత్రం కొంచెం బాగాలేదనడంలో అనుమానం లేదు. తల్లి లేని మనిషి. కష్టాలలో సలహా ఇచ్చేవారు ఎవరూ లేరు."

"తీవ్రమయిన అవమానం, అందరి మధ్యనా అవమానం!" వేళ్లను బల్లమీద కొడుతూ అన్నాడు లార్డ్ సెయింట్ సైమన్.

"పాపం ఆవిడను తమరు దయచూడాలి. అనుకోకుండా చిక్కుల్లో పడింది."

"అటువంటిదేమీ లేదు. నాకు నిజానికి చాలా కోపంగా ఉంది. నన్ను అన్యాయంగా ఇరికించారు."

"బెల్ వినపడినట్టుంది. అవును, కాళ్ల చప్పుళ్లు కూడా! లార్డ్ సెయింట్ సైమన్, వ్యవహారంలో తమరు కొంత పట్టువిడుపులు చూపించాలని అభ్యర్థిస్తున్నాను. మీరు వినని పక్షంలో, ఆ పని మరింత బాగా చేయడానికి మరొక వ్యక్తి మీ ముందుకు వస్తాడు" అంటూ తలుపు తెరిచాడు. ఒక స్త్రీ, వెంట మరొక వ్యక్తీ లోపలికి వచ్చారు. "లార్డ్ సెయింట్ సైమన్ తమరికి, మిస్టర్ అండ్ మిసెస్ ఫ్రాన్సిస్ హే మౌల్టన్ దంపతులను పరిచయం చేయడానికి అనుమతినివ్వండి. ఈ మహిళలను మీరు ఇంతకుముందే ఎరుగుదురు" అన్నాడు.

వచ్చినవారిని చూడగానే, మా క్లయింట్ ఒక్క ఉదుటున లేచి నిటారుగా నిలబడ్డాడు. నేల చూపులు చూస్తున్నాడు. రెండు చేతులను ఎదమీద కోటు జేబుల్లో పెట్టుకున్నాడు. గౌరవానికి భంగం కలిగిన మూర్తిలాగున్నాడు ఆయన!

వచ్చిన స్త్రీ ఒక్క అడుగు ఆత్రంగా ముందుకు వేసింది. చేతిని ముందుకు



అందించింది. అయినా ఆయన కళ్లు ఎత్తలేదు. ఆమె ముఖంలో ఎంతో దీనత్వం కనపడుతున్నది. కానీ, బహుశా ఆయన గట్టి పట్టుదలతో ఉన్నాడు.

"రాబర్ట్, మీకు బాగా కోపం వచ్చినట్టుంది. అందుకు తగిన కారణం ఉందిలెండి" అన్నది ఆమె.

"నాకు క్షమాపణలు అవసరం లేదు" కటువుగా అన్నాడు లార్డ్ సెయింట్ సైమన్.

"అవును. నేను చాలా అన్యాయంగా ప్రవర్తించాను. వెళ్లిపోయేముందు మీతో చెప్పి ఉండవలసింది. కానీ, చాలా కలవరంలో ఉన్నాను. ఫ్రాంక్‌ను మళ్లీ కలిసే వరకూ నా చేతలు, మాటలూ నాకు అర్థం కానేలేదు. చర్చిలోనే ఎందుకు మూర్ఛపోలేదా అని ఆశ్చర్యపోతున్నాను."

"మిసెస్ మౌల్టన్, బహుశా నేనూ నా మిత్రుడు, ఇక్కడినుంచి బయటకు పోతే, మీరు బాగా మాట్లాడుకోగలరేమో?"

"నన్ను అడిగితే, ఈ వ్యవహారాన్ని అనవసరంగా రహస్యంగా ఉంచి

నట్టున్నాము. నాకు తెలిసి, వివరాలను మొత్తం యూరప్, అమెరికాలలో వింటేనే బాగుంటుంది" అన్నాడు కొత్తగా వచ్చిన పెద్దమనిషి. అతను బక్కపలచని చిన్న ఆకారం కలవాడు. శుభ్రంగా గీసుకున్న ఆ మొహంలో చురుకుతనం కనపడుతున్నది.

"అయితే, సూటిగా మా కథ చెపుతాను. నేనూ, ఫ్రాంక్ అనే ఇతనూ 84లోనే కలిశాము. నాన్న పనిచేస్తుండిన రాకీస్‌లోని క్యాంప్‌లో అన్నమాట. మాకు, అంటే ఫ్రాంక్‌కూ, నాకూ అన్నమాట; అప్పుడు ఎంగేజ్‌మెంట్ జరిగింది. కానీ అంతలోనే నాన్నకు అనుకోని అదృష్టం వచ్చిపడింది. ఫ్రాంక్ వాళ్ల పరిస్థితి మాత్రం రానురాను దిగజారింది. నాన్న ఆస్తి పెరిగినకొద్దీ ఫ్రాంక్ వాళ్లు బీదరికంలోకి జారారు. నాన్న ఇక ఎంగేజ్‌మెంట్ లెక్కలేదన్నారు. నన్ను శాన్‌ఫ్రాన్సిస్కోకి మార్చారు. ఫ్రాంక్ మాత్రం ఊరుకోలేదు. తాను వెంట వచ్చాడు. నాన్నకు తెలియకుండా నన్ను కలుస్తూ ఉండేవాడు. నాన్న గోల చేస్తాడుగనుక వ్యవహారమంతా మేమే ఏర్పాటు చేసుకున్నాము. ఫ్రాంక్ వెళ్లిపోయి తాను కూడా డబ్బు సంపాదిస్తానన్నాడు. నాన్నకు సమంగా ఆస్తి చేకూరితేగాని మళ్లీ రానన్నాడు. నేను ఎంతకాలమయినా సరే తనకోసం ఎదురుచూస్తాను అన్నాను. అతను బతికి ఉండగా, మరొకరిని పెళ్లాడే ప్రసక్తి లేదన్నాను. 'అయితే, మనం ఇప్పుడే పెళ్లి చేసుకోవచ్చుకదా? అప్పుడు నమ్మకంగా ఉంటుంది. తిరిగి వచ్చేవరకూ నేను నీ భర్తనన్న సంగతి బయటపెట్టను' అన్నాడతను ఇంకేముంది? మాట్లాడుకున్నాము, అతను బాగా ఏర్పాట్లు చేశాడు. చర్చిలో, పెళ్లి చేసుకున్నాము. తర్వాత ఫ్రాంక్ వెళ్లిపోయాడు. నేను నాన్నతో ఉండిపోయాను.

కొంతకాలానికిగాని, ఫ్రాంక్, మోంటానాలో ఉన్నట్టు తెలిసింది. అతను వ్యాపారం వెతుకుతూ, అరిజోనా వెళ్లాడు. తరువాత న్యూ మెక్సికో నుంచి వార్త వచ్చింది. కొంతకాలానికి వార్తాపత్రికలలో ఒక పెద్ద కథనం వచ్చింది. గనుల వారి క్యాంప్‌లను అపాచీ ఇండియన్స్ దోచుకున్న ఉదంతమది.

చనిపోయినవారిలో నా ఫ్రాంక్ పేరు కూడా ఉన్నది. నేను కుప్ప కూలిపోయాను. నెలలపాటు అనారోగ్యంతో ఉన్నాను. ఏదో అయిందని అనుకుని, నాన్న నన్ను శాన్‌ఫ్రాన్సిస్కోలోని సగంమంది వైద్యులకు చూపించాడు. సంవత్సరంపాటు ఏ సంగతీ తెలియలేదు. ఫ్రాంక్ పోవడం గురించి నాకు అనుమానం మిగలలేదు. అప్పుడే లార్డ్ సెయింట్ సైమన్ ఫ్రిస్కోకు వచ్చారు. మేము లండన్ వచ్చాము. పెళ్లి ఏర్పాటయింది. నాన్న బాగా సంతోషించాడు. నాకు మాత్రం మనసులో నిలబడ్డ ఫ్రాంక్ స్థానాన్ని మరెవరూ ఆక్రమించలేరు అన్నభావం మిగిలి ఉండనే ఉంది.

"అయినాసరే, లార్డ్ సెయింట్ సైమన్‌గారిని పెళ్లాడితే, అందరికీ మంచి అనుకున్నాను. ప్రేమను శాసించలేము. కానీ చేసే పనులను శాసించ వచ్చుకదా? ఆయనగారికి అన్ని విధాలా తగిన భార్యగా ఉండాలనే నిర్ణయంతోనే పెళ్లికి సిద్ధమయ్యాను. సరిగ్గా ఆల్టర్ ముందుకు చేరేసమయానికి ఒక్కసారి పక్కకు చూస్తే, మొదటి వరుసలోనే ఫ్రాంక్ నిలబడి ఉండడం కనిపించినప్పుడు, నాకు కలిగిన భావాలను గురించి, మీరు ఊహించవచ్చు. ముందు అది అతని దయ్యం అనుకున్నాను. మళ్లీ చూస్తే, అతనే చక్కగా నిలబడి ఉన్నాడు. ఆయన కళ్లలో ప్రశ్న కనిపించింది. ఆయన కని పించినందుకు నేను సంతోషంగా ఉన్నానా, బాధపడుతున్నానా అడుగు తున్నట్టు ఉంది. ఆ సమయంలో నేను కుప్పకూలకపోవడం నాకే ఆశ్చర్యంగా ఉంది. ప్రపంచంమంతా గిర్రున తిరుగుతున్నట్టు ఉంది. పాద్రీ మాటలు చెవుల్లో తుమ్మెద మోతలాగా మోగాయి. ఏం చేయాలో అర్థం కాలేదు. పెళ్లిని ఆపి, చర్చిలో ఒక పెద్ద గందరగోళం సృష్టించాలా? మరోసారి అతని వేపు చూచాను. నా ఆలోచన అర్థమయినట్టుంది. వేలిని పెదాలకు పెట్టి నన్ను కిమ్మనకుండా ఉండమన్నాడు. అతను కాగితంముక్కమీద ఏదో రాయడం కనిపించింది. నాకు చీటీ రాస్తున్నాడని తెలుసు. పక్కగా వెళు తూ, కావాలనే పూలగుత్తిని అతని మీద పడేశాను. దానితో పాటు చీటీని

కూడా ఆయన నాకు అందించాడు. సరయిన సమయంలో సంకేతాన్ని చూచి, తన వద్దకు రమ్మని ఒక్క ముక్క మాత్రమే రాసి ఉంది. అతనితో చేరడమే నాకు తగినదని నిర్ణయించుకున్నాను.

"తిరిగి వచ్చిన తరువాత, నా మెయిడ్‌కు సంగతి చెప్పాను. తనకు కాలిఫోర్నియాలో ఫ్రాంక్ తెలుసు. వాళ్లిద్దరూ ఒకరినొకరు బాగా ఎరుగుదురు. మాట బయటకు పొక్కకూడదని చెప్పాను. కొన్ని వస్తువులు, నా కోటు సిద్ధంగా ఉంచమన్నాను. లార్డ్ సెయింట్ సైమన్‌గారితో మాట్లాడి ఉండవలసిందని తెలుసు. కానీ, వాళ్ల అమ్మగారు, మిగతా గొప్పవారు అందరూ ఉండగా, అది కుదరని పని. పారిపోయి, తరువాత చెప్పవచ్చును అనుకున్నాను. పది నిమిషాలు బల్ల దగ్గర కూచున్న తరువాత రోడ్డు అటు పక్కన ఫ్రాంక్ కనిపించాడు. నేను జారుకుని నా వస్తువులు తీసుకుని, అతని వెంట వెళ్లాను. లార్డ్ సెయింట్ సైమన్‌తో నా గురించి గోల చేస్తూ ఒక స్త్రీ వచ్చింది. విన్న కొన్ని మాటలతో, ఆయనకు కూడా పెళ్లికి ముందు ఏదో ప్రేమ వ్యవహారం ఉందని అర్ధమయింది. అదంతా పట్టించుకోకుండా, నేను వెళ్లి ఫ్రాంక్‌ని చేరుకున్నాను. ఇద్దరమూ ఒక బండి ఎక్కాము. గార్డన్ స్క్వేర్‌లో తాను ఏర్పాటు చేసుకున్న ఒక బసకు చేరాము. నాకు నిజంగా, గతంలోనే జరిగిన పెళ్లి ఇంతకాలం తరువాత మళ్లీ నిజమయింది. ఫ్రాంక్ అక్కడ



అపాచీలకు బందీగా ఉన్నాడు. తప్పించుకుని ఫ్రిస్కో వచ్చాడు. తాను పోయాడని నిశ్చయించుకుని నేను ఇంగ్లండ్ వెళ్లినట్టు తెలిసింది. కనుక తాను కూడా ఇక్కడికి వచ్చాడు. నా రెండవ పెళ్లినాడే సరిగ్గా నా ముందుకు వచ్చాడు."

"పత్రికల్లో చూచాను. చర్చి వివరం తెలిసింది. ఆమె బస మాత్రం తెలియలేదు" అమెరికన్ వివరించాడు.

"జరగవలసినదాని గురించి మేము మాట్లాడుకున్నాము. బట్టబయలు చేయడమే మంచిదని ఫ్రాంక్ అన్నాడు. నాకు మాత్రం సిగ్గుగా ఉంది. మాయమయి, మళ్లీ ఎవరికీ కనిపించకపోతే బాగుండును అనిపించింది. నాన్నకు మాత్రం ఒక్కముక్క వార్తగా పంపితే, నేను ఇంకా బతికే ఉన్నానని చెప్పడానికి అన్నమాట, చాలు అనుకున్నాను. బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ చుట్టూ కూచుని ఉన్న ఆ రాచకుటుంబాల మనుషులను తలుచుకుంటే, భయమయింది. నా పెళ్లి దుస్తులను కట్టగట్టి ఫ్రాంక్ ఎక్కడో పడేశాడు. అవి మళ్లీ నా కంట పడకూడదని తన ఉద్దేశం. రేపు మేము పారిస్‌కు వెళ్లిపోయి ఉండేవాళ్లం.



కానీ, ఈ పెద్దమనిషి, మిస్టర్ హెూమ్స్ సాయంత్రం మా వద్దకు వచ్చాడు. మమ్మల్ని ఎట్లా తెలుసుకున్నాడో చెప్పడం మాత్రం నావల్ల కాదు. ఆయన నాకు నా తప్పిదం గురించి, దయతో వివరించాడు. ఫ్రాంక్ మాట వినమన్నాడు. రహస్యంగా ఉంటే, తప్పులో మిగులు తారన్నాడు. లార్డ్ సెయింట్ సైమన్ గారితో ఒంటరిగా మాట్లాడే అవకాశం కల్పిస్తానని కూడా చెప్పినందుకు మేము నేరుగా ఇక్కడికి



వచ్చాము. ఇక, రాబర్ట్, అంతా విన్నారు కదా. మిమ్మల్ని బాధపెట్టి ఉంటే, నన్ను క్షమించండి. నా గురించి మరీ నీచంగా అనుకోకండి.”

లార్డ్ సెయింట్ సైమన్ తీరు మాత్రం కొంచెం కూడా సడల లేదు. అంతసేపూ ఆయన కను బొమలు ముడివేసి పెదవులు బిగబట్టి విన్నాడు.

“క్షమించాలి. మా స్వంత వ్యవహారాలను గురించి, ఇలా బట్టబయలుగా మాట్లాడడం, మాకు అలవాటు లేదు” అన్నాడు ఆయన.

“అయితే నన్ను క్షమించరా? వెళ్లేముందు కనీసం షేక్‌హ్యాండ్ చేయరా?”

“మీకు సంతోషం కలుగుతుందంటే, తప్పకుండా చేస్తాను” అంటూ చేతిని జాపి ఆమె చేతిని చల్లగా పట్టుకున్నాడు.

“మీరు మాతోపాటు భోజనం చేస్తారు అనుకున్నాను” సలహాగా అన్నాడు హెూమ్స్.

“మీరు కొంచెం ఎక్కువే అనుకున్నారు. జరిగిన విషయాలను గురించి నేను మరిచిపోగలనేమోగానీ, విందులు మాత్రం చేయలేను. తమరు దయచేస్తే, మీకంతా గుడ్‌నైట్ చెప్పి వెళతాను” బదులుగా అన్నాడు లార్డ్. అందరికీ కలిపి ఒక అభివాదం చేసి గదిలోనుంచి వెళ్లిపోయాడు.

“ఇక మీరయినా, మాతో ఉండి గౌరవం కలిగిస్తారనుకుంటాను? ఒక అమెరికన్‌ను కలవడం చాలా సంతోషం. మిస్టర్ మౌల్టన్, నా ఉద్దేశంలో గతంలో ఒక చక్రవర్తి చేసిన తప్పిదం, ఒక మంత్రి పొరపాటు, కలగలిసి మన పిల్లలను అందరినీ ప్రపంచవ్యాప్త దేశంలో హాయిగా ఉండకుండా చేయడం నాకు నచ్చదు. యూనియన్ జాక్‌తో పాటు స్టార్స్ అండ్ స్ట్రయిప్స్ కలిసి ఎగిరితే, ఏమవుతుంది?”

“ఈ కేసు ఆసక్తికరంగా సాగింది. మొదట చూచినపుడు చాలా చిక్కుగా కనిపించిన ఒక వ్యవహారం ఎంత సులభంగా విడిపోతుందో చూపించడానికి ఇది మంచి ఉదాహరణ. ఆ మహిళ చెప్పిన సంఘటనలకన్నా, సహజంగా మరేవీ ఉండవు. నిజంగా చూస్తే, బయటపడిన ఫలితాలకన్నా, విచిత్రంగానూ మరేదీ ఉండదు. లెస్ట్రేడ్ అనుకున్న తీరు గమనించావు కదా? ” అన్నాడు హెూమ్స్ అతిథులు వెళ్లిపోయిన తరువాత.

“అంటే, నీవు కూడా పొరపాటేదీ ఆలోచించలేదు అనేనా?”

“మొదటినుంచి నాకు రెండు సత్యాలు ఎదుట కనిపించాయి. ఆ అమ్మాయి పూర్తి ఇష్టంగానే పెళ్లికి సిద్ధమయింది, అన్నది ఒకటి. ఇక మరొకటి, ఇంటికి వచ్చిన కొంతసేపటికే ఆమెలో దోషభావం మొదలయింది. అంటే, తప్పకుండా, ఆ ఉదయాననే ఏదో జరిగింది. దానివల్ల ఆమె మనసు మారింది. అది ఏమయి ఉంటుంది? బయటకు వెళ్లినపుడు ఎవరితోనో మాట్లాడి ఉంటుంది అనడానికి లేదు. ఆమె మొత్తం సమయం పెళ్లి కుమారునితోనే గడిపింది. మరెవరయినా కనిపించారా, అంటే అదీ లేదు. కనిపించినప్పటికీ, వాళ్లు అమెరికావాళ్లు అయి ఉండాలి. ఆమె ఈ దేశం

వచ్చి ఎక్కువ కాలం కానేలేదు. ఒక్కసారి కనిపించినంత మాత్రాన అంత కలవరపరిచే పరిచయస్తులెవరూ ఇక్కడ లేరు. ఆ రకంగా ఆమె ఒక అమెరికన్‌ను చూచి ఉంటుందన్న నిర్ణయానికి మనం రానే వచ్చేశాం. అయితే ఆ మనిషి ఎవరు? అంత ప్రభావం ఎలా చూపగలిగాడు? ప్రేమికుడన్నా అయి ఉండాలి, లేక భర్త! ఆమె యుక్తవయసులో ఉన్నప్పుడు, విచిత్ర పరిస్థితుల్లో బతుకు సాగిందని తెలుసు. లార్డ్ సెయింట్ సైమన్ ఆ సంగతి చెప్పనే చెప్పాడు. ముందువరుసలో ఒక మనిషిని ఆమె చూచినట్టు మనకు తెలుసు. అక్కడే పెళ్లి కూతురులో మార్పు మొదలయింది. పూలగుత్తి వ్యవహారం, మెయిడ్‌తో మాట్లాడడం, తరువాతి సంగతులు. 'క్లెయిమ్ జంపింగ్' అన్నమాట నాకు మరో సూచన! ఆ మాటకు, ఇంతకు ముందే తమదయిన వస్తువును తిరిగి చేతికి తీసుకోవడం అని అర్థముంది. కనుక ఆమె తన మొదటి ప్రియుడు లేదా భర్తతో వెళ్లి ఉంటుందని నిశ్చయించు కున్నాను."

"ఇక వాళ్లను వెతికిపట్టుకోవడం ఎలా కుదిరింది?"

"నిజంగా కష్టమయ్యేదే! కానీ, మిత్రుడు లెస్ట్రేడ్ చాలా విలువయిన సమాచారాన్ని వెంట తెచ్చాడు. సంగతి అతనికి మాత్రం తెలియదు. పేరు పొడి అక్షరాలు నిజంగా అన్నింటికన్నా ముఖ్యమయినవి. కానీ, గత వారం లోపలే, అతను లండన్‌లోని చాలా ఖరీదయిన హొటేల్‌లో, బిల్లు చెల్లించా డన్నది అంతకన్నా ముఖ్యమయిన విషయం."

"హొటేల్ ఎలా దొరికింది?"

"ధరలు మొదటి సూచన. పడకకు 8 షిల్లింగులు, ఒక గ్లాసు షెర్రీకి 8 పెన్స్..అంటే అది చాలా ఖరీదయిన హొటేల్ అని అర్థం. అంతగా రేట్లు ఉండే హొటేళ్లు లండన్‌లో చాలా తక్కువ ఉన్నాయి. నార్తంబర్‌లాండ్ వీధిలో నేను వెళ్లిన రెండవ హొటేల్‌లోనే, ఫ్రాన్సిస్ ఎచ్. మౌల్టన్ అనే అమెరికన్ కొన్నిరోజుల క్రితం బస చేసినట్టు పుస్తకాల్లో సాక్ష్యం దొరికింది. బిల్లులో

కనిపించిన వస్తువులే, డూప్లికేట్‌లో కూడా అంతకుముందు కనిపించాయి. ఆయన తన ఉత్తరాలను 226, గార్డన్ స్క్వేర్‌కు పంపించాలని చెప్పి వెళ్లాడు. నేను సూటిగా ఆ చిరునామాకు చేరుకున్నాను. దంపతులు అక్కడ నాకు ఇంట్లోనే దొరికారు. వాళ్లకు ఒక తండ్రిలాగ సలహా ఇచ్చాను. తమ వ్యవహారాన్ని ప్రజల ముందు, ముఖ్యంగా లార్డ్ సెయింట్ సైమన్ ముందు బయటపెట్టడమే మంచిదని చెప్పాను. ఆయనను కలవడానికి, వాళ్లను ఇక్కడికి రమ్మని ఆహ్వానించాను. అనుకున్నట్టే ఆయన కూడా వచ్చాడు."

"ఆయన తీరుమాత్రం అంత గొప్పగా లేదు" అన్నాను నేను.

"వాట్సన్, నీవయినా, అలాగే ఉండేవాడివే! అంత కష్టపడి అమ్మాయిని చేరదీసి పెళ్లి చేసుకున్న తరువాత, క్షణంలో, భార్య ఆమెతోబాటు వచ్చిన సంపదా మొత్తం పోయిందంటే, అలాగే ఉంటుంది. మనం లార్డ్ సెయింట్ సైమన్‌ను కొంచెం సానుభూతితో గమనించాలి. అటువంటి పరిస్థితి మనకు కలగకూడదని అనుకోవాలి. కుర్చీ లాక్కో, నా వయిలిన్ అందించు, ఇక మనం విడదీయడానికి మిగిలిన సమస్య ఒకటే ఉంది. ఈ సాయంత్రాలను ఎట్లా గడపాలా? అన్నది."

Sherlock Holmes



11

# ది బెరిల్ కొరొనెట్

కిటికీలోనుంచి చూస్తూ నిలబడ్డ నేను ఒక్కసారి హోమ్స్‌ని పిలిచాను. "ఒక పిచ్చిమనిషి వస్తున్నాడు. అతడిని ఇంటివాళ్లు ఒంటరిగా ఎట్లా పంపించారని అనుమానంగా ఉంది" అన్నాను.

నా మిత్రుడు కుర్చీలోనుంచి బద్ధకంగా లేచాడు. చేతులను డ్రసింగ్ గౌన్ జేబుల్లో పెట్టుకుని నా భుజం మీదుగా చూచాడు. ఫిబ్రవరి మాసంలో వెలుగు నిండిన ఉదయం అది. మునుపటి రోజు కురిసిన మంచు, నేలమీద ఇంకా పరుచుకుని, ఎండలో మెరుస్తున్నది. వీధి మధ్యలో మంచు నలిగి నల్లగా మారింది. పక్కలలో మాత్రం ఇంకా అది కుప్పలుగా మిగిలే ఉంది. తెల్లగా కనిపిస్తున్నది. పేవ్‌మెంట్‌ని గీకి శుభ్రం చేసినట్టున్నారు. కానీ, అక్కడ ఇంకా జారిపడే ప్రమాదం ఉండనే ఉంది. కనుక ఎక్కువమంది తిరగడం లేదు. మెట్రోపాలిటన్ స్టేషన్ నుంచి అసలు ఎవరూ రావడంలేదు. పిచ్చిగా వ్యవహరిస్తున్న ఆ ఒక్క పెద్దమనిషి మాత్రం నా దృష్టిని ఆకర్షించాడు.

ఆ మనిషికి వయసు యాభయి ఉంటుంది. పొడుగ్గా బలంగా ఉన్నాడు. ముఖం కూడా బాగా పెద్దది. మొత్తంమీద అతను దాష్టీకంగా ఉన్నాడు. అతను వేసుకున్న దుస్తులు మామూలుగా ఉన్నా వెలగలవి. నల్లని కోటు, మెరిసే హ్యాట్, బ్రౌన్ రంగు బూటు, పర్ల్-గ్రే రంగు పంట్లాము వేసుకున్నాడు.

అతని తీరుమాత్రం శరీరానికి, దుస్తులకు తగినట్టుగా లేదు. పిచ్చిగా పరుగెత్తుతున్నాడు. అందులోనూ ఒక తీరు లేదు. తడబడుతున్నాడు కూడా. నడుస్తూ చేతులను చిత్రంగా ఆడిస్తున్నాడు. తలను కదిలిస్తున్నాడు. ముఖంలో రకరకాల భావాలు కనపడుతున్నాయి.

"ఆ మనిషికి ఏమయి ఉంటుంది? అతను ఇళ్ల నంబర్లు చూస్తున్నాడు" నేను అడిగాను.

"ఇక్కడికే వస్తున్నాడు అనుకుంటున్నాను" అన్నాడు హొమ్స్ చేతులు రుద్దుకుంటూ.

"ఇక్కడికా?"

"అవును. పైగా అతను నన్ను వృత్తిపరంగా సంప్రదించడానికి వస్తున్నాడు. అతని పరిస్థితిని నేను గుర్తించగలను. హా! చెప్పానా?" అతను అంటూ ఉండగా, ఎగశ్వాస పీలుస్తూ, ఆ మనిషి తలుపుదగ్గరికి చేరి గంట మోగించాడు. ఇల్లంతా ఆ చప్పుడుతో మారుమోగింది.



కొన్ని క్షణాల తరువాత అతను మా గదిలో ఉన్నాడు. ఇంకా శ్వాస కుదరలేదు. కదలికలు ఆగలేదు. కళ్లలో మాత్రం అంతులేని బాధ, దుఖం కనపడుతున్నాయి. మా చిరునవ్వులు ఒక్క క్షణంలో భయంతో కూడిన జాలిగా మారాయి. కొన్ని క్షణాలు అతను మాట్లాడలేకపోయాడు. శరీరం అటూ ఇటూ ఊగింది. తెలియని బాధకు గురవుతూ అతను జుట్టు కెలుకుతున్నాడు. ఒక్కసారిగా లేచి నిలబడి అతను తలను గోడకేసి బలంగా కొట్టుకోసాగాడు. మేమిద్దరమూ వేగంగా వెళ్లి అతడిని లాగి గది మధ్యలోకి తెచ్చాము. షెర్లక్ హోమ్స్ అతడిని ఒక వాలుకుర్చీలో కుదేశాడు. చేతి మీద తడుతూ, మెత్తని గొంతుతో అతడితో మాట్లాడసాగాడు. హోమ్స్‌కు అదంతా బాగా తెలిసిన విద్య.

“మీ కథ నాతో చెప్పుకోవాలని వచ్చారు కాదూ? తొందరతో మీరు బాగా అలసిపోయారు. కొంచెంసేపు విశ్రాంతి తీసుకోండి. మీ సమస్య ఏమిటో నాకు చెపితే, సంతోషంగా సహాయం చేస్తాను” అన్నాడు అతను.

ఎద బరువుగా కదులుతుండగా, ఆ మనిషి ఒక నిమిషం కూచున్నాడు. భావాలతో పోరాడుతున్నాడు. జేబురుమాలు తీసి నుదురు తుడుచుకున్నాడు. పెదవులు బిగబట్టి ముఖం మా వేపు తిప్పాడు.

“నన్ను పిచ్చివాడు అనుకుంటున్నారు. అనుమానం లేదు” అన్నాడు అతను.

“మీరు చాలా కష్టాల్లో ఉన్నారని చూడగలను” బదులుగా హోమ్స్ అన్నాడు.

“నా సంగతి దేవుడికి తెలుసు! వచ్చిన కష్టంతో నా బుద్ధి అడుగంటింది. అంత వేగంగానూ, భయంకరంగానూ వచ్చింది కష్టం. నా మీద ఇవాళిటి వరకూ ఒక్క అభియోగం కూడా లేదు. ప్రజలలో అగౌరవం జరిగిందీ లేదు. ఇక స్వంత జీవితంలో కష్టాలు అందరికీ ఉంటాయి. కానీ, అన్నీ కలిసి ఒకేసారి, మరీ భయంకరంగా తలమీద పడితే, ఎవరయినా

కదిలిపోతారు. పైగా, నా ఒక్కడిమీదే కాదు, ఇంత దారుణం జరిగితే ఈ ప్రపంచంలో ఎవరయినా నా లాగే అవుతారు."

"దయచేసి, కొంచెం తమాయించుకోండి, సర్. మీరెవరు? మీకు వచ్చిన కష్టమేమిటి? అంతా నాకు చెప్పండి" అన్నాడు హెూమ్స్.

"నా పేరు మీకు తెలిసే ఉంటుంది. నేను అలెగ్జాండర్ హెూల్డర్‌ని. హెూల్డర్ అండ్ స్టీవెన్‌సన్ అనే బ్యాంకింగ్ సంస్థ త్రెడ్‌నీడిల్ స్ట్రీట్‌లో ఉంది గదా, అది మాదే" అన్నాడు అతిథి.

మాకు నిజంగానే ఆ పేరు బాగా తెలుసు. లండన్ నగరంలోని రెండవపెద్ద ప్రయివేట్ బ్యాంకింగ్ సంస్థ పార్టనర్లు ఇద్దరిలో సీనియర్ ఇతను. లండన్‌లోని అంత ప్రముఖుడయిన పౌరునికి అంత దుస్తితి కలిగిందంటే, ఏం జరిగి ఉంటుంది? మేము చాలా కుతూహలంగా, కొంచెంసేపు వేచిఉన్నాము. మరింత ప్రయత్నించి అతను తన కథ చెప్పడానికి సిద్ధమయ్యాడు.

"సమయం చాలా విలువయినది అనుకుంటాను. అందుకే నేను పోలీస్ ఇన్‌స్పెక్టర్ సలహా ఇచ్చిన మరుక్షణం, మీ సహకారం అభ్యర్థిస్తూ, ఇక్కడికి పరుగున వచ్చాను. అండర్‌గ్రౌండ్‌లో బేకర్‌స్ట్రీట్‌కు వచ్చాను. అక్కడి నుంచి మాత్రం నడుస్తూ వచ్చాను. మరీ ఈ మంచులో బండ్లు వేగంగా కదలవు మరి! అందుకే నాకు అంత రొప్పు వచ్చింది. నాకు శరీరశ్రమ ఏమాత్రం అలవాటు లేదాయె! ఇప్పుడు కొంచెం బాగుంది. వీలయినంత సూక్ష్మంగా అయినా సరే, వివరంగా విషయాన్ని మీముందు ఉంచుతాను" అన్నాడు అతను.

"మీకు తెలియనదికాదు. బ్యాంకింగ్ వ్యాపారంలో విజయం సాధించాలంటే, మంచి పెట్టుబడులు ఉండాలి. అందుకు మాకు చేతనయినంతమంది డిపాజిటర్లతో మంచి సంబంధాలు ఉండాలి. ఇక డబ్బును లాభదాయకంగా వాడుకోవాలంటే, అప్పులుగా ఇవ్వడం మాకు తెలిసిన ముఖ్యమయిన పద్ధతి. అక్కడ సెక్యూరిటీ అన్నది గట్టిగా ఉండాలి.

గడిచిన కొన్నిసంవత్సరాలలో ఈ దిశగా మా శ్రమ బాగానే జరుగుతున్నది. మేము ఎన్నో రాజకుటుంబాలకు కూడా పెద్ద మొత్తాలను అడ్వాన్స్‌లుగా ఇచ్చాము. అందుకని వారు చిత్తరువులను, లైబ్రరీలను, ఫలకాలను మా దగ్గర పెట్టారు.

'నిన్న ఉదయం బ్యాంకులో నేను ఆఫీసులో కూచుని ఉన్నాను. ఒక క్లర్క్ ఒక కార్డ్‌తో నా ముందుకు వచ్చాడు. ఆ పేరును చూచి ఉలిక్కి పడ్డాను. అది ఎవరో కాదు-- సరే, మీకు కూడా ఆ పేరు గురించి అంతకన్నా ఎక్కువ చెప్పకూడదేమో, ఈ ప్రపంచంలోనే అందరికీ తెలిసిన పేరది-- ఇంగ్లండ్‌లోనే చాలా ఉన్నతమయిన వ్యక్తులలో ఆయన ఒకరు. నాకు ఉక్కిరిబిక్కిరిగా ఉంది. ఆయన వచ్చినపుడు నేరుగా వ్యవహారంలోకి దిగాడు. ఇష్టంలేని పనినుంచి వీలయినంత త్వరగా తప్పించుకోవాలన్నట్టు ఉంది ఆయన పద్ధతి.

" 'మిస్టర్ హోల్డర్, మీరు డబ్బు అడ్వాన్స్‌గా ఇస్తుంటారని నాకు తెలిసింది' అన్నాడు ఆయన.

" 'సెక్యూరిటీ సరిగా ఉంటే, సంస్థ ఆ పని చేస్తుంది' నేను జవాబిచ్చాను.

" 'నాకు జరూరుగా యాభయి వేల పౌండ్లు ఒక్కసారిగా కావాలి. అంతకు పదిరెట్ల సొమ్మును ఫ్రెండ్స్ నుంచి అరువు తీసుకోగలను అనుకోండి. కానీ, నేను ఇదంతా మరొక రకంగా ఉండాలనుకుంటున్నాను. వ్యవహారం నేనే స్వయంగా చూడాలని అనుకుంటున్నాను. నాకుగా నేను మిత్రుల రుణంలో చిక్కుకోవడం బాగుండదని మీరు అర్థంచేసుకో గలరు అనుకుంటాను.'

" 'మీకు ఆ మొత్తం, ఎంతకాలం కావాలని అడగవచ్చా?' నేను అడిగాను.

" 'వచ్చే సోమవారం నాకు ఒక పెద్ద మొత్తం అందవలసి ఉంది. మీరు ఇచ్చినదాన్ని అప్పుడు తప్పకుండా తిరిగి ఇవ్వగలను. మీరు చెప్పే

వడ్డీకూడా ఇచ్చుకుంటాను. కానీ, నాకు డబ్బు ఒక్కసారిగా ఇప్పుడే కావాలి.'

“ 'ఇంకా చికాకులు ఏవీ లేకుండా నా స్వంత పర్సు నుంచి మీకు నేను సంతోషంగా డబ్బులు ఇవ్వగలను. కానీ కొంచెం ఎక్కువ భారం పడుతుందేమో. మరోరకంగా, అంటే కంపెనీ తరఫున చేదామంటే నా పార్టనర్‌కు న్యాయం చేయాలిగనుక మీ వ్యవహారంలో కూడా మొత్తం తతంగం అంతా పద్ధతిగా జరగవలసి ఉంటుంది.' అన్నాను నేను.

“ 'నాకు ఆ పద్ధతే ఇష్టం' అంటూ ఆయన ఒక నలుచదరపు, నల్లని మొరాకో కేస్‌ని ఎత్తి చూపించాడు. 'మీరు బెరిల్ కొరొనెట్ గురించి విని ఉంటారు అనుకుంటాను?'

“ 'సామ్రాజ్యంవారి ఆస్తులలో అన్నింటికన్నా విలువయినది' అన్నాను నేను.

“ 'సరిగా చెప్పారు' ఆయన కేస్ తెరిచారు. అందులో చక్కని వెల్వెట్ పొరలలో వెలగల ఆ కిరీటం ధగధగ మెరుస్తున్నది. 'ఇందులో 39 పెద్ద పెద్ద పచ్చలు ఉన్నాయి. ఇక బంగారం ధర లెక్క కట్టడం కుదరదు. ఎంత కనీసంగా వెలకట్టినా, నేను అడిగిన డబ్బుకన్నా రెండంతలు తప్పకుండా ఉంటుంది. సెక్యూరిటీగా దీన్ని మీవద్ద వదలడానికి సిద్ధంగా ఉన్నాను' అన్నాడు ఆయన.



“నేను ఆ పెట్టెను చేతికి అందుకున్నాను. కొంచెం తికమక పడుతూ, ఆ పెద్దమనిషివేపు చూచాను.

“ 'విలువ గురించి అనుమానంగా ఉందా?' అడిగాడు ఆయన.

" 'లేదుగాక లేదు. నా అను మానం....'

" 'నేను దీన్ని మీ దగ్గర వదలడం గురించి. అదే అయితే మీరు నిశ్చింతగా ఉండవచ్చు. నాలుగు రోజుల్లో తిరిగి తీసుకుపోతానన్న నమ్మకం లేకుంటే, అసలు నేను దాన్ని ఇవ్వాలని కలలోకూడా అనుకునేవాడిని కాను. ఇది కేవలం నా పద్ధతి. ఇంతకూ సెక్యూరిటీ సరిపోతుందా?"

" 'అవశ్యంగా.'

" 'మిస్టర్ హోల్డర్, ఒకటి అర్థం చేసుకోండి. నాకు మీమీద ఉన్న నమ్మకానికి గట్టి రుజువు మీకు ఇస్తున్నాను. మీ గురించి చాలా విన్నాను. ఈ విషయాన్ని మీరు గోప్యంగా ఉంచుతారని, మాట బయటపడకుండానూ, అన్నిటినీ మించి ఈ కిరీటాన్ని చాలా భద్రంగానూ ఉంచుతారని నమ్ము తున్నాను. దీనికి ఏమన్నా అయితే, సమాజంలో పుట్టే కలకలం గురించి మీకు తెలుసు. కిరీటానికి చిన్న గాయం తగిలినా, అది పోయినంత పన వుతుంది. వీటికి సాటి రాగల పచ్చలు ప్రపంచంలో మరెక్కడా లేవు. మార్చడం ఇంచుమించు అసాధ్యం. అయినాసరే, పూర్తి నమ్మకంతో దీన్ని మీ వద్ద వదులుతున్నాను. దానికోసం సోమవారం పొద్దున్న మళ్లీ వస్తాను.'

"నా క్లయంట్ తొందరలో ఉన్నాడని గ్రహించాను. ఇక ఎక్కువగా మాట్లాడలేదు. క్యాషియర్‌ను పిలిచాను. వెయ్యిపౌండ్ల నోట్లు యాభయి తీసుకు రమ్మన్నాను. తరువాత ఒంటరిగా ఉన్నప్పుడు ముందు వెలగల ఆ కేస్ కనపడుతుండగా, నా తలమీద అలవిగాని బాధ్యత పెట్టుకున్నాను అని పించింది. ఒళ్లు జలదరించింది. ఆ వస్తువు జాతీయ ఆస్తి. దురదృష్టంగా ఏదన్నా జరిగితే, పెద్ద స్కాండల్ మొదలవుతుంది. దాని బాధ్యత తీసు కోవడమే తప్పని నాకు అప్పుడే భావం మొదలయింది. అయితే, అప్పుడిక చేయగలిగిందేమీ లేదు. నేను దాన్ని నా స్వంత సేఫ్‌లో జాగ్రత్తగా పెట్టి మళ్లీ పనిలో మునిగాను.

"సాయంత్రమయింది. వెలగల ఆ వస్తువును ఆఫీసులో వదిలి వెళ్లడం తెలివితక్కువ పని అవుతుందని అనిపించింది. బ్యాంకర్ల అల్మారాలను ఇప్పటికి ఎన్నోసార్లు పగలగొట్టిన సందర్భాలున్నాయి. నా విషయంలోనూ అదే జరగవచ్చు. అదే జరిగితే, నా పరిస్థితి ఏమవుతుంది? అందుకే నేను ఈ కొద్దిరోజుల పాటు కేసును నా వెంటే పెట్టుకోవాలని నిర్ణయించుకున్నాను. అది ఎప్పుడూ నా అందుబాటులో ఉండాలి అనుకున్నాను. ఆ ఉద్దేశంతో, నేను ఒక బండి పిలిచి స్ట్రీట్‌హామ్‌లో ఉన్న నా ఇంటికి వెళ్లాను. నగ నాతోనే ఉందన్నమాట. దాన్ని పై అంతస్తులో నా గదికి చేర్చి, డ్రెసింగ్‌రూమ్‌లోని నా బీరువాలో పెట్టేదాకా ఊపిరి ఆడలేదు.

"ఇక నా ఇంటి సంగతి చెప్పాలి. మిస్టర్ హోమ్స్, మీకు పరిస్థితి పూర్తిగా అర్థంకావాలిగదా! ఇంట్లో ఇద్దరు మగ పనివాళ్లు ఉన్నారు. వాళ్లు ఇంట్లో పడుకోరు. కనుక వాళ్లను వదిలేయవచ్చు. నా దగ్గర ముగ్గురు అమ్మాయిలు కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. వాళ్లు నిజంగా నమ్మదగిన మనుషులు, అనుమానం లేదు. మరొక అమ్మాయి, లూసీ పార్, కొన్ని నెలల క్రితం మాత్రమే పనిలో కుదిరింది. మంచి నడవడి గల అమ్మాయి. సంతృప్తికరంగా పనిచేస్తున్నది. అయితే ఆమె చాలా అందమయిన అమ్మాయి. ఆమె కోసం కొంతమంది ఇంటి చుట్టూ తిరుగుతూ ఉంటారు. ఆమె వల్ల అసౌకర్యం ఏదయినా ఉంటే, అది ఒక్కటే! మిగతా అన్ని రకాలుగానూ ఆమె చాలా మంచిదని మా నమ్మకం.

"అది పనివాళ్ల సంగతి. నా కుటుంబం చాలా చిన్నది. వర్ణించడానికి ఆట్టే కాలం పట్టదు. మా ఆవిడగారు పోయారు. నాకు ఒకే ఒక్క కొడుకు. పేరు ఆర్థర్. వాడు నాకు అసంతృప్తి కారణం. మిస్టర్ హోమ్స్, అది మామూలు అసంతృప్తి కాదు. అందుకు నేనే బాధ్యుడిని అనడంలో అనుమానం లేదు. అందరూ అదే మాట అంటారు. నిజమే అయి ఉంటుంది. నా ప్రియ భార్య పోయినప్పుడు నాకు మిగిలింది వాడు ఒక్కడే అనుకున్నాను.

వాని ముఖం మీద చిరునవ్వు చెరగకూడదని నా బాధ. వాని ఏ మాటనూ కాదనలేదు. నేను మరింత క్రమశిక్షణగా ఉంటే బాగుండేది. కానీ, అది జరగలేదు.

"సహజంగానే నేను, నా వ్యాపారాన్ని వాడు కొనసాగించాలి అనుకున్నాను. కానీ వానికి ఆ దృష్టి లేదు. నిజం చెప్పాలంటే, వాడు కొంచెం మొరటు రకం. పెద్ద మొత్తంలో డబ్బులను వాని చేతికి ఇవ్వడం మంచిది కాదు. చిన్న వయసులోనే వాడు అరిస్టోక్రాటిక్ క్లబ్‌లో మెంబర్ అయ్యాడు. నడవడి కారణంగా చాలామంది ధనవంతులు, ఖరీదయిన అలవాట్లుగల వారితో స్నేహం కుదిరింది. పేకాట బాగా నేర్చుకున్నాడు. డబ్బు పోవడమూ మొదలయింది. అప్పుడప్పుడు  నా వద్దకు వచ్చి, తనకు నేను మామూలుగా ఇచ్చే డబ్బులను కొంచెం ముందే అడుగుతుండేవాడు. గౌరవంగా అప్పుల నుంచి బయటపడాలి అనేవాడు. ఆ సహవాసం నుంచి తప్పించుకోవాలని ఒకటి రెండు సార్లు గట్టిగానే ప్రయత్నం చేశాడు. కానీ, సర్ జార్జ్ బర్న్‌వెల్ అనే మిత్రుడు వాడిని మళ్లీ లాక్కుపోయాడు.

"సర్ జార్జ్ బర్న్‌వెల్‌లాంటి మనిషి ప్రభావం వీడి మీద ఉండడం నాకు ఆశ్చర్యంగానే తోచింది. ఆయన తరుచూ, ఇంటికి వస్తూండేవాడు. అతని ధోరణి నిజంగా ఆకర్షణీయంగా ఉండేది. వయసులో ఆర్థర్ కన్నా పెద్దవాడు. ప్రపంచం తెలిసిన మనిషి. ఎంతో తిరిగాడు, అంతా చూచాడు. భలేగా మాట్లాడతాడు. మొత్తం మీద ఆయనలో ఒక గొప్ప ఆకర్షణ ఉంది. కానీ ఆయన గురించి నిజంగా ఆలోచిస్తే మాత్రం,  ఆ మాటతీరులో, ఆ కళ్లలోనూ, కనిపించినదేదో ఈ మనిషి  నమ్మదగనివాడు అనిపించేలా చేసింది. అది నా ఆలోచన. చిన్నారి మేరీ కూడా అదే మాట అనింది. ఆ అమ్మాయి మనుషులను సులభంగా పసిగడుతుంది.

"ఇక చెప్పవలసింది ఆ అమ్మాయి గురించే. ఆమె నా తమ్ముడి కూతురు. అయిదు సంవత్సరాల క్రితం నా తమ్ముడు చనిపోయాడు. అమ్మాయి

ఒంటరిదయింది. నేను ఆమెను పెంచుకున్నాను. నా స్వంత కూతురే అనుకున్నాను. మా ఇంటి వెలుగు ఆ అమ్మాయి. చక్కగా ఉంటుంది, ప్రేమ స్వభావం కలది. ఇంటి నిర్వహణనంతా బాగా చూస్తుంది. నాకు ఆమె కుడిచెయ్యి. ఆమె లేకుంటే, నేను ఏమవుతానో తెలియదు. ఒక్క విషయంలో మాత్రం, ఆమె నా మాట వినలేదు. నా కొడుకు ఆ అమ్మాయిని బాగా ప్రేమించాడు. రెండు సార్లు పెళ్లి చేసుకొమ్మని అడిగాడు. రెండుసార్లూ ఆమె కాదన్నది. వాడిని సరయిన మార్గంలో పెట్టగలవారు ఎవరయినా ఉంటే, తానొక్కతే అని, పెళ్లితో వాని బతుకంతా మారుతుందని అనుకున్నాను. కానీ, అంతా మీరిపోయింది. ఇప్పుడు సమయం కాదు!

"ఇక మిస్టర్ హెూమ్స్, నా యింట్లో మనుషుల సంగతి అది. ఇక నా కథ గురించి వివరిస్తాను.

"ఆ రాత్రి భోజనాల తరువాత డ్రాయింగ్‌రూమ్‌లో అందరమూ కాఫీ తాగుతున్నాము. ఆర్తర్, మేరీలకు నా అనుభవం చెప్పాను. ప్రస్తుతం ఆ వస్తువు ఇంట్లోనే ఉన్నదీ అని కూడా చెప్పాను. క్లయంట్ పేరు మాత్రమే దాచాను. కాఫీ తెచ్చిన, లూసీ పార్ గదిలో లేదని నా నమ్మకం. కానీ, వినలేదు అని చెప్పలేను. పిల్లలు ఇద్దరూ ఆసక్తి కనపరచారు. పేరుగల ఆ కిరీటాన్ని చూడాలన్నారు. నేనే వద్దన్నాను.

" 'దాన్ని ఎక్కడ ఉంచావు?' ఆర్తర్ అడిగాడు.

" 'నా బీరువాలో.'

" 'కొంపతీసి, ఈ రాత్రి ఇంట్లో దొంగతనంగానీ జరగ కూడదు' అన్నాడు వాడు.

" 'తాళం వేశాను' జవాబిచ్చాను.

" 'ఆ బీరువాను ఏ తాళం చెవితో నయినా తెరవవచ్చు. వెనకట నేను బాక్స్ రూమ్‌లోని అల్మారా తాళం చెవితో, దాన్ని ఎన్నోసార్లు తెరిచాను.'



"వాడి మాట తీరు మొరటుగా ఉంటుంది. కనుక నేను పట్టించుకోలేదు. వాడు నా వెంట ముఖం మాడ్చుకుని నా గది దాకా వచ్చాడు.

" 'చూడు డాడ్, నాకు రెండువందల పౌండ్లు ఇవ్వగలవా?' తలవాల్చుకుని అడిగాడు.

" 'ఇవ్వను! డబ్బుల విషయంలో నేను నీకు చాలా మెత్తగా కనపడతాను' అన్నాను నేను కటువుగా.

" 'అదేంలేదు, మంచితనం చూపించావు. కానీ, ఇప్పుడు చాలా అవసరం. లేకుంటే క్లబ్‌లో తల ఎత్తుకుని తిరగలేను.'

" 'అదే బాగుంటుంది!' నేను గట్టిగా అన్నాను.

" 'నాకు అగౌరవం జరిగితే, నీకు బాగుండదు కదా. నేను భరించలేను. ఏదో రకంగా ఆ డబ్బు సంపాదించాలి. నీవు కాదంటే, మరేదో మార్గం చూస్తాను' అన్నాడు వాడు.

"నాకు బాగా కోపం వచ్చింది. అడగడం అది, నెలలో మూడవసారి. నేను ఒక ఫార్దింగ్ కూడా ఇవ్వను" అన్నాను. మారు మాట్లాడకుండా వాడు నమస్కారం చేసి వెళిపోయాడు.

"బాబు వెళ్లిన తరువాత నేను బీరువా తెరిచాను. వస్తువు భద్రంగా ఉందని చూచి మళ్లీ తాళం వేశాను. అంతా భద్రంగా ఉందని చూడడానికి ఇల్లు కలియతిరుగుతున్నాను. ఆ బాధ్యత నేను మామూలుగా మేరీకి వదులుతాను. కానీ నిన్న మాత్రం నేను తలకెత్తుకున్నాను. కిందకు వచ్చేసరికి



వేరీ, హాలులో కిటికీ పక్కన నిలబడి కనిపించింది. నేను వస్తుండగా ఆమె దాన్ని మూసి గొళ్లెం వేసింది.

"డాడ్, పనిమనిషి లూసీకి నీవుగాని బయటకు వెళ్లడానికి అనుమతి ఇచ్చావా?" అని అడిగింది. ఆమె ముఖంలో కొంచెం తత్తరపాటు కనిపించింది.

" 'లేదు.'

" 'తాను ఇప్పుడే వెనుక తలుపు నుంచి లోపలికి వచ్చింది. ఎవరినో కలవడానికి పక్క గేటు దాకా వెళ్లింది, అనుమానం లేదు. కానీ, అది మంచి పద్ధతి కాదు.'

" 'పొద్దున్నే మాట్లాడు. లేదంటే నేను అడుగుతాను. ఇక అంతా మామూలుగానే ఉందా?'

" 'అన్ని తలుపులూ వేశాను, డాడ్.'

" 'సరే, గుడ్‌నైట్' ఆమెను ముద్దాడి నేను పడకగదికి వెళిపోయి పడుకున్నాను.

"మిస్టర్ హోమ్స్, కేసుతో సంబంధం గల సంగతులన్నీ మీకు వివరంగా చెప్పాలని ప్రయత్నిస్తున్నాను. మీకు అనుమానం కలిగినప్పుడు ఆపి, ప్రశ్నించవచ్చునని నా అభిప్రాయం."

"అదేం లేదు. మీరు చాలా వివరంగా చెపుతున్నారు."

"ఇక మిగిలిన విషయాన్ని మరింత వివరంగా చెప్పాలి. నేను అంత గాఢంగా నిద్రపోను. పైగా మనసులో మరేదో ఉంది. కనుక సరిగా నిద్ర పట్టలేదు. రాత్రి రెండు గంటల ప్రాంతాన, ఇంట్లో ఏదో చప్పుడయింది.

మెలుకువ వచ్చిన తరువాత మరే చప్పుడూ లేదు. ఎక్కడో ఒక కిటికీని గట్టిగా మూశారని అనుమానం వచ్చింది. శ్రద్ధగా వింటూ పడి ఉన్నాను. ఒక్కసారిగా, పక్క గదిలో అడుగుల చప్పుడు వినిపించింది. నాకు భయం మొదలయింది. మంచం నుంచి లేచాను. గుండె దడదడలాడుతుండగా, డ్రెసింగ్‌రూమ్ ద్వారంలో నుంచి చూచాను.

“ ‘ఆర్తర్! రాక్షసుడా! నీవు దొంగవు. కిరీటాన్ని ఎందుకు ముట్టుకున్నావు?’ గట్టిగా అరిచాను.

“దీపం, నేను వదిలినట్టే సగం వెలుగుతున్నది. మా బాబు షర్టు, ప్యాంట్ మాత్రమే వేసుకుని ఉన్నాడు. చేతిలో కిరీటంతో దీపం పక్కనే నిలబడి ఉన్నాడు. వాడు దాన్ని విరవడానికి లేదా వంచడానికి ప్రయత్నం చేస్తున్నట్టు కనిపించింది. నేను అరవడంతో అది చేయిజారి కిందపడింది. తెల్లబోతూ, అతను నా వేపు చూచాడు. నేను కిరీటాన్ని అందుకున్నాను. పరీక్షగా చూస్తే, అందులో ఒక ముక్క విరిగి ఉంది. మూడు రాళ్లు లేవు.

“ ‘దుర్మార్గుడా! దాన్ని నాశనం చేశావు! నాకు ఎక్కడలేని అగౌరవం కలిగించావు. దొంగిలించిన రత్నాలు ఎక్కడ? ’ కోపంతో ఊగిపోతూ అరిచాను.

“ ‘దొంగిలించడమా!’ వాడూ అరిచాడు.

“ ‘నీవే దొంగవు!’ వాడి భుజాలు పట్టుకుని కుదుపుతూ గట్టిగా అరిచాను.

“ ‘రాళ్లు ఏవీ పోలేదు. పోవ డమేమిటి?’ అన్నాడు బాబు.

“ ‘మూడు రాళ్లు కనిపించడం లేదు. అవి ఏమయినదీ నీకే తెలుసు. దొంగతనంతోపాటు అబద్ధం కూడానా? మరొక ముక్క విరిచేందుకు చేసిన నీ ప్రయత్నం నేను చూడనే చూచాను.’

“ ‘లేనిపోని మాటలు అంటున్నావు. ఇక ఊరుకునేది లేదు. నన్ను



అవమానించావు కనుక, ఈ వ్యవహారం గురించి ఇక నేను, ఒక్క మాట కూడా మాట్లాడను. పొద్దున్నే ఈ ఇంటి నుంచి వెళిపోతాను. నా బతుకు నేను బతుకుతాను' అన్నాడు వాడు.

" 'పోలీసులను పిలుస్తాను! ఈ వ్యవహారాన్ని బాగా లోతుదాకా చూస్తాను' దుఃఖమూ, కోపమూ కలగలిసి నేను పిచ్చెత్తి అరిచాను.

" 'నేను మాత్రం ముక్క చెప్పను. పోలీసులను పిలు. చేతనయితే, దొంగను పట్టుకుంటారు' వాడు ఎప్పుడూ మాట్లాడని రీతిగా ఒక రకమయిన మెత్తదనంతో మాట్లాడాడు.

"నేను మరీ గట్టిగా అరుస్తున్నట్టున్నాను. ఇంట్లో అందరూ లేచారు. అందరికన్నా ముందు మేరీ అక్కడికి వచ్చింది. కిరీటాన్ని, ఆర్తర్ ముఖాన్ని చూడగానే ఆమెకు వ్యవహారమంతా అర్థమయినట్టుంది. ఒక్కకేక వేసి కిందపడి మూర్ఛపోయింది. నేను పోలీసులను పిలిచి, వ్యవహారం అప్ప జెప్పడానికి పనిమనిషిని పంపించాను. ఒక ఇన్‌స్పెక్టర్, మరో కాన్‌స్టేబుల్ వచ్చారు. అప్పుడు, దొంగతనం నేరం తనమీద మోపుతానా అన్నట్టు, ఆర్తర్ చేతులు కట్టుకుని నిలబడి ఉన్నాడు. వ్యవ హారం ఇక ఇంటికి మాత్రమే సంబంధించినది కాదని, అది ఒక జాతీయ సమస్య అని నేను అనుకున్నాను. చట్టం తన పని చేసుకుపోతుందని నిర్ణయించుకున్నాను.

" 'కనీసం, నేను వెంటనే అరెస్టు కాకుండా చూడు. ఒక అయిదు నిమిషాలు నన్ను ఇంటిలోనుంచి బయటకు వెళ్లి రానిస్తే, మన ఇద్దరికీ మంచిది' అన్నాడు అబ్బాయి మాటల సందర్భంగా.

“ ‘పారిపోదామని లేక దొంగిలించింది దాచి వద్దామని అనుకుంటున్నావా?’ అన్నాను నేను. నేను ఇరికిన భయంకరమయిన పరిస్థితి అర్థం చేసుకున్నాను. అందులో పోయేది నా గౌరవం ఒక్కటే కాదు, మనకన్నా చాలా గొప్ప స్థితిలో ఉన్న వారికి ప్రమేయం ఉందన్నాను. దేశమంతా ఉడికిపోతుందన్నాను. కనిపించకుండా పోయిన మూడు రాళ్లు ఎక్కడ ఉన్నదీ చెపితే తాను ఇంత రభసను ఆపగలుగుతాడని చెప్ప ప్రయత్నించాను.’

“ ‘అంతా నీ మెడకే చుట్టుకుంటుంది. దొంగతనం చేస్తూ కనిపించావు. ఎంత మొత్తుకున్నా, జరిగేది ఏమీ ఉండదు. నీకు చేతనయిన రకంగా దిద్దుబాటు చేసుకుంటే, అంటే బెరిల్స్ గురించి చెబితే, నిన్ను నేను క్షమిస్తాను’ అన్నాను నేను.

“ ‘నీ క్షమాపణలు అడిగినవారికి ఇవ్వు’ అని జవాబిచ్చాడు. ఇక నా మాటల వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని కనిపించింది. మిగిలింది ఒకే మార్గం ఇన్‌స్పెక్టర్‌ను పిలిచి వాడిని అప్పజెప్పాను. వాడిని, వాడి గదినీ, ఇంటిలోని అన్నిచోట్లనూ రత్నాల కోసం వెతికారు. ఎక్కడా అవి దొరకలేదు. మొండి సన్నాసి, ఎంత చెప్పినా, భయపెట్టినా నోరువిప్పి ఒక్క ముక్క చెప్పలేదు. ఉదయాన వాడిని సెల్‌లో బంధించారు. అక్కడ తతంగం ముగించుకుని నేను పరుగుపెడుతూ, మీ వద్దకు చేరాను. ఈ చిక్కును విప్పడంలో తమరి సాయం కోసం అడుక్కుంటున్నాను. పోలీసులకు అంతుపట్టడం లేదని ఒప్పేసుకున్నారు. ఇక్కడ ఎంత ఖర్చయినా, నేను వెనుకాడను. ఇప్పటికే వెయ్యి పౌండ్లు బహుమతి ప్రకటించాను. ఓరి దేవుడా! నాకేది దారి. నా గౌరవం కాస్త పోయింది. దానితో పాటే రత్నాలు, నా కొడుకూ కూడా ఒక్క రాత్రిలో నాకు దూరమయ్యారు. ననేమయి పోను!” రెండు చేతులతో తలను పట్టుకుని అతను ఊగిపోసాగాడు. చిన్నపిల్లవాడిలాగ, వర్ణనకు అందనంత బాధపడుతున్నాడు.

షెర్లక్ హెూమ్స్ కనుబొమలు ముడుచుకుని మంటవేపే అదేపనిగా చూస్తూ, కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా ఉన్నాడు.

"ఇంటికి చాలామంది వస్తుంటారా?" అడిగాడు అతను.

"నా పార్టనర్, అతని కుటుంబం, మరొకరిద్దరు ఆర్తర్ మిత్రులు తప్ప ఎక్కువగా రారు. ఈ మధ్యన సర్ జార్జ్ బర్న్‌వెల్ చాలాసార్లే వచ్చాడు. ఇంకెవరూ రారు."

"మీరు బయట సొసైటీలో బాగా తిరుగుతూ ఉంటారా?"

"ఆర్తర్ తిరుగుతాడు. మేరీ, నేను ఇంట్లోనే ఉంటాము. మాకదంతా పట్టదు."

"అమ్మాయి అలా ఉండడం అసాధారణం."

"ఆమె చాలా నెమ్మది మనిషి. పైగా చిన్న పిల్ల కూడా కాదు. ఇరవయి నాలుగేళ్ల వయసు."

"మీరు చెపుతున్నదాన్ని బట్టీ, ఈ వ్యవహారం, ఆమెను కూడా బాగా కుదిపేసి ఉంటుంది. "

"భయంకరంగా! నాకంటే ఆమె ఎక్కువ కదిలిపోయింది."

"మీ అబ్బాయి విషయం గురించి మీ ఇద్దరికీ అనుమానమే లేదా?"

"కిరీటం చేతిలో ఉండగా నా కళ్లతో చూచిన తరువాత ఇంకా అనుమానం ఎక్కడిది?"

"అది నిజమయిన రుజువు కాకపోవచ్చు. కిరీటానికి మరేరకంగా నయినా హాని కనిపించిందా?"

"అవును. అది ఒంకర తిరిగి ఉంది."

"అతను దాన్ని సరిచేయాలని ప్రయత్నించాడని, మీకు అని పించలేదా?"

“గాడ్ బ్లెస్ యూ. మీరు నాకూ వాడికి అవసరమయింది చేస్తున్నారు. అది నిజమయితే బాగుంటుంది. వాడు అక్కడ ఏం చేస్తున్నాడు. తప్పుచేయనివాడయితే, ఆ సంగతి చెప్పడెందుకు?”

“అదీ ప్రశ్న! తప్పు చేసినవారు అబద్ధం చెప్పాలి. అతని నిశ్శబ్దంలో నాకు ఏవో వినిపిస్తున్నాయి. కేసులో ముఖ్యమయిన విషయాలు నాకు కనపడుతున్నాయి. మీరు నిద్రలేవడానికి కారణమయిన శబ్దాలను గురించి పోలీసులు ఏమంటున్నారు?”

“ఆర్తర్ తన పడకగదిని మూసినప్పుడు ఆ చప్పుడు వచ్చిందని వాళ్లు అంటున్నారు.”

“నిజంగానా! తప్పుచేయడానికి బయలుదేరిన మనిషి, ఇంట్లోవాళ్లంతా లేచేట్టు, తలుపులు తోస్తాడా? ఇక జెమ్స్ పోవడం గురించి వాళ్లు ఏమన్నారు?”

“వాళ్లు ఇల్లంతా కుళ్ల బొడిచి వాటికోసం వెతుకుతున్నారు.”

“బయటకూడా వెతకాలని వాళ్లకు తోచలేదా?”

“అది కూడా జరిగింది. శక్తినంతా ఉపయోగించి తోటలో అడుగడుగునా వెతికారు. ”

“ఇక, మైడియర్ సర్, ఒక మాట చెపుతాను. మీరు, అటు పోలీసులు అనుకుంటున్నదానికన్నా ఈ వ్యవహారంలో లోతు మరింత ఎక్కువగా ఉందని ఇప్పటికయినా తోచలేదా? ముందు మీకు అంతా సింపుల్‌గా తోచింది. నాకేమో చాలా గజిబిజి కనిపిస్తున్నది. మీ సిద్ధాంతం గురించి ఒక్కసారి చూద్దాము. మీరు చెపుతున్న ప్రకారం చూస్తే, మీ అబ్బాయి, ధైర్యం చేసి మీ డ్రెసింగ్‌రూమ్ దాకా వచ్చాడు, బీరువా తెరిచాడు, కిరీటం తీసుకున్నాడు, అందులో ఒక ముక్క తుంచాడు, ఉన్న ముప్పయి తొమ్మిది బెరిల్స్ నుంచి మూడింటిని దాచాడు. అది కూడా మరెవ్వరికీ దొరకకుండా.

ముప్పయి ఆరు రాళ్లున్న కిరీటంతో అతను తిరిగి వచ్చి మీ కంటపడే ప్రమాదాన్ని కోరి తలమీదికి తెచ్చుకున్నాడు. ఇదంతా మీకు అసంబద్ధంగా తోచడం లేదా?"

"ఇంకో దారి ఏముంది? వాడు ఏ తప్పూ చేయకుంటే, విషయం చెప్పవచ్చుకదా?" నిరాశకు గురవుతూ బ్యాంకర్ అన్నాడు.

"ఆ సంగతి తెలుసుకోవడానికే మనం ఉన్నాం. ఇక మీరు దయతలిస్తే, మిస్టర్ హోల్డర్, మనమంతా కలిసి స్ట్రీట్‌హామ్ పోదాం. అక్కడ వివరాలను ఓగంట పాటు మరింత నిశితంగా చూద్దాం" జవాబుగా అన్నాడు హోమ్స్.

తమతోపాటు నేను కూడా రావాలని, నా మిత్రుడు పట్టుపట్టాడు. కథ విన్న తరువాత నాలో కుతూహలం మరీ ఎక్కువయింది గనుక, నేనూ అదే కోరుకున్నాను. కుర్రవాడు నేరంలో ఇరకడంతో ఆ తండ్రికి కలిగినంత బాధ నాకు కూడా కలిగింది. హోమ్స్ నిర్ణయశక్తిమీద నాకు గట్టి నమ్మకం ఉంది గనుక, ఏదో మార్గం దొరుకుతుందని అనుకున్నాను. అతను విషయం గురించి అసంతృప్తిగా ఉన్నాడని అర్థమయింది. దారి మొత్తంలోనూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు అతను. తల కిందకు వాల్చుకుని హ్యాట్‌ను కళ్లమీదకు కప్పుకుని ఆలోచనలో మునిగి ఉన్నాడు. సూచనగా అందిన నమ్మకంతో మా క్లయంట్ కూడా కొంచెం తేరుకున్నట్టు కనిపించాడు. నాతో ఏదో మాట్లాడడంకూడా మొదలుపెట్టాడు. తన వ్యాపారం గురించి ఏవేవో చెప్పాడు. రైల్లో కొంతసేపు వెళ్లి, కొంత దూరం నడిచి, ఫెయిర్‌బ్యాంక్‌లో ఉన్న వాళ్ల ఇంటికి చేరుకున్నాము.

ఫెయిర్‌బ్యాంక్‌లో ఇల్లు నలుచదరపు స్థలంలో, తెల్లరాతితో కట్టినది. రోడ్డుకు కొంచెం దూరంగా ఉన్నది. లోపల విశాలమయిన దారి ఉన్నది. లాన్ మీద అంతా స్నో కురిసి ఉంది. పెద్ద గేట్లు మూసి ఉన్నాయి. కుడిపక్కన గుంపుగా ఉన్న చెట్ల మధ్యనుంచి ఒక దారి బయలుదేరి వంట ఇంటి తలుపు వరకు, చెట్ల మధ్యగా సాగి ఉంది. ఎడమపక్కన మరొక దారి



స్టేబుల్స్ వేపుగా ఉంది. అయినా దానిమీద ఎక్కువగా ఎవరూ తిరిగినట్టు లేదు. మమ్మల్ని ద్వారం దగ్గరే వదిలి, హోమ్స్, ఇంటి చుట్టూ తిరిగి చెట్ల మధ్య దారి వెంట మళ్లీ వచ్చాడు. అట్లాగే, ఇంకొక దారిలోకూడా వెళ్లి వచ్చాడు. ఆలోగా నేను, మిస్టర్ హోల్డర్ డయినింగ్ రూమ్‌లోకి వెళ్లి మంట కాచుకుంటూ కూచున్నాము. మేమట్లా కూర్చుని ఉండగా ఒక యువతి లోపలికి వచ్చింది. సన్నగా ఉన్న ఆమె, ఎత్తు కూడా ఎక్కువలేదు. జుట్టు, కళ్లు నల్లనివి. తెల్లని ఆమె చర్మం, వాటి నలుపును మరింత పెంచింది. ఒక ఆడమనిషి ముఖం, అంతగా పాలి ఉండడం నేను చూచి ఎరుగను. ఆమె పెదవుల్లో కూడా రక్తం లేదు. ఏడ్చినందుకు అన్నట్టు కళ్లు ఎర్రబడి ఉన్నాయి. ఆమె గదిలోకి వస్తుంటే, దుఖం నడిచి వస్తున్నట్టు ఉంది. అంత దుఖం ఆ బ్యాంకర్‌లో కూడా కనిపించలేదు. ఆ అమ్మాయిలో అది మరింత ఎక్కువగా కనిపించ డానికి కారణం, ఆమె వ్యక్తిత్వం అయి ఉంటుంది. నా ఉనికిని పట్టించుకోకుండా, ఆమె పెద్ద తండ్రి వద్దకు చేరి, పెద్ద మనిషిలా ఆయన తల నిమిరింది.

"ఆర్తర్‌ను విడిచిపెట్టమని ఆజ్ఞ చేశారు కదూ? అంతేనా డాడ్?" అమె అడిగింది.

"లేదు, లేదమ్మా. పరిశోధన బాగా జరగాలి."

"నాకు మాత్రం తను నిర్దోషి అని నమ్మకంగా ఉంది. ఆడ మనసు గురించి నీకు తెలియకనా? తానేమీ చేయలేదని నాకు తెలుసు. అది తెలిసి

నప్పుడు నీవూ బాధపడతావు.”

“నిర్దోషి అయితే, మరి మాట్లాడడెందుకు?”

“ఎవరికి తెలుసు? నీవు అనుమానించడంతో బాగా కోపగించుకుని ఉంటాడు.”

“అనుమానించకుండా ఎలాగుండను? అతని చేతులలో కిరీటం చూచాను కూడా!”

“ఓహ్, దాన్ని బాగా చూడాలని చేతిలోకి తీసుకుని ఉంటాడు. అతను నిర్దోషి అని చెపుతున్నాను నమ్ము. విషయం గురించి మరొక్కమాట అన వసరం. ఆర్థర్ జైల్లో పడతాడంటే, ఆలోచనే భయంకరంగా ఉన్నది!”

“రాళ్లు దొరికినదాకా వదిలేది లేదు. మేరీ, ఆర్థర్ మీద నీకు బోలెడంత అభిమానం. నాకు ఏం జరుగుతుందన్నది నీవు ఆలోచించడం లేదు. విషయాన్ని కప్పిపుచ్చడం కాదుకదా, దాన్ని లోతుగా పరిశోధించడానికి, లండన్‌నుంచి ఒక పెద్ద మనిషిని కూడా తెచ్చాను.”

“ఈయనేనా?” ముఖం నావేపు తిప్పుతూ ఆమె అన్నది.

“కాదు. ఈయున మిత్రుడు. ఆయున ఇంటి వెనుకవేపు పరి శీలిస్తున్నాడు.”

“ఇంటి వెనక? అక్కడేం దొరుకుతుందని? ఆహ్! ఈయనే అను కుంటాను. సర్, మీరు మీ పనిలో విజయం సాధిస్తారని నిజం తెలుసు కుంటారని నమ్ముతున్నాను. కజిన్ ఆర్థర్ ఏ నేరమూ చేయలేదు.” ఆమె నల్లని కనుబొమలను ఎత్తి అన్నది.

“మీ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. ఆ సంగతిని రుజువు పరచగలనని కూడా నమ్ముతున్నాను” జవాబుగా హోమ్స్ అన్నాడు. అతను పక్కకు వెళ్లి, కాళ్ల జోళ్లకు అంటిన మంచును వదిలించుకున్నాడు. “నేను మాట్లాడుతున్నది మిస్ మేరీ హోల్డర్‌గారితో అనుకుంటాను. తమరిని

ఒకటో రెండో ప్రశ్నలు అడగవచ్చా?”

‘దయచేసి అడగండి. ఈ భయంకరమయిన వ్యవహారంలో సాయ పడతాయేమో!”

“గడిచిన రాత్రి మీకు ఏమీ వినిపించలేదా?”

“అంకుల్ అరిచేదాకా, నాకు ఏమీ వినిపించలేదు. ఆయన మాట విని వచ్చాను నేను.”

“రాత్రి మీరే కిటికీలు, తలుపులూ మూశారు. అన్ని కిటికీలకు గొళ్లాలు బిగించారా?”

“అవును.”

“ఉదయాన అవన్నీ అలాగే ఉన్నాయా?”

“అవును.”

“మీ ఇంట్లో పనమ్మాయికి ఒక ప్రియుడు ఉన్నాడు. ఆ అమ్మాయి, ప్రియుడిని కలవడానికి రాత్రి బయటకు వెళ్లిందని మీరే అన్నారు.”

“అవును. ఆ అమ్మాయి డ్రాయింగ్ రూమ్‌లోనే ఉంది. కిరీటం గురించి అంకుల్ చెప్పినది విని ఉండవచ్చు.”

“అలాగా? సంగతిని ప్రియునితో చెప్పడానికి ఆమె బయటకు వెళ్లి ఉండవచ్చునని, ఇద్దరూ కలిసి దొంగతనం ప్లాన్ చేసి ఉండవచ్చుననీ, మీరు అంటున్నారన్నమాట.”

“కానీ, ఈ రకం సిద్ధాంతాలతో ఏం లాభం? కిరీటం చేతుల్లో ఉండగా ఆర్థర్‌ను నేను స్వయంగా చూచానని చెపుతున్నాను కదా?” గట్టిగా అడిగాడు బ్యాంకర్ అసహనంగా.

“ఒక్క క్షణం ఆగండి మిస్టర్ హోల్డర్! అక్కడికే వస్తాము. మిస్ హోల్డర్, ఇక ఈ అమ్మాయి గురించి. ఆమె వంట ఇంటి దారిలో వెనుకకు



వచ్చింది కదా?"

"అవును. తలుపులను గమనించడానికి వెళ్లినపుడు ఆమె నెమ్మదిగా లోపలికి రావడం గమనించాను. బయట చీకటిలో ఆ మనిషి కూడా కనిపించాడు."

"అతను మీకు తెలుసా?"

"ఓ యస్! అతనే మాకు కూరగాయలు తెస్తుంటాడు. పేరు ఫ్రాన్సిస్ ప్రాస్పర్."

''అతను తలుపుకు ఎడమగా నిలబడ్డాడు. అంటే తలుపు చేరడానికి వీలుకానంత దూరంగా అన్నమాట" అడిగాడు హోమ్స్.

"అవును, నిజమే."

"ఇక అతనికొక కర్రకాలు ఉంది కదూ?"

"అమ్మాయి నల్లని కళ్లలో ఒక్క క్షణం భయం కనిపించింది. "ఏమిటి? మీకు మాయలు తెలుసా? ఈ సంగతి ఎలా తెలిసింది?" ఆమె చిన్నగా నవ్వింది. హోమ్స్ ముఖంలో మాత్రం బదులుగా నవ్వు కనిపించలేదు.

"ఇక పై అంతస్తులోకి వెళితే, బాగుంటుంది. మళ్లీ ఒకసారి ఇంటి చుట్టూ కూడా చూడాలి. పైకి వెళ్లే ముందు కిటికీలను మరోసారి పరిశీలించాలి" అన్నాడు అతను.

అతను వేగంగా ఒకదాని నుంచి మరోదానివేపు నడిచాడు. రెండవ దారి మీదుగా ఇంటి వెనుకకు తెరుచుకునే పెద్ద కిటికీ దగ్గర ఆగాడు.

దాన్ని తెరిచి, భూతద్దం సాయంతో తీవ్రంగా పరిశీలించాడు. "ఇప్పుడిక పైకి వెళదాం" అన్నాడు చివరకు.

బ్యాంకర్ చెప్పిన డ్రెసింగ్ రూమ్ చాలా చిన్నది. ఫర్నిచర్ కూడా చాలా తక్కువ. అందులో ఒక కార్పెట్, పెద్ద బీరువా, ఒక ఎత్తయిన అద్దం ఉన్నాయి. హోమ్స్ బీరువా దగ్గరకు చేరి తాళాన్ని బాగా పరీక్షించాడు.

"దీన్ని తెరవడానికి ఏ తాళంచెవి వాడారు?" అతను అడిగాడు.

"మా అబ్బాయి చెప్పినదాన్ని. అంటే, లంబర్ రూమ్‌లో అల్మారా తాళం చెవిని."

"అది ఇక్కడ ఉందా?"

"డ్రెసింగ్ టేబుల్ మీద ఉన్నది అదే."

షెర్లక్ హోమ్స్ దాన్ని అందుకుని అల్మారా తెరిచాడు.

"అసలు చప్పుడు కాలేదు. కనుకనే మీకు మెలుకవ రాలేదు. కిరీటం ఈ కేసులోనే ఉందనుకుంటాను. దాన్ని ఒకసారి చూడాలి" అంటూ అతను ఒకసారి కేస్‌ను తెరిచాడు. డయడెమ్‌ను తీసి బల్లమీద పెట్టాడు. నగలు తయారు చేసే కళకు అది అత్యుత్తమ ఉదాహరణం. కనిపించిన ఆరు రాళ్లు చాలా గొప్పవి. అటువంటివి నేనింతకు ముందు చూచి ఎరుగను. కొరొనెట్‌లో ఒకచోట విరిగిన అంచు కనిపించింది. అక్కడే మూడు రాళ్లున్న ముక్క విరిగి ఉంటుంది.

"ఇక మిస్టర్ హోల్డర్, కిరీటంలో విరిగిన భాగాన్ని చూడండి. అటువంటిది మరొకటి విరవడానికి ప్రయత్నం చేయండి" అన్నాడు హోమ్స్.

బ్యాంకర్ భయంతో కదిలిపోయాడు. "నేను ఆ ప్రయత్నం చేయనుగాక చేయను" అన్నాడు.

''అయితే నేను చేస్తాను'' అంటూ హోమ్స్ తన బలమంతా ప్రయోగించి ముక్క విరవడానికి ప్రయత్నించాడు. ఫలితం లేకపోయింది.

"ఇది కదిలేట్టు లేదు. కానీ, నా వేళ్ల బలం తక్కువ అని నేను అనుకోను. అయినాసరే, ఇది విరగదు. మామూలు మనిషి ఎవరూ దీన్ని విరవలేడు. మిస్టర్ హోల్డర్, నేను విరిచానే అనుకోండి, ఏం జరుగుతుందో చెప్పగలరా? పిస్టల్ పేలినంత చప్పుడవుతుంది. ఇంత గోల మీరు పడుకున్న చోటికి పక్కనే జరిగింది. అయినా మీకు ఏమీ వినిపించలేదు. అదేనా మీరు చెపుతున్నది?"

"ఏమనాలో తెలియడం లేదు. నాకు ఏమీ అర్థం కావడం లేదు."

"రానురాను అర్థమవుతుంది. ఏమంటారు, మిస్ హోల్డర్."

"నేను కూడా అంకుల్‌లాంటి పరిస్థితిలోనే ఉన్నాను."

"మీరు చూచినప్పుడు మీ అబ్బాయి కాళ్లకు చెప్పులు లేదా షూస్ లేవు అన్నారా?"

"ప్యాంటు, షర్టు తప్ప ఒంటిమీద మరేమీ లేవు."

"థాంక్యూ. ఈ విచారణలో మనకు అసాధారణంగా అదృష్టం ఎదురయింది. సంగతిని తేల్చుకోలేకపోతే, తప్పంతా మనదే అవుతుంది. మిస్టర్ హోల్డర్, మీరు అనుమతిస్తే, నేను బయట, పరిశీలన కొన సాగిస్తాను."

అనవసరమయిన అడుగుజాడలు పడితే కష్టం గనుక, అందరినీ వద్దని, హోమ్స్ ఒక్కడే బయటకు వెళ్లాడు. ఒక గంటపాటు అక్కడే ఉన్నాడు. వెనుతిరిగి వచ్చినప్పుడు అతని కాళ్లమీద బోలెడంత మంచి పేరుకుని ఉంది. అతని వాలకం మాత్రం మునుపటిలాగే ఉంది.

"మిస్టర్ హోల్డర్, చూడవలసినదంతా చూసేశాను. ఇక చేయ వలసినది నేను తిరిగి వెళిపోవడమే."

"మరి రాళ్ల సంగతి, మిస్టర్ హోమ్స్? అవి ఎక్కడున్నాయి?"

"నేను చెప్పలేను."

"అవి ఇక మళ్లీ కనిపించేలా లేవు. ఇక నా కొడుకు? ఆ సంగతేమిటి?" అన్నాడు బ్యాంకర్ చేతులు నులుముకుంటూ.

"నా అభిప్రాయాలు ఏ రకంగానూ మారలేదు."

"మరి, రాత్రి నాయింటిలో జరిగిన ఈ వ్యవహారానికి అర్థమేమిటి?"

"రేపు ఉదయం తొమ్మిది, పది గంటలమధ్యన, బేకర్‌స్ట్రీట్‌లో ఉన్న మా గదులలో కలవండి. నేను విషయం వివరిస్తాను. మీరు నాకు ఈ విషయంలో పూర్తి స్వతంత్రం ఇవ్వాలి. మీకు మీ బెరిల్స్ తిరిగి ఇచ్చే పక్షంలో, నేను అడిగినంత సొమ్ము ఇస్తానని కూడా మాట ఇవ్వాలి."

"వాటి కొరకు నేను ఏమి అడిగినా ఇస్తాను."

"వెరీగుడ్. ఆలోగా నేను వ్యవహారాన్ని పరిశీలిస్తాను. గుడ్ బై. సాయంత్రం లోపల, ఇక్కడికి మరోసారి రావలసి ఉంటుందేమో!"



కేసు గురించి నా మిత్రుడు తన నిర్ణయాలు చేసుకున్నాడని నాకు అర్థమయి పోయింది. అయితే, అవి ఏమిటన్నది మాత్రం నాకు తోచలేదు. దారిలో, చాలాసార్లు విషయం గురించి అడిగాను. కానీ అతను సులభంగా మాట మార్చాడు. ఇక నిరాశతో నేను ఊరుకున్నాను. మా గదులకు చేరేసరికి ఇంకా మూడు గంటలు కాలేదు. అతను వేగంగా తన గదిలోకి వెళిపోయాడు. పనిలేక తిరిగే ఒక మామూలు మనిషి రూపంలో బయటకు వచ్చాడు. కాలర్ ఎత్తి ఉంది. ఒక మెరుస్తున్న కోటు వేసుకున్నాడు. ఎర్రని రుమాలు మెడకు చుట్టుకున్నాడు. బూట్లు పాతవి. అతను జనంలో బాగా కలిసిపోగలడు.

"ఇది చాలు అనుకుంటాను. వాట్సన్, నీవు నాతో వస్తే బాగుండేది. కానీ వీలు కుదరదు. నేను వెతుకుతున్నది మనిషినా లేక కనిపించని పదార్థాన్నా తెలియడం లేదు. తొందరలోనే తెలుస్తుంది. కొన్ని గంటల్లో తిరిగి వస్తాను" అన్నాడతను అద్దంలోకి చూచుకుంటూ. బల్లమీద ఉన్న బీఫ్ మాంసం నుంచి ఒక ముక్కను కోసి, రెండు రొట్టెల మధ్యన చుట్టి పొట్లాన్ని జేబులో దోపుకున్నాడు. ఇక ప్రయాణం మొదలయింది.

నేను టీ ముగించే సమయానికి అతను తిరిగి వచ్చాడు. గొప్ప ఉత్సాహంగా ఉన్నాడు. చేతిలో పట్టుకున్న ఒక బూటును ఒక మూలన పడేసి తాను కూడా కప్పులో టీ తెచ్చుకున్నాడు.

"ఇటుగా వెళుతూ లోపలికి వచ్చాను. మళ్లీ వెళ్లిపోతాను." అన్నాడు అతను.

"ఎక్కడికి?"

"అదా, వెస్ట్ఎండ్ అవతలి చివరికి. తిరిగిరావడానికి ఆలస్య మవుతుంది. నాకోసం ఎదురుచూడకు."

"సంగతి ఎలా సాగుతున్నది?"

"ఏదో ఒకలాగ. మళ్లీ స్ట్రీట్‌హ్యామ్ వెళ్లాను. ఇంట్లోకి మాత్రం పోలేదు. సమస్య చక్కగా ఉంది. వదులుకోవలసినది కాదు. అయితే, ఇక్కడ కబుర్లు చెపుతూ కూచుంటే కుదరదు. ఈ అన్యాయం దుస్తులు మార్చుకుని, కాస్త గౌరవంగా కనిపించాలి."

అతనిలో సంతృప్తి కనపడుతున్నదని నేను చూడగలిగాను. మాటలలో అది బయటపడలేదు. అతని కళ్లు మెరిశాయి. చామనచాయ బుగ్గలలో రంగు తిరిగింది. అతను వేగంగా పైకి వెళ్లాడు. కొద్దిసేపట్లోనే హాలు తలుపు ధడాలున మూసుకున్నట్టు వినిపించింది. తిరిగి అతని వేటలో పడ్డాడని తెలిసిపోయింది.

నేను మధ్యరాత్రిదాకా వేచి ఉన్నాను. అతను తిరిగి రానేలేదు. ఇక నేను నా గదికి వెళిపోయాను. అలా రాత్రులు, రోజులపాటు, వాసనలు పసిగడుతూ పోయి, కనిపించకుండా పోవడం అతనికి అలవాటే. కనుక నాకు ఆశ్చర్యం లేదు. ఎప్పుడు తిరిగి వచ్చాడో తెలియదు. ఉదయం నేను కిందకు వచ్చేసరికి ఒక చేతిలో కాఫీ కప్పు, మరొక చేతిలో వార్తాపత్రిక పట్టుకుని అతను ఆనందంగా కనిపించాడు.

"నీకోసం వేచి ఉండనందుకు క్షమించాలి, వాట్సన్. మన క్లయంట్ ఉదయాన్నే వస్తాడు, తెలుసుకదా?" అన్నాడు అతను.

"ఏమది? ఇప్పుడే కదా తొమ్మిది అయింది. బెల్ వినిపించింది. అతనే వచ్చినట్టున్నాడు" అన్నాను నేను.

నిజంగానే వచ్చినది, ఆ ఫైనాన్సియర్ మిత్రుడే. అతనిలో కనిపించిన మార్పు నన్ను కదిలించింది. అతని ముఖం తీరు బాగా మారింది. కుదించుకు పోయినట్టుంది. ఒక్కసారిగా జుట్టు తెల్లబడినట్టు కనిపించింది. అలసటతో, అనాసక్తిగా అతను వచ్చిన తీరు చూస్తే, నిన్నటి తీరుకు, ఇవాళటికీ తేడా తెలిసింది. వచ్చి అతను కుర్చీలో బరువుగా కూలబడ్డాడు.

"ఏమి తప్పు చేసినందుకు, నాకు ఈ కష్టాలు వచ్చాయో తెలియదు. రెండునాళ్ల క్రితం నేను సంతోషంగా బతుకుతున్న ధనవంతుడిని. ప్రపంచమంటే లక్ష్యం లేనివాడిని. ఇక ఇప్పుడు ఒంటరినయ్యాను. పైగా, అపప్రథ. దుఖాలు ఒకదాని వెంట ఒకటి వస్తాయంటారు. మా అమ్మాయి మేరీ, వెళ్లిపోయింది."

"మిమ్మల్ని వదిలి వెళిపోయిందా?"

"అవును. ఆమె రాత్రే ఇంటిలో లేదు. గది ఖాళీగా ఉంది. హాలులో బల్లమీద ఒక చీటీ దొరికింది. రాత్రి నేను ఆమెతో కోపంతో కాక, దుఖంగా ఒక మాట అన్నాను. ఆర్తర్‌ని తాను పెళ్లి చేసుకుని ఉంటే, వాడి తీరు

ఇలాగయ్యేది కాదన్నాను. అది నేను చేసిన తప్పు అనుకుంటాను. ఆ ప్రసక్తి గురించే ఈ నోట్‌లో రాసి ఉంది:

*"మై డియరెస్ట్ అంకుల్:*

*"నా వలన మీకు కష్టాలు వచ్చాయని అను కుంటున్నాను. నేను మరొక రకంగా ప్రవర్తించి ఉంటే, ఈ దురదృష్టకర సంఘటన జరిగి ఉండేది కాదన్నారు. ఈ ఆలోచన, నా మెదడులో తిరుగుతుండగా, ఈ ఇంటిలో సంతోషంగా ఉండలేను. శాశ్వతంగా వెళిపోతున్నాను. నా భవిష్యత్తు గురించి మీరు బాధపడకండి. ఏర్పాట్లు ఉండనే ఉన్నాయి. అన్నిటినీ మించి మీరు నాకోసం వెదకవద్దు. లాభం ఉండదు సరికదా, నాకు అది కష్టం కలిగిస్తుంది. బ్రతుకులోనూ, చావులోనూ సదా మీ..*

*ప్రేమతో, మీ*

*మేరీ "*

"మిస్టర్ హెూమ్స్, దీనికంతా ఏమి అర్థం? ఆత్మహత్య చేసు కుంటుందా?"

"లేదు లేదు. అదేమీ లేదు. సమాధానం సాధ్యమయినంత బాగానే ఉంటుంది. మిస్టర్ హెూల్డర్ మీరు మీ కష్టాలను దాటి, గట్టున పడుతున్నారని నా నమ్మకం."

"హా! అలాగంటారా? మీకేమయినా తెలిసిందా? మిస్టర్ హెూమ్స్, జెమ్స్ ఎక్కడున్నాయి?"

"వాటికి ఒక్కొక్కంటికీ వెయ్యి పౌండ్లు అంటే, ఎక్కువ అవుతుందా?"

"ఒకటేమిటి, పది ఇస్తాను."

"అంత అవసరం లేదు. మూడు వేలతో పని ముగుస్తుంది. మరింత

లాభం కూడా ఉంది. జేబులో చెక్‌బుక్ ఉందా? ఇదుగో పెన్ను. నాలుగు వేల పౌండ్లకు రాయండి."

ఏమీ అర్థంకాకుండానే, బ్యాంకర్ చెప్పినట్టు చెక్ రాశాడు. హోమ్స్ తన డెస్క్ దగ్గరకు వెళ్లాడు. మూడు బెరిల్స్ పొదిగి ఉన్న, మూడు మూలల బంగారపు ముక్కను తెచ్చి బల్లమీద పడవేశాడు.

సంతోషంగా ఒక కేక వేసి మా క్లయంట్, దాన్ని అందుకున్నాడు.

"దొరికింది! బయటపడ్డాను! నేను బయటపడ్డాను!" అతనికి ఊపిరి సలపడం లేదు.

అతనిలో సంతోషం కనిపించిన తీరు, నిన్నటి దుఖం తీరులాగే, చాలా బలంగా ఉంది. దొరికిన జెమ్స్‌ను అతను ఎదకు గట్టిగా పట్టుకున్నాడు.

"మీరు ఇంకొకటి బాకీ పడి ఉన్నారు, మిస్టర్ హోల్డర్" అన్నాడు షెర్లక్ హోమ్స్ కొంచెం గట్టిగానే.

"ఓవ్! ఎంతో చెప్పండి. ఇప్పుడే ఇస్తాను" అతను పెన్ను పట్టుకున్నాడు.

"నో! అప్పు నాకు కాదు. పాపం మంచి కుర్రవాడు, మీ కొడుకుకు మీరు క్షమాపణ చెప్పడం బాకీ ఉంది. అతని ఈ వ్యవహారంలో నిజంగా ఒక కొడుకులాగా వ్యవహరించినందుకు నాకు గర్వంగా ఉంది. అటువంటి కొడుకు నాకు ఉండిన పక్షంలో అన్నమాట."

"అయితే వాటిని తీసింది ఆర్తర్ కాదన్నమాట."

"నేను నిన్ననే చెప్పాను. ఇప్పుడు మళ్లీ చెపుతున్నాను, కాదని."

"నమ్మకంగానా?అయితే మనం వెంటనే వాడి దగ్గరకు వెళ్లి, నిజం తెలిసిందని చెప్పేద్దాం."

"అబ్బాయికి ఇప్పటికే తెలుసు. విషయం తెలిసిన తరువాత, నేను అతనితో మాట్లాడాను. సంగతి తాను చెప్పడం తెలుసు. కనుక నేనే

చెప్పేశాను. అతను చేయవలసిందల్లా నేను చెప్పింది నిజం అనడం. ఇంకా నాకు అందని కొన్ని వివరాలను అందించడం. ఇక ఈ ఉదయం మీరు తెచ్చిన వార్తతో అతను మాటలు మొదలుపెడతాడు అనుకుంటున్నాను.”

“అయితే, దేవుని పేరున, ఈ అసాధారణమయిన రహస్యమేమిటో చెప్పండి!”

“చెపుతాను. దాన్ని నేను తెలుసుకున్న తీరు కూడా చెపుతాను. అయితే ముందే చెపుతున్నాను, రహస్యం గురించి చెప్పడం నాకు కష్టం, వినడం మీకూ కష్టం. సర్ జార్జ్ బర్న్‌వెల్‌తో మీ తమ్ముని కూతురు మేరీకి ఒక అవగాహన కుదిరింది.  ఇప్పుడు వాళ్లిద్దరూ కలిసి పారిపోయారు.”

“మా మేరీయా? అసాధ్యం!”

“అది దురదృష్టంకొద్దీ సాధ్యం కన్నా ఎక్కువే అయింది. నిజమయింది. ఆ మనిషిని మీ కుటుంబ పరిధిలోకి రానిచ్చినప్పుడు అతగాని వ్యక్తిత్వం గురించి మీకుగాని, మీ అబ్బాయికిగాని ముక్క తెలియదు. అతను ఇంగ్లాండ్‌లోనే చెడ్డపేరున్న మనుషుల్లో ఒకడు. జూదంతో సర్వనాశన మయ్యాడు. కనుక గొప్ప దుష్టుడుగా మారాడు. దయాదాక్షిణ్యాలు అతనికి లేవు. మీ అమ్మాయికి అటువంటి మనుషులను గురించి ఏమీ తెలియదు పాపం. మరో వందమందికి చెప్పినట్టుగానే, అతను ఈమెకు కూడా ప్రేమ మాటలు చెప్పేసరికి, అమ్మాయి హృదయం కదిలిపోయింది. చెప్పినదేమిటో ఆ రాక్షసునికి తెలుసు. అతని చేతిలో కీలుబొమ్మ అయింది. వాళ్లిద్దరూ ప్రతినిత్యం కలుసుకుంటూనే ఉన్నారు.”

“నమ్మలేను. నమ్మను!” ముఖం తెల్లబోతుండగా, బ్యాంకర్ వాపోయాడు.

“ఇక గత రాత్రి మీ యింట్లో ఏం జరిగిందో చెపుతాను. మీరు మీ గదికి వెళ్లారని అనుకున్న తరువాత, మీ తమ్ముని కూతురు నెమ్మదిగా

కిందకు వెళ్లి, ఇంటి వెనుక కిటికీ నుంచి అతనితో మాట్లాడింది. అక్కడ మంచులో అతని కాలి గుర్తులు బలంగా ఉన్నాయి. అతను చాలాసేపు అక్కడ నిలబడ్డాడు. అతనికి కిరీటం గురించి చెప్పిందామె. వెంటనే అతనిలోని దుర్మార్గుడు మళ్లీ మేలుకున్నాడు. అమ్మాయిని దొంగతనానికి ఒప్పించాడు. మేరీకి మీమీద చాలా ప్రేమ అని తెలుసు. కానీ, ప్రియునిమీద ప్రేమ మిగతా ప్రేమలన్నింటినీ తుడిపివేస్తుంది. అందుకు ఉదాహరణలలో మీ అమ్మాయి ఒకర్తె. అతనితో మాట్లాడుతుండగానే, మీరూ కిందకు వచ్చారు. కనుక ఆమె కిటికీని త్వరగా మూసింది. ఇంటిలోని ఒక పనిమనిషి బయటకు వెళ్లి మాట్లాడడం గురించి మీతో ఏదో చెప్పింది. అయితే అది నిజం.

"మీతో మాట్లాడిన తరువాత, మీ అబ్బాయి ఆర్థర్ వెళ్లి పడుకున్నాడు. క్లబ్‌లో అప్పుల గురించిన ఆలోచనల కారణంగా అతనికి నిద్రపట్టలేదు. నడిరాత్రి తన గది ముందునుంచి ఎవరో నడిచిన చప్పుడు మెత్తగా వినిపించింది. నెమ్మదిగా లేచి బయటకు చూచాడు. నడవలో దొంగతనంగా నడుస్తూ, మేరీ కనిపించేసరికి ఆశ్చర్యపోయాడు. ఆమె మీ డ్రెసింగ్‌రూమ్‌లోకి దూరింది. ఆశ్చర్యంలోనే అతను త్వరగా ఏవో దుస్తులు వేసుకున్నాడు. చీకట్లో నక్కి నిలబడి, ఏం జరుగుతుందని చూచాడు. అంతలో అమ్మాయి గది నుంచి బయటకు వచ్చింది. నడవలో ఉన్న కొంచెం వెలుతురులో కూడా, ఆమె చేతిలో విలువయిన కిరీటం ఉండడం మీ అబ్బాయి చూడగలిగాడు. ఆమె మెట్లు దిగి కిందికి వెళ్లింది. భయంతో కదిలిపోయి అతను కూడా పరుగెత్తి మీ ద్వారం దగ్గర ఒక కర్టెన్ వెనుక నిలబడ్డాడు. అక్కడి నుంచి, కింద హాలులో జరుగుతున్న తతంగం కనపడుతుంది. ఆమె దొంగతనంగా కిటికీ తెరవడం, బయట చీకటిలో ఉన్న ఒక మనిషికి కిరీటాన్ని అందించడం, కిటికీ మూసి వేగంగా తన గదికి తిరిగిరావడం అన్నింటినీ అక్కడి నుంచే అతను చూడగలిగాడు. అమ్మాయిమీద, ఆర్థర్‌కు చాలా ప్రేమ ఉంది. కనుకనే ఆమె బయట ఉన్నంతసేపూ అతను ఏమీ



చేయలేకపోయాడు. గోల చేస్తే ఆమె బయటపడుతుంది. ఆమె వెళ్లి పడుకున్న తరువాత, సంఘటనతో మీమీద కలిగే ప్రభావం గురించి అతను ఆలోచించాడు. ఏదో చేయాలని నిర్ణయించుకున్నాడు. ఉన్నవాడు  ఉన్నట్టుగానే, కాళ్లకు జోళ్లు కూడా లేకుండా కిందకు పరిగెత్తాడు. కిటికీ తెరిచి బయట కురిసిన మంచులోకి దూకి, వీధిలోకి పరుగెత్తాడు. వెన్నెలలో అతనికి ఒక ఆకారం కనిపించింది. సర్ జార్జ్ బర్న్‌వెల్ పారిపోయే ప్రయత్నం చేశారు. కానీ, ఆర్తర్ అతడిని పట్టు కోగలిగాడు. ఇద్దరూ పెనుగులాడారు. కిరీటాన్ని లాక్కోవాలని ఇద్దరూ ప్రయత్నించారు. ఆ సందర్భంలోనే ఆర్థర్, కోపంగా సర్ జార్జ్‌ను కొట్టాడు. అతని కంటి మీద దెబ్బతగిలింది. ఉన్నట్టుండి ఏదో విరిగింది. మొత్తానికి కిరీటం మీ అబ్బాయి చేతిలో మిగిలింది. అతను వేగంగా వెనక్కు వచ్చి కిటికీ మూసేశాడు. నేరుగా మెట్లెక్కి మీ గదిలోకి వచ్చాడు. పెనుగులాటలో కిరీటం వంగిపోయిందని అప్పుడే గమనించాడు. దాన్ని మళ్లీ సరి చేయడానికి ప్రయత్నిస్తుండగా మీరు అక్కడికి ప్రవేశించారు."

"ఇదంతా సాధ్యమా?" ఆత్రంగా అడిగాడు బ్యాంకర్.

"మీరు థాంక్స్ చెప్ప వలసింది పోయి, నానా మాటలు అనేసరికి అతనిలో కోపం రేగింది. నిజానికి జాలిపడనవసరం లేని ఒక మనిషిని బయటపెట్టకుండా, జరిగిందేమిటో చెప్పడం అతనికి శక్యం కాలేదు. ఒక యువకుడు చూపించవలసిన  పద్ధతిలోనే అతను రహస్యాన్ని దాచేశాడు."

"అంటే, కిరీటాన్ని చూచిన మరుక్షణం, అమ్మాయి కేక వేసి మూర్ఛపోవడం అందుకేనన్నమాట. ఓరి దేవుడా! ఎంత గుడ్డివాడినయి పోయాను. ఒక్క అయిదు నిమిషాలు బయటకు వెళ్లి వస్తానన్నాడు. పెనుగులాట జరిగినచోట విరిగిన ముక్క దొరుకుతుందేమో చూడాలని వాడి ఆలోచన. నేను మాత్రం అర్థం చేసుకోలేకపోయాను" బాధగా అన్నాడు మిస్టర్ హొల్డర్.

"నేను మీ ఇంటికి వచ్చాను. వెంటనే మంచులో కనిపించే అడుగు జాడలకోసం వెతుకుతూ, కలియ తిరిగాను. మంచు గట్టి పడడంతో, అడుగు జాడలు నిలిచిపోయినాయి. ఆ తరువాత మరెవరూ తిరగలేదు కూడా. కుడిదారిలో చాలామంది తిరిగినట్టు అర్థమయింది. కానీ, వంటింటి తలుపుకు దగ్గరలోనే ఒక ఆడమనిషి నిలబడి ఒక మగ మనిషితో మాట్లాడినట్టు నాకు అర్థమయింది. కాలి గుర్తుల ప్రకారం ఆ పురుషునికి కర్రకాలు ఒకటి ఉందని తెలిసింది. వాళ్లు, ఎవరో రావడంతో డిస్టర్బ్ అయ్యారని కూడా చెప్పగలను. ఆ స్త్రీ తలుపువేపు వేగంగా పరుగెత్తింది. కాలిగుర్తుల ప్రకారం ఆ సంగతి చెప్పగలను. కర్రకాలు మనిషి ఆ తరువాత కొంచెంసేపు ఆగి, వెళ్లిపోయాడు. మీరు ముందే చెప్పినట్టు, మీ పనిమనిషి, ఆమె ప్రియుడు అక్కడ మాట్లాడుకున్నారని, నాకు అప్పుడే తోచింది. విచారణతో మాట స్థిరం అయింది. ఇక తోటలో కనిపించిన అడుగుజాడలు ముఖ్యమయినవి కావు. అవి పోలీసువాళ్లవి అని అనుకున్నాను. ఎడమదారిలో ఇంటి వెనుక గుర్రపుశాలవేపు వెళితే మాత్రం మంచులో మరొక పెద్దకథ రాసి ఉన్నట్టు కనిపించింది.

"బూట్లు వేసుకున్న ఒక మనిషి అడుగులు రెండు రకాలుగా ఉన్నాయి. మరొక రెండు రకాలుగా కాళ్లకు జోళ్లు లేని మరో మనిషి అడుగుజాడలు ఉన్నాయి. మీరు చెప్పిన సంగతుల ప్రకారం ఆ రెండవ జాడలు మీ కుమారుడివని అర్థమయింది. మొదటి మనిషి వచ్చాడు, వెళ్లాడు. రెండవ

మనిషి మాత్రం పరుగులు పెట్టాడు. బూట్ల మనిషి దారి మీద ఇతను పరిగెత్తినట్టు గుర్తించాను. ఇద్దరూ కలిసి నడవలేదు. వెంబడిస్తే, రెండు జాడలూ హాలు కిటికీని చేరుకున్నాయి. బూట్ల కాళ్లు అక్కడే చాలాసేపు నిలబడ్డందుకు వాటి కింద మంచు కరిగింది. జాడలవెంట మరో చివరకు వెళ్లాను. అట్లా వీధిలో వందగజాలదాకా వెళ్లాను. బూట్లు వెనుకకు తిరిగాయి. పెనుగులాట జరిగిందనడానికి సాక్ష్యంగా అక్కడ మంచు తొక్కినట్టు ఉంది. కొన్ని రక్తపుచుక్కలు కూడా కనిపించాయి. అంటే నా ఆలోచన తప్పుకాదని అర్థం. బూట్లు వీధిలో ముందుకు పరుగెత్తాయి, ఆ దారి వెంట అక్కడక్కడ రక్తంచుక్కలు ఉన్నాయి. అటు చివరన, హైరోడ్ చేరినచోట, జాడలు పేవ్‌మెంట్ మీదకు ఎక్కాయి. అక్కడ మంచును తొలగించారు. కనుక నా దారి ముందుకు సాగలేదు.

"ఇంట్లోకి వచ్చిన తరువాత మాత్రం నేను హాలు కిటికీలో కిందభాగాన్ని నా లెన్స్ సాయంతో పరీక్షించడం, మీకు గుర్తు ఉండే ఉంటుంది. ఎవరో అందులోకి ఎక్కి దూకినట్టు చూడగలిగాను. మళ్లీ ఒక తడికాలు తిరిగి ఎక్కడమూ కనిపించింది. ఇక, జరిగినదేమిటో ఊహించడం నాకు వీలయింది. ఒక మనిషి కిటికీ బయట వేచి ఉన్నాడు. నగను ఎవరో తీసుకుని వచ్చారు. అది జరగడం మీ అబ్బాయి గమనించాడు. అతను దొంగను వెంబడించాడు. అతనితో కలియబడ్డాడు. ఇద్దరూ కిరీటం కోసం పెనుగులాడారు. ఒకరివల్ల విరగని కిరీటం ఇద్దరు కలిసి లాగడంతో విరిగింది. మొత్తానికి వస్తువును అందుకుని మీ అబ్బాయి వెనుతిరిగాడు. అందులోని ఒక ముక్క మాత్రం దొంగచేతిలో మిగిలిపోయింది. అంతవరకూ నాకు అర్థమయింది. ఇక మిగిలిన ప్రశ్న ఏమంటే, ఆ మనిషి ఎవరు? కిరీటాన్ని కిటికీ వద్దకు తెచ్చింది ఎవరు? అని.

"నాకు ఒక అలవాటయిన పద్ధతి ఉన్నది. అసాధ్యాలు అనుకున్నవాటిని వదిలేసిన తరువాత, అది ఎంతటి వీలు కానిదయినా సరే, మిగిలిందే

నిజం. దాన్ని కిందకు తెచ్చినది, మీరు మాత్రం కాదని తెలుసు. ఇక మిగిలింది మీ తమ్ముని కూతురు, మరొక పనిమనిషి. తెచ్చినది పనిమనిషే అయితే, ఆమెను కాపాడి తాను నిందితుడుగా మిగలవలసిన అవసరం మీ అబ్బాయికి లేదు. అందుకు కారణమే ఉండదు. అతనికి మేరీ మీద ప్రేమ. కనుక రహస్యాన్ని దాచడానికి ఇక్కడ చాలా చక్కటి కారణం కనపడుతుంది. పైగా, రహస్యం కారణంగా కుటుంబానికంతా తలవంపులవుతుంది. మీరు ఆమెను కిటికీ దగ్గర చూచామని చెప్పింది, గుర్తుకు వచ్చింది. కిరీటం చూడగానే ఆమె మూర్ఛపోయిన తీరుతో నా ఆలోచన గట్టిపడింది.

"ఇక ఆమెతో నేరంలో చేయి కలిపిన మనిషి ఎవరు? తప్పకుండా ఒక ప్రియుడే అయి ఉండాలి. మీమీద ఉన్న ప్రేమను మించి మరొకరిమీద ప్రేమ ఉందంటే, ప్రియుడుకాక మరెవరోకాదు. మీరు సమాజంలో ఎక్కువగా తిరగరని, ఇంటికివచ్చే మిత్రుల సంఖ్య తక్కువని నాకు తెలుసు. అయితే, సర్ జార్జ్ బర్న్‌వెల్ వారిలో ఒకడు. ఆడవాళ్లతో అతనికున్న చెడ్డపేరు గురించి నేను ఇంతకుముందే విని ఉన్నాను. ఆ బూట్ల మనిషి, పోయిన నగను అందుకున్నది అతనే అయి ఉండాలి. తాను ఆర్థర్ కంటపడ్డానని అర్థమయినా, అబ్బాయి అంత సులభంగా విషయాన్ని బయట పెట్టడని, కనుక తనకు అపాయం లేదని అతను అనుకుని ఉంటాడు.

"ఇక, ఆ తరువాత నేను ఏం చేసి ఉంటానని మీరు ఊహించగలరు. నేను మారువేషంలో సర్ జార్జ్ ఇంటికి వెళ్లాను. అక్కడ ఒక వాలెట్‌తో మాట కలిపాను. తమ యజమానికి నుదుటిమీద గాయం అయిందని ఆ మనిషి చెప్పాడు. ఆరు షిల్లింగులు ఇచ్చిన తరువాత, అతను యజమానిగారి పాత బూట్ల జత ఒకటి నాకు ఇచ్చాడు. వాటితో నేను మళ్లీ స్ట్రీట్‌హ్యామ్ వచ్చాను. అడుగుజాడలను ఆ జోళ్లతో పోల్చి, వచ్చింది అతనే అని స్థిరం చేసుకున్నాను."

"నిన్న సాయంత్రం, ఒకరెవరో అలగా మనిషి, ఇక్కడ తిరుగు



తుండటం చూచాను" అన్నాడు మిస్టర్ హోల్డర్.

"నిజమే. ఎవరో కాదు నేనే. నాకు కావలసిన మనిషి దొరికి పోయాడు. కనుక ఇంటికి వెళ్లి బట్టలు మార్చుకున్నాను. తరువాత జరగవలసింది కొంచెం సున్నితమయిన వ్యవహారం. ఈ కేసు కోర్టు దాకా వెళితే, అనవసరమయిన ప్రచారం మొదలవుతుంది. దొంగ చాలా తెలివిగలవాడు. ఈ సంగతిని అర్థం చేసుకుంటాడు. కనుక నేను నేరుగా వెళ్లి అతగాడినే కలిశాను. మొదట్లో, మామూలుగానే తనకేమీ తెలియదన్నాడు. నేను జరిగిన సంగతులన్నీ, పూసగుచ్చినట్టు చెప్పేసరికి, అతను బిత్తరపోయి గోడ నుంచి తుపాకీని అందుకున్నాడు. నాకు అదంతా అలవాటే. అతనికన్నా ముందే, పిస్టల్ తీసి తలకు పెట్టాను. ఇక అతను మెత్తబడ్డాడు. బెరిల్స్‌కు ఒక్కొక్కంటికీ వెయ్యి పౌండ్ల ప్రకారం వెలకట్టి ఇస్తాము అన్నాను. అప్పుడు అతని ముఖంలో మొదటిసారిగా బాధ కనిపించింది. 'ఎంత మాట అన్నావు! మొత్తం మూడింటినీ ఆరు వందలకు అమ్మాను!' అన్నాడు. వెంటనే కొన్న మనిషి వివరాలను తెలుసుకోగలిగాను. కేసు విషయంలో పోలీసుల జోక్యం ఉండదని అతనికి మాట ఇచ్చాను. వెళ్లినచోట చాలా బేరమాడి వెయ్యి పౌండ్లకు ఒకటి చొప్పున బెరిల్స్‌ను

కొనేశాను. ఆ తరువాత వెళ్లి మీ అబ్బాయిని కలిసి, వ్యవహారం చక్కగా ముగిసిందని వివరించి చెప్పి, రెండుగంటల ప్రాంతానికి ఇంటికి వెళ్లి పడుకున్నాను. ఒక్కదినాన ఇంత సాధించడం నిజంగా గట్టి పని, అనుకుంటున్నాను.”

“మామూలు దినం కాదండి. ఇంగ్లండ్‌లో ఒక సంచలనాత్మక స్కాండల్ జరగకుండా కాపాడారు” అంటూ బ్యాంకర్ లేచి నిలబడ్డాడు. “సర్, మీకు ధన్యవాదాలు చెప్పడానికి నాకు మాటలు సరిపోవడం లేదు. కానీ, మీరు చేసినదానికి, ఏదో బదులు చేయకుండా ఉండేంత చెడ్డవాడిని మాత్రం కాదు. నేను వెంటనే పరుగున వెళ్లి నా చిట్టితండ్రికి, చేసిన తప్పులకు గాను, క్షమాపణ చెప్పుకోవలసి ఉంది. ఇక మీరు, పాపం మా మేరీ గురించి చెప్పిన విషయం నా హృదయాన్ని కదిలించింది. ఇంత శక్తిగల మీరు కూడా, ఆమె ఇప్పుడు ఎక్కడ ఉన్నదీ చెప్పలేరు” అన్నాడు అతను.

“ఒక్క విషయం మాత్రం చెప్పగలను. సర్ జార్జ్ బర్న్‌వెల్ ఎక్కడ ఉంటే ఆమె కూడా అక్కడే ఉంది. ఆమె పాపాలకు త్వరలోనే, తగిన శిక్ష అందు తుందన్నది మరొక వాస్తవం” బదులిచ్చాడు హోమ్స్.





# ది కాపర్ బీచెస్

"కళను కేవలం కళ కొరకు మాత్రమే ప్రేమించే మనిషి, అందులోని లోతయిన ఆనందాన్ని చాలా చిన్న విషయాలలో నుంచి అందుకుంటాడు" డైలీ టెలిగ్రాఫ్ లోని ప్రకటనల పేజీని పక్కన పడేస్తూ, అన్నాడు షెర్లక్ హెూమ్స్. "వాట్సన్, నీవు ఈ సత్యాన్ని గ్రహించావని గమనించడం నాకు సంతోషం. నా కేసులగురించి నీవు చేసిన చిన్న రచనలలో మాత్రం సెన్సేషన్ సృష్టించిన అంశాలను మాత్రమే ఎక్కువగా ఎత్తి చూపించావు. చిన్న కేసులను చెప్పి ఉంటే బాగుండేది. అటువంటి వాటిలో నా ప్రత్యేకతలయిన ఆలో చనాశక్తిని, విశ్లేషణాపద్ధతిని వాడడానికి ఎక్కువగా అవకాశం ఉంటుంది" అన్నాడు.

"నా రచనలలో సెన్సేషనలిజం ఉందన్న అభియోగాన్ని నేను కూడా పూర్తిగా తోసిపుచ్చలేను" అన్నాను నేను చిరునవ్వుతూ.

"బహుశా, చిన్న తప్పు చేసినట్టున్నావు" టాంగ్స్‌తో ఒక నిప్పు కణికను అందుకుని, చెర్రీ ఉడ్‌తో చేసిన పొడుగాటి పైప్‌ని వెలిగించుకునే ప్రయత్నం చేస్తున్నాడతను. ఆలోచనలో పడినప్పుడు మాత్రం అతను మట్టిపైప్‌ను కాలుస్తుంటాడు. "బహుశా నువ్వు తప్పుచేసి ఉంటావు. జరిగిన విషయాలను వాటిలోని కార్యకారణ సంబంధాలను నేరుగా ఎత్తి చూపకుండా వాటికి



రంగు పులిమి జీవం ఇవ్వాలని ప్రయత్నించావు” అన్నాడతను.

“ఈ విషయంలో నీకు నేను పూర్తిగా న్యాయం చేశాననే నాకు అనిపిస్తుంది” కొంచెం ఇష్టం లేకుండానే అన్నాను నేను. నా మిత్రుని సాటిలేని వ్యక్తిత్వంలోని ఒకానొక లక్షణంవలన అప్పుడప్పుడూ నాకు కొంచెం అసంతృప్తిగా ఉంటుంది.”

“నా కళకు పూర్తి న్యాయం జరగాలని అనుకోవడంలో స్వార్థంగాని, మోసంగాని అసలు లేవు. అది వ్యక్తిగతమయిన విషయం కాదు. నాకు సంబంధించినది కానేకాదు. నేరాలు జరగడం మామూలే. వాటిని సరిగా ఆలోచించడం అరుదు. కనుకనే నీవు నేరం గురించికాక, లాజిక్ గురించి పట్టించుకోవాలి. వరుసపెట్టి ఉపన్యాసాలుగా చెప్పవలసిన విషయాలను నీవేమో కథగా మలిచి దాని విలువను తగ్గిస్తావు” అతను ఇచ్చిన జవాబు నా ఆలోచనలకుగాని, నా మాటలకు కాదని అర్థమయింది.

వసంతం వస్తున్న తొలిరోజుల్లో ఒక చక్కని ఉదయం అది. బేకర్

స్ట్రీట్‌లోని పాత బసలో ఇద్దరమూ అందంగా ఉన్న మంటకు అటూ ఇటూ కూర్చుని ఉన్నాము. బయట చూస్తే రంగువెలసిన ఇళ్ల మధ్యన పొగమంచు దట్టంగా కదులుతున్నది. ఎదురుగా కనపడుతున్న కిటికీలు పసుపుపచ్చని పూలగుత్తులలో మధ్యన పడిన మరకలలాగ ఉన్నాయి. గ్యాసు దీపం వెలుగుతున్నది. ఆ వెలుగులో బల్లమీద ఉన్న తెల్లగుడ్డ, దానిమీది చైనా, లోహపు పాత్రలు తళతళలాడుతున్నాయి. అంటే బల్లను ఇంకా శుభ్రపరచలేదన్నమాట. ఆ ఉదయమంతా, షెర్లక్ హెూమ్స్ మౌనంగానే గడిపాడు. వరుసపెట్టి పత్రికలన్నింటిలోనూ ప్రకటనల కాలమ్స్ చూస్తున్నాడు. చివరికి ఆ అన్వేషణను ఆపినప్పుడు అతనికి అసంతృప్తిగా ఉంది. కనుకనే, నా సాహిత్య సృష్టిలోని లోపాలను ఎత్తిచూపుతూ, నా మీదకు ఉపన్యాసం మొదలు పెట్టాడు.

"అన్నానుగానీ, నీ మీద సెన్సేషనలిజం పేరున అభియోగం తేవడానికి కూడా లేదు. నీవు దయతో ఆసక్తి కనపరచిన ఆ కేసులలో చాలామటుకు నిజానికి పెద్ద నేరాలు కావు. అంటే, న్యాయవ్యవస్థ దృష్టిలో అన్నమాట. కింగ్ ఆఫ్ బొహిమియాకు నేను సాయంచేయ ప్రయత్నించిన చిన్న సంగతికాని, మిస్ మేరీ సూదర్‌లాండ్ విషయంగా కలిగిన వింత అనుభవం కానీ, వంకరపెదవి మనిషి సంగతేగానీ, రాచకుటుంబపు బ్రహ్మచారి సంగతేగాని, అన్నీనూ చట్టపరంగా నేరాలు కావు. కానీ, వాటిని గురించి చెపితే, మరీ చిన్న సంగతులన్నా అవుతాయి, లేదంటే అంతులేని ఆసక్తిని కలిగిస్తాయి" కొంతసేపు ఆగిన తరువాత అన్నాడతను. ఆ మధ్యసమయంలో అదే పనిగా పొడుగాటి పైప్ నుంచి పొగపీలుస్తూ, మంటను తదేక ధ్యానంగా చూస్తున్నాడు.

"కథల చివరకు నీవన్నట్టు అవుతుందేమోగాని, పద్ధతులు మాత్రం నిజంగా అందరూ ఎరగనివి, ఆసక్తి కలిగించేవీ" జవాబుగా నేను అన్నాను.

"మైడియర్ ఫెలో, ప్రజలకు, ఏ విషయాన్ని పట్టించుకోని ఈ మహా ప్రజలకు ఏం తెలుస్తుంది? దంతాలను చూచి నేతపనివాడిని, ఎడమ

బొటనవేలిని చూచి కంపోజిటర్‌ను వాళ్లు గుర్తించగలరా? ఇక వాళ్లకు విశ్లేషణలూ, విషయాలను ఊహించి తెలుసుకోవడాలు ఏమర్థమవుతాయి! నీవు విషయాలను చిన్నవి చేసి చెప్పినందుకు తప్పు పట్టలేను. అవును మరి, నిజంగా గొప్ప కేసులు రావడమే లేదు. మనిషి, కనీసం నేరాలు చేసే మనిషి ఆ గొప్పతనాన్ని పోగొట్టుకున్నాడు. ఇక నా ప్రాక్టీస్ సంగతికి వస్తే, అది దిగజారి, కనిపించకుండా పోయిన పెన్సిల్‌ను వెతకడం, బోర్డింగ్ స్కూల్లో చదువుతున్న అమ్మాయిలకు సలహాలివ్వడం లాంటి చోటికి దిగజారింది. నేను పూర్తి అగాథాన్ని అంటుతున్నానని అనిపిస్తున్నది. పొద్దున్నే వచ్చిన ఈ నోట్ ఆ పద్ధతిలోనే ఉంది. చదువుతావా!" అంటూ ఒక నలిగిన కాగితాన్ని అతను నా మీదకు విసిరాడు.

"ఆ ఉత్తరం నిన్న సాయంత్రమే మోంటగూ ప్లేస్ నుంచి పంపించినట్టు తెలుస్తున్నది. అది ఇలా సాగింది:

*"డియర్ మిస్టర్ హోమ్స్, గవర్నెస్‌గా నాకు ఆఫర్ చేయబడిన ఉద్యోగంలో నేను చేరాలా, వద్దా అన్న విషయంలో సలహాకోసం మిమ్మల్ని సంప్రదించాలని చాలా ఆత్రుతతో ఉన్నాను. మీకు అభ్యంతరం లేకపోతే, రేపు పదిన్నర గంటలకు నేను వస్తాను.*

*మీ విధేయురాలు,*

*వయొలెట్ హంటర్"*

"నీకు ఈ అమ్మాయి తెలుసా?" అడిగాను నేను.

"నాకా, లేదు."

"మరి పదిన్నర అయింది."

"గంట మోగింది. మరి ఆమే అయి ఉంటుంది."

"నీవు అంటున్నదానికంటే, కొంచెం ఆసక్తికరంగానే ఉంటుందేమో

వ్యవహారం. బ్లూ కార్బంకల్ సంగతి గుర్తుందా? మొదట్లో అది ఉట్టుట్టి సంగతే అనిపించింది. కానీ పరిశోధనకు దిగితే, సీరియస్‌గా మారింది. ఈ కేసు కూడా అలాగే ఉంటుందేమో!"

"బాగుంది. అట్లాగే అనుకుందాం. అనుమానాలు తొందరగానే తీరబోతున్నాయి. ఆవ్యక్తి వచ్చినట్టే ఉంది మరి. "

అతడు మాట్లాడుతుండగానే, తలుపు తెరుచుకుని ఒక యువతి గదిలోకి వచ్చింది. ఆమె దుస్తులు మామూలుగా ఉన్నా, చాలా నీట్‌గా ఉన్నాయి. అందమయిన ముఖం మీద మచ్చలు ఉన్నాయి. మంచి ఆత్మస్థయిర్యంగల మనిషిలా, చురుకుగా కనపడుతున్నది ఆమె.

"కష్టం కలిగించి నందుకు క్షమించాలి. కానీ, నాకు కలిగిన అనుభవం చాలా విచిత్రమయినది. సాయం, సలహా అడగడానికి, నాకు అమ్మా నాన్నగానీ, బంధువులుగానీ ఎవరూ లేరు. మీరు దయతలచి నాకు కర్తవ్యాన్ని చెపుతారని అను కున్నాను" నా మిత్రుడు లేచి ఆమెను స్వాగతించే లోగానే, చెప్పసాగింది.



"దయచేసి కూర్చోండి, మిస్ హంటర్. చేతనయినంత సహాయం సంతోషంగా చేస్తాను" కొత్త క్లయంట్ మాట తీరు, మనిషి తీరుతో నా మిత్రుడు ప్రభావితుడయినట్టు కనిపించింది. మామూలుగానే ఆమె వేపు పరిశీలనగా చూచాడు. ఇక కథ వినడానికి సిద్ధం అన్నట్టు, రెండు చేతుల వేళ్ల చివర్లను కలుపుతూ

ముందుకు వంగి కూచున్నాడు.

"గడచిన అయిదు సంవత్సరాలుగా, స్పెన్స్ ముఁన్రోగారి ఇంట్లో గవర్నెస్‌గా పనిచేశాను. ఆయనకు రెండు నెలల క్రితం నోవా స్కోషియా, హాలిఫాక్స్‌లో ఉద్యోగం వచ్చింది. కనుక పిల్లలతో సహా ఆయన అమెరికా వెళ్లిపోయారు. అంటే నాకు పనిలేకుండా పోయింది. నేను ప్రకటనలు ఇచ్చాను, ప్రకటనలకు బదులు ఇచ్చాను. కానీ, పనిమాత్రం దొరకలేదు. దాచుకున్న కొద్దిపాటి సొమ్ము అడుగంట సాగింది. ఏం చేసేది అర్థంకాని పరిస్థితి మొదలయింది.

"వెస్ట్ ఎండ్ ప్రాంతంలో వెస్టవేస్ అనే ఏజెన్సీవారు గవర్నెస్‌లకు పని ఇప్పిస్తుంటారు. అందుకనే నేను ప్రతివారం, నాకు తగిన పని ఉంటుందేమోనని అక్కడికి వెళుతుండేదాన్ని, ఆ ఏజెన్సీని స్థాపించినది వెస్టవే అనే వ్యక్తి అయినా, నిజానికి దాన్ని నిర్వహిస్తున్నది మాత్రం, మిస్ స్టోపర్ అనే ఆవిడ. ఆవిడ తన చిన్న ఆఫీసు గదిలో ఉంటుంది. పనికోసం వచ్చినవాళ్లు బయట గదిలో వేచి ఉంటారు. ఒకరితరువాత ఒకరిని ఆమె పిలుస్తుంది. తన పుస్త కాలలోనుంచి వివరాలు చూస్తూ ఎవరికి తగిన పనిని వారికి వెదికి పెడుతుంది.

"గడిచినవారం నేను వెళ్లినపుడు మామూలుగానే ఆ గదిలోకి పిలిచారు. అయితే అక్కడ మిస్ స్టోపర్ ఒంటిగా లేరు. ఒక లావుపాటి పెద్దమనిషి నవ్వు ముఖంతో ఆమె పక్కనే కూర్చుని ఉన్నాడు. అతని గడ్డం కింద మెడ నిండా మడతలు మడతలుగా చర్మం మందంగా, వింతగా కనిపించింది. కళ్లజోడు ముక్కుమీదకు జారి ఉంది. వచ్చినవాళ్ల వేపు ఆయన కుతూహలంగా చూస్తున్నాడు. నన్ను చూడగానే, కుర్చీలో తుళ్లిపడ్డాడు. వెంటనే మిస్ స్టోపర్ వేపు తిరిగాడు.

" 'దొరికింది' అన్నాడాయన. 'ఇంతకంటే కావలసింది లేదు. కాపిటల్! కాపిటల్!' అతను చాలా ఉత్సాహంగా కనిపించాడు. సంతోషంగా రెండు



చేతులను రుద్దుకుంటున్నాడు. ఆయనను చూస్తే, ఎవరి కయినా ఆనందం కలుగుతుంది.

“ ‘మీరు పనికోసం చూస్తున్నారు, అంతేనా మిస్’ ఆయన అడిగాడు.

“ ‘ఎస్. సర్’

“ ‘గవర్నెస్‌గా?’

“ ‘ఎస్.సర్’

“ ‘జీతం ఎంత అడుగుతున్నారు?’

“ ‘కల్నల్ స్పెన్స్ మున్రో గారి ఇంట్లో పనిచేసినపుడు నెలకు నాలుగు పౌండ్లు ఇచ్చే వారు.’

“ ‘అయ్యోయ్యో! అన్యా యం... చాలా అన్యాయం!’ భావావేశంలో కొట్టుకుపోతూ ఆయన రెండు చేతులను గాలిలోకి విసురుతూ, గట్టిగా అన్నాడు. ‘ఇంత ఆకర్షణ, అర్హతలు కలిగిన స్త్రీకి అంత కొంచెం డబ్బు ఇవ్వడం అన్యాయం.’

“ ‘నా అర్హతలు, మీరు అనుకున్నంత లేకపోవచ్చు. కొంచెం ఫ్రెంచ్, కొంచెం జెర్మన్, సంగీతం, డ్రాయింగ్ లాంటివి.....’ అన్నాను నేను.

“ ‘ ఛ, ఛ! అవన్నీ ప్రశ్నేకాదు. మీరు ఒక మహిళలకు ఉండవలసిన లక్షణాలు కనబరిచారా లేదా? అది తెలుస్తూనే ఉంది. లేకుంటే, ముందు దేశ చరిత్రలోనే ముఖ్యపాత్ర వహించే వీలుండే, పిల్లల పెంపకం బాధ్యతకు మీరు ఏ రకంగానూ కుదరరు కదా! కుదిరారు అంటే, ఎవరయినాసరే, మీకు మూడంకెల జీతం ఇవ్వకుండా ఎలా ఉండగలరు?

మేడమ్, నా దగ్గరయితే మీ జీతం సంవత్సరానికి వంద పౌండ్లతో మొదలవుతుంది.’

“మిస్టర్ హెూమ్స్, మీరు ఊహించగలరనుకుంటాను. నేను చాలా దీనమయిన స్థితిలో ఉన్నాను. కనుక ఆయన ఆఫర్ నాకు ఎలా కనిపించి ఉంటుందో అర్థంచేసుకోగలరు. నా ముఖంలోని భావాలను గమనించి ఆ పెద్ద మనిషి జేబులోనుంచి కాగితాలను బయటకు తీశారు.

“ ‘ఇది నాకు అలవాటు’ అంటూ ఆయన చాల ఆనందంగా నవ్వుతూ ఉన్నప్పుడు ఆయనకళ్లు ముడతలు పడిన ఆ తెల్లని ముఖంలో రెండు గీతలు లాగా మాత్రమే మిగిలాయి. ‘నా దగ్గర ఉద్యోగంలో కుదురుతున్న అమ్మాయి లకు ముందుగానే నేను సగం జీతం అడ్వాన్స్‌గా ఇస్తుంటాను. వాళ్లకు దుస్తులు, ప్రయాణం సంబంధంగా కొంచెం ఖర్చులు ఉంటాయి గదా?’ అన్నాడాయన.

“ఇంత ముందుజాగ్రత్తతో, ఇంత బాగా ఆలోచించే మనిషిని అంతకు ముందెపుడూ నేను కలిసినట్టు లేదు. అప్పటికే నేను కొంతమందికి అప్పుపడి ఉన్నాను. అంటే, ఆయన ఇస్తున్న అడ్వాన్స్ నాకు గొప్ప సదుపాయం. కానీ, ఈ వ్యవహారంలో నాకు ఏదో అసహజంగా ఉన్నట్టు తోచింది. అందుకే చేరే ముందే ఇంకొన్ని వివరాలు తెలుసుకుంటే బాగుంటుందని తోచింది.

“ ‘మీ నివాసం ఎక్కడో అడగవచ్చునా సర్?’ అడిగాను నేను.

“ ‘హాంప్‌షైర్. చాలా అందమయిన ప్రదేశం. వించెస్టర్‌కు అయిదు మైళ్ల దూరంలో ఉండే పచ్చని పల్లె ప్రాంతమది. మైడియర్ యంగ్ లేడీ, మాకు అక్కడ చక్కని కంట్రీ హౌజ్ ఉంది.’

“ ‘నేను చేయవలసిన పనులు ఏమిటి సర్? తెలిస్తే బాగుంటుంది.’

“ ‘ఒక బాబు ఉన్నాడు. కేవలం ఆరేళ్ల బాబు. వాడు స్లిప్పర్స్‌తో బొద్దింకులు చంపే తీరు చూశారంటే చాలు. ఠపక్! ఠపక్! ఠపక్! కన్నుమూసి

తెరిచేలోగా మూడు మాయం!' అతను మళ్లీ నవ్వుతూ ఉంటే కళ్లు మళ్లీ గీతలయ్యాయి.

"పిల్లవాడి వినోదం తీరు వింటే, నాకు దడ పుట్టింది. కానీ, ఆ తండ్రి నవ్వుచూస్తే మాత్రం, సరదాగా జోక్ చేస్తున్నాడు అనిపించింది.

" 'ఆ అబ్బాయిని చూడడం ఒక్కటేనా నా పని?' అడిగాను నేను.

" 'కాదు, కాదు. అదొక్కటే కాదు. మా ఆవిడగారు చెప్పే చిన్న చిన్న పనులను చేయడం ముఖ్యంగా మీ డ్యూటీ. ఆమె చెప్పే పనులు మీరు చేయదగినవిగా ఉన్నప్పుడు మాత్రమే. అసలు పేచీ లేదు' అన్నాడతను గట్టిగా.

" 'వీలయినంతగా సాయపడతాను.'

" 'బాగుంది. ఉదాహరణకు మీ డ్రస్ గురించి, మేం కొంచెం పిచ్చి మనుషులం. అయినా, దయలేని వాళ్ల మాత్రంకాదు. మేము ఇచ్చిన దుస్తులు ఏవయినా వేసుకోమని అడిగితే, మా కోరికను మన్నిస్తారు గదూ?'

" 'తప్పకుండా' అన్నాను నేను ఆయన మాటలకు బాగా ఆశ్చర్యపోతూ.

" 'ఇక్కడ కూచో, అక్కడ కూచో అని అడిగితే మీకు కోపం రాదుగదా?'

" 'రాదులెండి.'

" 'మా దగ్గరకు వచ్చేముందు మీరు తల జుట్టును పొట్టిగా కత్తిరించు కోవాలంటే?'

"నేను ఆ మాటలను నమ్మలేకపోయాను. మిస్టర్ హొమ్స్, మీరు గమనించే ఉంటారు, నా జుట్టు చాలా పెద్దది, రంగు కూడా మామూలుగా ఉండేది కాదు. అందరూ నా జుట్టును మెచ్చుకుంటూ ఉంటారు. అంత సులభంగా కలలో కూడా నా జుట్టును వదులుకోలేను.'

" 'అది సాధ్యం కాదేమోనని నా భయం' అన్నాను నేను. చిన్న కళ్లతో

అతను నన్ను ఆశగా చూస్తున్నాడు. నా మాటలో ఆ ముఖంలో ఒక నీడ కదిలింది.

" 'కానీ తప్పదేమోనని నా భయం. అది మా ఆవిడగారి చిన్న కోరిక. మేడమ్, ఆడవాళ్ల కోరికలను మీరు అర్థం చేసుకోగలరు. వాటిని పట్టించుకోకుంటే కుదరదు. అయితే మీరు జుట్టు కత్తిరించుకోరా?'

" 'లేదండి. నిజంగా కుదరదు' నేను గట్టిగా జవాబిచ్చాను.

" 'అయితే సరే. సంగతి తేలినట్టే. కానీ, అన్యాయం. మిగతా అన్ని రకాలుగానూ మీరు బాగా కుదిరారు. పోనీయండి. మిస్ స్టోపర్, మిగతా వాళ్లను పిలిస్తే, వాళ్లను కూడా చూస్తాను'

"అంతసేపూ, మిస్ స్టోపర్ మాట్లాడకుండా తన కాగితాలను చూస్తూ, గడిపింది. కానీ, అప్పుడు నావేపు చూచినపుడు ఆమె ముఖంలో చికాకు కనపడింది. నేను కాదనడంతో ఆమెకు అందవలసిన మంచి కమిషన్ చేజారిపోయింది.

" 'నీపేరు ఇంకా మా పుస్తకాలలో కొనసాగించాలా?' ఆమె అడిగింది.

" 'మీకు అభ్యంతరం లేకుంటేనే, మిస్ స్టోపర్.'

" 'నిజంగానా? కానీ ఏం లాభం? చేతికందిన మంచి ఆఫర్లను నీవు ఈ రకంగా తోసివేస్తుంటే, ఏం లాభం? నీ కొరకు కష్టపడి మరో మంచి ఉద్యోగం వెదకడం బాగా కష్టం. సరే మంచిది, మిస్ హంటర్' అంటూ ఆమె బల్లమీది గంటను మోగించింది. మనిషి వచ్చి నాకు బయటికి దారి చూపించింది.

" మిస్టర్ హెూమ్స్, నేను ఇంటికి తిరిగి వచ్చాను. ఇంట్లో సరుకులు నిండుకున్నాయి. బల్లమీద బిల్లులు మాత్రం ఉన్నాయి. పిచ్చిపని చేశానేమోనని నాకే అనుమానం మొదలయింది. పని ఇచ్చే మనుషులకు వింత ఆలోచనలు, అభిప్రాయాలు ఉండడంలో తప్పేమీ లేదు. బదులుగా వాళ్లు కావలసినన్ని

డబ్బులు ఇస్తున్నారాయె. ఇంగ్లండ్‌లో ఏడాదికి వంద పౌండ్లు అందే గవర్నెస్‌లు ఎక్కువగా లేరు. పైగా నా తలజుట్టువల్ల ఒరిగింది ఏమిటి? జుట్టు కత్తిరించుకుంటే కొంతమంది అందంగా కనపడతారు. నా విషయం అలాగే ఉంటుందేమో! మరునాటికల్లా నేను తప్పు చేశాననే అనిపించ సాగింది. ఆ తరువాతి రోజున నాకు అది నిజం అని అర్థమయింది. మళ్లీ ఏజెన్సీకి వెళ్లి, ఆ ఉద్యోగం ఖాళీగా ఉందేమో తెలుసుకోవాలని ఇంచుమించు నిశ్చయించుకున్నాను. అప్పుడిక నేరుగా ఆపెద్దమనిషి నుంచి ఈ ఉత్తరం వచ్చింది. చదివి వినిపిస్తాను:

*"ద కాపర్ బీచెస్, వించెస్టర్ దగ్గర.*

*"డియర్ మిస్ హంటర్-*

*"మిస్ స్టోపర్, దయతో మీ చిరునామా ఇచ్చారు. మీరు మీ నిర్ణయాన్ని గురించి మళ్లీ ఆలోచించారేమోనని అడగడానికి ఈ ఉత్తరం రాస్తున్నాను. నేను వర్ణించిన వివరాలను విని మా ఆవిడకు ఆసక్తి పెరిగింది. మీరు తప్పకుండా రావాలని ఆమె అంటున్నారు. మీకు ప్రతి మూడు మాసాలకు ముప్ఫయి పౌండ్ల చొప్పున, అంటే ఏటా నూట ఇరవయి పౌండ్లు ఇస్తాము. మా పిచ్చి కోరికల వల్ల కలిగిన అసౌకర్యానికి ప్రతిగా అన్నమాట. కోరికలు నిజానికి మరీ పిచ్చివి కావు. నా భార్యకు ఎలక్ట్రిక్ బ్లూ రంగులో ఒక ఛాయ అంటే ఇష్టం. మీరు ఉదయాన ఇంట్లో ఉన్నప్పుడు ఆ రంగు డ్రెస్ వేసుకోవాలని మా ఆవిడ కోరిక. అయితే మీరు ఆ దుస్తులను కొననవసరం లేదు. ప్రస్తుం ఫిలెడెల్ఫియాలో ఉన్న మా ముద్దుల కూతురు అలీస్ డ్రెస్‌లు ఉన్నాయి. అవి మీకు సరిగ్గా సరిపోతాయి. ఇక ఇక్కడా అక్కడా కూర్చోవడం గురించి, మా యిష్టప్రకారం*

*సరదాలను గురించి, మీకు ఎటువంటి అసౌకర్యం ఉండదు. మీ జుట్టు విషయానికి వస్తే, అది నిజంగా అన్యాయమే. మిమ్మల్ని చూచినప్పుడు నాకు ఆ సంగతి అర్థమయింది. అయినాసరే, ఆ విషయంలో మార్పు ఉండదని అంటున్నాను. అందుకు ప్రతిఫలంగా, జీతంలో జరిగిన పెంపుదల మీకు జరిగిన నష్టాన్ని పూడుస్తుంది. ఇక బాబుకు సంబంధించి, మీ డ్యూటీలు కష్టంగా ఉండవు. తప్పకుండా రావడానికి ప్రయత్నించండి. వించెస్టర్‌లో బండితో నేను మిమ్మల్ని కలుస్తాను. ట్రైన్ వివరాలు ముందే తెలపండి.*

*మీ విధేయుడు,*

*జెఫ్రో రుకాసిల్.'*

"మిస్టర్ హెూమ్స్, అది నాకు అందిన ఉత్తరం. అంగీకరించాలని నిశ్చయం చేసుకున్నాను. కానీ, చివరి అడుగు వేసేముందు మొత్తం వ్యవహారమంతా మీ ముందు ఉంచాలని నా అభిప్రాయం."

" మిస్ హంటర్, మీరు నిశ్చయం చేసుకున్న తర్వాత ఇక సంగతి తేలినట్టే కదా?" నవ్వుతూ అడిగాడు హెూమ్స్.

"ఉద్యోగాన్ని తిప్పికొట్టమని సలహా ఇస్తున్నారా?"

"నా చెల్లెళ్లలో ఒకరు చేరవలసిన ఉద్యోగం కాదని మాత్రం ఒప్పుకుంటున్నాను."

"అంటే ఏమిటి అర్థం? మిస్టర్ హెూమ్స్?"

"ఆహ్! నా దగ్గర వివరాలు లేవు. కనుక చెప్పలేను. కానీ, మీరే ఏవో అభిప్రాయాలు ఏర్పరచుకుని ఉంటారు."

"అయితే, ఒక సమాధానం మాత్రమే ఉన్నట్టుంది. మిస్టర్ రుకాసిల్, చాలా దయగల, మంచి స్వభావం గల మనిషిగా కనిపించారు. భార్యమాత్రం

పిచ్చి మనిషేమో! ఆ సంగతి బయటపడగూడదని, ఆమెను ఆసుపత్రి పాలు చేయకూడదని అనుకుని సంగతి బయటపడకుండా, ఆయన ఏర్పాట్లు చేస్తున్నాడేమో!"

"ఇది నిజమయ్యే వీలుంది. వ్యవహారం చూస్తే, బహుశా ఇదే నిజం కావచ్చు. అయినాసరే, ఒక యువతికి తగిన ఇల్లు అది కాదని నాక నిపించింది."

"మరి డబ్బు, మిస్టర్ హెూమ్స్, డబ్బు!"

"అవును. జీతం బాగుంది. మరీ బాగుంది. అక్కడే వచ్చింది పేచీ. నలభయి పౌండ్లకు మనుషులు దొరుకుతుండగా, మీకు నూట ఇరవయి పౌండ్లు ఎందుకిస్తున్నట్టు? వెనుక ఏదో బలమయిన కారణం ఉంటుంది."

"అందుకే మీకు వివరాలన్నీ చెపితే, తరువాత అవసరమయితే సాయం చేస్తారని అనుకున్నాను. నా వెనుక మీరు ఉన్నారు అనుకుంటే నాకు బలం కలుగుతుంది."

"మీకు ఆ అభిప్రాయం ఉంటే మంచిదే. గడిచిన కొన్ని నెలలలో నా ముందుకు వచ్చిన సమస్యలలో, మీరు చెప్పిన ఈ సమస్య అన్నిటికన్నా ఆసక్తికరమయినదని ఒట్టేసి చెబుతున్నాను. ఇందులోని వివరాలు కొన్ని విచిత్రంగా ఉన్నాయి. మీకు ఏమాత్రం అనుమానం, ఆపదా వచ్చినా..."

"ఆపదా! ఆపద వస్తుందంటున్నారా?"

హెూమ్స్ తన తలను నెమ్మదిగా కదిలించాడు. "ముందే తెలిస్తే, మనకు సంగతి అర్థమవుతుంది. ఇక అది రాత్రి కాని, పగలుకానీ, ఏ సమయంలోనయినాసరే, ఒక్క టెలిగ్రామ్ పంపితే మీకు సాయంగా వచ్చి వాలుతాను" అన్నాడు అతను.

"అది చాలు నాకు. మనసులో ఏ అనుమానం లేకుండా, నేనిక హాంప్‌షైర్ వెళతాను. సంగతి వెంటనే మిస్టర్ రుకాసిల్‌కి రాస్తాను. ఈ



రాత్రికే జుట్టు కత్తిరించు కుంటాను. రేపు బయలు దేరి వించెస్టర్ వెళతాను" ఆమె త్వరగా లేచింది. ముఖంలో ఆతురత నిండుగా కనిపించింది. గుడ్‌నైట్ చెప్పి వేగంగా తన దారిన తాను వెళిపోయింది.

"నాకు మాత్రం, ఈ అమ్మాయి తనను తాను కాపాడుకునే శక్తిగలదిగా కనపడుతున్నది" మెట్లమీద ఆమె దిగుతున్న చప్పుడు వినిపిస్తుండగా, నేను అన్నాను.

"ఆమెకు ఆ అవసరం వస్తుంది. మరీ ఎక్కువ రోజులు గడవకముందే, ఆ సంగతి మనకూ తెలుస్తుంది" అన్నాడు హొమ్స్ భారంగా.

నా మిత్రుడు చెప్పిన మాటలు నిజం కావడానికి ఎక్కువకాలం పట్టలేదు. ఒక పక్షం రోజులు గడిచాయి. ఆలోపల నేను ఆమె గురించి చాలాసార్లు గుర్తు చేసుకున్నాను. ఆమె దూరిన ఆ గొందిలో కలిగిన మానవ అనుభవాలను గురించి ఆలోచించాను. అసాధారణమయిన జీతం, వింత కోరికలు, కష్టంకాని పని అంతా కలిసి అక్కడ పరిస్థితి మామూలుగా లేదని అనిపించింది. ఆ మనిషి నిజంగా పరోపకారి అయి ఉండాలి. కాదంటే దుర్మార్గుడయినా అయి ఉండాలి. తేల్చి చెప్పడం మాత్రం నా వల్ల కాలేదు. ఈలోగా హొమ్స్ మాత్రం అప్పుడప్పుడు కనుబొమలు ముడివేసి తీవ్రంగా ఆలోచిస్తూ, గంటలకొద్దీ కాలం గడుపుతుండడం కనిపించింది. నేను ప్రసక్తి తెచ్చినప్పుడు మాత్రం, ఒక్కమాటలో తోసివేశాడు. "వివరాలు! వివరాలు! నేను మట్టి లేకుండా ఇటుకలు చేయలేను" అన్నాడతను అసహనంగా. అయినాసరే, అటువంటి ఉద్యోగానికి తన చెల్లెలిని పంపి ఉండేవాడిని కాదని

అతను గొణగడం నాకు తెలుసు.

ఒకానొక రాత్రి నేను నిద్రకు ఉపక్రమించే ప్రయత్నంలో ఉండగానూ, షెర్లక్ హెూమ్స్ తాను మామూలుగా జరిపే రసాయనపరిశోధనకు సిద్ధమవుతున్న సమయంలోనూ చివరకు టెలిగ్రామ్ రానే వచ్చింది. పరిశోధనలో పడిన హెూమ్స్‌ని నేనయితే రాత్రి మొత్తం ఆ గొట్టాలు, బుడ్డీల మధ్యన వదిలేస్తాను. పొద్దున తిండికి వచ్చే సమయానికి కూడా అతను అలాగే ఉంటాడు. ఇప్పుడు మాత్రం వచ్చిన పసుపు రంగు కవరును విప్పాడు. సందేశం చదివి నా మీదకు విసిరాడు.

"బ్రాడ్‌షాలో రైళ్ల వివరాలు చూడు" అంటూ అతను మళ్లీ రసాయన పరిశోధనలోకి దిగాడు.

సందేశం మాత్రం త్వరపడవలసినదిగానే ఉంది.

*"వించెస్టర్‌లోని బ్లాక్‌స్వాన్ హెూటేల్‌లో దయచేసి ఉండండి. రేపు మధ్యాహ్నం కలుద్దాము. తప్పకుండా రండి. నాకు ఏమీ తోచడం లేదు.*

*హంటర్."*

"నీవు నాతో వస్తావా?" అడిగాడు హెూమ్స్ తేరిపార చూస్తూ.

"రావాలనే కోరిక"

"అయితే మరి చూడు."

"తొమ్మిదిన్నరకు ఒక ట్రైన్ ఉంది. 11:30కి వించెస్టర్ చేరుతుంది" బ్రాడ్‌షాలో చూస్తూ అన్నాను నేను.

"బాగానే ఉంది మరి. అసిటోన్‌ల విశ్లేషణను కొంచెం వాయిదా వేస్తాను. మరి పొద్దున్నే పనిలోకి దిగాలిగదా!"

మరుసటినాడు పదకొండు గంటల ప్రాంతానికి మేము ప్రాచీన ఇంగ్లీషు

రాజధానికి వెళ్లే దారిలో ఉన్నాము. దారి పొడుగునా హోమ్స్, పత్రికలలో తలమునకలయ్యాడు. హాంప్‌షైర్ సరిహద్దులు దాటిన తరువాత వాటిని పడవేసి అందమయిన దృశ్యాలను ఆస్వాదించసాగాడు. వసంతరుతువులో చక్కని రోజు ఆకాశం నీలంగా ఉంది. అక్కడక్కడా దూదిపింజల వంటి మేఘాలు పడమటి నుంచి తూర్పువేపు కదులుతున్నాయి. సూర్యుడు బాగా వెలిగిపోతున్నాడు. అయినాసరే, గాలి మాత్రం చల్లగా ఉంది. అటువంటి పరిస్థితుల్లో మనిషికి చురుకుదనం కలుగుతుంది. ఆల్డర్‌షాట్‌లోని కొండ ప్రాంతాలలో అందమయిన ఎర్రని పై కప్పులు గల పల్లె ఇళ్లు కనిపించాయి. కొత్తగా పెరుగుతున్న పచ్చని ఆకులతో ఆ దృశ్యం అందంగా ఉంది.

"ఎంతో తాజాగాను, అందంగానూ ఉన్నాయి కదూ?" బేకర్ స్ట్రీట్‌లోని పొగమంచునుంచి బయటపడిన మనిషికి ఉండే ఉత్సాహంతో ఆనందంగా అడిగాను.

హోమ్స్ మాత్రం తలను గంభీరంగా కదిలించాడు.

"మెదళ్లకు, అందునా నా వంటివాని మెదడుకు ఒక శాపం ఉంటుందని నీకు తెలుసా వాట్సన్? నేను ప్రతి విషయాన్ని ప్రత్యేకంగా, నా దృష్టితోనే చూస్తాను. చెదురుమదురుగా ఉన్న ఆ ఇళ్లను చూచి, నీవు వాటి అందానికి మురిసి పోతున్నావు. నాకు మాత్రం వాటిలో ఒక ఏకాకితనం, అక్కడ నేరాలు జరిగే సంభావ్యతా మాత్రమే కనపడతాయి" అన్నాడు అతను.

"గుడ్ హెవెన్స్! ఇంత అందమయిన ఇళ్లకు, నేరాలకు లంకె పెట్ట గలవారు ఎవరు?" గట్టిగా అన్నాను.

"వాటిని చూస్తే, నాకు నిజంగా గొప్ప భయం అవుతుంది. వాట్సన్, ఇదంతా నా అనుభవంవల్ల అనుకుంటాను. లండన్‌లోని మురికి, ఇరుకు సందుల్లో గొప్ప భయంకరమయిన నేరాల చరిత్ర దొరకదు. నవ్వుతున్నట్టు ఉండే అందమయిన ఈ పల్లె ప్రాంతాల్లో మాత్రం దొరుకుతుంది."



“భయంకరంగా ఉంది, నీ మాట!”

“అందుకు తగినంత కారణం ఉంది. పట్నంలో చట్టం సాధించజాలనిదేదో ప్రజాభిప్రాయానికి లొంగుతుంది. అక్కడ క్రూరత్వానికి గురయిన ఒక కుర్రవాని అరుపు, తాగుబోతుకు తగిలిన పిడిగుద్దు మొదలయినవి చుట్టుపక్కల ఉండే వారిని కదిలించవు. అయితే, న్యాయవ్యవస్థ మాత్రం విస్తరించి ఉంటుంది. ఒక్కమాటతో అది పనిలోకి దిగుతుంది. నేరానికి, పరిశోధనకు మధ్యన దూరం తక్కువ. కానీ ఈ ఒంటరి పల్లె ఇళ్లను చూడు. ఎవరి పొలంలో వారి ఇల్లు. అక్కడ ఉండేదంతా చట్టం గురించి తెలియని అమాయకపు బీద మనుషులు. సంవత్సరం పొడుగునా, అక్కడ జరగడానికి వీలుండే నరకప్రాయమయిన క్రూరత్వం ఎవరికీ కనబడదు. మనకు వర్తమానం పంపి సాయం అడిగిన ఈ అమ్మాయి వించెస్టర్‌లో ఉందంటే, నేను అంతగా ఆమె గురించి భయపడేవాడిని కాదు. అక్కడి నుంచి అయిదు మైళ్ల దూరంలో పల్లె అంటేనే, ఆపద మొదలవుతుంది. అయినా సరే, వ్యక్తిగతంగా ఆమెకు భయం లేదనే అర్థమవుతున్నది.”

“నిజమే. మనలను కలవడానికి వించెస్టర్ దాకా వస్తున్నదంటే, అంతే మరి.”

“ఆమె స్వతంత్రం ఆమెకు ఉండనే ఉంది.”

“అయితే మరి, ఏం జరిగి ఉంటుంది? ఏమీ చెప్పలేవా?”

“నేను ఏడు రకాల వివరణలను సిద్ధం చేసుకున్నాను. అన్నీ నాకు తెలిసిన నిజాల మీద ఆధారపడేవే. తాజా సమాచారం దొరికిన తరువాతే, వాటిలో ఏది సరయినది అన్నది తేలుతుంది. అదుగో, కతీడ్రల్ టవర్ కనపడుతూనే ఉంది. మిస్ హంటర్ చెప్పే వివరాలు తెలుస్తాయి.”

బ్లాక్ స్వాన్ అన్నది హైస్ట్రీట్‌లో మంచి పేరున్న హొటేల్. అది స్టేషన్ నుంచి ఎక్కువ దూరం లేదు. మేము వెళ్లే సరికి అక్కడ ఆమె వేచి ఉంది. ఆమె ఏర్పరచుకున్న గదిలో మా భోజనం కూడా సిద్ధంగా ఉంది.

“మీరు రావడం సంతోషంగా ఉంది. మీరిద్దరూ దయగలవారు. నాకు మాత్రం ఎటూ తోచడం లేదు. మీ సలహా నాకు ఎంతో విలువగలదిగా ఉంటుంది'' వినయంగా అన్నది ఆమె.



‘‘మీకు ఏం జరిగిందో దయచేసి చెప్పండి.”

‘‘తప్పకుండా. అదీ త్వరగా జరగాలి. మూడు గంటలలోపల తిరిగి వస్తానని మిస్టర్ రుకాసిల్‌కి మాట ఇచ్చాను. పట్టణానికి రావడానికి పర్మిషన్ తీసుకున్నాను. కారణం

గురించి ఆయనకు తెలియదు.”

“జరిగిన వరుసలో అన్నీ చెప్పండి” తన సన్నని పొడుగాటి కాళ్లను మంటవేపు జార్చి వినడానికి సిద్ధంగా కూర్చుంటూ అన్నాడు హోమ్స్.

“రుకాసిల్ దంపతుల నుంచి నాకు ఏ రకంగానూ అసౌకర్యం ఎదురు కాలేదని మొట్టమొదట చెప్పవలసి ఉంది. వాళ్ల పట్ల మరో రకంగా చెప్ప లేను. కానీ, అక్కడ ఏదో నాకు అర్థంకాని సంగతి ఉంది. అది నన్ను ప్రశాం తంగా ఉండనివ్వడంలేదు. ”

“ఏమి అర్థంచేసుకోలేకపోతున్నారు?”

“వాళ్ల తీరుకు కారణాలను. జరిగింది జరిగినట్టు చెప్తాను. నేను వచ్చినప్పుడు మిస్టర్ రుకాసిల్ ఇక్కడికి వచ్చి తనతో బండిలో కాపర్ బీచెస్‌కి వెంటబెట్టుకుపోయారు. ఆయన చెప్పినట్టే, అది అందమయిన ప్రదేశం. ఇల్లు నిజానికి అంత అందమయినది కాదు. సున్నం కొట్టిన ఆ ఇంటిమీద తేమ, వాతావరణం కారణాలుగా మరకలు పడి ఉన్నాయి. చుట్టూ బోలెడు చోటు ఉంది. మూడు పక్కల అడవి పెరిగి ఉంది. నాలుగో పక్కన వాలుగా, సౌత్ హాంప్టన్ రోడ్డు వేపుకు పొలం ఉంది. ఆ దారి భవనానికి వందగజాల దూరంలో ఉంటుంది. ఇంటి ముందు ఉండే ఈ ప్రదేశం ఇంటికి చెందినదే. మూడు పక్కలనున్న అడవి మాత్రం లార్డ్ సౌతర్టన్‌సన్స్ ప్రిజర్వ్ వారిది. ఇంటిముందు కాపర్ బీచెస్ ఉండడంతో ఇంటికే ఆ పేరు పడింది.

“చాలా కలగలుపుగా ఉండే యజమానిగారు నన్ను ఇంటికి చేర్చారు. భార్యను, పిల్లవాడిని పరిచయం చేశారు. బేకర్ స్ట్రీట్‌లో మనం ఉన్నప్పుడు మనం అనుకున్న మాటలలో సత్యం లేదు. మిసెస్ రుకాసిల్‌కు ఎటువంటి పిచ్చీ లేదు. ఆమె నిశ్శబ్దంగా ఉంటుంది. భర్త కన్నా, చాలా తక్కువ వయసు గలది. బహుశా ముప్ఫయికన్నా ఎక్కువ ఉండదేమో! ఆయనమాత్రం కనీసం నలభయి అయిదు పైబడిన మనిషి. మాటల సందర్భంలో, ఆయన మొదటి

భార్య పోయిందని,  ఈ పెళ్లి జరిగి ఏడు సంవత్సరాలు అయిందని తెలిసింది. మొదటి భార్యకు ఒకానొక సంతానం అయిన కూతురు ఫిలడెల్ఫియాలో ఉంది. ఆమెకు సవతితల్లి పట్ల విపరీతమయిన ఏవగింపు ఉన్నందుకే అట్లా వెళ్లిందని నాతో విడిగా మాట్లాడిన సందర్భంలో మిస్టర్ రుకాసిల్ చెప్పారు. అమ్మాయి వయసు ఇరవయి పైనే. అంటే మరీ ఎక్కువ వయసు లేని సవతి తల్లితో వచ్చిన అభిప్రాయభేదాలు నేను ఊహించగలిగాను.

"రుకాసిల్ భార్య అన్ని రకాలుగానూ చాలా మామూలు మనిషి. ఆమె మీద నాకు ఇష్టంగాని, అయిష్టంగానీ కలగలేదు. ఆమె ఉండీ లేనట్టే, భర్తపట్ల చిన్నారి కొడుకుపట్లా ఆమెకు ఎంతో ప్రేమ ఉందని మాత్రం సులభంగా చూడగలిగాను. ఆమె కళ్లు ఎప్పుడూ వారి మీదే ఉంటాయి. ప్రతి కదలికనూ గమనిస్తూ ఉంటాయి. అంత ఆడంబరంలోనూ, ఆయన కూడా ఆమె పట్ల దయ కలిగి ఉంటారు. మొత్తం మీద వారిద్దరూ అనుకూల దంపతులుగానే కనపడ్డారు. కానీ  ఆ స్త్రీలోపల, రహస్యమయిన దుఖం ఏదో దాగి ఉంది. అప్పుడప్పుడు ఆమె మరీ దుఖంతో మొహం వేలవేసుకుని లోతుగా ఆలోచనల్లోకి వెళిపోతుంది. ఆమె కళ్లనీళ్లు పెట్టడం కూడా నేను ఒకటి రెండుసార్లు గమనించాను. ఆమె పిల్లవాడు మరీ భయంకరమయిన ప్రకృతి కలవాడు. ఆ విషయం బహుశా ఆమె మనసుకు భారంగా ఉందని నేననుకున్నాను. పిల్లవాడు పీలగా ఉంటాడు. తల మాత్రం బాగా పెద్దది. వాని బతుకంతా క్రూరమయిన కార్యక్రమాలు, వెంటనే మూలన కూచోవడాలు వంటి విచిత్రమయిన వరుసతో నిండి ఉంటుంది. తనకంటే బలహీనమయిన మరే ప్రాణికయినా బాధ కలిగిస్తే వాడికి అది సరదాగా కనిపిస్తుంది. చుంచులను, చిన్న పిట్టలను, పురుగులను పట్టడంలో బ్రహ్మాండ మయిన లాఘవం కనపరుస్తాడు. మిస్టర్ హోమ్స్, నేను ఆ జీవిని గురించి మాట్లాడదలచుకోలేదు. నా కథతో వానికి సంబంధం లేదు."

"మీరు చెపుతున్న వివరాలు పనికి వస్తాయి. మీకవి సంబంధంలేనివిగా

కనిపించినా సరే” అన్నాడు నా మిత్రుడు.

“ముఖ్యమయిన విషయాలను వదలకుండా ఉండడానికి ప్రయత్నిస్తాను. ఆ ఇంటిని గురించి ఆలోచిస్తే, నాకు అర్థమయిన అసంతోషకరమయిన విషయం అక్కడి పనిమనుషుల తీరు. నిజానికి ఇద్దరే ఉన్నారు, భార్యాభర్తలు. ఆ మనిషి పేరు టోలర్. అతను మొరటు, ముతక మనిషి. చింపిరి జుట్టుతో ఆ మనిషి ఎప్పుడూ తాగినవాసన వేస్తుంటాడు. నేను ఉన్న ఆ కొంచెం కాలంలోనే అతను రెండుసార్లు మరీ ఎక్కువతాగి పడిపోయాడు. అయినా మిస్టర్ రుకాసిల్ మాత్రం పట్టించుకోలేదు. అతని భార్య ఎత్తరి, బలమయిన మనిషి ముఖం ముడుచుకుని ఉంటుంది. మిసెస్ రికాసిల్ మాదిరే నిశ్శబ్దంగానూ, ఒంటరిగానూ ఉంటుంది. ఆ జంటతో కొంచెం అసౌకర్యమనిపిస్తుంది. అయితే, నేను ఎక్కువకాలం పిల్లవాని గదిలో లేదా నా గదిలోనే గడుపుతాను. అవి రెండూ భవనంలోని ఒక మూలలో పక్కపక్కనే ఉన్నాయి.

“నేను చేరిన తరువాత కాపర్ బీచెస్‌లో నా బ్రతుకు ప్రశాంతంగానే సాగింది. మూడవనాడు బ్రేక్‌ఫాస్ట్ తరువాత, మిసెస్ రుకాసిల్ కిందకు వచ్చి, భర్తతో గుసగుసగా ఏదో చెప్పింది.

“ ‘ఓ యస్!’ అన్నాడాయన. తరువాత నా వేపు తిరిగి ‘మిస్ హంటర్, మా పిచ్చి పిచ్చి కోరికలను మన్నించి మీరు జుట్టు కూడా కత్తిరించుకున్నారు. అయినా, మీ రూపంలో ఏ రకమయిన లోపం రాలేదని నేను నమ్మకంగా చెపుతున్నాను. ఇక ఎలెక్ట్రిక్ బ్లూ దుస్తులు మీమీద ఎలా నప్పుతాయో చూద్దాం. అవి మీ గదిలో మంచం మీద ఉన్నాయి. మీరు వెళ్లి వేసుకువస్తే, మేమిద్దరమూ మీకు రుణపడి ఉంటాము’ అన్నాడు.

“నా గదిలో ఉన్న ఆ డ్రెస్ విచిత్రమయిన నీలం ఛాయలో ఉంది. గుడ్డ చాలా వెలగలది. కానీ, ఆ డ్రెస్‌ను ఇంతకు ముందే ఎవరో వేసుకున్న గుర్తులు బాగా తెలుస్తున్నాయి. నా కొలతలతో కుట్టినట్టే నీ మీద కుదిరింది

ఆ డ్రెస్. చూడగానే రుకాసిల్ దంపతులు గొప్ప ఆనందం కనపరిచారు. అందులో నాకు కొంచెం అతిశయం కనపడింది. వాళ్లు నా కోసం డ్రాయింగ్ రూమ్‌లో వేచి ఉన్నారు. ఇంటి మధ్య నుంచి ముందు వరకూ సాగిన ఆ గది చాలా పెద్దది. అందులో నేల దాకా ఉండేరకంగా మూడు పెద్ద కిటికీలు ఉన్నాయి. మధ్య కిటికీ దగ్గర, ఇటువేపు మలిపి ఒక కుర్చీ వేసి ఉంది. నన్ను అందులో కూర్చోమన్నారు. ఇక మిస్టర్ రుకాసిల్, ఆ గదిలో అటువేపు అటూ ఇటూ తిరుగుతూ, నేనెన్నడూ విని ఎరుగని వింత వింత కథలు చెప్పసాగాడు. అవి నిజంగా నవ్వు పుట్టించేవిగా ఉన్నాయి. నేను అలిసి పోయేదాకా పడి పడి నవ్వాను. ఆయన భార్య మాత్రం పట్టించుకోలేదు. చిరునవ్వు కూడా కనపరచకుండా చేతులను ఒడిలో పెట్టుకుని, ముఖంలో ఆతురత కనపరుస్తూ కూచుండిపోయింది. సుమారు ఒక గంట తరువాత, ఉన్నట్టుండి కథలు ఆపి మిస్టర్ రుకాసిల్, నన్ను పనిలోకి వెళ్లిపోమన్నాడు. దుస్తులు మార్చుకోవచ్చునన్నాడు.



"రెండు రోజుల తరువాత, అదే పరిస్థితులతో అదే నాటకం మళ్లీ సాగింది. నేను దుస్తులు మార్చుకున్నాను. కిటికీ పక్కన కూచున్నాను. యజమాని అంతులేకుండా చెపుతున్న, వింత కథలను వింటూ పడి పడి నవ్వాను. అతని తీరుకు సాటి లేదు. అప్పుడు ఆయన నాకొక పాత నవల ఇచ్చి కుర్చీని కొంచెం తిప్పి కూర్చోపెట్టాడు. నా నీడ పుస్తకం మీద పడకుండా ఉంది ఆ ఏర్పాటు. నన్ను పుస్తకం చదివి వినిపించమన్నాడు.

నేనలా పదినిమిషాలు చదివాను, అదీ మధ్యలో ఎక్కడో మొదలుపెట్టి. ఒక వాక్యం మధ్యలో ఉండగా, ఆయన ఇక ఆపేసి, దుస్తులు మార్చుకోవచ్చు నన్నాడు.

"మిస్టర్ హెూమ్స్, నాకు ఇదంతా అర్థం తెలియక ఎంత తికమకపడ్డానో మీరు ఊహించగలరు. ఒకటి మాత్రం గమనించాను. వాళ్లు, నా ముఖం కిటికీవేపు కనిపించకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. ఇక నాకు, వెనుక ఏం జరుగుతున్నదో చూడాలన్న కోరిక మరీ ఎక్కువయింది. మొదట్లో అది అసాధ్యం అనిపించింది. అయితే ఒక మార్గం వెతికాను. నా దగ్గర ఉన్న అద్దం పగిలింది. నాకొక ఆలోచన వచ్చింది. అద్దంలోని ఒక ముక్కను జేబురుమాలులో దాచుకున్నాను. మరుసటిసారి నా నవ్వుల మధ్యన, జేబురుమాలును కళ్ల ఎత్తుకు ఎత్తి చూస్తే, వెనుక దృశ్యమంతా కనిపించింది. అయితే, నాకు నిరాశే మిగిలిందని ఒప్పుకుంటాను. అక్కడ ఏమీ లేదు. కనీసం నాకు మొదట అలాగని పించింది. రెండవసారి చూస్తే మాత్రం, సౌతాంప్టన్ రోడ్‌లో నిలబడ్డ ఒక మనిషి కనిపించాడు. గ్రే సూట్ వేసుకుని ఉన్న ఆ గడ్డం మనిషి నా వేపే చూస్తున్నాడు. ఆ రోడ్డు రద్దీగా ఉండే హైవే. దాని మీద ఎప్పుడూ జనం ఉండనే ఉంటారు. అయితే ఇతను మాత్రం ఈ ఇంటి ఆవరణ అంచుమీదనున్న రైలింగ్స్‌కు ఆనుకుని ఇటువేపే ధ్యాసగా చూస్తున్నాడు. నేను జేబురుమాలను కిందికి దించి చూస్తే మిసెస్ రుకాసిల్, పరీక్షగా నావేపే అదే పనిగా చూస్తున్నది. ఆమె ఏమీ అనలేదు. అయితే, నా చేతిలో అద్దం ఉన్నట్టు ఆమె తెలిసిందని నాకు అర్థమయింది. వెనుక దృశ్యాన్ని చూచానని కూడా ఆమె పసిగట్టేసింది. ఆమె ఒక్కసారిగా లేచింది.

" 'జెఫ్రో, రోడ్డు మీద ఒకతను ఎవరో నిలబడి మిస్ హంటర్‌ను చూస్తున్నాడు' అన్నది ఆమె.

" 'మీ మిత్రుడా, మిస్ హంటర్?' ఆయన అడిగాడు.

" 'లేదు. ఈ ప్రాంతాల్లో నేనెరిగినవారు ఎవరూ లేరు.'

“ ‘డియర్ మీ! ఎంత జులాయితనం! దయచేసి అటు తిరిగి ఆ మనిషిని వెళిపోమని సైగ చేయండి.’

“ ‘పట్టించుకోకుండా ఉంటే, బాగుంటుందని నా నమ్మకం.’

“ ‘లేదు. లేదు. అతను మళ్లీ వస్తాడు. దయచేసి తిరిగి సైగ చేయండి.’

“చెప్పినట్టే చేశాను. వెంటనే మిసెస్ రుకాసిల్ కిటికీ తెరలను దించేసింది. ఇదంతా జరిగి వారమయింది. ఆ తరువాత మళ్లీ కిటికీ దగ్గర కూచున్నది లేదు. బ్లూ డ్రెస్ వేసుకున్నదీ లేదు. ఆ మనిషి వచ్చిందీ లేదు.”

“దయచేసి చెప్తూ పొండి. మీ కథనం చాలా ఆసక్తికరంగా ఉండేట్టుంది” అన్నాడు హెూమ్స్.

“సంబంధం లేదు అనిపించవచ్చు. నేను చెపుతున్న వివిధ సంఘటనల మధ్యన సంబంధం లేకపోవచ్చు. కాపర్ బీచెస్‌కు నేను వెళ్లిన మొదటి రోజునే మిస్టర్ రుకాసిల్ నన్ను ఒక చిన్న ఔట్‌హౌజ్‌కి తీసుకువెళ్లాడు. అది వంటింటి అవతలి తలుపు పక్కన ఉంది. అందులో నాకు గొలుసుల చప్పుడు వినిపించింది. పెద్ద జంతువు ఒకటి కదులుతున్న చప్పుడుకూడా వినిపించింది.

“ ‘లోపల చూడు! చాలా బాగుంది కదూ?’ చెక్కల సందులలోనుంచి చూపిస్తూ అన్నాడు రుకాసిల్.

“లోపలికి చూస్తే, మెరుస్తున్న రెండు కళ్లు కనిపించాయి. చీకటిలో ఒక ఆకారం ఏదో ఉన్నది.”

“ ‘భయపడనవసరం లేదు’ అన్నాడు యజమాని. నా ముఖంలో భయం చూచి నవ్వాడు కూడా. ‘అది కార్లో, నా మాస్టిఫ్. నాది అంటున్నాను. కానీ, మనవాడు ఓల్డ్ టోలర్, ఒక్కడు మాత్రమే దాని దగ్గరకు వెళ్ల గలుగుతాడు. దానికి నిత్యం ఒకసారిమాత్రమే తిండి పెడతాము. అదీ

కొంచెంగానే. కనుక, అది ఎప్పుడూ అతి చురుకుగా ఉంటుంది. రాత్రి పూట, టోలర్ దాన్ని బయటకు వదులుతాడు. వచ్చినవాడు దానికి చిక్కితే ఇక దేవుడే కాపాడాలి. నీవు ఏ కారణంగానూ రాత్రిపూట మాత్రం కడపదాటి బయట కాలుపెట్టవద్దు. ప్రాణానికే ప్రమాదం' అన్నాడు.

"ఆ హెచ్చరిక మామూలుది కాదు. రెండవ రోజు రాత్రి రెండు గంటల ప్రాంతంలో నాకు మెలుకువ వచ్చింది. బెడ్‌రూమ్ కిటికీలోనుంచి బయటకు చూచాను. వెన్నెల బాగా కాస్తున్నది. ఇంటి ముందరి లాన్ వెండిలా మెరుస్తూ, పగలు లాగే వెలుగు ఉంది. అందమయిన దృశ్యాన్ని చూస్తూ, అలాగే నిలబడిపోయాను. కాపర్ బీచెస్ ప్రాంతంలో ఏదో కదలిక కనిపించింది. అది వెన్నెలలోకి వస్తే, విషయం తెలిసింది. దూడంత ఆకారం గల పెద్ద కుక్క అది. ముదురు రంగు, వేలాడుతున్న దవడలు, నల్లని ముట్టె, దాని శరీరంలో ఎముకలు బయటకు కనపడుతున్నాయి. అది గడ్డిమీదుగా నడుస్తూ, అటుపక్కన నీడలోకి వెళ్లిపోయింది. ఆ పహారా పద్ధతి చూస్తే, నా గుండె గతుక్కుమన్నది. దొంగను చూచిన అంత భయం వేసేది కాదు.

"ఇక మీకు చెప్పవలసిన ఒక విచిత్రమయిన అనుభవం ఉన్నది. నా జుట్టును నేను లండన్‌లోనే కత్తిరించుకున్నానని మీకు తెలుసు. ఆ జుట్టును నేను జాగ్రత్తగా నా పెట్టెలో దాచుకున్నాను. ఒక సాయంత్రం పిల్లవాడు పడుకున్నాడు. ఆ తరువాత నా గదిని సర్దుతూ సరదాగా గడుపుతున్నాను. అక్కడ మూడు డ్రాయర్స్ గల ఒక అల్మారా లాంటిది ఉన్నది. పై రెండు డ్రాలు ఖాళీగానూ, తెరిచి ఉన్నాయి. కింద దానికి తాళం ఉన్నది. ఖాళీ డ్రాలలో నా బట్టలు పెట్టుకున్నాను. ఇంకా మిగిలిన బట్టలు పెట్టడడానికి మూడవ డ్రా తెరిచి లేదని చికాకు పడుతున్నాను. దానికి ఊరికే తాళం పెట్టి ఉంటారని తోచింది. నా దగ్గరనున్న తాళంచేతుల గుత్తి తీసి దాన్ని తెరవడానికి ప్రయత్నించాను. మొదటి తాళంచెవితోనే పని కుదిరింది. దాన్ని

లాగితే, లోపల ఒకే ఒక వస్తువు ఉంది. అదేమిటో మీరు ఊహించలేరని నా నమ్మకం. అది కత్తిరించిన నా జుట్టు.

"నేను దాన్ని చేతిలోకి తీసుకుని పరీక్షించాను. అదే రంగు, అదే తీరు. కానీ అదెలాగ సాధ్యమయిందని మాత్రం నాకు అనుమానం. నా జుట్టును డ్రాలో ఎవరు దాచారు? చేతులు వణుకుతుండగా, నా ట్రంక్ పెట్టె తెరిచి కలియబెట్టాను. అడుగునుంచి నా వెంట్రుకలు కట్టగా బయటికి వచ్చాయి. రెండు కట్టలను పక్కపక్కగా పెట్టాను. రెండూ ఒకే రకంగా ఉన్నాయి. అసాధారణం కదూ? తికమక పడ్డాను అయినా, అర్థమేమిటో అంతుపట్టలేదు. జుట్టును తిరిగి డ్రాలో పెట్టాను. రుకాసిల్ దంపతులతో సంగతి గురించి మాట ఎత్తలేదు. వాళ్లు తాళం పెట్టిన డ్రాను తెరవడమే తప్పుగా భావించాను.

"నాకు సహజంగానే పరిశీలించే గుణం ఉంది. అది మీరు గుర్తించే ఉన్నారు. త్వరలోనే ఇంటి ప్లాను మొత్తం నా తలకు ఎక్కింది. అయితే, భవనంలోని ఒక భాగంలో మాత్రం ఎవరూ ఉండరు. టోలర్స్ ఉండే భాగానికి ఎదురుగా ఉన్న తలుపుగుండా ఆ భాగంలోకి దారి ఉంది. దానికి ఎప్పుడూ తాళం పెట్టి ఉంటుంది. ఒకనాడు మాత్రం నేను మెట్లు ఎక్కుతూ ఉండగా, మిస్టర్ రుకాసిల్ ఆ తలుపులోనుంచి రావడం కనిపించింది. చేతిలో తాళం చెవులు ఉన్నాయి. మామూలుగా ఉండే సరదా మనిషిగా కాక, ఆయన ఆరోజు నాకు మరీ వేరుగా



కనిపించాడు. చెంపలు ఎర్రబారినయి. కనుబొమలు కోపంగా ముడుచుకుని ఉన్నాయి. కణతలు రక్తనాళాలు కనపడుతున్నాయి. తాళం పెట్టి, ఆయన మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

“ఇక నాకు కుతూహలం మొదలయింది. చిన్నబాబుతో కలిసి గ్రౌండ్స్‌లో తిరుగుతున్నప్పుడు నేను భవనం అటువేపు వెళ్లి కిటికీలను గమనించాను. అవి వరుసగా నాలుగు ఉన్నాయి. అందులో మూడు మకిలిపట్టి ఉన్నాయి. నాలుగవ కిటికీ మాత్రం షటర్ బిగించి ఉంది. గదులలో ఎవరూ లేరని తోచింది. అటూ ఇటూ తిరుగుతూ, అప్పుడప్పుడూ గమనించాను. ఆనందంగానే కనబడుతూ, మిస్టర్ రుకాసిల్ అక్కడికి వచ్చాడు. “ ‘ఆహ్! ముక్క మాట్లాడకుండా, వెళ్లిపోయినందుకు ఏమీ అనుకోవద్దు, అమ్మాయీ! మరేదో ఆలోచనలో ఉన్నాను’ అన్నాడాయన.

“నేను పట్టించుకోలేదని నమ్మకంగా చెప్పాను. ‘అయితే, ఇంట్లో ఆ భాగంలో ఖాళీ గదులు చాలా ఉన్నట్టున్నాయి. అందులో ఒకదానికి తలుపు కూడా వేసి ఉంది’ అన్నాను.

“ఆయన ఆశ్చర్యపడినట్టు, నా మాటలకు కొంచెం అదిరిపోయినట్టు నాకు తోచింది.

“ ‘నా హాబీలలో ఫొటొగ్రఫీ ఒకటి. నా డార్క్ రూమ్ అక్కడే ఉంది. అయినాసరే, ఎంతటి పరిశీలనగల అమ్మాయి దొరికింది! ఎవరయినా నమ్మగలరా? ఎవరికీ నమ్మకం కుదరదు?’ ఆటపట్టిస్తున్నట్టు అన్నాడాయన. కానీ కళ్లలో మాత్రం హాస్యం కనిపించలేదు. వాటిలో అనుమానం, చికాకూ మాత్రమే కనిపించాయి.

“వెల్, మిస్టర్ హోమ్స్ ఆ గదులలో నాకు తెలియవలసిన సంగతేదో ఉందని అర్థమయింది. ఆ క్షణంనుంచి చూడాలన్న కోరిక గట్టిపడింది. అది కేవలం కుతూహలం కాదు. కుతూహలం లేదనీ లేదు. అదెందుకో నా డ్యూటీ అనిపించింది. అక్కడికి చొరబడి చూచినందుకు మంచి ఏదో

జరగవచ్చు అనిపించింది. ఆడ మనిషి ఆలోచనలను గురించి ఏదేదో చెపుతుంటారు గదా. బహుశా ఆ పద్ధతిలోనే, నాకూ ఆ భావం కలిగినట్టుంది. ఏదయితేనేమి, భావం ఉంది. వెళ్లకూడని ఆ ప్రాంతానికి వెళ్లే అవకాశం కోసం ఎదురుచూడసాగాను.

"ఆ అవకాశం నిన్ననే దక్కింది. మిస్టర్ రుకాసిల్ మాత్రమే కాక, టోలర్ దంపతులు కూడా ఆ ఖాళీ గదులలోకి వెళుతుంటారు. అతను ఒక పెద్ద సంచిని ఆ ద్వారం గుండా తీసుకుపోవడం నేనొకసారి గమనించాను. ఈ మధ్యన అతని తాగుడు మరీ ఎక్కువయింది. నిన్న సాయంత్రం తాగి తాగి పడిపోయాడు. నేను పైకి వెళ్లేసరికి తాళంచెవి తలుపులోనే ఉంది. అతనే వదిలి ఉంటాడని అనుకున్నాను. రుకాసిల్ దంపతులు కింది అంతస్తులో ఉన్నారు. పిల్లవాడు వాళ్ల దగ్గరే ఉన్నాడు. నాకది మంచి అవకాశంగా కనిపించింది. తాళం చెవి నెమ్మదిగా తిప్పాను. తలుపు తెరిచి లోపలికి దూరాను.

"ముందు ఒక సన్నని నడవ ఉంది. గోడలకు కాయితం లేదు. నేలమీద కార్పెట్ లేదు. నడవ చివరన మలుపు ఉంది. అక్కడే వరుసగా మూడు ద్వారాలు ఉన్నాయి. మొదటిది, మూడవది తెరిచి ఉన్నాయి. లోపల గదులు దుమ్ము కొట్టుకుని ఖాళీగా కనిపించాయి. వాటిలో ఒకదాంట్లో రెండు, మరొకదాంట్లో ఒకటే కిటికీలున్నాయి. వాటికి మరీ మకిలిపట్టి ఉంది. సాయంత్రపు వెలుగు కూడా లోపలకు రావడం లేదు. మధ్యతలుపు మూసి ఉంది. దాని బయట ఒక ఇనుప మంచం పట్టి అడ్డంగా వచ్చేట్టు బిగించి ఉంది. గోడలోని ఒక రింగ్‌లో ఆ పట్టిని కలిపి తాళం పెట్టి ఉంది. మరొక చివర గట్టి తాడుతో కట్టి ఉంది. తలుపు కూడా తాళం వేసి ఉంది. తాళం చెవి మాత్రం లేదు. బంధించిన ఈ గది లెక్కప్రకారం, తలుపు పెట్టి ఉన్న కిటికీకి సంబంధించినది. ఆ గదిలో చీకటి లేనట్టు నాకు తలుపుకింది నుంచిచూస్తే, అర్థమయింది. పై కప్పులో ఉన్న గవాక్షం నుంచి వెలుతురు

వస్తున్నదని తోచింది. ఆ తలుపును చూస్తూ, దాని వెనుక దాగి ఉన్న రహస్యం గురించి ఆలోచిస్తున్నాను. అంతలో ఆ గదిలో నుంచి అడుగుల చప్పుడు వినిపించింది. లోపల ఒక మనిషి అటూ ఇటూ తిరుగుతున్నట్టు తలుపు కిందనుంచి లీలగా కనిపించింది. ఆ దెబ్బతో నిష్కారణమయిన భయం నన్ను నిలువెత్తునా ముంచింది. మిస్టర్ హోమ్స్, ముందే భయపడి ఉన్నాను. కనుక వెనక్కు తిరిగి పరుగు లంకించుకున్నాను. వెనుకనుంచి ఎవరో నా దుస్తులను పట్టి లాగుతున్నంత భయంతో పరుగెత్తాను. నడవలోనుంచి తలుపు దాటి నేరుగా మిస్టర్ రుకాసిల్ చేతులలోకి వెళ్లి పడ్డాను. ఆయన బయట వేచి ఉన్నాడు.

" 'నువ్వా, ఇంతకూ? తలుపు తెరిచి ఉంటే, నీవే అనుకున్నాను కూడా' అన్నాడు ఆయన చిన్నగా నవ్వుతూ.



" 'ఓహ్, ఎంత భయమయిందో!' నేను ఒగరుస్తున్నాను.

" 'మైడియర్ యంగ్ లేడీ! మైడియర్ యంగ్ లేడీ' అతను నన్ను అను నయించిన తీరు ఎంత మృదువుగా ఉందో చెప్పలేను. 'ఏం చూచి భయమయింది, మైడియర్ యంగ్ లేడీ?'

''ఆయన మాటలు మాత్రం అదో రకంగా ఉన్నాయి. కొంచెం అతిగా ఉన్నాయి. నేను చాలా జాగ్రత్తపడ్డాను."

" 'ఖాళీ భవనంలోకి వెళ్లి

పిచ్చి పొరపాటు చేశాను. ఆ చిరుచీకటిలో భయంగా తోచింది. అందుకే బయటకు పరుగెత్తుకు వచ్చాను. అక్క డంతా భయంకరంగా, ప్రశాంతంగా ఉంది!' జవాబిచ్చాను.

" ' అంతేనా?' అన్నాడాయన, నా వేపు గుచ్చి చూస్తూ.

" 'ఏం, ఏమనుకున్నారు?' నేను అడిగాను.

" 'నేను ఆ తలుపు తాళం వేసి ఎందుకు పెట్టానంటావు?'

" 'నాకేం తెలుసును?'

" 'పనిలేని వారంతా ఆ పక్కలకు వెళ్లవద్దని. తెలిసిందా?' అతనింకా కలుపుగోలుగా నవ్వుతూనే ఉన్నాడు.

" 'నాకు తెలిసిఉంటే.... '

" 'ఇప్పుడు తెలిసిందిగా! ఇక మరీ ఒకసారి ఆ కడప దాటి వెళ్లావంటే...' ఆయన తీరు ఒక్క క్షణంలో మారింది. చిరునవ్వు పోయి కోపపు నవ్వు వచ్చింది. రాక్షసుడి ముఖంతో ....'నిన్ను మాస్టిఫ్‌కు వేసేస్తాను' అన్నాడు.

"నేను మరీ భయపడిపోయాను. ఏం చేశానో నాకే తెలియదు. అతన్ని వదిలించుకుని నా గదిలోకి పారిపోయి ఉంటానని అనుకుంటున్నాను. వణుకుతూ నా మంచం మీద పడి ఉండడం మాత్రం గుర్తుంది. మిస్టర్ హోమ్స్, అప్పుడు మీరు గుర్తుకువచ్చారు. మీ సలహా తీసుకోకుండా అక్కడ మరింత కాలం ఉండలేకపోయాను. ఆ ఇల్లు, ఆ మనిషి, ఆవిడ, ఆ పనిమనుషులు, చివరకు పిల్లవాడు కూడా భయం కలిగించేలాగే ఉన్నారు. అందరూ భయంకరమయిన వాళ్లే. మిమ్మల్ని అక్కడికి తేగలిగితే, అంతా సర్దుకుంటుంది. నేను అక్కడినుంచి పారిపోవచ్చు. అయితే నా కుతూహలం, నా భయంలాగే తీవ్రమయినది. అందుకే నిశ్చయించుకున్నాను, మీకు తార్ పంపాలని. కోటు, టోపీ వేసుకున్నాను. ఇంటికి అరమయిలు దూరంలో ఉన్న ఆఫీసుకు వెళ్లాను. తిరిగి వచ్చాను. అప్పుడు కొంచెం తేరుకున్నట్టు

తోచింది. ఇల్లు చేరుతూ ఉంటే, కుక్కను వదిలిపెట్టారేమోనని భయంకర మయిన అనుమానం మొదలయింది. కానీ, సాయంత్రం నుంచి, టోలర్ తాగి పడి ఉన్నాడని తెలుసు. ఆ భయంకరమయిన ప్రాణి మీద పట్టు కలిగిన మనిషి అతనొక్కడే అని తెలుసు. మరొకరు దాన్ని వదలను కూడా లేరు. నేను నెమ్మదిగా లోపలికి చేరి మధ్యరాత్రి వరకూ నిద్రలేకుండా పడి ఉన్నాను. మిమ్మల్ని చూడబోతున్నానన్న సంతోషం నన్ను ముంచెత్తింది. ఈ ఉదయం వించెస్టర్ రావడానికి అనుమతి సులభంగానే దొరికింది. సాయంత్రం, రుకాసిల్ దంపతులు ఎవరి ఇంటికో వెళుతున్నారు. బాబును సాయంత్రం నేనే చూచుకోవాలి. కనుక, మూడయ్యేలోగా తిరిగి రావాలి. మిస్టర్ హోమ్స్, నా సాహసయాత్ర మొత్తం చెప్పాను. దీనికంతా అర్థమేమిటి? ఇక, నేను చేయవలసిందేమిటి? చెపితే సంతోషిస్తాను.”

అసాధారణమయిన ఈ కథను హోమ్స్, నేను ముగ్ధులమయి విన్నాము. నా మిత్రుడు ఇక లేచి, చేతులు జేబుల్లో పెట్టుకుని ముఖం మీద తీవ్రమయిన భావాలు కనపడుతుండగా, అటు ఇటూ తిరగసాగాడు.

“టోలర్ ఇంకా తేరుకోలేదా?” అడిగాడతను.

“లేదు. ఆ సంగతి మిసెస్ రుకాసిల్‌తో, అతని భార్య చెపుతుండగా విన్నాను.

“బాగుంది. రుకాసిల్స్ ఈ సాయంత్రం బయటకు వెళుతున్నారు.”

“అవును.”

“గట్టి తాళం పెట్టగల సెల్లార్ గది ఒకటి ఉందా?”

“ఉంది. వైన్ సెల్లార్”

“ఈ వ్యవహారంలో మీరు చాలా తెలివిగా, ధైర్యం కలిగి పనిచేశారని నాకు తోస్తున్నది. మిస్ హంటర్, మీరు ఇంకొక్క చిత్రం చేయగలరా?మీరు అసాధారణమయిన స్త్రీ అనుకోకపోతే, నేను అడిగి ఉండేవాడినే కాదు.”

"ప్రయత్నిస్తాను. ఏం చేయాలి?"

"సాయంత్రం ఏడు గంటలకల్లా నా మిత్రుడు, నేను, కాపర్ బీచెస్ చేరుకుంటాము. ఆ సమయానికి రుకాసిల్స్ వెళ్లిపోయి ఉంటారు. టోలర్ లేచే పరిస్థితిలో ఉండడు అనుకుంటాను. ఇక మిగిలింది టోలర్ భార్య. గోల చేస్తుందేమో! ఏదో పనిచెప్పి ఆమెను సెల్లార్‌లోకి పంపండి. బయట తాళం పెట్టండి. అప్పుడు మన పని సులువవుతుంది."

"అలాగే చేస్తాను."

"ఎక్సలెంట్! అప్పుడు వ్యవహారం గురించి చూద్దాం. ఒకే ఒక వివరణ సరిగా ఉందనిపిస్తున్నది. మరెవరిలాగో కనిపించాలని మిమ్మల్ని అక్కడికి తీసుకుపోయారు. అసలు మనిషిని ఆ గదిలో బంధించి ఉంచారు. అను మానం లేదు. ఇక ఆ బందీ ఎవరు? అంటే, వాళ్ల అమ్మాయి, మిస్ ఆలీస్ రుకాసిల్ అనడానికి అనుమానమే లేదు. ఆమె అమెరికా వెళ్లిందని చెప్పినట్టు గుర్తు. ఒడ్డు, పొడుగు, జుట్టు రంగు ఆమెలాగే ఉన్నందుకు, మిమ్మల్ని ఎంచుకున్నారు. ఏ అనారోగ్య కారణంగానో, ఆమె జుట్టు కత్తిరించి ఉంటారు. కనుక మీ జుట్టును బలి యివ్వవలసి వచ్చింది. విచిత్రమయిన పరిస్థితులలో మీకు ఆ సంగతి అర్థమయిపోయింది. రోడ్డు మీద కనిపించిన వ్యక్తి, ఆమె మిత్రుడు అనడంలో అనుమానం లేదు. ఆమె దుస్తులే వేసుకుని మీరు ఆమెలాగే కనిపించారు. అతను ఎప్పుడు చూచినా, మీరు నవ్వుతూ సంతోషంగా ఉన్నట్టు అతనికి అర్థమయింది. మీరు సైగ కూడా చేయడంతో మిస్ రుకాసిల్ నిజంగా సంతోషంగా ఉన్నట్టు, అతగాడి గురించి అసలు పట్టనట్టు తేలిపోయింది. మీతో మాట్లాడడానికి ధైర్యం చేయకుండా, రాత్రిళ్లు కుక్కను వదులుతున్నారు. ఇంతవరకూ అంతా అర్థమయినట్టే ఉంది. అర్థంకానిదల్లా, ఆ పిల్లవాని స్వభావం ఒకటే."

"ఇక్కడ ఆ ప్రసక్తి ఎందుకు?" నేను కుతూహలంగా అడిగాను.

"మైడియర్ వాట్సన్, నీవు వైద్యరంగం మనిషివి. తలిదండ్రులనుబట్టి పిల్లల ప్రవర్తన ఉంటుందని క్రమంగా అర్థం చేసుకునే ఉంటావు. ఆ సంబంధాన్ని మరొకరకంగానూ చూడవచ్చు. పిల్లల ప్రవర్తనను చూచి, చాలా సందర్భాలలో నేను తలిదండ్రులను గురించిన వివరాలు అర్థం చేసుకోగలిగాను. ఈ కుర్రవాడు, కేవలం క్రూరత్వంకోసం క్రూరంగా ఉంటాడు. ఆ తీరు అతనికి, నవ్వుతూ కనిపించే నాన్న నుంచి వచ్చిందా? లేక తల్లి నుంచా? ఏదయినా, ఆపద మాత్రం ఈ అమ్మాయి గారికే!"

"మిస్టర్ హోమ్స్, మీరు చెప్తున్నది సరిగా ఉంది. మీరు సరిగా చెప్పారు అనడానికి నాకు వెయ్యి విధాలా కారణం తోస్తున్నది. ఆ చిన్న బాబుకు సాయం అందాలి. అందులో ఆలస్యం జరగకూడదు" గట్టిగా అన్నది మా క్లయంట్.

"మనం జాగ్రత్తగా ఉండాలి. నిజంగా పన్నాగాలు వేసే మనిషితో పెట్టుకుంటున్నాం. ఏడు గంటలదాకా చేయగలిగింది ఏమీ లేదు. ఆ సమయానికి మీ దగ్గర ఉంటాం. రహస్యం బయటపడడానికి ఆ తరువాత ఆలస్యం జరగదు."

మేము మాట నిలబెట్టుకున్నాము. కాపర్‌బీచెస్ చేరేసరికి సరిగ్గా ఏడయింది. బండిని దారిపక్కన ఒక పబ్లిక్ హౌజ్ దగ్గర వదిలాము. అస్తమిస్తున్న సూర్యుని వెలుగులో ఇంటిముందు చెట్లమీది ముదురు రంగు ఆకులు, మెరుగుపెట్టిన లోహంలాగా తళతళలాడుతున్నాయి. ద్వారంలో చిరునవ్వుతూ మిస్ హంటర్ నిలబడకున్నా సరే, ఆ యింటిని సులభంగానే గుర్తించి ఉండేవాళ్లం.

"చెప్పింది చేయగలిగారా?" అడిగాడు హోమ్స్.

కింది అంతస్తు నుంచి ఏదో ధడాలున కిందపడ్డ చప్పుడయింది. "సెల్లర్‌లో మిసెస్ టోలర్. ఆమె భర్త వంటింట్లో గురకలు పెడుతున్నాడు.

తాళంచెవులు ఇదుగో, ఇవి రుకాసిల్ దగ్గర ఉండేవాటి డూప్లికేట్స్" అన్నది ఆమె.

"చాలా బాగా పని నడిపించారు. ఇక దారి చూపండి. వ్యవహారం అంతు తేల్చుకుందాం." ఉత్సాహంగా అన్నాడు హెూమ్స్.

మేము మెట్లెక్కాము. తలుపు తెరిచాము. నడవలో ముందుకు సాగాము. మిస్ హంటర్ వర్ణించిన అడ్డంకుల వద్దకు చేరాము. కట్టిన తాటిని హెూమ్స్ కత్తిరించాడు. ఎన్ని తాళంచెవులు వాడినా, తలుపు మాత్రం తెరుచుకోలేదు. లోపల ఏ చప్పుడూ లేదు. ఆ నిశ్శబ్దంతో హెూమ్స్ ముఖంలో రంగులు మారాయి.

"మనం మరీ ఆలస్యం చేసినట్టు లేదు. మిస్ హంటర్, ఇందులో మీరు కలగజేసుకునే అవసరం లేదు. ఇక వాట్సన్, కాస్త సాయం పడితే దారి చేసుకోగలమేమో చూద్దాం" అన్నాడు అతను.

తలుపు చాలా పాతది. మా ఇద్దరి బలం ముందు ఆగలేదు. ఇద్దరమూ కలిసి వడిగా గదిలోకి దూరాము. అది ఖాళీగా ఉంది. ఒక చిన్న మంచం, ఒక బల్ల, నిండా దుస్తులున్న ఒక బుట్ట తప్ప అందులో మరేమీ లేదు. గవాక్షం తెరిచి ఉంది. అంటే, బందీ పారిపోయింది.

"ఇక్కడేదో ఘాతుకం జరిగింది. మిస్ హంటర్ ఆలోచనలను పసిగట్టి ఎవరో బందీని తరలించేశారు" అన్నాడు హెూమ్స్.

"కానీ ఎలాగ?"

"గవాక్షం గుండా! ఎలా చేశాడో చూద్దాం." అతను ఎగిరి అంచు అందుకుని పై కప్పు మీదికి ఎక్కాడు. "తెలిసి పోయింది. ఇక్కడ ఒక తాటి నిచ్చెన కూడా ఉంది. సంగతి తెలిసిపోయింది" అరిచాడు అతను.

"కానీ అది అసాధ్యం. సాయంత్రం కూడా ఆ నిచ్చెన అక్కడ లేదు" అన్నది మిస్ హంటర్.



"రుకాసిల్ తిరిగి వచ్చి ఆ పని చేసి ఉంటాడు. అతను చాలా తెలివి గలవాడు. అపాయకరమయిన వాడూనూ! ఇక్కడ పడినవి అతని కాలి గుర్తులేనని నా అనుమానం. వాట్సన్, ఎందుకయినా మంచిది పిస్టల్ రెడీగా పెట్టుకో."

ఆయన మాటలు ముగించాడో లేదో, గది ద్వారంలో ఒక మనిషి వచ్చి నిలబడ్డాడు. ఆ భారీమనిషి చేతిలో ఒక దుడ్డుకర్ర ఉన్నది. ఆయనను చూడగానే, మిస్ హంటర్ ఒక కేక వేసి గోడకు అంటుకుపోయింది. షెర్లక్ హోమ్స్ ముందుకు దూకి అతని ఎదురుగా వచ్చాడు.

"దుర్మార్గుడా! నీ కూతురిని ఏం చేశావ్?"

లావుపాటి మనిషి చుట్టూ కలియజూశాడు. ఇక గవాక్షం వేపు చూచాడు.

"ఆ ప్రశ్న నేనే నిన్ను అడుగుతున్నాను. దొంగ భడవల్లారా! గూఢ చారులు, దొంగలు! మిమ్మల్ని పట్టేశాను. ఇక మీరు నా బందీలు. మీ సంగతి చూస్తాను" అతను వెనుదిరిగి వచ్చినంత వేగంగానూ మెట్లు దిగి

పోయాడు.

"కుక్కను వదులుతాడు!" గట్టిగా అన్నది మిస్ హంటర్.

"నా దగ్గర రివాల్వర్ ఉంది" అన్నాను నేను.

"ముందు తలుపు మూస్తే మేలు" అరిచాడు హెూమ్స్.

అందరమూ కలిసి మెట్లు దిగి వెళ్లాము. హాలులోకి చేరకముందే, కుక్క అరుపు వినిపించింది. తరువాత బాధగా వేసిన ఒక కేక వినిపించింది. అది వినడానికే భయం పుట్టించేదిగా ఉంది. పక్క తలుపులోనుంచి ఒళ్లు దులుపుకుంటూ, తడబడుతూ ఒక భారీ మనిషి, ఎర్రని ముఖంతో బయటకు వచ్చాడు.

"మై గాడ్! ఎవరో కుక్కను వదిలారు. దానికి రెండురోజులుగా తిండి లేదు. తప్పుకోండి. కొంపలు మునుగుతయి" అరిచాడతను.

హెూమ్స్, నేనూ బయటకు వచ్చి పరుగుపెట్టాము. టోలర్ మా వెనుకే వచ్చాడు. భయంకరమయిన, ఆకలిగొన్న క్రూర జంతువు కనిపించింది. దాని ముట్టె రుకాసిల్ గొంతును పట్టి ఉంది. అతను కిందపడి గిల గిలా



కొట్టుకుంటున్నాడు. ముందుకు పరిగెత్తి నేను దాని తల పేల్చేశాను. పడి పోయిన కుక్క తెల్లని పళ్లు భయంకరంగా కనిపిస్తున్నాయి. అవింకా మనిషి మెడమీదే ఉన్నాయి. చాలా కష్టపడి మేము దాన్ని తొలగించాము. అతనిని ఎత్తి ఇంట్లోకి తీసుకువచ్చాము. అతనింకా బతికే ఉన్నాడు కానీ, భయంకరంగా గాయపడ్డాడు. డ్రాయింగ్‌రూమ్‌లో సోఫా మీద పడుకో బెట్టాము. అప్పటికే తేరుకున్న టోలర్‌ను అతని భార్యదగ్గరికి పంపించాము. ఈ లోగా ఆ మనిషి బాధ తగ్గించడానికి నాకు వీలయిందేదో చేశాను. అతని చుట్టూ మేమంతా ఉండగా, తలుపు తెరుచుకుని ఒక పొడుగాటి స్త్రీ లోపలికి వచ్చింది.

"మిస్ టోలర్!" మిస్ హంటర్ గట్టిగా అరిచింది. పైకి వచ్చేందుకు ముందే, మిస్టర్ రుకాసిల్ నన్ను విడిపించారు. మీరు చేయదలచుకున్న దేమిటో, నాకు ముందు చెప్పకపోవడం చాలా అన్యాయమయిపోయింది, మిస్. మీ పథకమంతా వ్యర్థమవుతుందని నేను ముందే చెప్పేదాన్ని."

"హా! మిగతా అందరికన్నా, ఈ సంగతి గురించి మిసెస్ టోలర్‌కు ఎక్కువ తెలుసున్నది నిజం" అన్నాడు హెూమ్స్ ఆమెవేపు గుచ్చి చూస్తూ.

"యస్. సర్. నాకు తెలుసు. అంతా చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను."

"అయితే చెప్పండి. కూచోండి. నాకు ఇంకా అర్థంకాని పాయింట్లు ఎన్నో ఉన్నాయని ఒప్పుకుంటున్నాను."

"అంతా తెలిసిపోతుంది. సెల్లార్ లోనుంచి బయటకు రాగలిగితే, ఇంతకుముందే అంతా చెప్పేదాన్ని. ఇందులో పోలీసులు, కోర్టు ప్రమేయం ఏర్పడినా, నేను మీ తరఫునే ఉన్నానని చెపుతున్నాను. పైగా, మిస్ ఆలీస్‌తో కూడా నాకు మంచి నేస్తం ఉండేది.

"ఆ అమ్మాయికి ఈ ఇంట్లో సంతోషం లేదు. అంటే మిస్ ఆలీస్‌కు అన్నమాట. వాళ్ల నాన్న పెళ్లి చేసుకున్న తరువాత అంతకన్నా సంతోషం

లేదు. ఆమెను అవమానించేవారు. ఎందులోనూ కలగజేసుకోనిచ్చేవారు కాదు. తెలిసినవాళ్ల ఇంట్లో మిస్టర్ ఫౌలర్‌ను కలిసిన తరువాత పరిస్థితి మరింత దిగజారింది. నాకు తెలిసి, వీలునామాల ప్రకారం మిస్ ఆలీస్‌కు కూడా స్వంత ఆస్తులున్నాయి. కానీ, ఆమె ఓపికపట్టింది. వాటిగురించి ఒక్క మాట అనలేదు. మిస్టర్ రుకాసిల్ చేతుల్లోనే వాటిని ఉండనిచ్చింది. అతనికి భరోసాగా ఉండేది. కానీ, పెళ్లవుతుందంటే, అమ్మాయికి వచ్చిన భర్త చట్టం గురించి మాట్లాడతాడు. కనుక, వ్యవహారాన్ని అక్కడే ఆపాలని ఆయన అనుకున్నాడు. ఆమెను కాగితాలమీద సంతకం పెట్టమన్నాడు. పెళ్లి జరిగినా, జరగకున్నా ఆమె సొమ్మును అతనే అనుభవించవచ్చు. కానీ, ఆమె అందుకు ఒప్పుకోలేదు. అతను మరీ ఒత్తిడి పెడుతున్నాడు. ఈ లోపల అమ్మాయికి బ్రెయిన్ ఫీవర్ వచ్చింది. ఆరు వారాలపాటు ఆమె చావుతో పోరాడింది. ఆ తరువాత నయమయింది. కానీ, ఆమె మొదటిలాగ లేదు. అందమయిన జుట్టు పోయింది. ఆమె నీడగా మిగిలింది. అయినాసరే, ఆ యువకుడు మాత్రం మారలేదు. ఒక మనిషి చూపవలసిన ప్రేమను అతను పట్టుకునే ఉన్నాడు.”

“ఆహ్! ఇప్పుడు, సంగతి అర్థమయి పోయింది. మిగిలినదంతా నా పద్ధతులతో నేను ఊహించగలను. ఇక మిస్టర్ రుకాసిల్, అమ్మాయిని గదిలో బంధించాడు. అంతేనా?” అన్నాడు హోమ్స్.

“యస్ సర్.”

“పట్టుపట్టిన మిస్టర్ ఫౌలర్‌ను తొలగించుకోవడానికి, లండన్ నుంచి మిస్ హంటర్‌ని తెచ్చాడు.”

“సరిగ్గా అదే సర్.”

“కానీ, మిస్టర్ ఫౌలర్ మరీ పట్టుదల మనిషి. నౌకా సైన్యం వాళ్ల తీరు అది. ఇంటిని చుట్టుముట్టి ఏదో రకంగా మిమ్మల్ని కలిశాడు. చర్చలు జరిపాడు. మీరిద్దరూ ఒకే విషయం గురించి ఆలోచిస్తున్నారని తేలి

పోయింది."

"మిస్టర్ ఫౌలర్ చాలా మంచి మనిషి. ఉదారుడు కూడా." అన్నది మిసెస్ టోలర్ ప్రశాంతంగా.

"ఇక మీ ఆయనకు తాగడానికి లోటులేకుండా పోయింది. యజమాని ఇంటిలో లేని సమయానికి, నిచ్చెన సిద్ధంగా అందింది."

"జరిగింది జరిగినట్టు పట్టేశారండీ!"

"మీకు క్షమాపణ చెప్పవలసి ఉంది, మిసెస్ టోలర్. నాకు గజిబిజిగా మిగిలినవన్నీ మీరు వివరించారు. అదుగో స్థానిక సర్జన్ మిసెస్ రుకాసిల్‌తో వచ్చేస్తున్నారు. ఇక వాట్సన్, మనం మిస్ హంటర్‌కు తోడుగా వించెస్టర్ దాకా వెళితే మంచిది. ఇంకా మనం ఇక్కడ ఉండిపోతే, ప్రశ్నలు మొదలవుతాయి" అన్నాడు హోమ్స్.

ముందు కాపర్‌బీచెస్ గల ఆ యింట్లోని రహస్య వ్యవహారం ఆ రకంగా బయటపడింది. మిస్టర్ రుకాసిల్ కూడా బతికి బయటపడ్డాడు. కానీ, మనిషి మనిషిగా లేడు. ఆయన భార్య ఆరాధనాభావంతో చేసిన సేవల వల్ల కొనసాగాడు. వాళ్ల పనివాళ్లు కూడా అక్కడే ఉన్నారు. వాళ్లకు గతం గురించి కొంచెం ఎక్కువే తెలుసు. కనుక వదులుకోవడం మంచిది కాదు. మిస్టర్ ఫౌలర్ సౌతాంప్టన్‌లో పారిపోయిన మరుసటి రోజే మిస్ రుకాసిల్‌ని పెళ్లి చేసుకున్నాడు. మారిషస్ దీవులలో అతను ప్రభుత్వ అధికారిగా కొనసాగుతున్నాడు. ఇక మిస్ వయొలెట్ హంటర్ సంగతి. నా మిత్రుడు హోమ్స్ ఆమె విషయంగా ఏ మాత్రం ఆసక్తి చూపించకపోవడం నాకు కొంచెం ఆశాభంగంగా ఉంది. ఆమె ప్రస్తుతం వాల్‌సాల్‌లో ఒక ప్రయివేటు బడికి హెడ్‌గా ఉన్నది. అక్కడ ఆమె మంచి విజయాలే సాధించిందని నా నమ్మకం.




Sherlock Holmes



షెర్లక్ హోమ్స్ గురించి...

షెర్లక్ హోమ్స్ గురించి అతని మిత్రుడు డా॥ వాట్సన్ గురించి ఇవాళ కొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. తనదయిన తీరులో టోపీ, పైప్‌లతో హోమ్స్ పేరు వినగానే అతని రూపం కళ్లముందు మెదులుతుంది. ఆలోచన, చాకచక్యం లాంటి లక్షణాల సాయంతో ఎంతటి చిక్కు సమస్యనయినా హోమ్స్ సులభంగా విడదీస్తాడు.

వంద సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా హోమ్స్ పేరు ప్రఖ్యాతలు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. నిజంగానే హోమ్స్, వాట్సన్‌లు బేకర్స్ స్ట్రీట్‌లో బ్రతికారని అనుకునే వాళ్లు ఈ ప్రపంచంలో చాలా మంది ఉన్నారు. అందుకే తరతరాలుగా హోమ్స్ నవలలు, కథలను ప్రపంచమంతటా ఇష్టంగా చదువుతున్నారు.

షెర్లక్ హోమ్స్ పాత్రను సృష్టించిన కానన్ డాయ్‌ల్ కన్నా అతని పాత్రలకు ఎక్కువ పేరు వచ్చిందంటే ఆశ్చర్యం లేదు.

**ఈ వరుసలో ..**

- **ఎ స్టడీ ఇన్ స్కార్లెట్,**
- **ద సైన్ ఆఫ్ ఫోర్ (నవలలు)**
- **అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హోమ్స్ (మొదటి ఆరు కథలు)**

a **Creative Links Publication, 2016**

₹ 100/-